Dwaraka


కోల్‌కతా: బెంగాల్ గ్లోబల్ వాణిజ్య సదస్సులో రిలయన్స్ అధినేత ముఖేష్, ఆర్సెలార్ మిట్టల్ సీఈవో లక్ష్మీమిట్టల్‌తో బెంగాల్ సీఎం మమత

Estd. 1938

ఆంధ్రప్రభ

www.prabhanews.com

Journalism first!



సంపుటి: 61 • సంచిక: 7 • బుధవారం 17 జనవరి 2018 • విజయవాడ ✻ పేజీలు: 14 • వెల: 5.00 • Published from: Vijayawada | Kurnool | Hyderabad | Guntur | Rajahmundry | Visakhapatnam | Tirupati | Karimnagar | Suryapet | Anantapur | Nellore | Nizamabad

ముహూర్తం | శ్రీ హేవళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంతఋతువు, పుష్యమాసం, తిథి: బహుళ అమావాస్య ఉ. 7.02 వరకు; నక్షత్రం: ఉత్తరాషాఢ రా. 9.55 వరకు, అనంతరం శ్రవణం; అమృతకాలం: తె. 2.50 నుండి 3.35 వరకు; వర్జ్యం: తె. 2.16 నుండి 4.01 వరకు, దుర్ముహూర్తం: ఉ. 11.36 నుండి 12.24 వరకు; రాహుకాలం: మ. 12.00 నుండి 1.30 వరకు; యమగండం: ఉ. 7.30 నుండి 9.00 వరకు; ముక్కనుమ, బొమ్మల నోము

జోరుగా కోడిట్ల పందాలు





- ముగిసిన సంబరాలు
- సంప్రదాయానిదే పైచేయి
- చేతులు మారిన రూ.500 కోట్లు
- హోం మంత్రి జిల్లాలోనే యథేచ్ఛగా పందాలు
- రాజకీయ నేతల ప్రోద్బలం

కాకినాడ, ఆంధ్రప్రభ ప్రతినిధి: మూడ్రోజుల సంక్రాంతి సంబరాలు ముగిశాయి. సంప్రదాయం పేరిట ఈసారి కూడా కోడిపందాలదే పైచేయి అయింది. రాష్ట్ర వ్యాప్తంగా పందాల పేరిట సుమారు ఐదొందల కోట్లు చేతులు మారినట్లు అంచనాలేస్తున్నారు. ఇందులో గోదావరి జిల్లాల్లోనే మూడొందల కోట్లు పందాలు జరిగుంటాయని భావిస్తున్నారు. కృష్ణా జిల్లాలో కూడా ఈ సారి గట్టిగానే పందాలు జరిగాయి. గోదావరి జిల్లాల్లోని భీమవరం, తాడేపల్లిగూడెం, పాలకొల్లు, నర్సాపురం, ఏలూరు, కాకినాడ, మురమళ్ళ తదితర ప్రాంతాల్లో ఈ పందాలు జోరుగా సాగాయి. ఇందుకోసం ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు. భారీ టెంట్లువేసి సకల సదుపాయాలు కల్పించారు. సందర్శకుల కోసం ఎకరాల విస్తీర్ణంలో పార్కింగ్ ప్రదేశాలేర్పాటు చేశారు. తొలుత కత్తుల్లేకుండా పందాలు మొదలెట్టారు. అయితే 13వ తేదీ మధ్యాహ్నం 11గంటల్నుంచి కోళ్ళ కాళ్ళకు కత్తులు కట్టడం మొదలెట్టారు. ఎంపిలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, స్థానికంగా పేరున్న రాజకీయనేతలు దగ్గరుండి మరీ ఈ పందాల్ని ప్రోత్సహించారు. కొందరైతే స్వయంగా బరులకు రిబ్బన్ కటింగ్‌లు చేశారు. వాస్తవానికి పందాలు నిర్వహించొద్దంటూ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. పందాలు జరక్కుండా చూడండంటూ ప్రభుత్వాన్ని కూడా ఆదేశించింది. గత ఏడాది తాము జారీ చేసిన ఉత్తర్వుల అమలుపై హైకోర్టు ఆగ్రహంగా ఉంది. ఈ సారి ఉత్తర్వుల అమల్లో విఫలమైతే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డిజిపిలను బాధ్యుల్ని చేస్తామంటూ హైకోర్టు హెచ్చరించింది. అయితే బిజెపి నాయకుడు రఘురామకృష్ణంరాజు హైకోర్టు ఆదేశాల్ని సవాల్ చేస్తూ సుప్రీంకోర్టుకెళ్ళారు. పందాలపై నిషేధం ఎత్తేయాలంటూ సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. దీంతో కొన్ని షరతులెట్టి సుప్రీంకోర్టు ఉత్తర్వులిచ్చింది. సంప్రదాయంగానే తప్ప కోళ్ళకు కత్తులు కట్టొద్దంటూ ఆదేశించింది. దీన్ని జూదంగా నిర్వహించడానికి వీల్లేదంటూ పేర్కొంది. ఈ తీర్పును ➩ 3వ పేజీలో...

సంక్షోభం కొలిక్కి?



- ఆ నలుగురు సీనియర్ జడ్జిలతో సీజేఐ సమావేశం
- 15 ని.ల పాటు చర్చ
- హాజరైన ఇతర న్యాయమూర్తులు
- ఫలిస్తున్న బీసీఐ, ఎస్‌సీబీఏ చర్చలు

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు సంక్షోభం దాదాపుగా కొలిక్కి వచ్చినట్లేకనిపిస్తోంది. సర్వోన్నత ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా, తనపై న్యాయస్థానం పరిపాలనా వ్యవహారాలపైనా ఆరోపణలు చేసిన నలుగురు సీనియర్ న్యాయమూర్తులను కలిశారు. మంగళవారం కోర్టు కార్యకలాపాలు ప్రారంభానికి 15 నిమిషాల ముందు దీపక్ మిశ్రా.. సీనియర్ జడ్జిలు జస్టిస్ జాస్తి చలమేశ్వర్, జస్టిస్ రంజన్ గొగోయ్, జస్టిస్ మదన్ బీ లోకూర్, జస్టిస్ కురియన్ జోసెఫ్‌లతో ➩ 5వ పేజీలో...

హజ్ సబ్సిడీ రద్దు



కేంద్రం నిర్ణయం

- మేలు జరగడం లేదు • ఆ మొత్తం బాలికల విద్యకు వినియోగం
- కేంద్రమంత్రి ముక్తార్ అబ్బాస్ నక్వీ వెల్లడి

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ : మక్కా యాత్ర కోసం ముస్లింలకిస్తున్న హజ్ సబ్సిడీని కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకుంది. ఈ నిర్ణయంతో ఆదా అయ్యే సుమారు 700 కోట్ల రూపాయల సబ్సిడీ మొత్తాన్ని ముస్లిం బాలికల విద్యకు కేటాయిస్తామని కేంద్ర మైనారిటీ వ్యవహారాల శాఖ మంత్రి ముక్తార్ అబ్బాస్ నక్వీ తెలిపారు. మంగళవారం న్యూఢిల్లీలో విలేకరులతో ఆయన మాట్లాడారు. హజ్ సబ్సిడీతో ముస్లిం సమాజానికి మేలు జరగలేదని చెప్పారు. ముస్లింలు ఆత్మగౌరవంతో అభివృద్ధి చెందాలన్నదే తమ ప్రభుత్వ అభిమతమని చెప్పారు. ముస్లిం సంతుష్టీకరణకంటే ముస్లింల సాధికారతకే తాము పెద్ద పీట వేస్తామని వెల్లడించారు. హజ్ సబ్సిడీ ఉప సంహరణతో కేంద్ర ప్రభుత్వానికి ప్రతి ఏడాది 700 కోట్ల రూపాయలు ఆదా కానుంది. ముస్లింల అతి పవిత్రంగా భావించే మక్కాకు వెళ్లడానికి భారతీయ ముస్లింలకు ప్రతి ఏడాది ప్రభుత్వం కోట్ల రూపాయలు ఖర్చు చేస్తోంది. విమాన ప్రయాణ చార్జీల తగ్గింపు, హజ్ టర్మినల్స్, భోజన, వసతిని ఏర్పాటు చేస్తోంది. అయితే తాజాగా సబ్సిడీ ఉపసంహరణతో హజ్ యాత్రీకులపై ఎటువంటి ప్రభావం చూపదని కేంద్ర ప్రభుత్వం అభిప్రాయపడుతోంది. ప్రతీ ఏటా 1,75,000 మంది ముస్లిం లు హజ్ యాత్రకు వెళ్తున్నారు. మరోవైపు హజ్ కమిటీ కార్యదర్శి ఆర్పిసింగ్‌ను ఆ పదవి లో నుంచి తప్పిస్తూ నిర్ణయం తీసుకుంది. యూపీ హజ్‌కమిటీ కార్యాలయానికి కాషాయ రంగు వేయించినందుకు ఆయనపై వేటు పడింది.

సుప్రీంకోర్టు ఆదేశాల మేరకే...

హజ్ సబ్సిడీని దశలవారీగా 2022కల్లా తొలగించాలని సుప్రీంకోర్టు 2012లో ఆదేశాలు ఇచ్చింది. అలాగే నూతనంగా హజ్ పాలసీని ➩ 5వ పేజీలో...


లేగ దూడను నిమురుతున్న జగన్, (పక్కన) చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి

అటు బాబు- ఇటు జగన్

సంక్రాంతి సంబరాలు 2లో

అభివృద్ధికి చిరునామా చిత్తూరు

- రూ.6 కోట్లతో నారావారిపల్లెలో మోడల్ ఆస్పత్రి
- జపాన్ సహకారంతో టమోటా హబ్‌గా మదనపల్లె
- పలు రకాల పరిశ్రమలకు శ్రీకారం
- జాతీయ రహదారులతో కనెక్టివిటీ
- హంద్రీ-నీవా, గాలేరు-నగరి ప్రాజెక్టులకు జలకళ
- ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రకటన


స్వగ్రామం నారావారిపల్లెలో వినతిపత్రాలను స్వీకరిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు

తిరుపతి, ప్రభ న్యూస్ బ్యూరో: వివిధ రకాల కార్యక్రమాలను, పథకాలను అమలు చేయడం ద్వారా చిత్తూరు జిల్లాను అభివృద్ధి అనే పదానికి మోడల్‌గా తీర్చిదిద్దుతున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటించారు. సంక్రాంతి పండగను పురస్కరించుకుని మూడు రోజులపాటు స్వగ్రామమైన నారావారిపల్లెలో బస చేసిన ఆయన మంగళవారం మధ్యాహ్నం రాజధాని నగరానికి వెళ్లారు. ఉదయం రూ. 6 కోట్ల వ్యయంతో నారావారిపల్లెలో 53 గ్రామాల కోసం మోడల్‌గా నిర్మించిన 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించారు. అదేవిధంగా రంగం పేట నుంచి నారావారిపల్లె మీదుగా పదిట్లబైలు వరకు ఉన్న 35 కిలోమీటర్ల రహదారిని రూ. 50 లక్షల వ్యయంతో నాలుగులేన్ల రోడ్డుగా విస్తరించే పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం అక్కడి టీటీడీ కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చంద్రబాబునాయుడు మాట్లాడుతూ గత ముడున్నరేళ్ల మధ్యకాలంలో అంచెలంచెలుగా అన్ని విధాలుగా జిల్లా ను అభివృద్ధి చేయడానికి ప్రత్యేకంగా కృషి చేస్తున్నట్టు తెలిపారు. ఈ క్రమంలోనే నారావారిపల్లె ఆరోగ్య కేంద్రాన్ని స్విమ్స్‌కు అనుసంధానం చేసి, 54 గ్రామాలకు చెందిన 50 వేలమందికి అత్యాధునిక వైద్య సేవలందించే మోడల్ హాస్పిటల్‌గా ➩ 2వ పేజీలో...

నేడు హస్తినకు చంద్రబాబు

- సిఐఐ సదస్సుకు హాజరు
- పెండింగ్ సమస్యలపై కేంద్ర మంత్రులతో భేటీ 2

నేటి నుంచి విశాఖలో అంతర్జాతీయ మహిళా పారిశ్రామికాభివృద్ధి సదస్సు

- ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా ప్రారంభం 2లో

ఏపీకి కొత్త గవర్నర్

- నియమించాలని కేంద్రానికి ఎంపీ హరిబాబు లేఖ 3



మైత్రికి ఇజ్‌లాయల్!

- కార్గిల్ సహకారం మరువలేనిది
- 1971 పాక్‌తో యుద్ధంలోనూ మద్దతు
- కాంగ్రెస్ ఆది నుంచీ వ్యతిరేకమే!
- ఎన్డీయే హయాం నుంచి బలపడుతున్న బంధం
- అంతర్జాతీయ వ్యవహారాల్లో ఆచితూచి అడుగులు


తాజ్‌మహల్‌ను సోమవారం సందర్శించిన ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమెన్ నెతన్యాహూ దంపతులు

(న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ ప్రత్యేక ప్రతినిధి)

ప్రపంచంలోనే అతిపెద్ద రక్షణరంగ నైపుణ్యంగల ఇజ్రాయెల్‌తో భారత్ సంబంధాలు మరింత పటిష్టమౌతున్నాయి. ఆ దేశాధ్యక్షుడు బెంజిమెన్ నెతన్యాహూ మూడ్రోజుల క్రితం భారత్‌కు వచ్చినప్పుడు ప్రోటోకాల్‌ను కూడా పక్కనపెట్టి ప్రధాని స్వయంగా విమానాశ్రయానికెళ్ళి ఆయనకు స్వాగతం చెప్పారు. భారత భూమిపై నెతన్యాహూ అడుగెట్టగానే ఆయన్ను ఆలింగనం చేసుకుని ఇజ్రాయెల్ పట్ల భారత అభిమానాన్ని మోడి చాటారు. ఇది భారత సార్వభౌమత్వానికి విఘాతమంటూ కాంగ్రెస్‌తో పాటు వామపక్షాలు విమర్శలు చేశాయి. ఇక కాంగ్రెస్ అయితే మరో అడుగు ముందుకేసి దీన్ని హగ్ డిప్లమోసి అంటూ తన అధికారిక ట్విట్టర్ పేజీలో ఈ ఆలింగనాన్ని అపహాస్యం చేసింది. బెంజిమెన్ భారత్‌లో ఆర్రోజుల పాటు పర్యటిస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన ఇప్పటికీ తాజ్‌మహల్‌ను సందర్శించారు. పలు రక్షణరంగ ఒప్పందాల్ని ఆయన భారత్‌తో ➩ 3వ పేజీలో...

9 కీలక ఒప్పందాలు

వివరాలు 3లో...

ఇదిగిదిగో సామాన్యుడి బడ్జెట్

ఇలా ఉంటే... సూపర్ హిట్!



- నోట్ల రద్దు నుంచి ఉపశమనం ఉండాలి • విద్య, స్వయం ఉపాధికి పన్నుపోటు విముక్తి కలిగించాలి 7లో

గ్రామీణ విద్య మిథ్య..!



- 40శాతం మందికి గడియారంలో టైం తెలీదు
- 60 శాతం మందికి ఇంటర్నెట్ పరిచయమే లేదు.. సెల్‌ఫోన్లపైనే ఆసక్తి 5లో

అభివృద్ధికి చిరునామా చిత్తూరు





(మొదటిపేజీ తరువాయి)

అభివృద్ధి చేశామన్నారు. లక్షా 50 వేల మందికి వైద్యసేవలందించడానికి వీలైన వ్యవస్థలు ఉన్న ఈ ఆరోగ్య కేంద్రాన్ని స్విమ్స్‌కు, అనుబంధంగా ఉన్న పద్మావతి వైద్య కళాశాల విద్యార్థినుల ప్రయోగశాలగా ఉపకరించేలా చేస్తున్నామన్నారు. భవిష్యత్తులో ఈ ఆరోగ్య కేంద్రానికి అనుబంధంగా సిబ్బంది నివశించే క్వార్టర్ల నిర్మాణం చేస్తామని, టీటీడీ సహకారంతో ఉచిత నిత్యాన్న వితరణ పథకాన్ని అమలు చేయిస్తామని తెలిపారు. సాధించే ఫలితాల ఆధారంగా రాష్ట్రంలో వీలున్న చోట్ల ఈ తరహా ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేయడానికి కృషి చేస్తామన్నారు. భవిష్యత్తులో ఈ ప్రాంతంలోని ప్రతి ఇంటికి రెండు పాడి పశువులను ఇచ్చి, వాటిద్వారా లభించే పాలను సేకరించి నిర్ణీత పద్ధతిలో ప్రతి ఇంటికి రూ. 10 వేలనుంచి రూ. 15 వేల వరకు ఆదాయం లభించేలా చేస్తామన్నారు.

మరోవైపు జిల్లాలోని శ్రీసిటీ పారిశ్రామిక వాడ తరహాలో హార్డ్ వేర్, సాఫ్ట్ వేర్, ఆప్పారెల్స్, ఫుడ్ ప్రాడక్ట్స్, ఆటోమొబైల్ పరిశ్రమలను ఏర్పాటు చేసి మల్టీ ఇండస్ట్రియల్ హబ్‌గా జిల్లాను తీర్చి దిద్దుతామన్నారు. కృష్ణపట్నం, తడ, ఏర్పేడు, తిరుపతి మధ్య త్రిభుజ ఆకారంలో స్పెషల్ ఎంప్లాయిమెంట్ జోన్ ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. జిల్లాలో వివిధ దశల్లో ఉన్న హంద్రీ-నీవా, గాలేరు-నగరి ప్రాజెక్టులను పూర్తి చేసి వ్యవసాయరంగాన్ని లాభసాటిగా మారుస్తామన్నారు. పుట్టపర్తి ప్రాంతంలో ఏర్పడిన లీగల్ సమస్య పరిష్కారమైనందున త్వరలో హంద్రీ-నీవా ద్వారా జిల్లాలోని మదనపల్లె, పుంగనూరు, పలమనేరు, కుప్పం, చిత్తూరు, పీలేరు ప్రాంతాలకు సాగునీరు, తాగునీరు అందిస్తామన్నారు. సోమశిల- స్వర్ణముఖి పథకం ద్వారా బాలాజి రిజర్వాయర్, మల్లెమడుగు జలాశయాలను నింపి, తిరుపతి, శ్రీకాళహస్తి, పుత్తూరు, నగరి ప్రాంతాలకు సాగునీరు, తాగునీరు అందిస్తామన్నారు. ఈ ప్రాజెక్టుల ద్వారా చెరువులన్నిటినీ నింపుకోడానికి ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తామన్నారు. మదనపల్లె ప్రాంతంలోని పండే టమోటా పంటకు సంబంధించి జపాన్ దేశ సహకారంతో టమోటా హబ్‌ను ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేస్తున్నామన్నారు. మామిడి వంటి పండ్లను కూరగాయల ఆధారిత పరిశ్రమలను ఏర్పాటు చేయడం ద్వారా రైతాంగాన్ని ఆదుకుంటామన్నారు.

అటు చెన్నై, ఇటు బెంగళూరు వైపులనుంచి జిల్లా గుండా వెళ్లే ప్రధాన రహదారులన్నిటినీ వెడల్పు చేయడం ద్వారా జాతీయ రహదారులతో కనెక్టివిటీ పెంచడానికి కృషి జరుగుతోందన్నారు. భవిష్యత్తులో ఒక్కో గ్రామాన్ని జిపిఎస్ వ్యవస్థ ద్వారా ఎంపిక చేసుకుని ప్రతి ఇంటిలోని అర్హులను, వారికి అవసరమైన ప్రభుత్వ పథకాల లబ్ధిని అంచనాలు వేసి తగు చర్యలు తీసుకోడానికి వీలుగా సాంకేతిక వ్యవస్థను రూపొందించి ప్రజా సాధికార సర్వేకు అనుసంధానం చేస్తామన్నారు. ప్రతినెలా 5 లక్షల చొప్పున ఫైబర్ గ్రిడ్ ద్వారా ఇంటింటికి ఇంటర్నెట్, కేబుల్ టివిల సేవలను అందిస్తామన్నారు. వీటన్నిటితో పాటు భవిష్యత్తులో ఉరుకుల పరుగుల నగర జీవితాలతో విసిగిపోయినవారు సంక్రాంతి వంటి సంప్రదాయ పండుగల సందర్భంగా అయినా తమ తమ గ్రామాలకు వెళ్లి సంస్కృతి సంప్రదాయాల వారసత్వాన్ని కొనసాగించాలని అంటూ ఈ విషయంలో గత 15 ఏళ్లనుంచి నారావారిపల్లెకు వచ్చి పండుగ చేసుకుంటున్న తన భార్య భువనేశ్వరిని తాను కూడా గత కొన్నేళ్లుగా అనుసరిస్తున్నానన్నారు. ఈ ఆనవాయితీ ఇప్పుడిప్పుడే పలువురు నగరవాసులలో పెరుగుతోందని అంటూ అందరికీ అలవాటు చేయడానికి వీలుగా విలేజ్ టూరిజం, అగ్రి టూరిజం వంటి వ్యవస్థలను అభివృద్ధి చేయడానికి కృషి చేస్తామన్నారు. అన్నిరకాలుగా అభివృద్ధి చేయడం ద్వారా చిత్తూరు జిల్లాను అభివృద్ధి అనే పదానికి మోడల్‌గా మార్చేందుకు పూర్తి స్థాయిలో కృషి చేస్తానన్నారు. పెండింగ్‌లో ఉన్న టిటిడి ధర్మకర్తల మండలిని కొన్ని కారణాల వల్ల భర్తీ చేయలేక పోయామని చెబుతూ త్వరలో కొత్త మండలిని నియమిస్తామన్నారు. చైర్మన్‌గా సుధాకర్‌యాదవ్‌ను నియమించరాదంటూ వస్తున్న వార్తలపై స్పందిస్తూ పత్రికల్లో ప్రకటనలను చూసి నియామకాలు చేయాలా అంటూ ఎదురుప్రశ్న వేశారు.

విలేకరుల సమావేశం అనంతరం తనకోసం వేచివున్న వందలాదిమంది ప్రజలను దాదాపు అరగంటపాటు పలుకరిస్తూ, వారినుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా అనారోగ్యానికి గురైన తిరుపతి వాసి రెడ్డెప్పకు రూ. 50 వేల ఆర్థిక సహాయాన్ని, వెంకట్రామానాయుడు(పొలకల)కు వృద్ధాప్య పింఛన్‌ను, ధనలక్ష్మి, పుష్పలత, శకుంతలమ్మ, అను ముగ్గురు మహిళలకు అర్బన్ హౌసింగ్ కింద ఇళ్లను మంజురు చేశారు. మధ్యాహ్నం 2 గంటలకు నారావారిపల్లె హెలీపాడ్ నుంచి హెలికాప్టర్ లో రేణిగుంట విమానాశ్రయం చేరుకున్న ముఖ్యమంత్రి అందరికీ వీడ్కోలు పలికి ప్రత్యేక విమానంలో రాష్ట్ర రాజధాని బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమాలలో రాష్ట్ర మంత్రులు కామినేని శ్రీనివాస్, నారా లోకేష్, లోక్‌సభ సభ్యుడు శివప్రసాద్, జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ గీర్వాణి, శాసనసభ్యురాలు సుగుణమ్మ, తుడా ఛైర్మన్ నరసింహయాదవ్, శాసనమండలి సభ్యులు దొరబాబు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

అటు బాబు... ఇటు జగన్ సంక్రాంతి సంబరాలు





తిరుపతి, ప్రభ న్యూస్ బ్యూరో: సంక్రాంతి పండగ సంబరాలను సోమవారం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చంద్రగిరి నియోజకవర్గంలోని నారావారిపల్లెలో కుటుంబ సభ్యుల, గ్రామస్తుల నడుమ జరుపుకోగా ప్రధాన ప్రతిపక్ష నేత, వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అదే నియోజకవర్గంలోని పాతకాల్వ గ్రామంలో పార్టీ నేతలు, సన్నిహితుల మధ్య జరుపుకొన్నారు. ప్రతిఏటా తన పుట్టిన ఊరిలో సంక్రాంతి సంబరాలను జరుపుకునే ఆనవాయితీ ప్రకారం చంద్రబాబు కుటుంబ సభ్యులతో రెండురోజులకు ముందే నారావారిపల్లెకు చేరుకున్నారు. ఆదివారం రాత్రి నారా వారిపల్లె గ్రామంలో తిరుగుతూ పలువురి ఇళ్లకు వెళ్లి వారిని పలుకరించి పండుగరోజున ఇంటికి రావాలని పిలిచారు. వియ్యంకులు ఇతర బంధువర్గంతో కలిసి గ్రామ దేవతకు, కులదేవతలకు కొలుపులు చేసారు.

ఆపై తమ ఇంటికి సమీపంలోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసిన తర్వాత తన తల్లిదండ్రుల సమాధులకు శ్రద్ధాంజలి సమర్పించారు. ఆపై అందరికీ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. కుటుంబ సభ్యులతో, స్థానికులతో కలిసి ఇంటి ఆవరణలో పిండివంటలతో సామూహిక భోజనాలు చేశారు. సాయంత్రం చంద్రబాబు కోడలు బ్రాహ్మణి, కుమారుడు దేవాశ్‌తో కలిసి ఎడ్లబండిలో గ్రామమంతటా తిరుగుతూ అందరికీ ఆకట్టుకున్నారు. ఇక జిల్లాలో గత పక్షం రోజులకు పైగా పాదయాత్ర చేస్తున్న వైఎస్ జగన్ సోమవారం సంక్రాంతి సందర్భంగా పాదయాత్రకు విరామం ప్రకటిం చారు. చంద్రగిరి నియోజకవర్గంలోని రామచంద్రాపురం మండలం పాతకాల్వ వద్ద ఆదివారం రాత్రి బస చేసిన జగన్ సోమవారం ఉదయం సంప్రదాయ దుస్తులను ధరించి పార్టీ నేతలకు, సన్నిహితులకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. కొందరికి వస్త్రాలను పంపిణీ చేసిన తర్వాత అందరికీ కలిసి గోవులను పూజించారు.

ఈ కార్యక్రమంలో జిల్లాకు చెందిన పార్టీ సీనియర్ నాయకులు, ప్రజా ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరై జగన్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

ప్రతి ఇంటికీ బాబు బాకీ రూ.90 వేలు

- మాటమీద నిలబడితేనే విశ్వసనీయత
- చక్కెర ఫ్యాక్టరీలను తెరిపిస్తా
- పాదయాత్రలో జగన్



తిరుపతి, ప్రభ న్యూస్ బ్యూరో: అధికారంలోకి రాగానే ప్రతి ఇంటికి ఒక ఉద్యోగం ఇస్తానని, అలా ఇవ్వక పోతే రూ. 2 వేలు నిరుద్యోగ భృతి ఇస్తాననే హామీని మరచిపోవడం ద్వారా చంద్రబాబు ఇప్పటి వరకు రాష్ట్రంలోని ప్రతి ఇంటికి రూ. 90 వేలు బాకీ పడ్డారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్ అన్నారు. చిత్తూరు జిల్లాలో కొనసాగిస్తున్న ప్రజాసంకల్పయాత్రలో జగన్ మంగళవారం చంద్రగిరి శాసనసభ నియోజకవర్గం నుంచి నగరి శాసనసభ నియోజకవర్గంలో అడుగుపెట్టారు. ఉ. వడమాలపేట మండలం అమ్మగుంటలో ప్రవేశించిన జగన్‌కు నగరి శాసనసభ్యురాలు ఆర్కె రోజా నేతృత్వంలో భారీ సంఖ్యలో ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. ఆయన పత్తిపుత్తూరు, పూడి క్రాస్, అప్పలాయగుంట, ఎనుములపాలెం, తిరుమణ్యం, రాజులకండ్రిగ, వేమాపురం, గొల్లకండ్రిగ, వడమాలపేటకు చేరుకున్నారు. వడమాలపేట సభలో జగన్ మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన మాటను నిలబెట్టుకునే వారి వల్లనే రాజకీయాల పట్ల విశ్వసనీయత పెరుగుతుందన్నారు. గత ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన 6 వందల హామీలలో భాగంగా బాబు వస్తే జాబు వస్తుందని, జాబు ఇవ్వక పోతే రూ. 2 వేలు నిరుద్యోగ భృతి ఇస్తామని ఇచ్చిన హామీ నెరవేరందా అని ప్రశ్నించారు. ఉద్యోగాల విషయంలో చంద్రబాబు హామీ ప్రకారం రూ. 2 వేలు చొప్పున లెక్క కడితే ప్రతిఇంటికి ఇప్పటి వరకు రూ. 90 వేలు ఇవ్వాలని జగన్ ప్రకటించారు. ప్రజల ఆశీస్సులతో తాను అధికారంలోకి రాగానే రెండు చక్కెర ఫ్యాక్టరీలను పునరుజ్జీవింపచేసి బలోపేతం చేస్తానన్నారు. నవరత్నాల పేరుతో తాను ప్రకటించిన హామీలను వివరిస్తూ, విద్య, వైద్యపరంగా తనతండ్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను రెండింతలుగా అమలు చేస్తానన్నారు. తాను ప్రకటించిన పథకాలలో ఎటువంటి మార్పు చేర్పులు కావాలన్నా తనవద్దకు వచ్చి లిఖితపూర్వకంగా కానీ, వ్యక్తిగతంగా కానీ తెలియజేయవచ్చునన్నారు.

ఈ సభలో పాల్గొన్న శాసనసభ్యురాలు రోజా మాట్లాడుతూ బాబు వస్తే జాబు వస్తుందని మోసం చేసిన చంద్రబాబు ప్రభుత్వం అధికారంలో తప్పుకుంటేనే జాబు వస్తుందని అంటూ బాబు పోతేనే జాబు వస్తుందని నినాదాలు చేశారు. బహిరంగ సభ ముగిసిన తర్వాత పాదిరేడు వరకు కొనసాగిన జగన్ మంగళవారం నాటి పాదయాత్రను ముగించారు. దాదాపు 15 కిలోమీటర్ల దూరం కొనసాగించిన 63వ రోజు పాదయాత్రలో ఆర్‌కె రోజాతో పాటు పుంగనూరు శాసనసభ్యుడు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి గంగాధరనెల్లూరు శాసనసభ్యుడు నారాయణస్వామి, చిత్తూరు పార్టీ ఇన్‌చార్జి జంగా లపల్లె శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. కాగా ఈ నెల 17వ తేది బుధవారం నగరి నియోజకవర్గం నుంచి శ్రీకాళహస్తి నియోజకవర్గంలో అడుగుపెట్టనున్న పాదయాత్రలో భాగంగా జగన్ సాయంత్రం పాపానాయుడుపేటలో ఏర్పాటు చేసిన బిసి సదస్సులో పాల్గొననున్నారు.

నేడు హస్తినకు ముఖ్యమంత్రి

- సిఐఐ సదస్సుకు హాజరు
- పెండింగ్ సమస్యలపై కేంద్ర మంత్రులతో భేటీ




అమరావతి, ఆంధ్రప్రభ: ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు మరోసారి ఢిల్లీ వెళుతున్నారు. నేడు సి.ఎం. షెడ్యూల్ ఖరారైంది. సిఐఐ భాగస్వామ్య సదస్సు 2018 సన్నాహక సమావేశంలో చంద్రబాబు పాల్గొంటారు. ముఖ్యమంత్రితో పాటు పలువురు కేంద్రమంత్రులు కూడా ఈ సమావేశంలో పాల్గొంటారు. కాగా సిఐఐ భాగస్వామ్య సదస్సులో పాల్గొన్న అనంతరం ముఖ్యమంత్రి మరోసారి రాష్ట్ర విభజన సమస్యలపై దృష్టి సారించనున్నారు. ప్రత్యేకించి విభజన చట్టం అమలు వంటి అంశాలపై కేంద్ర ఆర్థిక, జల వనరుల, కేంద్ర హోం శాఖల మంత్రులను కూడా కలుసుకుని ప్రస్తావిస్తారు. విభజన హామీల మేరకు కేంద్రం నుంచి రావాల్సిన నిధులపై ముఖ్యంత్రి చర్చించే అవకాశాలు వున్నాయి. అదే విధంగా పోలవరం ప్రాజెక్టుకు సంబంధించిన ప్రధానమైన అంశాలపై సైతం చర్చించడం జరుగుతుంది. ప్రధానమంత్రిని కలిసిన నేపథ్యంలో, అందుకు కొనసాగింపుగానే సీఎం కేంద్ర మంత్రులను కలుసుకోవాలని నిర్ణయించారు. ఇదే విషయమై ప్రధానితో ప్రస్తావించారు కూడా. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ప్రధానమైన అంశాలను పరిష్కరిస్తానని మోడీ హామీ ఇచ్చారు. అయితే వివిధ అంశాలకు సంబంధించిన మంత్రులను వారిని విడివిడిగా కలుసుకోవాలని సంకల్పించడం జరిగింది. పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి ఇంతవరకూ రాష్ట్ర ప్రభుత్వం వెచ్చించిన మొత్తంలో ఇంకా కేంద్రం నుంచి సుమారు 3వేల కోట్ల రూపాయలు రావాల్సి వుంది. అదే విధంగా పోలవరం ప్రాజెక్టుకు 58వేల కోట్ల రూపాయలతో సమర్పించిన పూర్తిస్థాయి అంచనాలను ఆమోదించడం, రాజధాని అమరావతి నిర్మాణం కోసం రానున్న కేంద్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించడంపై ప్రధానంగా చర్చిస్తారు. రాష్ట్రంలో పునర్వ్యస్థీకరణ చట్టంలో ఇచ్చిన హామీలన్నిటినీ బడ్జెట్‌తో నిమిత్తం లేకుండా అమలు చేయాలని ముఖ్యమంత్రి కోరతారు. రాష్ట్రం విడిపోయి నాలుగేళ్ళు కావస్తున్న విషయాన్ని గట్టిగా గుర్తు చేయడం ద్వారా వత్తిడి పెంచాలనేది బాబు వ్యూహంగా కనిపిస్తోంది. నియోజకవర్గాల పెంపెదల ను కూడా కేంద్ర మంత్రుల వద్ద ప్రస్తావించడం జరుగుతుంది. ఏపీ రుణాల విషయంలో కేంద్రం నిర్మాణాత్మకంగా వ్యవహరించాలని, నిధుల విడుదలలో త్వరితగతిన నిర్ణయం తీసుకోవాలని, ప్రత్యేక ప్యాకేజీలో భాగంగా కేంద్ర ప్రాయోజిత పథకాలకు సంబంధించిన నిధులు కూడా జాప్యం లేకుండా విడుదల చేయాలని కోరనున్నారు. పెండింగ్‌లో వున్న కృష్ణా నదీ యాజమాన్యం బోర్డు పరిధి, విధి విధానాలు ఖరారు చేయడం, నోటిఫికేషన్ విడుదల ప్రక్రియపై మరోసారి వినతి పత్రం ఇవ్వనున్నారు. ఈఏపీ, కేంద్ర ప్రాయోజిత పథకాలకు సంబంధించిన దాదాపు రూ.20,000 కోట్లు రావాల్సి వుందని, రానున్న అయిదేళ్ళలో ఎకనమిక్ ఎయిడెడ్ ప్రాజెక్టు విషయమై నిధుల విడుదలలో ఉదారంగా వ్యవహరించాల్సిందిగా కోరనున్నారు. ప్రధానితో భేటీకి ముందే ఆర్థిక శాఖ మంత్రి అరుణ్‌జైట్లీకి ముఖ్యమంత్రి ఒక లేఖ కూడా రాశారు. పాత విదేశీ రుణాలు, చిన్న పొదుపు మొత్తాలు, హడ్కో, నాబార్డు వంటి సంస్థల నుంచి రుణాలు స్వీకరించడానికి అనుమతించాలని కోరే అవకాశాలున్నాయి. మరోసారి అమరావతి మెట్రో రైల్, విశాఖలో రైల్వే జోన్ వంటి అంశాలపై మరోసారి కేంద్ర మంత్రులతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చర్చించనున్నారు. సమయాభావం వల్ల తాజా పర్యటనను ఇద్దరు లేదా ముగ్గురు కేంద్ర మంత్రులకే పరిమితం చేయాలని, మరోసారి ఢిల్లీకి వచ్చి కేంద్రంపై వత్తిడి పెంచాలనేది యోచనగా వుందని భావిస్తున్నారు. కాగా సీఎం ఢిల్లీ పర్యటనలో ఆర్థిక, ఇరిగేషన్, ప్రణాళిక, పరిశ్రమల శాఖకు చెందిన అధికారులు సైతం పాల్గొననున్నారు.

సురేష్ ప్రభుతో చర్చలు

కేంద్ర మంత్రి సురేష్‌ప్రభుతో కూడా ముఖ్యమంత్రి చంద్రబాబు ఢిల్లీ పర్యటనలో భాగంగా భేటీ అయ్యే అవకాశాలున్నాయి. ఈ నెల 20న దావోస్ పర్యటన నేపథ్యంలో ఈ సమావేశానికి ప్రాధాన్యత ఏర్పడింది. దావోస్‌కు కేంద్ర మంత్రి సురేష్ ప్రభు సైతం హాజరవుతున్నారు. కాగా రాష్ట్రానికి పెట్టుబడులు గతంలో జరిపిన పర్యటనలు, ఒప్పందాలపై వీరి ఇరువురి భేటీలో చర్చించేఅవకాశాలున్నాయి. సురేష్‌ప్రభు రాష్ట్రం నుంచి రాజ్యసభకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. దీంతో దావోస్ పర్యటన విషయంలో సురేష్ ప్రభుతో కూడా ముందస్తు సమావేశం కావాలని ముఖ్యమంత్రి నిర్ణయించారు. ఈ సందర్భంగా ఇరువురి మధ్య పలు కీలకమైన అంశాలపై పెట్టుబడులు రాబట్టడంపై లోతుగా చర్చించే అవకాశాలున్నాయి. దావోస్ పర్యటనలో కేంద్ర మంత్రిగానే కాకుండా రాష్ట్రం నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న ఎంపీగా కూడా సురేష్ ప్రభు ఆంధ్రప్రదేశ్‌కు సహకారం ఇవ్వనున్నారు.

నేటి నుంచి విశాఖలో అంతర్జాతీయ మహిళా పారిశ్రామికాభివృద్ధి సదస్సు

ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా ప్రారంభం



విశాఖపట్నం, ప్రభ న్యూస్ బ్యూరో : విశాఖ వేదికగా బుధవారం నుంచి మూడు రోజులపాటు భారత మహిళా పారిశ్రామికవేత్తల సమాఖ్య (అలిప్ ఇండియా), దక్షిణాసియా మహిళాభివృద్ధి సంస్థ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో కలిసి అంతర్జాతీయ మహిళా పారిశ్రామికాభివృద్ధి సదస్సును నిర్వహించనున్నారు. బుధవారం నుంచి మూడు రోజుల పాటు ఈ సదస్సు విశాఖలోని నొవొటెల్ హోటల్‌లో జరగనుంది. ముఖ్య అతిథిగా ముఖ్యమంత్రి చంద్రబాబు హాజరై ప్రారంభిస్తారు. అనంతరం మహిళా పారిశ్రామికాభివృద్ధిపై సీఎం కీలక ప్రసంగం చేయనున్నారు. ప్రధానంగా పారిశ్రామిక నవకల్పనలు, సాంకేతికోత్పత్తి, పారిశ్రామికీకరణ తదితర అంశాలపై ఈ సదస్సులో చర్చించనున్నారు. మహిళల్లో సాంకేతిక పరిజ్ఞానం, నూతన వ్యాపార పెట్టుబడి అవకాశాలు, మార్కెటింగ్ అంశాలు, మహిళల ఆర్థిక అభివృద్ధి వంటి అంశాలపై నిపుణులతో చర్చించడంతోపాటు పరిశోధనా అంశాలపై సమావేశాలు నిర్వహించనున్నారు. పలు ఉత్పత్తుల ప్రదర్శనల ద్వారా పారిశ్రామికవేత్తలకు, వ్యాపార వర్గాలకు, విద్యార్థులకు ఉపయోగపడే విధంగా ఈ సదస్సును అలిప్ ఇండియా నిర్వహిస్తోంది. ఈ సదస్సులో వివిధ దేశాలకు చెందిన అభివృద్ధి సంస్థల ప్రతినిధులు, మేధావులు, టెక్నాలజీ నిపుణులు, ఆన్‌లైన్ మార్కెటింగ్ సంస్థల ప్రతినిధులు పాల్గొని టెక్నాలజీ మార్పిడి, విజ్ఞాన మార్పిడి, నూతనోత్పత్తుల తయారీ తదితర అంశాలపై వ్యవసాయ, ఆహార, జౌళి ఉత్పత్తులు, ఇంధన, సేవ, పారిశ్రామిక వ్యర్థాలు, ఇతర రంగాల అవకాశాలపై విశ్లేషించనున్నారు. మహిళా పారిశ్రామికవేత్తలకు వారి వ్యాపార అభివృద్ధికి దోహదపడుతుందని అలిప్ అధ్యక్షురాలు కె.రమాదేవి తెలిపారు. సదస్సును ప్రారంభించిన అనంతరం వుడా కార్యాలయం ఎదురుగా పునఃనిర్మించిన గురజాడ కళాక్షేత్రాన్ని సీఎం ప్రారంభించనున్నారు. సీఎం పర్యటన నేపథ్యంలో మంత్రి గంటా మంగళవారం రాత్రి నొవొటెల్‌లో ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సదస్సుకు పలు ప్రాంతాల నుంచి మహిళా పారిశ్రామికవేత్తలు, ఇతర నిపుణులు, అధికార వర్గాలు హాజరుకానున్నాయి.

ఎన్నార్టీఎస్‌ద్వారా 16 ఐటీ కంపెనీలు

- నేడు ప్రారంభించనున్న మంత్రి లోకేష్



అమరావతి, ఆంధ్రప్రభ: ఆంధ్రప్రదేశ్‌ను ఐటీ హబ్‌గా మార్చేందుకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటోంది. విశాఖపట్టణం, తిరుపతి నగరాలతో పాటు రాజధాని ప్రాంతంలోని మంగళగిరి, విజయవాడ ప్రాంతాలలో పలు ఐటీ కంపెనీలు ప్రారంభించేవిధంగా చర్యలు చేపడుతుంది. ప్రవాసాంధ్రుల కోసం ఏపీ ఎన్నార్టీ సొసైటీ ద్వారా మరో 16 ఐటీ కంపెనీలు ప్రారంభిస్తుంది. ప్రపంచంలోని తెలుగువారికి సేవలు అందించటంతో పాటు ఏపీ అభివృద్ధిలో ప్రవాసాంధ్రులను భాగస్వాములు చేయటానికి ఈకంపెనీలు ఉపయోగపడనున్నాయి. మార్చి నెలాఖరుకు లక్షమంది సభ్యత్వంతో 75 కంపెనీలు ప్రారంభించేవిధంగా కృషిచేస్తోంది. ప్రవాసాంధ్రులతో ఏపీలో పెట్టుబడులు పెట్టించడమే ధ్యేయంగా, పలు అంతర్జాతీయ కంపెనీలతో పెట్టుబడులు పెట్టేవిధంగా ప్రత్యేక ప్రోత్సాహకాలు అందించి రాష్ట్రాభివృద్ధిలో కీలక పాత్ర పోషించనుంది. ముఖ్యంగా నైపుణ్యాలను అభివృద్ధి పర్చుకోవడం, ఉద్యోగాల కోసం వలసలు నివారించేవిధంగా ఐటీ కంపెనీలశిక్షణ, ఉద్యోగాల భర్తీతోపాటు ఏపీలో బ్రాంచ్ ఏర్పాటు చేసేవిధంగా ఏపీఎన్నార్టీ కృషిచేస్తుంది. ఐటీ శాఖా మంత్రి బుధవారం మంగళగిరిలోని ఎన్నార్టీ టెక్ పార్కులో 16 కంపెనీలను ఉ. 9 గం.కు ప్రారంభించనున్నారు. ఎన్నార్టీ టెక్ పార్క్‌లో 13 కంపెనీలు, పైకేర్ ఐటీ పార్కులో 3 కంపెనీలు స్థాపించబడుతున్నాయి. ఈ16 ఐటీ కంపెనీ ద్వారా 606మందికి ఉపాధి లభించనుంది. రాబోయే మూడేళ్లలో 1795 మందికి ఉపాధి కల్పించనున్నాయి. రూ. కోటి వ్యయంతో 10మంది ఉద్యోగులతో ఏర్పాట వుతున్న పిక్సీ డాట్ కామ్ స్టాక్ ఫొటో కంపెనీ మూడే ళ్లలో 50 మంది ఉద్యోగులతో రూ.10కోట్ల పెట్టుబడి పెట్టనుంది. రూ.10లక్షల వ్యయంతో 10 మంది ఉద్యోగులతో ప్రారంభమవుతున్న సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ కంపెనీ అయిన డీఎఫ్ఐ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఐటీ సర్వీస్ కంపెనీ మూడేళ్లలో 20మంది ఉద్యోగులతో రూ.20 లక్షల పెట్టుబడి పెట్టనుంది. రూ.కోటి వ్యయంతో 30మంది ఉద్యోగులతో ప్రారంభమవుతున్న ప్రొడక్టు డెవలప్‌మెంట్ కంపెనీ అయిన స్క్రిప్ట్ బీస్ ఐటీ ప్రైవేట్ లిమిటెడ్ ఐటీ కంపెనీ రాబోయే మూడేళ్లలో 100 మందికి ఉద్యోగం కల్పించడంతోపాటు రూ.3కోట్లు పెట్టుబడి పెట్టనుంది. విజయవాడలో ఉ. 11.30 నుంచి మ. ఒంటి గంటకు జరిగే టైఅమరావతి కార్యక్రమంలో ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించనున్నారు. 50మంది ఉద్యోగులు రూ.కోటి వ్యయంతో ప్రారంభమవుతున్న అద్వైత్ అల్గారిథం యల్‌యల్‌పి మూడేళ్లలో రూ.50లక్షల పెట్టుబడితో 150మందికి ఉపాధి కల్పించనుంది. సువిజ్ ఐటీ సర్వీసెస్ కంపెనీ రూ.20 లక్షల వ్యయంతో 15మందికి ఉపాధి, మహోత్ర మీడియా సొల్యూషన్స్ రూ.15 లక్షల వ్యయంతో 10 మందికి ఉపాధి కల్పించనుంది. విద్యార్థులకు ఉద్యోగావకాశాలు, స్కిల్స్ అవగాహన కల్పించడం కోసం 31 స్టాల్స్‌తో పలు కళాశాలలు, వర్సిల్లోని వేల ఉద్యోగావకాశాలు, నైపుణ్యాల గురించి అవగాహన కలిగించనున్నారు. కార్యక్రమంలో మంత్రులు కొల్లు రవీంద్ర, ఆనంద్ బాబు,పత్తిపాటి పుల్లారావు, డిజిపి మాల కొండయ్య, ఐటీ సలహాదారు జేఏ చౌదరీ, ముఖ్యకార్యదర్శి కె. విజయానంద్, వేద ఐఐటీ ఛైర్మన్ జి. ఆంజనేయులు, ఉన్నత విద్యా కౌన్సిల్ ఛైర్మన్ విజయరాజు, జేయన్‌టీయు కాకినాడ వీసీ వియస్‌యస్ కుమార్, గుంటూరు జిల్లా కలెక్టర్ కోన శశిధర్ పాల్గొనున్నారు.

ఏపీలో 'టై అమరావతి' విస్తరణ

- నూతన వ్యాపార ఔత్సాహికులకు వరం

అమరావతి, ఆంధ్రప్రభ బ్యూరో : ప్రపంచ ప్రఖ్యాత ప్రముఖ వ్యాపార దిగ్గజం ' టై ' వ్యాపార సంస్థ ఇక నుంచి నవ్యాంధ్ర రాజధాని అమరావతి నిర్మాణంలో కూడా పాలుపంచుకోనున్నది. దేశ,విదేశాల్లో భారీ ఎత్తున వ్యాపార లావాదేవీలు నిర్వహిస్తూ తనదైన ముద్ర వేసిన టై సంస్థ అమరావతి అభివృద్ధిలో కూడా భాగస్వామ్యం కాబోతున్నది. బుధవారం మంత్రి నారా లోకేశ్ చేతులు మీదుగా ప్రారం భంకాబోతున్న ఈ ఆధునిక వ్యాపార పురోభివృద్ధి సంస్థ అనేక దేశాలతో వ్యాపార సంబంధాలు కలిగి ఉన్నది. ఈ సంస్థ ఒక లాభాపేక్ష లేని సంస్థగా ప్రసిద్ధి చెందింది . కొత్త ఆలోచనలు,భవిష్యత్ అవకాశాలు, నెట్‌వర్కింగ్ సెషన్స్, పెట్టుబడిదారులతో మాట్లాడడం, వర్క్‌షాపులు నిర్వహించడం, ముఖాముఖి పరిచయ కార్యక్రమాలు నిర్వహించడం, సెమినార్లు నిర్వహించడం, రోడ్ ట్రిప్స్ తదితర కార్యక్రమాలను టై అమరావతి సంస్థ ఔత్సాహిక వ్యాపారవేత్తలతో నిర్వహిస్తోంది. 2,500 మందికి పైగా అనుభవం ఉన్న వ్యాపార వేత్తలు,వ్యాపార కార్యనిర్వాహకులు, చార్టర్ సభ్యులు ఈ టై అమరావతి సంస్థలో భాగస్వాములై ఉన్నారు. 8,500 మంది ఔత్సాహికులు,నిపుణులు సభ్యులుగా ఉన్నారు.18 దేశాల్లో 61 చాప్టర్లను కలిగి ఉంది. వ్యాపారంలో సంపదను సృష్టించడంపై దృష్టి పెట్టడడంలో దిట్టగా పేరుగాంచింది. నిరంతరం సభ్యులతో సమావేశాలు నిర్వహిస్తుంది. వందలకొద్ది అంకితమై పని చేసే వాలంటీర్లు ఇందులో ఉన్నారు.

ప్రపంచ వ్యాప్తంగా ఉన్న వ్యాపార సమాజం ఈ సంస్థకు ఆహ్వానం పలుకుతోంది. కొత్తగా వ్యాపార రంగంలోకి అడుగిడిగే ఔత్సాహికులకు వెన్నంటి ఉండి,ప్రోత్సహించడం ఈసంస్థ ప్రధాన నైజం. వ్యాపారం రంగంలో వస్తున్న నూతన ఒరవడులకు శ్రీకారంచుట్టడడమే కాకుండా వ్యాపార దృక్పధాన్ని మార్చడం,కొత్త ఆలోచనలకు పునాది వేయడంలో టై అందే వేసిన చేయిగా చెబుతుంటారు.టై అయిదు మార్గదర్శకాలను పెంపొందిస్తుంది. వ్యాపారంలో మార్గదర్శకత్వం, నెట్‌వర్కింగ్, విద్య, అవరోధాలు, నిధులు అనే ఈ అయిదు ప్రధాన అంశాలపై దృష్టిపెట్టి, వ్యాపారాన్ని ఏ విధంగా అభివృద్ధి పర్చాలో చైతన్యపరుస్తుంది.

ఈ అయిదు మార్గదర్శక త్వాలపైనే వ్యాపార అభివృద్ధిని పెంపొందిస్తుంద నడంలో అతిశయోక్తి లేదు. ఈ అయిదు అంశాలే టైకి మూల స్తంభాలని పేర్కొనవచ్చు. 1992లో సిలికాన్ వ్యాలీలో స్థాపితమైన ఈ టై వ్యాపార సంస్థ ఒక విజయవంతమైన ప్రముఖ వ్యాపార దిగ్గజంగా ప్రపంచప్రఖ్యాతిని పొందింది. ఇందులో విజయవంతమైన వ్యవస్థాపకులతో పాటు కార్పొరేట్ స్థాయి అధికారులు,నిపుణులు, సింధు ప్రాంతానికి చెందిన నిపుణ గణం కలిపి మొత్తం 13వేల మంది ఈ సంస్థ భాగస్వామ్యంలో పాలు పంచుకుంటూ, విజయపథంలో దూసుకుపోతున్నారు.ఉన్నతమైన సంపద సృష్టికి దోహదపడుతుంది. నమ్మకానికి చిరునామాగా పేరు గాంచింది. కొత్తగా ఉత్పాదక సామర్థ్యాన్ని పెంచడం, వ్యవస్థలు,ఉత్పత్తి పెంచడమే లక్ష్యంగా ముందుకు సాగుతుంది. సరికొత్త అధ్యయనాల వేదికగా టై సంస్థ పేరుగాంచింది. ఆ దిశగా వేగంగా అభివృద్ధి చెందుతుంది. తన కార్యకలాపాలు ద్వారా కొత్త సంస్థలు,వ్యక్తులను ఆకర్శిస్తూ సామర్థ్యాన్ని పెంచుకుంటూ ముందు కెళుతుంది. ఈ క్రమంలోనే ఆంధ్రప్రదేశ్‌లో కూడా తన కార్యకలాపాలను విస్తరించబోతున్నది.బహుళ అంశాలపై దృష్టి సారించి,రాష్ట్రాభివృద్ధికి పాటు పడుతుందంటున్నారు.

ఔత్సహికులను పెంచి పోషించే బలమైన నెట్‌వర్క్‌గా పేరుగాంచింది. వ్యాపారంలో పెట్టుబడి పెట్టడానికి ముందుకొచ్చే ఔత్సహికులకు మార్గదర్శకం చేయడమే కాకుండా,నూతన ఒరవడులకు శ్రీకారం చుట్టడడంలో తనకు తానే దిట్ట అంటారు. వ్యాపారంలో వచ్చే అసమానతలను ఎప్పటికప్పుడు పసిగట్టి, వ్యాపా రాన్ని గాడిలో పెడుతుంది. తద్వారా వ్యాపార సామర్థ్యాన్ని మరింతగా పెంచడంలో తోడ్పడుతుంది. వ్యాపార ప్రారంభ దశ నుంచే వ్యాపారం అభివృద్ధిపై దృష్టి పెట్టడం, నెట్‌వర్క్,వ్యవస్థాపకత,బలమైన కార్యాచరణను రూపొందించి అమలు చేయడం, సమయం,పెట్టుబడి,నిధులసమీకరణ ,ఇతర అంశాలపై ప్రధానంగా కేంద్రీకరించి పని చేస్తుంది. పెట్టుబడి కంపెనీలకు నైపుణ్యాన్ని అందిస్తుంది. ఆంధ్రప్రదేశ్‌లో వేగంగా వ్యాపారాన్ని అభివృద్ధి చేయడం, విద్య, నిధుల సమీకరణ సులభతరం చేయడంపై ప్రధానంగా దృష్టి పెడుతుంది. కొత్తగా మార్కెట్‌లోకి వచ్చే కొత్త కంపెనీలకు సంబంధించి వినూత్నమైన ఆలోచనలు,వ్యాపార ప్రణాళిక, సంస్థాగత పెట్టుబడి ఇత్యాధి అంశాలపై ఔత్సాహికులకు దిశా నిర్దేశం చేస్తుంది. కొత్తగా వ్యాపారంలోకి వచ్చే ఔత్సాహికుల్లో నూతన ఆలోచనలు రేకిత్తిస్తుంది. వృత్తి నైపుణ్యాన్ని కలిగించి,సంపూర్ణ మద్దతును ఇస్తుంది. ఇందులో కార్పొరేట్ సభ్యత్వం, చార్టర్ సభ్యత్వం, అసోసియేట్ సభ్యత్వం, విద్యార్థి సభ్యత్వం ఉంటుంది. ఈ రకమైన సభ్యత్వాలు పొందడం ద్వారా కొత్తగా వ్యాపారంలోకి వచ్చే వారు అనేక విధాలుగా లబ్ధిచేకూర్చేలా టై చర్యలు తీసుకుంటుందంటున్నారు.ఇందులో సభ్యత్వం పొందిన వారికి విజయవంతమైన వ్యాపార వేత్తలతో కలిపించి,ఒకరి భావాలు మరొకరు పంచుకునేలా చేస్తారు. తద్వారా వ్యాపారం అభివృద్ధికి మార్గం సుగామం అవుతుంది. అంతేకాకుండా పరిశ్రకు సంబంధించి వృత్తి నిపుణులతో పరిచయాలు ఏర్పాటు చేస్తారు.

వ్యాపార ప్రణాళికలు, వ్యూహాలు, ఇతర అంశాలపై ఇరువురి మధ్య సంబంధాలు బలపడతాయి. అయితే టై అమరావతి నిర్వహించే కొన్ని వ్యాపారాభివృద్ధి కార్యక్రమాలకు ఉచితంగా ప్రవేశం కల్పిస్తున్నారు.మరికొన్నింటిని నామమాత్రపు ప్రవేశ ధరతో ప్రవేశం కల్పిస్తున్నారు. కార్పొరేట్ సభ్యత్వం కేవలం ఆహ్వానం పొందిన వారికే ఉంటుంది. చట్ట పరిధికి లోబడి ఈ తరహా సభ్యత్వం కల్పిస్తారు. ఇక చార్టర్ సభ్యత్వం కూడా అదే విధంగా ఉంటుంది. ఇక అసోసియేట్ సభ్యత్వానికి మాత్రం రూ. 5000లు చెల్లించాల్సి ఉంటుంది. దీని ద్వారా సంవత్సరం వరకు పన్ను మినహాయింపు ఇస్తారు. విద్యార్థి సభ్యత్వానికి రూ.1000లు ఉంటుంది. ల్యాబులు,స్కూలు స్థాయిలో జరిగే వివిధ కార్యక్రమాలకు సంపూర్ణ మద్దతుగా టై నిలుస్తుందంటారు.

భారత్-ఇజ్రాయెల్ మధ్య
9 కీలక ఒప్పందాలు

న్యూఢిల్లీ: ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజిమన్ నెతన్యాహు భారత్ పర్యటన ఉత్సాహంగా సాగుతోంది. ఆరురోజుల పర్యటన కోసం ఆదివారం భారత్ చేసురున్న నేతన్యాహుకు రాష్ట్రపతి భవన్‌లో ఘన స్వాగతం లభించింది. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఇజ్రాయెల్ ప్రధాని దంపతులకు సాదర స్వాగతం పలికారు. అనంతరం భారత ప్రధానితో భేటీ అయిన నెతన్యాహు మోడీపై ప్రశంసల వర్షం కురిపించారు. నరేంద్ర మోడీ విప్లవాత్మకమైన నేత అని నెతన్యాహు కొనియాడారు. ఎప్పుడైనా మోడీతో యోగా చేసేందుకు తాను సిద్ధమేనని ప్రకటించారు. ఇజ్రాయెల్, భారత్ రెండూ ఉగ్రవాద బాధిత దేశాలేనని.. ఆ బాధేంటో రెండు దేశాలకు బాగా తెలుసని వ్యాఖ్యానించారు. ఉగ్రవాదాన్ని కూకటివేళ్లతో పెకిలించేందుకు కలిసికట్టుగా పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. అనంతరం మోడీ మాట్లాడుతూ వేగవంతమైన దేశాభివృద్ధి కోసం మీరు అధికారులకు విధించిన నిబంధనాలను తొలగించారు.. ఇక్కడ మేం కూడా అదే పనిలో ఉన్నాం అని చెప్పుకొచ్చారు. ప్రజలకు మేలు చేయాలని తపనతో ఉన్నారని చెప్పారు. ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమన్ నెతన్యాహు భారత్ పర్యటన సందర్భంగా రెండు దేశాల మధ్య 9 ఒప్పందాలు కుదిరాయి.

తాజ్‌మహల్ సందర్శించిన నెతన్యాహు దంపతులు

ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు దంపతులు ప్రేమకు ప్రతిరూపమైన తాజ్ మహల్‌ను సందర్శించారు. సతీమణి సారాతో కలిసి నెతన్యాహు తాజ్‌మహల్ వద్ద ఫోటోలు కూడా దిగారు. ఈ సందర్భంగా తాజ్ మహల్ విశిష్టతను అక్కడి అధికారులు వారికి తెలియజేశారు. నెతన్యాహు దంపతుల వెంట ఉత్తర్ ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆధిత్యనాథ్ కూడా వెళ్లారు. అనంతరం యోగి ఆధిత్యనాథ్ నెతన్యాహు దంపతులకు ప్రత్యేక విందు ఇచ్చారు.

నేడు గుజరాత్‌కు నెతన్యాహు

భారత్ పర్యటన సందర్భంగా ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమన్ నెతన్యాహు నేడు గుజరాత్ లో పర్యటించనున్నారు. మోడీ- నెతన్యాహులు భారత జాతిపిత మహాత్మాగాంధీ నెలకొల్పిన సబర్మతీ ఆశ్రమాన్ని సందర్శిస్తారు.

మోడీకి నెతన్యాహు స్పెషల్ గిఫ్ట్

ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు భారత ప్రధాని నరేంద్ర మోడీకి ప్రత్యేక బహుమతిని ఇవ్వనున్నారు. గాల్ మొబైల్ వాటర్ డిసాలినైజేషన్ ప్యూరిఫైడ్ జీప్‌ను గిఫ్ట్‌గా ఇవ్వనున్నారు. సముద్రనీటిని శుద్ధిపరిచే సాంకేతిక పరిజ్ఞానం కలిగిన ఈ జీపును మోడీ ఇజ్రాయెల్ లో నడిపి ముచ్చటపడ్డారు. ఈ జీపు పనిచేసే విధానాన్ని అధికారులు వారికి వివరిస్తారు. ఈ జీపు విలువ రూ. 71 లక్షలపైనే ఉంటుందని అధికారులు తెలిపారు.

ముంబై చేరుకున్న చిన్నారి మోషె



26/11 ఉగ్రదాడిలో తల్లిదండ్రులను కోల్పోయిన చిన్నారి మోషె హోల్జ్ బర్గ్ తొమ్మిదేళ్ల తర్వాత భారత్ వచ్చాడు. 11 ఏళ్ల మోషె తన తాత షిమాన్ రోసెన్ బర్గ్ తో కలిసి ముంబై చేరుకున్నాడు. ముంబై నగరానికి రావడం సంతోషంగా ఉందని మోషె తెలిపాడు. గతేడాది ఇజ్రాయెల్ పర్యటన సందర్భంగా ప్రధాని మోడీ మోషెను, అతడి అమ్మమ్మ, తాతలను కలిశారు. మీరు ఎప్పుడైనా భారత్ సందర్శించవచ్చు అని అప్పుడు మోడీ వారితోచెప్పారు. గురువారం ఇజ్రాయెల్ ప్రధాని ముంబైలోని నారీమన్ హౌస్ సందర్శన సందర్భంగా మోషె ఇరుదేశాల ప్రధానులను కలిసేఅవకాశం ఉంది.

రైతుల నుండి తక్షణం ధాన్యం కొనుగోలు చేయండి

- పౌరసరఫరాల శాఖకు ముఖ్యమంత్రి ఆదేశం

అమరావతి, ఆంధ్రప్రభ: ఆరుగాలం శ్రమించి పండించిన పంటకు అమ్మకంలో ఎదురవుతున్న ఇబ్బందులను పరిష్కరించి తక్షణం ధాన్యం కొనుగోలు చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారు. పట్టిసీమ నీటితో అధిక దిగుబడులు వచ్చినప్పటికీ పౌరసరఫరాల శాఖ ఆంక్షల వల్ల రైతులు కళ్లాలలోనే ధాన్యాన్ని నిల్వ ఉంచుకోవాల్సిన దుస్థితి నెలకొందని పేర్కొన్నారు. రైతులు, రైస్ మిల్ అసోసియేషన్ నాయకులు మంగళవారం సాయంత్రం ఉండవల్లిలోని సీఎం నివాసంలో చంద్రబాబు నాయుడును కలుసుకున్నారు. ముఖ్యంగా కృష్ణాజిల్లాలో ధాన్యం కొనుగోలుకు సంబంధించి ఆంక్షలతో ఎదురవుతున్న సమస్యలను వివరించారు. ఈ నేపథ్యంలో పౌరసరఫరాల శాఖ కమిషనర్ రాజశేఖర్, కృష్ణాజిల్లా జాయింట్ కలెక్టర్ విజయ్ కృష్ణన్‌ను పిలిపించి మాట్లాడారు. రైతుల వద్ద ఉన్న ధాన్యాన్ని తక్షణం కొనుగోలు చేసి సమస్యను పరిష్కరించాలని ముఖ్యమంత్రి సూచించారు. ధాన్యానికి మద్దతు ధర చెల్లించాలని కూడా ఆదేశించారు.

ఏపీకి కొత్త గవర్నర్

- నియమించాలని కేంద్రానికి ఎంపీ హరిబాబు లేఖ



విశాఖపట్నం, ప్రభ న్యూస్ బ్యూరో: ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేకంగా నూతన గవర్నర్‌ను నియమించాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, విశాఖ పార్లమెంట్ సభ్యుడు కంభంపాటి హరిబాబు కోరారు. ఈ మేరకు మంగళవారం ఆయన కేంద్ర హోంశాఖామంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌కు లేఖ రాశారు. విభజన చట్టంలో పొందుపరిచిన విధంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సచివాలయం, అసెంబ్లీ, ఇతర ప్రభుత్వ కార్యకలాపాలు అమరావతి వేదికగా ఏర్పాటు చేసుకొని నిర్వహిస్తున్నందున తక్షణమే ఏపీకి గవర్నర్‌ను ఏర్పాటు చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని హరిబాబు లేఖలో ప్రస్తావించారు. దీంతో పాటు రాష్ట్రప్రజల అవసరాలకు తగ్గట్లుగా హైకోర్టును కూడా విభజించి తక్షణమే ఏపిలో కూడా హైకోర్టు ఏర్పాటు చేయాలని లేఖలో పేర్కొన్నారు. విభజన చట్టంలో పొందుపరిచిన ఆయా అంశాలను తక్షణమే అమలులోకి తేవాలని కోరారు. రాష్ట్రప్రజల మనోభావాలు దెబ్బతినకుండా ఈ రెండింటిని తక్షణమే అమలుల్లోకి తేవాలని హరిబాబు విజ్ఞప్తి చేశారు.

మైత్రికి ఇజ్‌లాయల్!

(మొదటిపేజీ తరువాయి)



చేసుకుంటున్నారు. తద్వారా రక్షణ విషయంలో భారత్ మరే దేశానికి తీసిపోకుండా మెరుగైన స్థానంలో నిలబడేందుకు సహకరిస్తున్నారు. కాంగ్రెస్‌తో సహా విపక్షాలు నెతన్యాహూ పర్యటనపై విరు చుకుపడుతున్నాయి. ఆయనకు భారత్ అనవసర ప్రాధాన్యత ఇస్తోందంటూ మండిపడుతున్నాయి. కొన్ని సామాజిక సేవా సంస్థలు కూడా మోడి తీరును తప్పుబడుతున్నాయి. భారత దీర్ఘకాలిక రక్షణావసరాలతోపాటు గతంలో భారత్ కష్టకాలంలో ఉన్న సమయాల్లో ఇజ్రాయెల్ నుంచి పొందిన సహకారాన్ని దృష్టిలో పెట్టుకుని చూస్తే బెంజిమెన్ పర్యటనకు భారత్ ఇస్తున్న ప్రాధాన్యత పెద్దగొప్పేం కాదంటూ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. పైగా ఈ ప్రాధాన్యత తప్పని సరైనదేనంటూ స్పష్టం చేస్తున్నారు. భారత్‌లో కాంగ్రెస్, బీజేపీలు రాజకీయంగా భిన్నవైఖరులు అవలంబిస్తున్నాయి. ఇది దేశీయంగానే కాదు.. విదేశీ సంబంధాల విషయంలో కూడా ఇదే పోకడను అనుసరిస్తున్నాయి. కాంగ్రెస్ అయితే జవహర్‌లాల్ నెహ్రూ కాలం నుంచి ప్రపంచపటంలో లేని పాలస్తీనాకు మద్దతిస్తున్నారు. ఆయన తర్వాత ఇందిర, రాజీవ్, పి.వి. నరసింహరావులు కూడా పాలస్తీన విమోచన నేత ఆసర్ అరాఫత్‌కు మద్దతుదారులుగా నిల్చారు. ఇజ్రాయెల్, పాలస్తీనా మధ్య జరుగుతున్న అంతర్గత పోరాటంలో కాంగ్రెస్ ఏలుబడిలోని భారత్ పాలస్తీనాకే మద్దతు పలికింది. ఎన్‌డీఏ మాత్రం ఈ విషయంలో ఆచితూచి వ్యవహరించింది. వాజ్‌పేయి హయాం నుంచి కూడా అరాఫత్‌తో స్నేహం చేస్తూనే ఇజ్రాయెల్ ప్రయోజనాల పరిరక్షణకు ఎన్‌డీఏ ఏలుబడిలోని భారత్ మద్దతుగా నిల్చింది. ఇందుకు ఈ దేశం తగిన ప్రతిఫలాన్ని పొందింది. 1999లో జరిగిన కార్గిల్ యుద్ధం సమయంలో ఇజ్రాయెల్ భారత్‌కు ఆయాచితంగా సహాయ, సహకారాల్ని అందించింది. వాస్తవానికి కార్గిల్ యుద్ధం నాటికి భారత్ వద్ద తగినంత మందుగుండు సిద్ధంగా లేదు. ఆయుధ సంపత్తి కూడా అంతంత మాత్రమే. పైగా హిమాలయ సానువుల్లో అత్యంత ప్రమాదకరమైన ప్రాంతంలో పాక్ దాడికి దిగింది. అక్కడికి వేగంగా ఆయుధాల్ని చేరవేయడం కూడా కష్టం. వీటన్నింటిని పరిగణనలోకి తీసుకునే ముషారఫ్ కార్గిల్ వద్ద దాడికి వ్యూహాన్ని అమలు చేశారు. వాస్తవానికి ఆ సమయంలో ఆయుధ సంపత్తి వరకు పాక్‌తో పోలిస్తే భారత్ చాలా వెనుకంజలో ఉంది. అప్పుడు ఇజ్రాయెల్ తనంత తానుగా సాయమందించేందుకు ముందుకొచ్చింది. వాస్తవానికి వాజ్‌పేయి ప్రభుత్వం ఈ విషయంలో సాయం చేయమని అభ్యర్థన పంపలేదు. కనీసం అలాంటి ప్రతిపాదన కూడా రాలేదు. కానీ ఇజ్రాయెలే ముందుకొచ్చింది. అవసరమైన రక్షణ పరికరాల జాబితాను కూడా ఆ దేశ రక్షణరంగ నిపుణులే సిద్ధం చేశారు. ముఖ్యంగా ఎత్తయిన ప్రదేశాలు, అత్యంత శీతలమైన ప్రాంతాల్లో నిప్పులుగగ్గి శత్రువుల్ని చీల్చి చెండాడగలిగే ఆయుధాల్ని భారత్‌కు సరఫరా చేయాలని నిర్ణయించారు. అది కూడా వెనువెంటనే చేపట్టారు. ఇందుకోసం ఆ దేశ నౌకల్నే వినియోగించారు. వాటివెంట ఇజ్రాయెల్ రక్షణనౌకల్ని కాపలాగా పంపించారు. ఈ సమచారం తెలుసుకున్న అమెరికా ఇజ్రాయెల్‌ను కట్టడి చేసే ప్రయత్నం చేసింది. సకాలంలో ఆయుధ సంపత్తి అందని పక్షంలో ఖచ్చితంగా భారత్ వెనుకంజేస్తుందంటూ అమెరికా పేర్కొంది. అయినా సరే సరఫరా నిలిపేందుకు ఇజ్రాయెల్ ససేమీరా అంది. కనీసం రవాణాలో జాప్యం చేయండన్న అమెరికా అభ్యర్థనను కూడా ఇజ్రాయెల్ పట్టించుకోలేదు. దీంతో ఇజ్రాయెల్ నుంచి భారీ సంఖ్యలో మోర్టార్లు, మందుగుండు సామగ్రి భారత్‌కు చేరాయి. దూరప్రాంత లక్ష్యాల్ని ఛేధించే మిస్సైళ్ళు కూడా ఇజ్రాయెల్ భారత్‌కు పంపించింది. వీటన్నింటితో పాటు యుద్ధాల్లో వినియోగానికి మిరేజ్ 2000హెచ్ రకం యుద్ధ విమానాల్ని కూడా సరఫరా చేసింది. కార్గిల్ యుద్ధంలో పాక్‌పై భారత్‌పై చేయికి ఈ విమానాలే కారణమయ్యాయి. ఇవే కాదు. మానవరహిత విమానాల్ని కూడా భారత్‌కు సరఫరా చేసింది. శత్రువుల రహస్య స్థావరాల్ని కూడా గుర్తించగలిగే రాడార్లను కూడా అందించింది. వాస్తవానికి ఇజ్రాయెల్ సరఫరా చేసిన అత్యాధునిక రక్షణ సామగ్రే కార్గిల్ యుద్ధంలో పాక్ పీచమణిచేందుకు భారత్‌కు దోహద పడింది. కార్గిల్ యుద్ధ విజయంలో ఇజ్రాయెల్ కీలక పాత్ర పోషించింది. ఆయుధాలన్నింటిని ఇజ్రాయెల్ భారత్‌కు అమ్మలేదు. వీటికోసం భారత్ నుంచి డబ్బులు వసూలు చేయలేదు. కేవలం స్నేహపూర్వకంగానే ఇజ్రాయెల్ భారత్‌కు వీటిని అందించింది. ఆనాటి యుద్ధంలో భూతలంపై హోవిడ్జర్ శతఘ్నులు నిప్పులు రాలిస్తే గగనతలంపై ఇజ్రాయెల్ సరఫరా చేసిన రాకెట్ లాంచర్లు, మోర్టార్లు, మానవరహిత విమానాలే కీలకపాత్ర పోషించాయి. కార్గిల్ యుద్ధ వాతావరణాన్ని ఒక్కసారిగా మార్చడంలో ఇజ్రాయెల్ ఏ విధంగా భారత్‌కు సహకరించిందన్న దానిపై ఇటీవలె ఢిల్లీలో ఇజ్రాయెల్ అంబాసిడర్ మార్క్‌సోఫెర్ అవుట్‌లుక్ వారపత్రికకు ఇచ్చిన తన ఇంటర్వ్యూలో మరింత విశదీకరించారు. ఒక్క కార్గిల్ యుద్ధంలోనే కాదు.. 1971లో జరిగిన ఇండో-పాక్ యుద్ధంలో కూడా ఇజ్రాయెల్ భారత్‌కు మద్దతుగా నిలబడింది. అప్పుడు కూడా ఉచితంగానే రక్షణ సామగ్రిని సరఫరా చేసింది.

ఆదినుంచి ఇజ్రాయెల్‌కు కాంగ్రెస్ వ్యతిరేకమే

ఆదినుంచి కాంగ్రెస్ ఇజ్రాయెల్‌కు వ్యతిరేకంగానే ఉంది. భారత్ మతప్రాతిపదికన విభజనకు గురైనప్పటికీ ఇజ్రాయెల్ విషయంలో మహాత్మాగాంధీ వ్యతిరేక వైఖరినే అవలంబించారు. మతప్రాతిపదికన ఇజ్రాయెల్ ఏర్పాటు సరికాదంటూ ఆయన పలు సందర్భాల్లో పేర్కొన్నారు. 1949లో ఐక్యరాజ్య సమితిలోకి ఇజ్రాయెల్ ప్రవేశానికి వ్యతిరేకంగా ఇండియా ఓటేసింది. అప్పుడే భారత్‌లోని ఆర్ఎస్ఎస్ ఇజ్రాయెల్‌కు అనుకూల వాదాన్ని మొదలెట్టింది. హిందూ మహాసభ నాయకుడు వినాయక దామోదర సావర్కర్ ఇజ్రాయెల్ ఏర్పాటును, అక్కడి మత రాజకీయ పరిస్థితుల్ని కూడా సమర్థించారు. ఐక్యరాజ్య సమితిలో ఇజ్రాయెల్ ప్రవేశానికి వ్యతిరేకంగా భారత్ ఓటేయడాన్ని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ తప్పుబట్టింది. 1950 సెప్టెంబర్ లోనే ఇజ్రాయెల్‌ను భారత్ అధికారికంగా గుర్తిస్తున్నట్లు ప్రకటించింది. అయినప్పటికీ కాంగ్రెస్ నాయకులు అరబ్ దేశాలతో మొహమాటం చెడిపోవడానికి ఇష్టపడేవారు కాదు. 1953వరకు భారత్‌లో కాన్సులేట్ ఏర్పాటుకు ఇజ్రాయెల్‌కు అనుమతివ్వలేదు. అప్పుడు కూడా మరోవైపు పాలస్తీనా నాయకులతో భారత ప్రభుత్వం మైత్రీ బంధాన్ని కొనసాగిస్తూనే ఉండేది. అరబ్బులకు ఆగ్రహం రాకుండా ఇజ్రాయెల్ పట్ల ఉదాసీనత ప్రదర్శించేది. అరబ్బు దేశాల్ని పాక్‌కు దూరంగా ఉంచడంతో పాటు మిత్రదేశం సోవియట్ సూచనలకు అనుగుణంగానే పాలస్తీనాకు అనుకూలంగా వ్యవహరిస్తున్నామంటూ ఇందిరాగాంధీ పలు సందర్భాల్లో పేర్కొన్నారు. ఆదినుంచి కాంగ్రెస్ నాయకులు ప్రో అరబ్ పాలసీకే కట్టుబడ్డారు. ఆర్గనైజింగ్ ఆఫ్ ఇస్లామిక్ కోపరేషన్ అనే సంస్థను అరబ్ దేశాలు ఏర్పాటు చేసుకోవడం, ఇది భారత ప్రయోజనాలకు విఘాతకరంగా ఉండడంతో పాటు పాక్‌కు అనుకూల వైఖరి ప్రదర్శించడంతో ఒక్కసారిగా భారత ప్రభుత్వంలో మార్పులు మొదలయ్యాయి.

1997లో తొలిసారిగా ఇజ్రాయెల్ అధ్యక్షుడు ఎజీర్ వైజ్‌మెన్ భారత్‌లో పర్యటనకొచ్చారు. ఇక భారత్ నుంచి 2000లో అప్పటి కేంద్ర మంత్రి ఎల్‌కె అద్వానీ ఇజ్రాయెల్‌లో పర్యటించారు. ఆ తర్వాత వరుసగా జశ్వంత్ సింగ్ రెండుసార్లు వెళ్లొచ్చారు. అప్పటి నుంచి ఇజ్రాయెల్ భారత్‌ల మధ్య సంబంధాలు మరింత బలపడ్డాయి. 2003లో ఇజ్రాయెల్ ప్రధాని ఏరియల్ షారోన్ తొలిసారిగా భారత్‌లో పర్యటన జరిపారు. అప్పటి భారత ప్రధాని వాజ్‌పేయి కూడా మోడి తరహాలనే ఆ పర్యటనకు అత్యంత ప్రాధాన్యతనిచ్చారు. షారోన్ రాకకు వ్యతిరేకంగా ఇస్లామిక్ సానుకూలశక్తులతో పాటు కమ్యూనిస్టు నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున చేపట్టిన ఆందోళనల్ని వాజ్‌పేయి ప్రభుత్వం కఠినంగా అణచేసింది. ఇలా రెండు దేశాల మధ్య సుహృద్భావ వాతావరణం పెంపొందింది. మోడి ప్రభుత్వం అంతర్జాతీయ సంబంధాల విషయంలో ఆచితూచి వ్యవహరిస్తోంది.

గత ఏడాది మోడి ఇజ్రాయెల్ పర్యటన సందర్భంగా ఇదే నెహ్యాహు ప్రోటోకాల్‌ను పక్కన పెట్టి స్వయంగా విమానాశ్రయానికొచ్చి భారత ప్రధానిని స్వాగతించి ఆయనతో పాటు ఒకే కారులో తీసుకెళ్ళారు. అంతమాత్రాన భారత్ ఏకపక్షంగా వ్యవహరించలేదు. ఇటీవలె జెరూసలెం విషయంలో అమెరికా నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఐక్యరాజ్య సమితి చేపట్టిన ఓటింగ్‌లో భారత్ ఇజ్రాయెల్ ప్రయోజనాలకు వ్యతిరేకంగానే ఓటేసింది. ఇలా అంతర్జాతీయ సమాజ దృక్పథానికి భారత్ కట్టుబడి ఉంది.

రేపటి నుంచి కలెక్టర్ల సదస్సు

- రెండు రోజులపాటు ఉండవల్లి గ్రీవెన్స్‌సెల్‌లో నిర్వహణ
- ఏర్పాట్లు పూర్తి చేసిన ప్రభుత్వం
- ఏడు అంశాలపై చర్చ జరిగే అవకాశం

అమరావతి, ఆంధ్రప్రభ: రాష్ట్రానికి చెందిన కలెక్టర్ల సదస్సు రెండు రోజులపాటు జరుగనుంది. గత సాంప్రదాయానికన్నా భిన్నంగా ఈసారి కలెక్టర్ల సదస్సును ముఖ్యమంత్రి నివాసం వుంటున్న ఉండవల్లి కరకట్ట వద్ద కొత్తగా నిర్మించిన గ్రీవెన్స్ సెల్ భవనంలో నిర్వహించబోతున్నారు. జనవరి 18,19 వ తేదీలలో గురు, శుక్రవారాలలో రెండు రోజులు జరిగే సదస్సు కోసం ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసింది. గ్రీవెన్స్ సెల్ వద్ద సీట్ల ఏర్పాటు తో పాటు కొత్తగా పార్కింగ్ కోసం స్థలాన్ని చదును చేసి సిద్ధం చేశారు.పోలీస్ యంత్రాంగం పెద్ద ఎత్తున బందోబస్తు చర్యలను చేపట్టింది. గుంటూరు రూరల్ ఎస్.పి ఆధ్వర్యంలో ఇప్పటికే రూట్‌మ్యాప్‌ను సిద్ధం చేశారు. తొలుత సదస్సును వెలగపూడి సచివాలయంలోని అయిదవ బ్లాక్ మొదటి అంతస్తులో నిర్వహించాలని నిర్ణయించారు. అయితే అక్కడ ఇంకా నిర్మాణ పనులు కొనసాగుతుండటంతో ఈసారి గ్రీవెన్స్ సెల్‌లో నిర్వహించాలని ముఖ్యమంత్రి చేసిన సూచనలకనుగుణంగా సదస్సు కోసం సిద్ధం చేశారు. కలెక్టర్లు, ఎస్.పి.లకు అక్కడే భోజన వసతులు కల్పించేందుకు ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయి. రాష్ట్ర విభజన అనంతరం కలెక్టర్ల సదస్సులను విజయవాడలోని ప్రైవేట్ హాల్‌లలో నిర్వహిస్తూ వస్తోంది. ప్రైవేట్ కన్వెన్షన్లు, హోటల్స్‌లో సదస్సులను నిర్వహిస్తూ రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తోందంటూ విమర్శలు తలెత్తాయి. ఫలితంగానే గ్రీవెన్స్ సెల్‌లో ఈ సదస్సును నిర్వహించాలని తలపెట్టారు. మొదటి రోజు, రెండవ రోజు మధ్యాహ్నం దాకా కలెక్టర్ల సదస్సు వుంటుంది. అదే విధంగా రెండవ రోజు మధ్యాహ్నం నుంచి ఎస్.పి.లతో సదస్సు వుంటుంది.

మిషన్‌లపై చర్చ

రెండు రోజులపాటు జరిగే కలెక్టర్ల సదస్సులో వివిధ అంశాలపై చర్చ జరిగే అవకాశాలు వున్నాయి. ప్రత్యేకించి రియల్ టైం గవర్నెన్స్ కు సంబంధించి ముఖ్యమంత్రి మరోసారి దిశానిర్దేశం చేయనున్నారు. ఇప్పటికే ప్రధాన కేంద్రాన్ని వెలగపూడి సచివాలయంలోని ఒకటవ బ్లాక్‌లో నెలకొల్పారు. అయితే పూర్తిస్థాయి సామర్థ్యంతో పనిచేసే క్రమంలో అన్ని జిల్లా కేంద్రాలలోనూ అనుబంధంగా ఆర్.టి.జి కేంద్రాలను ఏర్పాటు చేయాలని సంకల్పించారు. అదే విధంగా జన్మభూమి కార్యక్రమంపై కూడా కలెక్టర్ల సదస్సులో ప్రధానంగా చర్చ జరగనుంచి. గతంలో అందిన ఫిర్యాదులు, తాజాగా పరిష్కరించిన అంశాలపై చర్చ జరుగుతుంది. ఇందుకు సంబంధించి కలెక్టర్లు నివేదికలను సమర్పిస్తారు. గత ఎన్నికలలో ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చడంపై దృష్టిని కేంద్రీకరిస్తారు. వివిధ శాఖలు, మిషన్‌ల వారీగా చర్చలుంటాయి. పరిశ్రమలు పట్టణాభివృద్ధి, ప్రాథమిక, సేవా రంగం, మౌళికసదుపాయాలు, సామాజిక సాధికారత, నైపుణ్యాభివృద్ధి మిషన్లపై సమగ్రంగా చర్చ జరుగుతుంది. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలు, వ్యవసాయం, ఐటి కంపెనీలకు ఎకోసిస్టం సృష్టి, ఏపీ ఫైబర్‌నెట్‌కు సంబంధించి సదస్సులో చర్చిస్తారు. రాష్ట్రంలో శాంతి భద్రతలపరిస్థితులపై కూడా ఎస్.పి.లతో రెండవ రోజు సమీక్ష వుంటుంది. 2017-18 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన కార్యాచరణ ప్రణాళిక అమలు తీరు, ఇతర అంశాలపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ వుంటుంది. కుటుంబ వికాసం, సమాజ వికాసం, అభివృద్ధి లక్ష్యాలు, సామర్థ్యంపై ఇండికేటర్లు, జిల్లాలవారీగా రేటింగ్‌లపై ప్రధానంగా కలెక్టర్ల సదస్సు ఫోకస్ చేయనుంది.

ఆర్డీఎస్‌పై మంత్రి దేవినేనికి తెలంగాణ మంత్రి హరీశ్‌రావు లేఖ

అమరావతి, ఆంధ్రప్రభ: ఆర్డీఎస్ ఆధునీకరణ పనులకు సంబంధించి రాష్ట్ర జలవనరుల శాఖా మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావుకు తెలంగాణ రాష్ట్ర భారీ నీటిపారుదల శాఖా మంత్రి హరీశ్‌రావు మంగళవారం లేఖ రాశారు. ఆర్డీఎస్ ఆధునీకరణ పనుల్లో ఏపీ సహకారం కోరుతూ మంత్రి హరీశ్‌రావు ఈ లేఖను రాశారు. ఆర్డీఎస్ ఆధునీకరణ పనులు జూలైలోగా పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈనెల 4న కర్ణాటక మంత్రి ఎంబీ పాటిల్ రాష్ట్ర పర్యటన సందర్భంగా నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. తెలంగాణ, కర్ణాటక, ఏపీ ఆయకట్టుదారుల ప్రయోజనాల దృష్ట్యా ప్రాజెక్టు ఆధునీకరణ పనులకు ఏపీ చొరవ చూపాలన్నారు. ఇప్పటికే కర్ణాటక అంగీకరించినందున హైదరాబాద్‌లో సమావేశానికి రెండు రోజుల్లో ఏపీ ఆమోదయోగ్యమైన తేదీలు చెప్పాలన్నారు.

విశాఖ శారదాపీఠంలో గోపూజలు



విశాఖపట్నం, ప్రభన్యూస్ బ్యూరో: సాంస్కృతి -సాంప్రదాయాలు పాటించడంలో భారతదేశం ముందువరుసలో ఉందని భవిష్యత్తులో కూడా ఇదే ఒరవడిని కొనసాగించాలని విశాఖ శారదాపీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి మహాస్వామి అభిలాషించారు. ఈ మేరకు మంగళవారం కనుమ పండుగ నేపథ్యంలో శారదాపీఠంలో ఉన్న గోవుల ఆశ్రమంలో స్వామీజీ ప్రత్యేకంగా గోపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆవులకు పండ్లుతో పాటు ఇతర ఆహారపదార్థాలు తినిపించారు. అంతకు ముందు గోవులను శుభ్రం చేయించి వాటికి ప్రత్యేకంగా అలంకరణ గావించారు. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా సంక్రాంతి పండుగ నిలుస్తుందన్నారు. భక్తులకు తీర్ధ ప్రసాదాలతో పాటు ఆశీర్వాదం అందజేశారు.

కన్నులపండువగా అప్పన్న మకర వేట

సింహాచలం, (విశాఖపట్నం), ప్రభ న్యూస్ బ్యూరో: సింహాచలం శ్రీ వరాహా లక్ష్మీనృసింహ స్వామి మంగళవారం హరి వరదరాజ స్వామి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రతి ఏటా సాంప్రదాయ బద్ధంగా నిర్వహించే అప్పన్న మకరవేట (గజేంద్ర మోక్షం) ఉత్సవాన్ని ఆలయ వర్గాలు మంగళవారం సాయంత్రం అత్యంత ప్రతిష్టాత్మకం గా నిర్వహించాయి. ఉత్సవంలో భాగంగా సింహాద్రినాథుడిని హరి వరదరాజ స్వామిగా ఆలయ వర్గాలు సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దా రు. సర్వాభరణాలతో స్వామిని అలంకరించారు. ఆపై అందంగా తీర్చిదిద్దిన పల్లకీపై స్వామిని ఆశీనుల్ని చేశారు. తదుపరి మెట్ల మార్గం ద్వారా బోయీలు కొండ దిగువకు తీసుకువచ్చారు. తొలిపావంచా వద్ద సాంప్రదాయం ప్రకారం ఆలయ ఏఈవోలు కృష్ణమాచార్యులు, ఆర్.వి.ఎస్.ప్రసాద్, సూపరింటెండెంట్ తిరుమలేశ్వరరావు తోపాటు వైజాగ్ జర్నలిస్టుల ఫోరం అధ్యక్షుడు గంట్ల శ్రీనుబాబు, ఇతర గ్రామ పెద్దలు స్వామికి సాష్టాంగ నమస్కారం చేసి గ్రామంలోనికి స్వాగతం పలికారు. అక్కడ పూజలందుకున్న సింహాద్రినాథుడు నేరుగా ఉద్యానవనానికి చేరుకున్నారు. తదుపరి అక్కడ కళ్యాణ మండపంలో స్వామిని ఆశీనుల్ని చేసి, మకరవేట (గజేంద్ర మోక్షం) ఉత్సవాన్ని వైభవంగా జరిపించారు. ఇతిహాస కథనం ప్రకారం మొసలి బారి నుంచి తనను రక్షించాలని గజేంద్రుడు శ్రీమన్నారాయణుడిని వేడుకుంటాడు. దీంతో గజేంద్రుడిని రక్షించేందుకు స్వామి హరి వరదరాజ స్వామి అలంకరణలో సాక్షాత్కరించి గజేంద్రుడిని మొసలి బారి నుంచి రక్షించడం జరుగుతుంది. ఇతిహాస కథనానికి అనుగుణం గా అప్పన్న ఉద్యాన మండపంలో మొసలి, ఏనుగు బొమ్మలను ఏర్పాటు చేసి ఈ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తదుపరి స్వామిని పుష్కరిణి సత్రంలో ఆశీనుల్ని చేసి అక్కడ ప్రత్యేక పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ఈవో కె.రామచంద్రమోహన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఉత్సవంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ వర్గాలు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాయి.



జోరుగా కోడిపందాలు

(మొదటిపేజీ తరువాయి)

పందెంరాయుళ్ళు, పోలీసులు ఎవరికి వారు తమకనుకూలంగా అన్వయించుకున్నారు. ఆపేస్తామంటూ పోలీసులు హెచ్చరికలు మొదలెట్టారు. అయితే చివరకు పందెం రాయుళ్ళే గెల్చారు. పోలీసుల హడావిడి ప్రకటనలకే పరిమితమైంది. ఇక హోమ్‌మంత్రి సొంత జిల్లాలో యదేచ్ఛగా పందాలు సాగాయి. మురమళ్ళలో ఎమ్మెల్యే మూడ్రోజులు అక్కడే ఉండి పందాలతీరును పర్యవేక్షించారు. పందెం బరులవైపు పోలీసులు కన్నెత్తి చూడకుండా ఆయనే కాపుకాశారు. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం, వెంప గ్రామాల్లో పెద్దెత్తున పందాలు నిర్వహించారు. కోడిపందాల పేరిట ఈ సారి నెంబర్‌గుండు, స్కిల్‌గేమ్స్ విస్తృతంగా సాగాయి. అలాగే పందాల బరుల వద్ద విశృంఖుల స్థాయిలో మద్యం ప్రవహించింది.

సచివాలయంలో స్మార్ట్ బైకులు

- జర్మనీ సాంకేతిక పరిజ్ఞానంతో ఈ-సైకిళ్లు
- త్వరలో పైలెట్ ప్రాజెక్టును ప్రారంభించనున్న సీఎం



అమరావతి, ఆంధ్రప్రభ: నిత్యం రణగొణ శబ్దాలతో సతమతమవుతున్న ప్రజలను కాలుష్యం నుంచి కాపాడటానికి రాష్ట్ర ప్రభుత్వం సరికొత్తగా స్మార్ట్ బైక్ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టింది. పైలెట్ ప్రాజెక్టుగా సచివాలయాన్ని ఎంచుకొంది. ఇక్కడ విజయవంతమైతే రాష్ట్రవ్యాప్తంగా ఈ ప్రాజెక్టును అమలు పరచేందుకు ప్రభుత్వం సమాయత్తమవుతోంది. ఇప్పటికే సచివాలయంలో ఉద్యోగుల కోసం బ్యాటరీ కార్లు నడుస్తుండగా, వీటికి తోడుగా బ్యాటరీతో నడిచే స్మార్ట్ బైకులు నడిపేందుకు సన్నాహాలు చేస్తోంది. స్మార్ట్ బైకులు (ఈ-సైకిల్స్) సచివాలయానికి వచ్చే ఉద్యోగులు, సందర్శకులను కనువిందు చేయనుంది. సచివాలయానికి వచ్చే వారికోసం సరికొత్త అనుభూతి కలిగించేందుకు సీఆర్డీఏ స్మార్ట్‌బైక్ ప్రాజెక్ట్‌ను చేపట్టింది. జర్మనీ సాంకేతిక పరిజ్ఞానంతో తయారైన 24 సైకిళ్లను మూడు నెలల క్రితం సెక్రటేరియట్‌కు తీసుకొచ్చారు. ఆంధ్రాబ్యాంక్ సహకారంతో సుమారు రూ.25 లక్షలతో ఈ ప్రాజెక్ట్‌ను చేపట్టారు. ఇందులో భాగంగా సెక్రటేరియట్ వెలుపల బస్టాండ్ సమీపంలో సైకిల్ స్టాండ్‌ను, సచివాలయంలోపల మరో రెండు సైకిల్ స్టాండ్లను ప్రకాష్ ఆర్ట్స్ సౌజన్యంతో ఏర్పాటు చేశారు. సచివాలయం వెలుపల నుంచి లోపలికి సుమారు కిలో మీటరు దూరం ఉండటంతో లోపలి ఆరు బ్లాకులను చేరుకునేందుకు ఈ సైకిల్ సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు. దీని ద్వారా ఉద్యోగులు, సందర్శకులు సైకిళ్లపై సచివాలయంలోని బ్లాకుల్లోకి చేరుకునే అవకాశముంది. సైకిల్ స్టాండ్ల కోసం అధునాతనంగా షెల్టర్లను ఏర్పాటు చేశారు. మూడు స్టాండ్లలో 8 సైకిళ్ల చొప్పున ఉండే విధంగా రూపొందించారు. సైకిళ్లను దొంగిలించకుండా ఉంచేందుకు స్మార్ట్‌కార్డు పద్ధతిని ఏర్పాటు చేశారు. కార్డును సైకిల్ షెల్టర్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక యంత్రంతో అనుసంధానం చేశారు. కార్డును యంత్రానికి అనుసంధానం చేస్తేనే సైకిల్ తీసుకునే విధంగా యాప్‌ను రూపొందించారు. సచివాలయం వెలుపల తీసుకున్న సైకిల్‌ను లోపల సైకిల్ స్టాండులో అప్పగించి తిరిగి పనిముగిసిన అనంతరం లోపల స్టాండులోని సైకిల్‌ను వెలుపల ఉన్న స్టాండ్‌లో అప్పగించే విధంగా ఏర్పాటు చేశారు. సైకిల్‌ను తీసుకునేందుకు డిజిటల్ లాక్‌సిస్టం రూపొందించారు. రాష్ట్రంలో ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టిన ఈ ప్రాజెక్ట్‌విజయవంతమైతే మరికొన్నిచోట్ల ఇదే తరహాలో స్మార్ట్‌బైక్‌లను నడుపనున్నారు. అంతేకాకుండా రాజధాని ప్రాంతంలో సైకిల్ ట్రాక్‌ను కూడా మాస్టర్ ప్లాన్‌లో రూపొందించడం ఈసందర్భంగా గమనార్హం. ముఖ్యమంత్రి తొలుత ఈ సైకిల్‌పై కరకట్టపైగల ఆయన నివాస గృహం వద్ద చక్కర్లు కొట్టడం జరిగింది. కాగా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఏర్పాటు చేసిన ఈ ప్రాజెక్టును ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు త్వరలో ప్రారంభించనున్నారు.

దావోస్‌లో
ఏపీ పారిశ్రామిక ప్రచార రథం



అమరావతి, ఆంధ్రప్రభ : పెట్టుబడుల ఆకర్షణలో భాగంగా దావోస్ నగర వీధుల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పారిశ్రామిక ప్రగతి రథం ప్రత్యక్షమైంది. రాష్ట్రంలో పెట్టుబడులకు సంబంధించి సానుకూల అంశాలను ప్రగతిరథం ప్రతిబింబిపచేస్తోంది. ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సు కోసం దావోస్ నగరంలో ఆంధ్రప్రదేశ్ వాహనం ద్వారా ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రచారం చేస్తుంది. కాగా ఈ నెల 20వ తేదిన ప్రపంచ ఆర్థిక వేదిక సదస్సు జరగనుండగా రాష్ట్ర ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కేంద్ర ప్రభుత్వం తరపున మంత్రి సురేష్‌ప్రభు వంటి ప్రముఖులు హాజరవుతున్నారు. ఈ సదస్సు పెట్టుబడులను ఆకర్షించేందుకు మంచి వేదికగా మలుచుకోవాలని ఏపీ ప్రభుత్వం ప్రయత్నాలు ప్రారంభించింది. ఈ నేపథ్యంలోనే ఆంధ్రప్రదేశ్ గమ్యస్థానం కోసం మంచి వాతావరణాన్ని ఏర్పరచేందుకు ముందుగానే దావోస్ అంతట ప్రచారం చేయాలని సంకల్పించింది. ఈ నేపథ్యంలోనే ప్రగతి రదం రావడం జరిగింది. రాష్ట్రంలో పరిశ్రమలకు సత్వర అనుమతులు, భూముల కేటాయింపు, విద్యుత్, నీరు, ఉపాధి వంటి పలు అంశాలను పారిశ్రామిక వేత్తలకు తెలియజేసే విధంగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బ్రాండ్ ఇమేజ్‌కు తగ్గట్టుగా ప్రగతి రధాన్ని రూపొందించడం జరిగింది. ఏపీఐఐసీ, ఏపిఎస్ఎస్ఐడీసీ ఎకనమిక్ డెవలప్మెంట్ బోర్డుకు చెందిన అధికారులు ఇప్పటికే దావోస్‌కు చేరుకుని ప్రచార కార్యక్రమాలను పర్యవేక్షిస్తున్నారు.

సాగరతీర పర్యాటకానికి
అంతర్జాతీయ అవార్డు

- బెర్లిన్ వేదికగా అవార్డుల ప్రదానోత్సవం
- ఉద్యోగుల పనితీరుకు అవార్డులే గీటురాయి: టూరిజం శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్‌కుమార్‌మీనా

అమరావతి, ఆంధ్రప్రభ : ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగానికి అవార్డుల పరంపర కొనసాగుతోంది. రాష్ట్ర విభజన అనంతరం 13జిల్లాల పరిధిలో పర్యాటక రంగ పరంగా చేపడుతున్న ప్రాజెక్టులు ఇప్పటికే ఫలితాలను ఇస్తూ రాగా, వివిధ జాతీయ, అంతర్జాతీయ స్థాయి సంస్థలు పర్యాటక శాఖకు అవార్డులు అందిస్తున్నాయి. తాజాగా పసిఫిక్ ప్రాంత పర్యాటక రచయితల సంస్థ ఆంధ్రప్రదేశ్ టూరిజంకు అవార్డు ప్రకటించింది. మార్చి 9వ తేదిన బెర్లిన్ వేదికగా జరిగే అవార్డుల ప్రధానోత్సవంలో అతిరధ మహారధుల సమక్షంలో రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా అవార్డును అందుకోనున్నారు. సాగరతీర పర్యాటకంలో ఉత్తమ ఆగమన కేంద్రం విభాగంలో ఈ అవార్డును అందిస్తున్నట్లు, పట్వా ప్రధానకార్యదర్శి సాగర్ ఆహ్లువాలియా రాష్ట్రపర్యాటక శాఖకు సమాచారం అందించారు. అవార్డుల ప్రధానోత్సవం సందర్భంగా బెర్లిన్ వేదికగా పసిఫిక్ ఏరియా ట్రావెల్ రైటర్స్ అసోసియేషన్ పలు కార్యక్రమాలను చేపడుతుండగా, ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖ ఆయా కార్యక్రమాలలో భాగస్వామ్యం కాబోతుంది. వరల్డ్ టూరిజం, ఏవియేషన్ లీడర్స్ సమ్మిట్‌తో పాటు, సుస్థిర పర్యాటకం అనే అంశంపై అంతర్జాతీయ స్థాయి సెమినార్ జరగనుంది. ఈ సందర్భంగా పర్యాటక సాంస్కృతిక శాఖ కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా మాట్లాడుతూ విభజన అనంతరం ఎదురవుతున్న ఇబ్బందులను సైతం అధిగమించి సమగ్ర అభివృద్ధికి అవసరమైన ప్రణాళికలను అమలు చేస్తుండగా, దీనిని జాతీయ, అంతర్జాతీయ స్థాయి సంస్థలు గుర్తించడం ముదావహమన్నారు. అవార్డు సాధనలో గణనీయమైన భూమికను పోషించిన ఆంధ్రప్రదేశ్ పర్యాటక అభివృద్ధి సంస్థ, ఆంధ్రప్రదేశ్ టూరిజం అథారిటీ, సిబ్బందికి రాష్ట్ర ప్రభుత్వం పక్షాన అభినందనలు తెపారు.

సత్యం బ్రూయాత్, ప్రియం బ్రూయాత్
నబ్రూయాత్ సత్యమప్రియం, ప్రియంచ నానృతం బ్రూయాత్
ఆంధ్రప్రభ
బుధవారం 17 జనవరి 2018

వాణిజ్యమే ఇజ్రాయెల్ లక్ష్యం

జెరూసలెంను ఇజ్రాయెల్ రాజధానిగా అధికారికంగా గుర్తిస్తున్నట్టు అమెరికా చేసిన ప్రకటనకు వ్యతిరేకంగా ఐక్యరాజ్యసమితి సర్వప్రతినిధి సభలో భారత్ ఓటు వేసినంత మాత్రాన ఇరుదేశాల మధ్య సంబంధాలకు చేటు జరగదంటూ ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమన్ నెతన్యాహూ ప్రకటించడంలో లౌక్యం ఉంది. దౌత్యపరమైన సంబంధాలు పెంపొందించుకోవడానికి భారత్ పర్యటనకు వచ్చిన నెతన్యాహూ భారత్ చేసింది తప్పని ఢిల్లీలో ప్రకటిస్తారని ఎవరూ అనుకోరు. ప్రపంచీకరణ అనివార్యమైన ప్రస్తుత పరిస్థితుల్లో ఏ ఒక్క దేశమూ కూడా స్వతంత్రంగా మనుగడ సాగించే అవకాశాలు, పరిస్థితులు ఇప్పుడు లేవు. అమెరికా, సోవియట్ యూనియన్‌ల మధ్య ప్రచ్ఛన్న యుద్ధం జరిగినప్పుడు కూడా ఇంత కుండబద్దలు కొట్టినట్టు ఇజ్రాయెల్ నాయకులెవరూ ప్రకటించలేదు. భారత్‌లో తమ వ్యాపారాభివృద్ధికి అనుకూలమైన వాతావరణం ఉందని గ్రహించడం వల్లనే వారు మొదటి నుంచి భారత్‌తో సాన్నిహిత్యం కోసం ప్రయత్నిస్తున్నారు. పాలస్తీనాకు పూర్వపు ప్రభుత్వాలు మద్దతు ఇచ్చినా, సాంకేతిక రంగంలో తమదేశం సాధించిన అభివృద్ధిని ఆహ్వానించే దేశాల్లో భారత్ ఒకటని వారికి తెలుసు. ఆయుధాల వ్యాపారంచేసే దేశాలు ఇతర దేశాలతో కోరి కయ్యాలకు దిగవు. అమెరికా అనుసరిస్తున్న వైఖరే ఇందుకు నిదర్శనం. అమెరికా అధ్యక్షునిగా డొనాల్డ్ ట్రంప్ పదవీ బాధ్యతలు స్వీకరించిన తర్వాత పరిస్థితిలో కొద్దిగా మార్పు కనిపించినా, మొదటి నుంచి అమెరికా భారత ఉపఖండంలో భారత్, పాకిస్తాన్‌లు రెండూ తమ దేశానికి సమానమేనని ప్రకటిస్తూ వచ్చిన విషయాన్ని మరువరాదు. ఎఫ్-16 విమానాలను పాకిస్తాన్‌కే కాదు, భారత్‌కి కూడా విక్రయిస్తామంటూ అమెరికా మాజీ అధ్యక్షుడు జార్జి బుష్ ఆనాడు ప్రకటించిన సంగతిని మరువలేం. భారత్‌తో పౌర అణు ఒప్పందం కుదుర్చుకున్నప్పుడు పాక్ రుసరుస లాడింది. ఆ సందర్భంలో బుష్ తన అనుమానాలను బహిరంగంగానే వ్యక్తపర్చారు. పాకిస్తాన్ అణు పితామహుడు అబ్దుల్ ఖదీర్‌ఖాన్ ఉత్తర కొరియాకూ, ఇరాన్‌కూ అణు పరిజ్ఞానాన్ని రహస్యంగా విక్రయించిన ఘటన అప్పట్లో చోటు చేసుకోవడం వల్ల అమెరికాను పాకిస్తాన్ ఈ విషయంలో నిలదీయలేకపోయింది. ఆయుధాల విక్రేతలుగా వ్యవహరించే దేశాలు అన్ని దేశాలతో సాన్నిహిత్యంగా మెలగడమో, లేక సర్దుకునిపోవడమో చేస్తుంటాయి. భారత్‌తో ఇజ్రాయెల్ సాగిస్తున్న మైత్రిని ఈ కోణం నుంచే చూడాల్సి ఉంటుంది. భారత్‌లో ముస్లింల జనాభా ఎక్కువగా ఉన్నందున పాలస్తీనా సమస్యకు భారత్ వ్యూహాత్మకంగానే మద్దతు ఇస్తోందని ఇజ్రాయెల్ భావిస్తూ ఉండవచ్చు. ఇప్పటికిప్పుడు భారత్ తీసుకున్న వైఖరి వల్ల తమ దేశానికి వచ్చిన ఇబ్బందేమీ లేదు. అమెరికా అండ ఉన్నంత కాలం అంతర్జాతీయ వ్యవహారాల్లో తమకు తిరుగులేదన్నది ఇజ్రాయెల్ ధీమా కావచ్చు. అందువల్ల భారత్‌తో సాంకేతిక పరిజ్ఞానం బదిలీ, జల సంరక్షణ తదితర అంశాల్లో ఒప్పందాలు కుదుర్చుకునేందుకు వచ్చిన నెతన్యాహూ ఫక్తు వ్యాపారవేత్తగానే మాట్లాడారని అనుకోవాలి. భారత్‌లో ఇప్పుడు అధికారంలో ఉన్నది ఇజ్రాయెల్ అనుకూల పార్టీ కనుక, తగవులు వచ్చే అవకాశం అసలే లేదు. ప్రస్తుత ప్రభుత్వంతో వాణిజ్య, సాంకేతిక ఒప్పందాలను కుదుర్చుకోవడం ద్వారా వ్యాపారాన్ని వృద్ధి చేసుకోవడమే లక్ష్యంగా నెతన్యాహూ పర్యటిస్తున్నారు. ఉపగ్రహాల ప్రయోగాల్లో ఇతర దేశాలకు సహాయం అందిస్తున్న భారత రోదసి పరిశోధనా సంస్థ (ఇస్రో)తో కుదుర్చుకున్న ఒప్పందాల వల్ల ఇజ్రాయెల్ ఎక్కువ లాభం పొందుతోంది. గత సంవత్సరం జూలైలో ప్రధానమంత్రి నరేంద్రమోడీ ఇజ్రాయెల్‌లో పర్యటించినప్పుడు కుదుర్చుకున్న ఒప్పందం ప్రకారం ఇజ్రాయెల్ ఉపగ్రహాన్ని ఇస్రో అంతరిక్షంలోకి పంపింది. భవిష్యత్‌లో ఇలాంటి అవసరాలు మరిన్ని రాగలవన్న ఉద్దేశంతోనే భారత్‌ను మిత్రదేశంగానే తాము పరిగణిస్తున్నట్టు నెతన్యాహూ ప్రకటించారు. ఇజ్రాయెల్ ఉపగ్రహాన్ని ఇస్రో 2008 లోనే అంతరిక్షంలోకి పంపింది. ఇజ్రాయెల్‌ది వ్యాపార ధోరణి అన్న మన వామపక్షాల విమర్శల్లో పూర్తిగా అసత్యం లేదు. తమ వాణిజ్య అవసరాలకు ఉపయోగపడే దేశాలతో ఎంత మేరకైనా స్నేహ సంబంధాలను కొనసాగించేందుకు ఇజ్రాయెల్ నేతలు వెనకాడరు. అమెరికా మాదిరిగానే ఇజ్రాయెల్ సైతం మిత్ర దేశాలను శాశ్వతంగా పరాధీనం చేసేందుకు వెనకాడదు. జల సంరక్షణకు సంబంధించి ఇజ్రాయెల్ అందిస్తున్న సహకారం అంతంత మాత్రమే. గత సంవత్సరం ప్రధానిమోడీ ఇజ్రాయెల్ పర్యటన సందర్భంగా చైనాకు ఇజ్రాయెల్ ఆయుధాలను విక్రయించకుండా నిరోధించాలని చేసిన ప్రయత్నం ఫలించలేదు. చైనాలో ఇజ్రాయెల్ ఆయుధ ఫ్యాక్టరీని నెలకొల్పాలన్న ప్రతిపాదనను విరమించుకునేట్టు చేయడంలో కూడా మన దేశం విఫలమైంది. ఈ రెండు ఉదంతాలను పరిశీలించినట్టయితే, ఇజ్రాయెల్ ఫక్తు వ్యాపార ధోరణితోనే మన దేశంతో దౌత్య సంబంధాలను కొనసాగిస్తోందన్న విషయం స్పష్టమవుతోంది.

హిందుత్వమే అస్త్రం

కాంగ్రెస్ ఎలా తిప్పికొడుతుందనేదే ఆసక్తికరం



విశ్లేషణ

అనితా సలూజా
సీనియర్ పాత్రికేయురాలు

రాజకీయ సమీకరణాలు ఇప్పుడు ప్రధానంగా హిందుత్వ, దాని చరిత్ర చుట్టూ తిరుగుతున్నాయి. ప్రస్తుత తరుణంలో హిందుత్వ రాజకీయాలకు ప్రధాన వేదికగా మారిపోయింది. భారతీయ జనతా పార్టీని ఎదుర్కొనడానికి కీలకమైన గుజరాత్ రాష్ట్రంలోనే ఈ ధోరణి మొదలైంది. తాను జంధ్యం ధరించిన హిందువునని నిరూపించుకోవడానికి కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ఆలయాల చుట్టూ పరుగులు తీస్తుండడం ఇప్పటికే కనిపిస్తోంది. అనుకున్నట్లే.. గుజరాత్‌లో రాహుల్ గాంధీ ఎక్కడెక్కడ ఆలయాలను సందర్శించారో ఆ ప్రాంతాలన్నింటిలో కాంగ్రెస్ అభ్యర్థులు అందరూ గెలిచారు. దీన్ని అదృష్టమనాలా.. ప్రజల వైఖరిలో వచ్చిన మార్పునకు సంకేతమనాలా? వచ్చే ఎన్నికలలో ఆలయాల సందర్శన ధోరణి బాగా పెరిగే అవకాశముంది. లౌకిక పార్టీలుగా చెప్పుకుంటున్న పార్టీలు కూడా కాస్తంత సేపు తమ సిద్ధాంతాన్ని పక్కనపెట్టి హిందుత్వ వాదానికి అనుకూలురుగా చెప్పుకునేందుకు సిద్ధమైపోతున్నాయి. కారణం గుజరాత్‌లో కాంగ్రెస్ సాధించిన విజయాలు.

ఈ ధోరణిపై భారతీయ జనతా పార్టీ ఆందోళన చెందడానికి కారణాలున్నాయి. ఈ ధోరణి హిందూ ఓట్ బ్యాంకును నష్టపరిచే అవకాశాలు ఎక్కువ ఉన్నాయి. హిందుత్వ ఓటు బ్యాంకును సృష్టించుకోవడానికి సంఘ్ పరివార్ దశాబ్దాల పాటు శ్రమకోర్చి పనిచేసింది. అటల్ బిహారీ వాజపేయి, ఎల్‌కె అద్వానీల కృషి ఫలితమే ఇదని సంఘ్ పరివార్ చెబుతుంటుంది. హిందుత్వ సిద్ధాంతాన్ని ప్రాచుర్యంలోకి తెచ్చింది వారిద్దరే అనడంలో ఎటువంటి సందేహమూ లేదు. బద్ధవ్యతిరేకులు కూడా ఇప్పుడు బీజేపీకి బలమైన మద్దతుదారులుగా మారిపోతున్నారు.

ఇందుకు తాజా ఉదాహరణ తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి, పశ్చిమ బంగ ముఖ్యమంత్రి అయిన మమతా బెనర్జీ. ఇటీవలే ఆమె వీర్భూమ్ జిల్లాలో బ్రాహ్మణ సమ్మేళనాన్ని నిర్వహించారు. భగవద్గీత గ్రంథాలను పంపిణీ చేశారు. జాతీయ గ్రంథంగా భగవద్గీతను ప్రకటించాలని కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి సుష్మా స్వరాజ్ డిమాండ్ చేసినప్పుడు ఎందరో కనుబొమలు ఎగరేశారు. లౌకికత్వానికి తనను తాను కాపరిగా ప్రకటించుకున్న ఆమె తన మాటను వెనక్కి తీసుకోవడానికి ఎక్కువ సమయాన్ని తీసుకోలేదు. వచ్చే ఎన్నికలలో తిరిగి గద్దెనెక్కాలంటే హిందుత్వ నినాదమే ఉత్తమమనే అభిప్రాయానికి ఆమె వచ్చేశారు. రాజకీయ ప్రసంగాలలో హిందుత్వ పోకడల ధోరణిని కనబరుస్తున్నారు.

గుజరాత్‌లో కుల సమీకరణాలతో ఇంద్రధనుస్సును నిర్మించడానికి ప్రయత్నించిన రాహుల్ గాంధీ, సగం దారిలోనే ఆ ప్రయత్నాన్ని విరమించుకోవాల్సి వచ్చింది. హిందుత్వ వాదాన్ని కౌగిలించుకోవడానికి వెనుకాడలేదు. కర్ణాటకలో కులాల లెక్కలు కాంగ్రెస్‌కు ఎక్కువ మేలు చేకూరుస్తాయి. గుజరాత్ కంటే అక్కడే ఎక్కువ ఫలితాన్నిస్తాయి. బీజేపీ విసిరిన సవాలుకు కాంగ్రెస్ అక్కడ సమాధానం చెప్పే పరిస్థితి కనిపించడం లేదు. కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలు తరుముకొస్తున్న ఈ తరుణంలో కాంగ్రెస్‌కిది గొంతులో పచ్చివెలక్కాయ పడినట్టుంది. ఇదే కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల తరవాత ఫలితాలను మార్చేస్తుంది. రాజకీయాల ఆట మార్గాన్ని మళ్ళిస్తుంది.

ఈ ఏడాది కాంగ్రెస్, బీజేపీ మధ్య నాలుగు కీలకమైన పోటీలు జరగబోతున్నాయి. 2019 ఎన్నికల ఫలితాలకు ఇది బాటను చూపుతుంది. ఈ ఏడాది ఏప్రిల్-మే నెలల్లో కర్ణాటక అసెంబ్లీకి ఎన్నికలు జరగనున్నాయి. రాజస్థాన్, మధ్య ప్రదేశ్, చత్తీస్‌గఢ్‌లకు కూడా ఇదే ఏడాది జరుగుతాయి. ఈ మూడింటిలోనూ భారతీయ జనతా పార్టీ అధికారంలో ఉంది. పార్టీ పగ్గాలను స్వీకరించిన రాహుల్ గాంధీకి కర్ణాటక అసెంబ్లీ



ఎన్నికల రూపంలో తొలి పరీక్ష ఎదురవుతుంది. గుజరాత్ ఎన్నికల ముంగిట ఆయన కాంగ్రెస్ పార్టీకి అధ్యక్షుడయ్యారు. బీజేపీతో కాంగ్రెస్ తలపడబోయే తొలి రాష్ట్రం కర్ణాటకే. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ ఇప్పటికే ఎన్నికలలో తాను అజేయుమని నిరూపించుకున్నారు. తన సమర్థతను చాటిచెప్పారు. మరో పక్క కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ప్రముఖమైన రాష్ట్రంలో గెలుపు బావుటా ఎగరేయడానికి పోరాడుతున్నారు. ఒక్క ఛాన్సివ్వమని ఓటర్లను అర్థిస్తున్నారు. ఆ ఒక్క గెలుపు కాంగ్రెస్ పార్టీని 2019 ఎన్నికలలో విజయపథంలో నడిపించడానికి ఉపయోగించవచ్చు. ఆత్మవిశ్వాసాన్ని ప్రోది చేయవచ్చు. క్యాడర్‌లో ఉత్సాహాన్ని రేకెత్తించవచ్చు. ఒక్క విజయం కోసం రాహుల్ గాంధీ పరితపిస్తున్నారు. ఇక్కడ మనం సోనియా గాంధీ గురించి చెప్పుకోవాలి. 1998 మార్చిలో పార్టీ నాయకత్వ బాధ్యతలను చేపట్టగానే సోనియా గాంధీ కాంగ్రెస్ పార్టీని ఢిల్లీ, రాజస్థాన్, మధ్యప్రదేశ్, వంటి రాష్ట్రాలలో అధికారంలోకి తీసుకువచ్చారు. ఇదే పార్టీని ఆమె వెనుక ఉండేలా చేసింది. 2004లో కేంద్రంలో కాంగ్రెస్‌ను సోనియా అధికారంలోకి తెచ్చారు. 20 ఏళ్ళ అనంతరం, 2018లో కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ఇదే తరహా పరిస్థితినే ఎదుర్కొంటున్నారు. అదే సవాలును ఎదుర్కొనబోతున్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికలలో పెద్ద విజయాన్ని సాధించలేకపోతే, రాహుల్ గాంధీకి ఆత్మవిశ్వాసంతో 2019 సాధారణ ఎన్నికలను ఎదుర్కొనడం కష్టమని చెప్పకతప్పదు.

బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు కర్ణాటక ఎన్నికలు అత్యంత ప్రతిష్టాత్మకమైనవి. అధికారంలోనికి రావడానికి బీజేపీ ప్రయత్నిస్తోంది. అధికారాన్ని నిలబెట్టుకోవడానికి కాంగ్రెస్ కృషి చేస్తోంది. రాజకీయ, అర్థ బలాలను ఇందుకోసం మోహరిస్తోంది. పంజాబ్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచినప్పటికీ, కర్ణాటకలో గెలుపు ఆ పార్టీకి నైతికబలాన్ని చేకూరుస్తుంది. కందేలైన పార్టీకి కచ్చితంగా జవజీవాలను అందిస్తుంది. గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల్లో పరాజయం దరిమిలా విజయ సూత్రాన్ని కనుగొనేందుకు తీవ్రంగా శ్రమిస్తోంది. ఒక పక్కన బీజేపీ తన హిందుత్వ సిద్ధాంతంతో దూకుడుమీద ఉంది. ఉత్తర ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ దాస్ ఇప్పటికే ఒకసారి కర్ణాటక రాష్ట్రాన్ని సందర్శించారు. పార్టీ కార్యకర్తలలో ఊహలకు రెక్కలు తొడిగేలా ఆయన పర్యటన సాగింది. దక్షిణాది రాష్ట్రాలలో ఒక్క కర్ణాటకలోనే గతంలో భారతీయ జనతా పార్టీ అధికారాన్ని చెలాయించింది. మళ్ళీ అధికారంలోకి వస్తామని భావిస్తోంది. 224 సీట్లున్న అసెంబ్లీలో 150 స్థానాలను గెలవాలని లక్ష్యంగా నిర్దేశించుకుంది. దక్షిణ భారత దేశంలో బీజేపీ ప్రవేశించడానికి కర్ణాటకను ముఖద్వారంగా భావిస్తోంది. కేరళపై కూడా ఇప్పటికే పార్టీ కన్నేసింది.

పార్టీ అధ్యక్షుడు అమిత్ షా ఇటీవల చిత్రదుర్గలో నిర్వహించిన ఓ ర్యాలీలో ప్రసంగిస్తూ, కాంగ్రెస్ హిందూ వ్యతిరేక పార్టీ అని వ్యాఖ్యానించారు. మరోవంక హిందుత్వ సమానంగా ప్రణాళికను రచించేందుకు కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా శ్రమిస్తోంది. ఇప్పటికే కాషాయదళం ఈ అంశంపై ఒక నిర్ణయానికి వచ్చేసింది. టిప్పు సుల్తాన్ జయంతా లేక హనుమాన్ జయంతా తేల్చుకోవాలని కోరుతోంది. దీనికితోడు రాష్ట్రంలో గొడ్డు మాంస వినియోగంపై నిషేధం విధించాలని సవాలు చేశారు. ఆయన నిజంగా హిందువైతే ఈ పనిచేయాలని షా డిమాండ్ చేశారు. హిందుత్వను ఈ ఎన్నికలకు ముఖ్యాంశంగా మార్చేశారు. హిందూత్వ రాష్ట్రంలో రాజ్యసభ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ అభ్యర్థి అహ్మద్ పటేల్‌కు మద్దతుగా కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో సిద్ధరామయ్య, మంత్రి డికె శివకుమార్‌లు క్యాంప్ నిర్వహించడంలో ప్రధాన పాత్ర పోషించారు. హిందుత్వంపై బీజేపీకి ఏకఛత్రాధిపత్యమేదీ లేదని వారిద్దరూ స్పష్టంచేశారు. హిందుత్వ శక్తులను ఎదుర్కొనడానికి సిద్ధరామయ్య పటిష్ఠమైన ప్రణాళిక రచించారు. గొర్రెల కాపరి కులస్థుడైన సిద్ధరామయ్య ఓబీసీలు, దళితులు, మైనారిటీలు వంటి వివిధ వర్గాలతో కూటమిని ఏర్పాటుచేశారు. లౌకికవాదం నినాదంతో హిందువుల మద్దతు కోల్పోతామనే భయంతో, సిద్ధరామయ్య తాను హిందువునని ప్రకటించారు. తాను ఇతర ప్రాంతీయుడను కాదని స్పష్టంచేశారు. ఇది మైనారిటీలనుంచి కాంగ్రెస్‌ను దూరం చేసి, బీజేపీకి పైచేయిని అందిస్తోంది.

లింగాయత్‌లు దైవసమానంగా భావించే బసవణ్ణ చిత్రాలను కర్ణాటకలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో ఉంచాలని సిద్ధరామయ్య ఆదేశాలను జారీచేశారు. బీజేపీకి చెందిన లింగాయత్ ఓటు బ్యాంకును చీల్చేందుకు ఆయనీ పథకం పన్నారు. కానీ అది అంత సులభమైన పనికాదు. లింగాయత్‌లు బీజేపీకే ఓటు చేస్తారు. అంతేకాకుండా వారు బి.ఎస్. ఎడ్డియూరప్పకు విధేయులు కూడానూ. ఎన్నికల్లో గెలవడానికి ఏ ఒక్క అవకాశాన్ని విడిచిపెట్టడానికి సిద్ధరామయ్య సిద్ధంగా లేరు. ఇందిరాగాంధీని ప్రార్థించడానికి సిద్ధమవుతున్నారు. సరిగ్గా 40ఏళ్ళ క్రితం 1978లో అధికారాన్ని కోల్పోయి, రాజకీయ శూన్యతలోకి జారిపోయిన ఇందిరకు కర్ణాటక నుంచే అనూహ్యమైన మద్దతు లభించింది. 1977లో కాంగ్రెస్ ఉత్తర భారతంలో తుడిచిపెట్టుకుపోయింది. కొద్దినెలల్లోనే కాంగ్రెస్ ఐ ఆవిర్భావానంతరం, జనవరి 2, 1978లో కర్ణాటకలోనూ, అప్పటి ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలోనూ అధికారంలోకి దూసుకొచ్చారు. అదే ఏడాది ఇందిర చికమగళూరు ఉప ఎన్నికలో లోక్ సభకు ఎన్నికయ్యారు. ప్రజలతో ఇందిరా గాంధీ చేసిన మ్యాజిక్ అది. పేదలు, అణగారిన వర్గాలకు ఆమె అంటే అపారమైన ప్రేమ. అదే పేదలను ఆకట్టుకోవడానికి సిద్ధరామయ్య ఇందిర క్యాంటిన్లను ప్రారంభించారు. ఇందిరా గాంధీ శత జయంతి సంవత్సరం సందర్భంగా ఆయనీ క్రతువును చేపట్టారు. ఈ క్యాంటిన్లలో 5 రూపాయలకు అల్పాహారం, పది రూపాయలకు మధ్యాహ్న, రాత్రి భోజనాలు అందిస్తున్నారు. కర్ణాటక రాష్ట్రంలో ఉన్న సంఘ్ పరివార్ కార్యకర్తలు బీజేపీని పరిపుష్టం చేసింది. అదే ఆ పార్టీ బలం. 2008-13మధ్య ఎడ్డియూరప్ప, డివి సదానంద గౌడ, జగదీశ్ షెట్టర్‌లు రాష్ట్ర ముఖ్యమంత్రులుగా పనిచేశారు. ఇప్పుడు బీజేపీయే ప్రధాన ప్రతిపక్షం. జెడీఎస్‌ను ఆ పార్టీ వెనక్కి నెట్టేసింది. మాజీ ప్రధాన మంత్రి దేవెగౌడ ఈ పార్టీకి అధ్యక్షుడు.

ప్రధాని నరేంద్ర మోడీ, బీజేపీ అధ్యక్షుడు అమిత్ షాల ద్వయాన్ని దెబ్బతీయడం అంత తేలికకాదు. ప్రధాని మోడీ ఆకర్షణ పైనే పార్టీ ప్రధానంగా ఆధారపడుతోంది. దక్షిణాదిలో విజయాన్ని సాధించడానికి కాషాయ పార్టీ సిద్ధమవుతోంది. హిందూత్వ అంశంతో ప్రజలను ఒంటరి చేసేందుకు తాము అవకాశమీయమని సిద్దరామయ్య చెబుతూ, కాంగ్రెస్‌లో పునరధికారంపై ఆశలను కల్పిస్తున్నారు. అమిత్ షా ఎన్నిసార్లు రాష్ట్రంలో పర్యటిస్తే.. బీజేపీ విజయావకాశాలు అంతగా పెరుగుతాయి. హిందుత్వ ఓటు అనే బీజేపీ అస్త్రంపై యుద్ధం ఇప్పుడే ప్రారంభమైంది.

ఏటీఎంలా.. 'ఎమ్టీ'ఎంలా!

ప్రజావసరాలు తీర్చేందుకు, నగదు అవసరాలు ముంగిట్లోకి వచ్చేందుకు ప్రభుత్వం బ్యాంకుల ద్వారా ఏటీఎం (ఎనీటైమ్ మనీ/ ఆటోమేటిక్ టెల్లర్ మెషీన్)లను విస్తృతంగా ప్రవేశపెట్టింది. బ్యాంకుల వద్ద నగదు లావాదేవీలు, అవసరాలు నానాటికీ పెరిగిపోతుండటంతో బ్యాంకులపై ఒత్తిడి పెరిగింది. ప్రతి ఒక్కరికి డబ్బు అవసరాలు తీర్చేందుకు బ్యాంకు ఖాతాలు తెరవాలని ప్రభుత్వమే ప్రోత్సహించింది. ఆ పిమ్మట ఈ ఖాతాల సంఖ్య లక్షలు దాటి కోట్లకు చేరుకోవటంతో ఏటీఎంల ప్రక్రియ మొదలైంది. గ్రామీణ ప్రాంతాల్లో సైతం ఈ సేవలు బాగా పెరిగిపోయాయి. కావాల్సినప్పుడల్లా డబ్బు తీసుకోవడం లేదా దాచుకోవడం (డిపాజిట్) కోసం జనం కూడా ఈ సౌకర్యాల పట్ల ఎంతో ఆకర్షితులయ్యారు. వేళకాని వేళల్లో సైతం తక్కున డబ్బు దొరకటంతో ఖాతాదారులందరూ ఆవైపే మొగ్గుచూపారు. ఎటొచ్చి ఈ ఏటీఎంల పనితీరే నానాటికీ తీసికట్టవుతోంది. వినియోగదారులపై బ్యాంకులు ఇబ్బడి ముబ్బడిగా ఛార్జీలు బాదటంతో ఏటీఎంల వినియోగదారుల సంఖ్య మునుపటితో పోలిస్తే తగ్గిపోతోంది. విత్‌డ్రాయల్స్‌పై పరిమితి, ఆ పైన ఛార్జీల భారమే ఈ వెనకడుగుకు ఒక కారణంగా వెల్లడవుతోంది. ఇక ఏటీఎంల పనితీరు కూడా దీనికి జతకూడింది. చాలినన్ని డబ్బులు ఏటీఎంలలో ఉండకపోవడం, నిర్వహణభారం, కొన్నిచోట్ల వాడకం నిష్పత్తి అధికంగా ఉండటం... ఇలా రకరకాల కారణాలు ఏటీఎంలపై ప్రభావం చూపుతున్నాయి. ఇటీవల కాలంలో చాలాచోట్ల ఏటీఎంలు మూతపడే ఉంటున్నాయి. డబ్బు సరైన సమయానికి నింపకపోవడంతో పాటు ఏటీఎంల వద్ద భద్రత కూడా కారణమౌతున్నాయి. 2 లేదా 3 ఏటీఎంలు ఉన్నచోట్ల ఒక్కటే పనిచేయడాన్ని మనం ఎక్కువగా గమనిస్తున్నాం. అలాగే ఎక్కువ భాగం ఏటీఎంలలో లావాదేవీల రికార్డు స్లిప్‌లు అస్సలు రావడంలేదు. కేవలం డబ్బు రావడంతోనే సరిపెడుతున్నారు. కాగిత రహిత లావాదేవీలే ప్రభుత్వ ప్రోత్సాహమని బ్యాంకుల వారంటు న్నారు. ఈ లావాదేవీలకు ఛార్జీలు వసూలు చేస్తున్నప్పుడు, నియంత్రణ పెడుతున్నప్పుడు రికార్డు స్లిప్‌లకెందుకో బ్యాంకులు మొగ్గు చూపక నిర్లక్ష్యం చూపుతున్నాయని ఏటీఎంలకు వెళ్లిన వినియోగదారులు గొణుక్కుంటూ వెనుదిరుగుతున్నారు. పండుగల సీజన్‌లో ఏటీఎంల వినియోగం అధికంగా ఉంటున్న నేపథ్యంలో ప్రజలకు ఆర్థిక ఇబ్బందులు తప్పేట్లు లేవు.

ఇక ఏటీఎంల నిర్వహణ విషయంలో బ్యాంకులకు సహ లక్ష సమస్యలున్నాయి. భద్రత నిర్వహణ, ఆర్థిక, సాంకేతిక సమస్యలు ఇత్యాది తాము ఎదుర్కొంటున్నామని వారు విశ్లేషిస్తున్నారు.



ఆంధ్రప్రదేశ్‌ను ఉదాహరణగా పరిశీలిస్తే కొన్ని వాస్తవాలు వెల్లడవుతున్నాయి. రాష్ట్రం మొత్తం మీద బ్యాంకింగ్ రంగంలో అగ్రగామి అయిన భారతీయ స్టేట్ బ్యాంకు (ఎస్‌బీఐ) పేరిట దాదాపు 3,500 ఏటీఎంలున్నాయి. వీటిలో 65 శాతం దాకా ఇటీవల మూతపడి ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. నో క్యాష్ పేరుతో ఇవి దర్శనమిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ మూతపడ్డ ఏటీఎంల వల్ల నిర్వహణ భారం తడిసి మోపెడవుతోంది. అవి పనిచేసినా చేయకపోయినా అద్దెల రూపంలో లక్షలాది రూపాయలు వెచ్చించాల్సిందే. అద్దెలు, కరెంటు ఖర్చు, సెక్యూరిటీ గార్డుల జీతాలు, మెషీన్ల నిర్వహణ ఖర్చు ఇందులో ఇమిడి ఉన్నాయి. లెక్కలు తీస్తే రెండేళ్లలో 3,500 ఏటీఎంలలో దాదాపు 29 శాతం ఏటీఎంలకు నో క్యాష్, సాంకేతిక సమస్యల వల్ల కోట్లు ఖర్చయ్యాయి. మరికొన్ని ఏటీఎంలు రకరకాల సమస్యలతో ముడిపడి తెరచుకోవడం లేదు. ఒక్క స్టేట్ బ్యాంకు పరిస్థితి ఇలా ఉంటే ఇక మిగతా బ్యాంకుల పరిస్థితి చెప్పనక్కర్లేదు. ఒక్కో ఏటీఎంలో సగటున రోజుకు కనీసం 250 లావాదేవీలయినా జరగాలన్న నిబంధన ఉంది. అయితే కారణాలు ఏమైనా చాలాచోట్ల ఏటీఎంల వాడకం తగ్గిందనే అంటున్నారు.

ఈ పండుగ సీజన్‌లో చాలా ప్రాంతాల్లో పరిశీలిస్తే 90 శాతం ఏటీఎంలు డబ్బుల్లేవంటూ స్వాగతం చెబుతున్నాయి. తీరా బ్యాంకులకు వెళితే అక్కడా నగదు లేదంటూ ఉద్యోగులు పెదవి విరుస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అయితే ఈ పరిస్థితి మరీ దారుణంగా ఉంది. గడచిన నెలరోజుల వ్యవధిలో బ్యాంకుల నుంచి పెద్ద సంఖ్యలో ఖాతాదారులు డిపాజిట్‌లు వెనక్కి తీసుకొన్నారంటూ బ్యాంకు వర్గాలు విశదీకరిస్తున్నాయి. ఇవన్నీ ఇలా ఉండగా కోడిపందెం రాయుళ్ళు పండుగను పురస్కరించుకొని పందేలకు, జూదాలకు భారీగా ఏటీఎంల నుంచి డబ్బులు తీసుకొన్నట్టు కూడా వినబడుతోంది. ఊళ్ళలో ఇదే అదనుగా వడ్డీ వ్యాపారులు తలుపులు బార్లా తెరిచారు. నిలువు దోపిడీకి సిద్ధమయ్యారు. దిగువ, మధ్యతరగతి వారు బాగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏటీఎంలు అన్నీ మళ్ళీ యథాతథ స్థితికి ఎప్పుడొస్తాయా అన్నది. వేచి చూడాల్సిందే. ఏటీఎంల నిర్వహణ బ్యాంకులకు గుదిబండలుగా తయారవుతున్న నేపథ్యంలో వినియోగదారులపై ఇంకా ఛార్జీలు పెంచుతారని వార్తలొస్తున్నాయి. ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగిస్తారని కూడా వినిపిస్తోంది. ప్రభుత్వ నిర్వహణలోనే అంతంత మాత్రంగా ఉన్న ఏటీఎంల పరిస్థితి ప్రైవేటుకిస్తే మెరుగవుతుందో లేదో చూడాలి. ఏటీఎంలు ఏనీటైమ్ మీసేవలోనేగా మారాలని, ప్రజల ఆర్థిక అవసరాలు తీర్చడంలో మరింత చేరువవ్వాలని, లోటుపాట్లు సరిచేస్తే మేలు.

✦ చెన్నుపాటి రామారావు, 9959021483

కౌరవులెవరు సిద్ధూ!



ఎన్నికలను యుద్ధంగా పరిగణించడం ఎప్పుడైతే మొదలు పెట్టారో, పాండవులు, కౌరవులప్రస్తావన రావడం అనివార్యమవుతోంది. ప్రతి ఎన్నికలోనూ ఏదో ఒక రాజకీయ పార్టీకి చెందిన నాయకుడు ఇదే మాదిరిగా పాండవుల ప్రస్తావన తెస్తున్నారు. ఈసారి కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య కాంగ్రెస్ వారు పాండవులనీ, బీజేపీ వారు కౌరవులని అభివర్ణించారు. రాష్ట్ర బీజేపీ నాయకులు కూడా తమను తాము పాండవులుగా అభివర్ణించుకోవచ్చు. ఇంతకీ కౌరవులుఎవరు?

చరిత్రలో ఈరోజు



పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రిగా 34ఏళ్ళపాటు కొనసాగిన మార్క్సిస్టు పార్టీ మహానాయకుడు జ్యోతి బసు 2010 లో సరిగ్గా ఇదే రోజున కన్నుమూశారు. దేశంలో వామపక్ష ప్రజాతంత్ర శక్తులను ఏకం చేయడంలో ఆయన కృషి మరువలేనిది. ఆయన గొప్ప సంస్కరణాభిలాషి. ప్రధానమంత్రి అయ్యే అవకాశాన్ని ఆయన యునైటెడ్ ఫ్రంట్ ప్రభుత్వ హయాంలో వదులుకున్నారు. కాంగ్రెస్ మద్దతును స్వీకరించడం ఇష్టంలేకనే అత్యున్నతమైన పదవి ముంగిట వచ్చి వాలినా ఆయన తిరస్కరించారు.

అసందర్భ, అసంపూర్ణ రామాయణం

మా నాన్నగారు నా చిన్నప్పుడు, తన చిన్ననాటి ముచ్చట్లను చెబుతుండేవారు. నాకు లీలగా గుర్తున్న ఒక సన్నివేశాన్ని ప్రస్తావిస్తున్నా! ఒకసారి మల్లాది అవధాని అనే ఆయన రాసిన, హాస్యరస ప్రధానమైన అసంపూర్ణ రామాయణం అన్న నాటికను, తన మిత్రులతో కలసి, ప్రదర్శించారు. అందులో మానాన్నగారు విశ్వామిత్రుడిగా, వెంకన్నారావు దశరథునిగా వేషం వేశారు.

నాటిక ప్రదర్శన ఆరంభమైంది. విశ్వామిత్రుడు తను తలపెట్టిన యాగానికి రక్షకులుగా, రామలక్ష్మణులను పంపవలసిందిగా కోరడానికి, దశరథ మహారాజు దగ్గరకు వచ్చిన సన్నివేశంలో, రామలక్ష్మణులవైపు చేయిచూపించి, వారిని బంపవా? అని అనగానే దశరథ మహారాజు మహర్షీ! నేను నా బిడ్డలను బంపజాల. క్షమింపుము. అంటూ ప్రాథేయ పడుచుండగా, అసలే కోపిష్ఠి అయిన విశ్వామిత్రుడు పాత్రను ధరించిన మానాన్నగారు, అంతకన్నా ఎక్కువ కోపిష్ఠి కావడం వలన, ద్విగుణీకృతమైన తనకోపాన్ని తట్టుకోలేక, ఒళ్ళుమండి, తన కాలితో దశరథ పాత్రధారి అయిన తన మిత్రుడు వెంకన్నారావు తలపైన ఘట్టిగా తన్నారు. దాంతో మాడుపగిలిన, ఆ వెంకన్నారావు, తను అనాల్సిన సంభాషణను పూర్తిగా మర్చిపోయి, అబ్బ! నామాడు పగిలింది కదరా! ఎందుకంత ఘట్టిగా తన్నావ్! అన్నాడు. దాంతో ఇదేదో అసందర్భంగా వుందని, వెంటనే తెరవేసేశారట.

ఈ నాటకాల గాలి నాకు కూడా సోకి, నేను హైస్కూలులో చదివేటప్పుడు, భరతుడు, నారదుడు, మాధవుడు వంటి పాత్రలను నాటకాలలో వేస్తుండేవాణ్ణి. నేను నారద పాత్ర ధరించిన సందర్భంలో, నా సంభాషణ పూర్తి కాకుండానే, యయాతి పాత్రధారి, నామిత్రుడు కామేశ్వరరావు ప్రవేశించాడు. వాణ్ణి చూడగానే నాకు చిరాకనిపించింది. ఇంకా నాడైలాగు, సాగుతోంది. అప్పుడే వచ్చావేంరా? పో! పోయి మళ్ళీరా! అన్నాను నా తంబుర మీటుతూ, జనం ఘొల్లున నవ్వారు.

ఇలాంటి బాల్యక్రీడా విశేషాలు, ఇప్పుడు ఎక్కడన్నా మనకు కనిపిస్తున్నయ్యా? పుస్తకాల మూటలు మోసుకొంటూ, కాన్వెంట్లకు వెళ్ళడం, తిరిగి ఆ మూటల్ని మోసుకొంటూ, ఇంటికి వచ్చి, కళ్ళజోళ్ళతో టీవీల దగ్గర తిష్ఠ వేయడం అలవాటుగా మారింది.

సృష్టి ఆరంభంలో, సృష్టి, స్థితి, లయకారకుడైన, ఆ పరమేశ్వరుణ్ణి, శంభోశంకర! హరహర శంకరా! అంటూ అందరూ శంభోజనంలా ఉండేవాళ్ళు. కాలక్రమేణా, అనేక మార్పులు చోటుచేసుకున్నందున, శంభోజనంలో శయోపోలు, భోజనం మాత్రం మిగిలింది. ఆ సమయంలో, భోజనానికి కావాల్సినవి ఏర్పాటు చేసుకొని, భోజనం చేస్తుండేవాళ్ళు. ఆ తర్వాత మళ్ళీ చాలాకాలానికి భోజనంలో భో పోయి, ఇప్పుడు జనం మాత్రం మిగిలారు. ఎక్కడ చూసినా కుప్పలు కుప్పలుగా జనం.

ఈ కుప్పల కుప్పల జనమంతా, తమ తమ రకరకాల ఆలోచనలకు, మేధాశక్తిని కూడా జోడించి, కొందరు నాస్తికులుగా, కొందరు ఆస్తికులుగా, మరికొందరు, వీటిని వేటినీ, పట్టించుకోకుండా, కేవలం ఆస్తిపరులుగా ఎదిగిపోయారు. శంకరమయంగా ఉండవలసిన, సమాజం పూర్తిగా మారిపోయి, మనుషులూ, మనసులూ, ప్రేమలూ, పెళ్ళిళ్ళు, తిళ్ళు, గుళ్ళు, బళ్ళు, ఇళ్ళు, వాకిళ్ళూ, ఒళ్ళూ ఒకటేమిటి అన్నీ, కల్తీసరుకుగా అయిపోయినట్లుగా, రకరకాల కథనాల వలన, మనకు, తెలుస్తోంది. ప్రతి మనిషీ, ఏదో ఒక విషయంలో అల్లకల్లోలం అయిపోతూ, తన చుట్టూ ఉన్న పరిసరాల్ని పరివారాన్ని, మరింత అల్లకల్లోలం చేస్తున్నాడు. ఇదో విచిత్రమైన సునామి.

ఈ పరిస్థితి మారాలంటే, చర్చోపచర్చలు చేస్తూ కాలక్షేపం చేయకుండా, ఎవరికి వారే ఆత్మపరిశీలన చేసుకొని తీరాల్సిందే. తప్పొప్పులు, తల నొప్పుల నుంచి బయటపడేందుకు అప్పుడు అవకాశం ఉంటుంది. అన్నీ, అందరికీ తెలుసు. అయినా కేవలం తనకోసం, తన కుటుంబ సభ్యులకోసం, మాత్రమే ఏమైనా చేయడానికి, వెనుకాడని మనస్తత్వం, ప్రబలంగా ఉండడం కూడా ఓ కారణంగా చెప్పవచ్చు.ఎంతోకొంత ప్రయోజనముంటే గానీ, చివరకు కాలక్షేపానికి కూడా ఎక్కడికీ పోరు. ఎవర్నీ ఎవరూ ప్రేమగా పలకరించుకోరు. బజారులో తెలిసిన వాళ్ళు కనబడ్డా, వాళ్ళెవరో తమకు తెలియన ట్లుగా పోతుంటారు. పలకరిస్తే ఏం సాయం చేయమంటారో అని. స్వార్థమే పరమార్థంగా, సాగిపోతూ, అసలైన రామాయణాన్ని సరిగా అర్థం చేసుకోక, ఆ ప్రయత్నమూ చేయక, ఏదో రోజులు వెళ్ళిపోతున్నయ్యిలే అనుకొంటూ, ఎవరికి వారు తమ జీవితాలను అసందర్భ, అసంపూర్ణ, రామాయణంలా చేసుకొంటున్నారు. ఎలాగో ఏమిటో!

పరిష్కారం ఆలోచించుకోవాలి. తప్పదు మరి!

✦ షణ్ముఖశ్రీ,

జల్లికట్టుకు ముగ్గురు బలి

మదురై: తమిళనాడులో పొంగల్ వేడుకల్లో భాగంగా మంగళవారం వేర్వేరు చోట్ల జల్లికట్టు, మంజువిరట్టు పేరిట నిర్వహించిన ఎద్దులను లొంగదీసే సంప్రదాయ క్రీడల్లో ముగ్గురు వ్యక్తులు దుర్మరణం పాలయ్యారు. పొరుగున ఉన్న శివగంగ జిల్లాలో శిరవయల్ వద్ద మంజువిరట్టును చూస్తుండగా ఇద్దరు ప్రేక్షకులు మరణించారని పోలీసులు తెలిపారు. తిరుచిరాపల్లి జిల్లాలో ఆవరంగాడులో జల్లికట్టు సందర్భంగా రెచ్చిపోయిన ఎద్దు దాడిలో సోలై పాండ్యన్ అనే వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. దీంతో ఎద్దులను రెచ్చగొట్టే క్రీడల్లో మరణించిన వారి సంఖ్య నాలుగుకు చేరుకుంది.

సంక్షోభం కొలిక్కి?

● ఆ నలుగురు సీనియర్ జడ్జిలతో సీజేఐ సమావేశం ● తాజా పరిణామాలపై 15 నిమిషాల పాటు చర్చ ● సమావేశానికి ఇతర న్యాయమూర్తులు హాజరు ● కోర్టు కార్యకలాపాలకు హాజరైన ఆ నలుగురు ● ఫలిస్తున్న బీసీఐ, ఎస్‌సీబీఏ చర్చలు ● ఒక రోజులోనే మాట మార్చిన ఏజీ





(మొదటిపేజీ తరువాయి)

భేటీ అయి తాజా పరిణామాలపై చర్చించినట్లు న్యాయస్థాన వర్గాలు పేర్కొన్నాయి. ఈ సమావేశానికి సుప్రీంకోర్టు ఇతర న్యాయమూర్తులు కూడా హాజరైనట్లు సమాచారం. సమావేశం తర్వాత ప్రధాన న్యాయమూర్తి, నలుగురు సీనియర్ జడ్జిలు తమ రోజువారీ కార్యక్రమాలకు హాజరయ్యారు. సుప్రీం సంక్షోభానికి ముగింపు పలికేందుకు బార్ కౌన్సిల్ ఆఫ్ఇండియా(బీసీఐ), సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ సభ్యులు ప్రధాన న్యాయమూర్తి, నలుగురు సీనియర్ జడ్జిలు, సుప్రీంకోర్టు ఇతర న్యాయమూర్తులతో పలు దఫాలుగా చర్చలు జరిపారు.

సుప్రీంలో సంక్షోభమే లేదు:బీసీఐ

సుప్రీంకోర్టులో ఖచ్చితంగా సంక్షోభమే లేదని బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా స్పష్టం చేసింది. బీసీఐ చైర్మన్ మనన్ కుమార్ మాట్లాడుతూ.. ''బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఏడుగురు సభ్యుల బృందంద సోమవారం సర్వోన్నత న్యాయస్థానం పాలనా వ్యవహారాలపై ఆరోపణలు చేసిన న్యాయమూర్తుల్లో ఒకరైన రంజన్ గొగోయ్ ను కలిసింది. సుప్రీంకోర్టులో అసలు సంక్షోభమే లేదని ఆయన తేల్చిచెప్పారు. కానీ సుప్రీంకోర్టులో సంక్షోభం నెలకొందని మీడియా రిపోర్టులు తయారు చేయడం సరికాదు. ఇక్కడ పరిస్థితులు బాగానే ఉన్నా.. అలాంటివార్తలు ఎందుకిస్తున్నారో అర్థ కావడం లేదు. ఆరోపణలు చేసిన వారిలో ఒకరైన జస్టిస్ మదన్ బీలోకూర్ కూడా సుప్రీంకోర్టులో ఎలాంటి సంక్షోభం లేదని ఇప్పటికే తేల్చిచెప్పారు. అయితే వివాదం ఇంకా కొలిక్కిరాలేదని అటార్నీ జనరల్ ఎందుకలా వ్యాఖ్యానించారో నాకు తెలియదు. సుప్రీంకోర్టు న్యాయమూర్తులంతా తమ విధులకు హాజరై, రోజువారీ కార్యక్రమాలు చేపట్టారు. త్వరలో అన్ని అంశాలకు పరిష్కారం లభిస్తుంది. ఖచ్చితంగా సుప్రీంకోర్టు ఎలాంటి సంక్షోభం లేదు.'' అని మనన్ కుమార్ స్పష్టం చేశారు.

ఈ వారంలో వివాదానికి పరిష్కారం:ఎస్‌సీబీఏ

సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, న్యాయస్థానం పరిపాలన వ్యవహారాలపై నలుగురు సీనియర్ న్యాయమూర్తులు చేసిన ఆరోపణల వివాదానికి ఈ వారంలో పరిష్కారం లభిస్తుందని సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వికాస్ సింగ్ స్పష్టం చేశారు. చర్చల ద్వారానే సమస్యలకు పరిష్కార మార్గాలు లభిస్తాయన్నారు.ఆదివారం బీసీఐ ఏడుగురు సభ్యుల బృందం, సుప్రీంకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వికాస్ సింగ్ లు తనను కలిసినప్పుడు సుప్రీం సంక్షోభానికి ముగింపు పలుకుతామని హామీ ఇచ్చిన విషయం తెలిసిందే.

మాట మార్చిన అటార్నీ జనరల్

సుప్రీంకోర్టు వివాదాలు పరిష్కారమయ్యాయని సోమవారం ప్రకటించిన అటార్నీ జనరల్ కేకే వేణుగోపాల్ ఒకరోజులోనే మాటమార్చారు. వివాదం ఇంకా ముగిసినట్లు కనిపించడం లేదని మంగళవారం చెప్పుకొచ్చారు. నలుగురు సీనియర్ న్యాయమూర్తులు లేవనెత్తిన అంశాలకు సంబంధించిన వివాదం మరో మూడు రోజుల్లో పరిష్కారమవుతుందని అటార్నీ జనరల్ స్పష్టం చేశారు. వివాదం ముగిసిందని సోమవారం ప్రకటించిన మరుసటి రోజే ఏజీ ఇలా మాట్లాడడం చర్చనీయాంశమైంది. అయితే మంగళవారం మీరు నలుగురు సీనియర్ జడ్జిలనూ, ప్రధాన న్యాయమూర్తిని కలిశారా అని మీడియా ప్రశ్నించగా ఆయన లేదు అని సమాధానమివ్వడం గమనార్హం.

లోయ మరణంపై రిపోర్టులను పిటిషనర్లకూ ఇవ్వండి...

న్యూఢిల్లీ: సీబీఐ న్యాయమూర్తి జస్టిస్ బీహెచ్ లోయ మరణానికి గల కారణాలకు సంబంధించిన పూర్తి నివేదికలను పిటిషనర్లకు అందజేయాలని సుప్రీంకోర్టు మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది.ఈ కేసుపై విచారణజరిపిన జస్టిస్ అరుణ్ మిశ్రా, జస్టిస్ ఎంఎం శాంతనగౌదర్ లతో కూడిన ధర్మాసనానికి మహారాష్ట్ర ప్రభుత్వం న్యాయమూర్తి మరణానికి సంబంధించిన పూర్తి వివరాలతో కూడిన నివేదికలను సీల్డ్ కవర్ లో అందజేసింది. ఈ నేపథ్యంలో తమకు కూడా లోయ మృతికి సంబంధించిన వివరాలు అందజేయాలని పిటిషనర్లు కోరగా న్యాయస్థానం ఆ అభ్యర్థనను మన్నించి.. పిటిషనర్లకు కూడా లోయ మృతి వివరాలకు సంబంధించిన నివేదికల కాపీలను అందించాలని మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. కీలకమైన సోహ్రాబుద్దీన్ షేక్ ఎన్ కౌంటర్ కేసు విచారణ జరుపుతున్న క్రమంలో 2014 డిసెంబర్ 1న జస్టిస్ లోయ గుండెపోటుతో మృతి చెందారు. బంధువుల ఫంక్షన్ కు వెళ్లిన సమయంలో లోయకు హార్ట్ ఎటాక్ వచ్చినట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. అయితే లోయ మృతిపై తమకు అనుమానున్నాయని మహారాష్ట్రకు చెందిన ఓ జర్నలిస్ట్, ప్రజా సంఘాల కార్యకర్తలు సుప్రీం కోర్టును ఆశ్రయించడంతో న్యాయస్థానం విచారణ జరుపుతోంది. మంగళవారం మహారాష్ట్ర ప్రభుత్వం నివేదిక అందించిన తర్వాత ఈ కేసును కోర్టు వాయిదా వేసింది.

కుల పంచాయితీల దాడులు చట్టవిరుద్ధం

న్యూఢిల్లీ: కుల పంచాయితీలు, అసోసియేషన్లపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఖాప్ పంచాయితీలో దంపతులపై దాడి అక్రమం అని పేర్కొంది. కులాంతర వివాహాలకు అనుగుణంగా ఉన్నజంటలను కాపాడేందుకు ఒకచట్టాన్ని అమలు చేయాలనిలా కమిషన్ సిఫార్సు చేసింది. అమికస్‌క్యూరి కోర్టుకు సహాయం చేయాలని కోర్టు ఆదేశించింది. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి దీపక్ మిశ్రా నేతృత్వంలోని ధర్మాసనం ఈ ఆదేశాలను జారీచేసింది. బాలుడి, లేదా బాలికపై ఏ విధమైన సామూహిక దాడి జరుగుతుందో అది ఖచ్చితంగా చట్టవిరుద్ధం అని ధర్మాసనం పేర్కొంది.

హౌసింగ్ సొసైటీల కేసు మార్చి 13కు వాయిదా

న్యూఢిల్లీ, ఆంధ్రప్రభ: శాసనసభ్యులు, సివిల్ సర్వీస్ అధికారులు, జర్నలిస్టుల హౌసింగ్ సొసైటీ కేసు వచ్చే మార్చి 13కు వాయిదా పడింది. మంగళవారం న్యూఢిల్లీలో సుప్రీంకోర్టులో ఈ కేసుపై విచారణ జరిగింది. జస్టిస్ చలమేశ్వర్, జస్టిస్ సంజయ్ కిషన్ కౌశల్‌తో కూడిన ధర్మాసనం కేసు విచారించింది. అయితే బుధవారం నుంచి రాజ్యాంగ ధర్మాసనం ఎదుట విచారణకు హాజరు కావాల్సి ఉన్న నేపథ్యంలో ఈ కేసును మరో తేదీకి వాయిదా వేయాలని అటార్నీ జనరల్ వేణుగోపాల్ తరపు న్యాయవాది విజ్ఞప్తి చేశారు. దాంతో కేసును మార్చి 13వ తేదీకి వాయిదా వేయాలని ధర్మాసనం నిర్ణయించింది. వరుసగా మూడురోజుల పాటు ఈ కేసుపై తుది వాదనలు వినాలని ధర్మాసనం నిర్ణయించినట్లు సొసైటీ తరపు న్యాయవాదులు తెలిపారు. మరోవైపు ఈ కేసులో సుమారు 20 రాష్ట్రాలు తమ కౌంటర్‌లు దాఖలు చేసినట్లు తెలిసింది. హౌసింగ్ పాలసీపై అన్ని రాష్ట్రాలు కౌంటర్ దాఖలు చేయాలని సుప్రీంకోర్టు ఇది వరకే అన్ని రాష్ట్రాలకు నోటీసులు జారీ చేసింది. కేసు విచారణకు తెలంగాణ అడిషనల్ అడ్వేకేట్ జనరల్ రాంచందర్‌రావు తదితరులు హాజరయ్యారు.

హజ్ సబ్సిడీ రద్దు

(మొదటిపేజీ తరువాయి)


రూపొందించాలని కోరింది. 1994 నుంచి ఏటేటా హజ్ యాత్రికులపై ప్రభుత్వం పెడుతున్న ఖర్చు పెరుగుతూ వస్తోంది. 1994లో 21,035 మంది యాత్రికులు వెళితే ఒక్కొక్కరిపై 17,000 రూపాయల చొప్పున దానికి 10.51కోట్ల రూపాయల ఖర్చు అయ్యింది. అయితే 2011 నాటికల్లా ఇది భారీగా పెరిగింది. 2011లో 1,25,000 యాత్రికులు వెళితే ఒక్కొక్కరిపై 54,800 రూపాయలు ఖర్చుతో 685 కోట్ల రూపాయల వ్యయమైంది. ఈ నేపథ్యంలో రోజురోజుకూ యాత్రికులు పెరుగుతుండడంతో సబ్సిడీని దశలవారీగా ఉపసంహరించాలని 2012లో సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈసారి హజ్ యాత్రలో కేంద్ర ప్రభుత్వం పలు మార్పులు తీసుకువచ్చింది. పురుషుల తోడు లేకుండా మహిళలు హజ్ యాత్రకు వెళ్లేందుకు అనుమతించింది. అలాగే సౌదీ అరేబియా ప్రభుత్వంతో చర్చలు జరిపి ఈసారి హజ్ యాత్రికుల సంఖ్యను పెంచేందుకు అనుమతి పొందింది. వీటితోపాటు సముద్ర మార్గంలో హజ్ వెళ్లేందుకు కూడా సౌదీ అరేబియాను ఒప్పించింది. హజ్ యాత్ర సబ్సిడీని ఉపసంహరిస్తూ కేంద్రం తీసుకున్న నిర్ణయాన్ని ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు స్వాగతించింది. ప్రభుత్వం నుంచి తాము ప్రయోజనం పొందుతున్నామని అందరిలో తప్పుడు అభిప్రాయముందని బోర్డుసభ్యుడు కమల్ ఫారూఖీ అన్నారు. ఈ యాత్ర వల్ల ఎయిరిండియానే పెద్ద ఎత్తున ప్రయోజనం పొందుతోందని అన్నారు.

ముస్లిం బాలికల ఉపకారవేతనాలకై రూ. 20 వేల కోట్లు కేటాయిస్తారా?: ట్విట్టర్‌లో మోడీని ప్రశ్నించిన అసదుద్దీన్ ఓవైసీ

హైదరాబాద్ ,ఆంధ్రప్రభ : వచ్చే 2018-19 వార్షిక బడ్జెట్‌లో ముస్లిం బాలికల ఉపకారవేతనాలకై రూ. 20,000 కోట్లు కేటాయించగలరా అని ప్రధాన మంత్రి నరేంద్రమోడీని ఎంఐఎం అధ్యక్షులు, ఎంపి అసదుద్దీన్ ఓవైసీ ప్రశ్నించారు. మంగళవారం ట్విట్టర్‌లో అసద్ ఈ విషయం ప్రస్తావించారు. ఉపకార వేతనాల్లో భాగంగా ప్రీమెట్రిక్, పోస్ట్ మెట్రిక్ స్కాలర్ షిప్‌లకు పై మొత్తంలో కేటాయింపులు కేంద్ర బడ్జెట్‌లో జరుగుతాయో లేదో వేచి చూస్తామని పేర్కొన్నారు. హజ్ సబ్సిడీపై చేస్తున్న విమర్శలకు అసద్ పై విధంగా ట్వీట్ చేశారు.

కాంగ్రెస్ - కరవు కవలలు!

● ప్రధాన మోడీ ధ్వజం ● బర్మెర్ రిఫైనరీ పనులు ప్రారంభం



పచ్‌పద్ర (బర్మెర్), రాజస్థాన్: కాంగ్రెస్‌పార్టీ ఆచరణ సాధ్యం కాని హామీలతో ప్రజలను మోసగిస్తున్నదని ప్రధాని నరేంద్ర మోడీ ఆరోపించారు. క్షేత్ర స్థాయిలో కార్యాచరణ శూన్యమని విమర్శించారు. రూ.43, 129 కోట్ల బర్మెర్ చమురు శుద్ధి ప్రాజెక్టు పనులను ఇక్కడ ప్రారంభించిన సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రసంగిస్తూ కాంగ్రెస్, కరవు చేతులు కలిపి నడుస్తున్నాయని మోడీ అన్నారు. ఆ పార్టీని అధికారం నుంచి తప్పించినప్పుడు మాత్రమే కరవు చరమాంకం పలుకుతున్నదని ప్రధాని తెలిపారు. గొప్పలు చెప్పుకోవడం కోసమే ఆ పార్టీ ప్రాజెక్టులకు శంకుస్థాపనలు లేదా కొత్త రైళ్ళకు ప్రకటనలు చేసుకుంటూ పోయిందే తప్ప వాటిలో ఒక్కదాన్ని కూడా మొదలుపెట్టలేదని విమర్శించారు. తమ ప్రభుత్వం కేవలం ప్రకటనలకు పరిమితం కాదని, వాటికి ఒక తార్కిక ముగింపు తీసుకురావడం కోసమే పనులు చేపడుతుందని ప్రధాని తెలిపారు. సంకల్పం సిద్ధించడానికి ఇదే సరైన సమయం. మనం మన లక్ష్యాలను గుర్తించాలి. 75వ స్వాతంత్ర్య దినోత్సవం నాటికి అంటే 2022నాటికి వాటిని సాధించేలా ముందుక ు సాగాలి. ఏడాదికి తొమ్మిది మిలియన్ టన్నుల (ఎంటీపీఏ) చమురు శుద్ధి కార్మాగారం సైతం 2022నాటికి పూర్తవుతుందని మోడీ చెప్పారు.

గ్రామీణ విద్య మిథ్య..!

● 40 శాతం మందికి గడియారంలో టైం తెలీదు ● 60 శాతం మందికి ఇంటర్నెట్ పరిచయం లేదు ● 14 శాతం మంది కొలతల లెక్కలు రానేరావు ● సెల్‌ఫోన్లపైనే ఆసక్తి ● ప్రథమ్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ సర్వేలో వెల్లడి

న్యూఢిల్లీ: గ్రామీణ ప్రాంతాల్లో విద్యా బుద్ధులు అంతంత మాత్రంగానే ఉంటున్నాయి. సైరైన విద్యా ప్రమాణాలు పల్లెస్థాయికి చేరడం లేదు. అంతరిక్షంలోకి ఆవాసానికి అడుగులు పడుతున్నా, గ్రామీణ భారతంలో విద్యావ్యవస్థ నేటికీ వానాకాలం చదువులనే తలపిస్తోంది. నాణ్యమైన విద్య అక్కడ మిథ్యగానే ఉంది అని తాజా సర్వే ఒకటి కుండబద్దలు కొట్టింది. వార్షిక విద్యా స్థితిగతుల నివేదిక (ఎఎస్ఈఆర్)పేరుతో ప్రథమ్ ఎడ్యుకేషన్ ఫౌండేషన్ అనే సంస్థ దేశవ్యాప్తంగా 24 రాష్ట్రాల్లోని 26 గ్రామీణ జిల్లాల్లో సర్వే నిర్వహించింది. 14-18 ఏళ్ల మధ్య వయసు విద్యార్థులు 28వేల మందికి తేలికపాటి పరీక్షలు నిర్వహించి నివేదికరూపొందించింది. ఎన్నో ఆసక్తికర వివరాలను వెల్లడించింది.

- 14-18 వయసు మధ్య విద్యార్థులు దేశంలో 12 కోట్ల మంది ఉన్నారు. వీరిలో 86 శాతం మంది ఇంకా సాధారణ విద్యావ్యవస్థలోనే ఉండిపోయారు. 50 శాతం మంది 10వ తరగతిలోపు ఉన్నారు. 25 శాతం మంది 11-12 తరగతుల్లో, 6 శాతం మంది డిగ్రీ కోర్సుల్లో ఉన్నారు.

- 1641 గ్రామాల్లో 25000 ఇళ్లను సర్వే చేరుకుంది. దాదాపు 35 భాగస్వామ్య విద్యా సంస్థల్లో 2వేల మంది వలంటీర్లు సర్వే చేపట్టారు. 28వేల మంది విద్యార్థులను పరీక్షించారు.

- చొరవ, మేథో సమర్థత, అవగాహన, ఆకాంక్ష అనే నాలుగు అంశాల ఆధారంగా సర్వే పాఠం రూపొందించారు. వీటితోపాటు ఆర్థమెటిక్, పఠనం, కంప్యూటర్ పరిచయం, లక్ష్యాలు వంటి అంశాలనూ ప్రస్తావించారు.

- ఆంగ్ల వాక్యం చదవగలిన 14 ఏళ్ల వయసు విద్యార్థులు 53శాతం. 18 ఏళ్ల వయసు వారు 60 శాతం.

- ఆహార పొట్లాలపై ముద్రించిన సూచలను చదవే సామర్థ్యం కేవలం 54 శాతం మందికే ఉంది. డిస్కౌంట్ అనంతరం వాస్తవిక ధరను గుర్తించ గలిగిన విద్యార్థులు 38 శాతం మాత్రమే. 15శాతం మందికే వడ్డీ లెక్కలు తెలుసు.

- కంప్యూటర్ వాడే విద్యార్థుల సంఖ్య కేవలం 28శాతంగా ఉంది.

- 2004-11 మధ్యకాలంలో 8వ తరగతి పాసైన వారి సంఖ్య రెట్టింపు అయింది. ఈ సంఖ్య 11 మిలియన్ల నుంచి 22 మిలియన్లకుచేరింది.

- విద్యా హక్కు చట్టం అమల్లోకి వచ్చిన ఎనిమిదేళ్ల అనంతరం దేశంలో విద్యా ప్రమాణాలు, విద్యార్థుల మేథో సామర్థ్యాన్ని అంచనా వేసేందుకు సర్వే ప్రాధాన్యం ఇచ్చిందని ప్రథమ్ సంస్థ ముఖ్య కార్యనిర్వహణ అధికారి రుక్మిణి బెనర్జీ చెప్పారు.

- విద్యా హక్కు అమలుకు ముందు, తర్వాతి పరిస్థితులను బేరీజు వేశారు. ఇదివరకు 46 శాతం మంది అర్థమెటిక్ డివిజన్ చేస్తుండగా, ఇప్పుడు వారి సంఖ్య 29శాతానికి పడిపోయింది. అదేమాదిరి చిన్నచిన్న వాఖ్యాలను తప్పుల్లేకుండా చదివేవారి సంఖ్య ఆర్టీఈకి 63 నుంచి 36శాతానికి దిగజారింది.

- ప్రతి 10 మందిలో ఏడుగురి వద్ద సెల్‌ఫోన్లు ఉన్నాయి. సగటున 73శాతం మంది మొబైల్స్ వాడుతున్నారు. సరిగా వ్యాక్యాలు చదవని వారు సైతం దర్జాగా సెల్‌ఫోన్లు వాడేస్తున్నారు.

''ఈ పరిణామం చాల అస్థిరంగా ఉంది. విద్యా వ్యవస్థలో ఏం జరుగుతున్నదో, మెరుగైన ప్రమాణాల అమలుకు ఏం చేయాలన్న అంశంపై ఆలోచన చేయాలి'' - అరవింద్ సుబ్రమణియన్



- 36శాతం మందికి దేశరాజధాని తెలీదు.. తమ రాష్ట్రం పేరు చెప్పలేని దుస్థితిలో 21 శాతం మంది ఉన్నారు.

- 74 శాతం మంది విద్యార్థులకు బ్యాంకు ఖాతాలున్నాయి. వీరిలో 51 శాతం మంది ఖాతాలు క్రియాశీలకంగా ఉన్నాయి. కాగా 15 శాతం మంది మాత్రమే ఏటీఎం సౌకర్యం వినియోగిస్తున్నారు. 5 శాతం విద్యార్థులు ఇంటర్నెట్ బ్యాంకింగ్ సేవలకు చేరుకున్నారు.

- తూర్పు, పశ్చిమ ప్రాంతాలతో పోల్చుకుంటే, మధ్యభారత్‌లోని జిల్లాల విద్యార్థులు బాగా వెనుకబడి ఉన్నారు. డబ్బు లెక్కింపు, బరువు తూకాల లెక్కల్లో వీరు మరింత బలహీనంగా ఉన్నారు.


- ప్రాథమిక విద్యార్హతల్లో ఈశాన్య రాష్ట్రాలు అట్టడుగు స్థానానికి పరిమితం అయ్యాయి.

-సర్వే నివేదికపై కేంద్ర ముఖ్య ఆర్థికసలహాదారు అరవింద్ సుబ్రమణియన్, నైపుణ్యాభివృద్ధి శాఖ కార్యదర్శి కేపీ కృష్ణన్, ప్రథమ్ ఫౌండేషన్ అధ్యక్షుడు మాధవ్ చవాన్ చర్చించారు.

- కనీస లెక్కలు, సంగ్రహణ విషయాలు విద్యార్థికి తప్పనిసరిగా ఉండాలని సుబ్రమణియన్ పేర్కొనగా, దీర్ఘకాలంలో పాఠశాల విద్య మరింత మెరుగవ్వాలని, ఉద్యోగార్హతకు అనుగుణంగా ఉండాలని కృష్ణన్ అభిప్రాయపడ్డారు.

చాలినన్ని మెడికల్ సీట్లు

లేవు: రాష్ట్రపతి



న్యూఢిల్లీ: దేశంలోని మెడికల్ కళాశాలల్లో చాలినన్ని సీట్లు లేకపోవడం వల్ల ఆసక్తి ఉన్న విద్యార్థులు వైద్య విద్యకు దూరం అవుతున్నారని రాష్ట్రపతి రామనాథ్ కోవింద అన్నారు.ఆయన మంగళవారం ఢిల్లీలోని ఆలిండియా మెడికల్ ఇనిస్టిట్యూట్ 45వ స్నాతకోత్సవ సమావేశంలో ప్రసంగిస్తూ,ఒకవేళ కొన్ని కాలేజీల్లో సీట్లు ఉన్నా, క్రమబద్ధీకరణ పరమైన అవరోధాలవల్ల సీట్లు భర్తీ కావ డంలేదని ఆయన అన్నారు. అంతేకాక, మెడికల్ కాలేజీల్లో ప్రవేశాలు సామాన్యులకు అందు బాటులో ఉండాలని రాష్ట్రపతి సూచించారు.

ప్రభుత్వాసుపత్రుల్లో వైద్యుల సంఖ్య తగినంతగా లేదనీ, దాని వల్ల చాలా ఆస్పత్రుల్లో రోగులకు సరైన వైద్య సేవలు అందడం లేదని కోవింద్ అన్నారు. గ్రామాల్లో పరిస్థితులు మరీ దారుణమనీ, కనీసం మండల కేంద్రాల్లో సైతం సరైన వైద్య సదుపాయాలు లభించడం లేదని ఆయన అన్నారు.

దేశంలోని ప్రభుత్వ,ప్రైవేటు మెడికల్ కాలేజీలలో అండర్ గ్రాడ్యుయేట్ సీట్లు 67,000, పోస్టు గ్రాడ్యుయేట్ స్థాయిలో 31,000 మాత్రమే ఉన్నాయనీ, నూట ముప్పయి కోట్ల జనాభా కలిగిన సువిశాల దేశంలో ఇవి ఏమూలకని ఆయన ప్రశ్నించారు.సామాన్య కుటుంబాలకు చెందిన విద్యార్థులు వైద్య విద్యను అభ్యసించడానికి అనువైన వాతావరణాన్ని సృష్టించాలని ఆయన సూచించారు. ప్రతిభావంతులైన విద్యార్థులు డబ్బు చెల్లించలేక వృత్తి విద్యలకు దూరమవుతున్నారనీ, ఈ పరిస్థితిమారాలని ఆయన అన్నారు.అలాగే, వైద్యవిద్యలో నాణ్యత పెరగాలని ఆయన సూచించారు.

వైద్య విద్యను అభ్యసించే వారు మిగిలిన వృత్తుల వార కన్నా, పవిత్రమైన సేవలకు పునరంకితం అవుతున్నామనే భావనతోనే ఈ వృత్తులలో ప్రవేశించాలని రాష్ట్రపతి సూచించారు.అలాగే, వైద్యులకు సరైన గౌరవం, వారి సేవలకు తగిన గుర్తింపు లభించేట్టు చూడటం సమాజం బాధ్యత అని ఆయన అన్నారు. మన దేశంలో ఇంజక్షన్లు తయారు చేసే కంపెనీలు అధికంగా ఉన్నప్పటికీ, దేశంలో టీకాల మందుకార్యక్రమం ఆశించిన స్థాయిలో జరగడం లేదని ఆయన అన్నారు. ముఖ్యంగా,చిన్న పిల్లలకు వేసేచుక్కల మందు కార్యక్రమాన్ని మరింత చురుకుగా అమలు జరపాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. రోగ నిరోధక శక్తిని పెంచే ఇంజక్షన్లను మరిన్నింటిని ప్రవేశపెట్టాలని ఆయన సూచించారు.ఇంజక్షన్లను కనుగొన్న శాస్త్రజ్ఞులకు తగిన గుర్తింపు,ప్రోత్సాహం లభించాలని ఆయన సూచించారు.ఆస్పత్రుల్లో మందులు, వైద్యుల సేవలు అన్ని వేళల్లో లభించేట్టు చూడటం అత్యవసరమని ఆయనఅన్నారు. ఈ విషయమై ఎన్‌డియే ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ఆయన అభినందించారు.

చుక్కల్లో చంద్రుడు ట్రంప్

సోమవారం నుంచి ప్రపంచ ఆర్థిక సదస్సు

జెనీవా: అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ప్రపంచ నాయకుల మధ్య చుక్కల్లో చంద్రునిలా ఆవిర్భవించే అరుదైన ఘట్టం వచ్చే వారం దావోస్‌లో జరిగే ప్రపంచ ఆర్థిక సదస్సు(డబ్ల్యూయిఎఫ్)లో ఆవిష్కృతం కానుంది. లగ్జరీ స్విస్ కీ రిసార్ట్ టౌన్ వద్ద జరిగే వార్షిక సదస్సు వివరాలను డబ్ల్యూయిఎఫ్ మంగళవారం ఆవిష్కరిం చింది.

బీటలు వారిని ప్రపంచానికి భాగస్వామ్య భవిత

బీటలు వారిన ప్రపంచంలో భాగస్వామ్య భవిష్యత్తును ఎలా సృష్టించాలనే దానిపై ఈ ఏడాది జరిగే సదస్సు దృష్టి పెడుతుంది. మన ప్రపంచం ఎదుర్కొంటున్న సవాళ్ళు మునుపెన్నడూ లేని విధంగా సంఘటిత, భాగస్వామ్య, సమీకృత చర్యను మరింత ముఖ్యం చేస్తున్నాయని డబ్ల్యూయిఎఫ్ వ్యవస్థాపకుడు, ఎగ్జిక్యూటివ్ చైర్మన్ క్లాస్ ష్వాబ్ ఒక ప్రకటనలో తెలిపారు. దేశాల మధ్య భాగస్వామిక ప్రయోజనాలను మళ్ళీ నొక్కివక్కాణిస్తూ, సంఘటిత వృద్ధి ద్వారా సామాజిక కాం ట్రాక్టులను పునరుద్ధించడానికి బహుముఖ నిబద్ధతను పది లపరచడం ద్వారా ఈ తప్పిదపు రేఖలను అధిగమించడ మే లక్ష్యంగా 48వ దావోస్ సదస్సు జరుగుతుందని ఆయన చెప్పారు.

వివాదాస్పద నేతపైనే అందరి దృష్టి

కానీ ఈ ఏటి సదస్సుకు ప్రధాన ఆకర్షణగా ట్రంప్ అనివార్యం కానున్నారు. దౌత్యపరమైన ఘర్షణలను పెద్దది చేస్తూ, ఒంటెద్దు పోకడలతో కూడిన విధానం మరియు వాక్చాతుర్యంతో కొత్త వాటిని సృష్టిస్తున్నారనే నిందలు ఆయన్ను అలముకున్నాయి. అమెరికా అధ్యక్ష పదవిని చేపట్టిన ఏడాది కాలంలో తనదైన అమెరికా ఫస్ట్ అజెండాకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చారు. వాస్తవానికి అది దావోస్‌కు హాజరయ్యే దేశాల మధ్య ప్రపంచీకరణ, నియంత్రిత ఏకీకరణకు అది పూర్తి విరుద్ధమైనది. ఐదు రోజుల దావోస్ సదస్సు సోమవారం ప్రారంభం కానుంది. 70 దేశాధి నేతలతో సహా 3,000 మంది రాజకీయ, వాణిజ్య ప్రముఖులు సదస్సుకు హాజరు కావచ్చని ఓ అంచనా. కానీ 2000 సంవత్సరంలో బిల్ క్లింటన్ హాజరైన తర్వాత సదస్సుకు హాజరవుతున్న తొలి అమెరికా అధ్యక్షుడిగా అందరి దృష్టి ట్రంప్‌పై పడనుంది.

ట్రంప్ బృందంలో అల్లుడు

అధ్యక్షుడితో పాటుగా వచ్చే ప్రతినిధుల బృందంలో ఆయన అల్లుడు, సలహాదారు జరెడ్ కుష్‌నెర్, సెక్రటరీ ఆఫ్ స్టేట్ రెక్స్ టిల్లెర్‌సర్, ట్రెజరీ సెక్రటరీ స్టీవ్ నుచిన్ ఉంటారని వైట్‌హౌస్ పేర్కొంది. వీరికితోడు అమెరికా మాజీ ఉపాధ్యక్షుడు అల్ గొరె, దేశ మాజీ ఉన్నత దౌత్యవేత్త జాన్ కెర్రీ సైతం సదస్సుకు హాజరు కానున్నారు.

ప్రముఖ నేతల ప్రసంగాలు

శుక్రవారం సమావేశం ముగియడానికి ముందు ట్రంప్ కీలకోపన్యాసం చేస్తారని డబ్ల్యూయిఎఫ్ ప్రకటించింది. ఈసారి సదస్సులో భారత ప్రధాని నరేంద్ర మోడీ ముఖ్య భూమిక పోషించనున్నారు. భారత ప్రధాని మంగళవారం ప్రారంభోపన్యాసం చేస్తారు. ఫ్రాన్సు అధ్యక్షుడు ఇమ్మాన్యుయేల్ మాక్రోన్ 24వ తేదీన సదస్సును ఉద్దేశించి ప్రసంగించాల్సి ఉంది.

అతిరథ మహారథుల రాక

బ్రిటిష్ ప్రధాని థెరెసా మే, కెనడా ప్రధానమంత్రి జస్టిన్ ట్రుడివా, ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమన్ నెతన్యాహు సదస్సుకు హాజరు కానున్నారు. బ్రెజిల్, కొలొంబియా, జింబాబ్వే, స్విట్జర్లాండ్, ఐరోపా కమిషన్ అధ్యక్షులతో పాటుగా జోర్డాన్, స్పెయిన్ రాజులు జెనీవా సదస్సులో పాలుపంచుకుంటారు.

దక్షిణ మధ్య రైల్వే

బహిరంగ ఇ-టెండరు ప్రకటన నెం. డిఆర్ఎం/పనులు/బిజడ్ఎ/01/2018 తేది: 16-01-2018

PUB/0061/18

భారత రాష్ట్రపతి తరపున దిగువ సంతకందారు దిగువ పనుల కొరకు ప్రతిపాదిత వివరాలతో 15.00గం.ల వరకు ఇ-టెండర్లు ఆహ్వానిస్తున్నారు.

క్ర.సం.1 టెండరు నెం. ఇ-01-ఈస్ట్-2018 పని పేరు: భీమవరం - నిడదవోలు & భీమవరం - నర్సాపూర్ సెక్షన్‌లు - వంతెనలు మెరుగుపరుచుట - బల్లాస్ట్ రిటైనర్లు, ఫేస్ వాల్స్, సీలింగ్స్ మొదలగునవి పెంపు. పూర్తిచేయు కాలం : 09 (తొమ్మిది) నెలలు, టెండరు విలువ: ₹ 27,46,276/-, ఇఎండి: ₹ 54,930/-. టెండరు డాక్యుమెంట్ ధర: ₹ 3,000/-, ముగింపు తేదీ: 22-02-2018.

క్ర.సం.2 టెండరు నెం. ఇ-02-ఈస్ట్-2018. పని పేరు: విజయవాడ- గూడూరు సెక్షన్- డి,ఇ మరియు ఎఫ్ క్యాటగిరి స్టేషన్‌ల వద్ద దివ్యాంగుల సదుపాయాల కల్పన. పూర్తిచేయు కాలం : 06 (ఆరు) నెలలు, టెండరు విలువ: ₹ 46,03,595/-, ఇఎండి: ₹ 92,080/-. టెండరు డాక్యుమెంట్ ధర: ₹ 3,000/-, ముగింపు తేదీ: 22-02-2018.

క్ర.సం.3 టెండరు నెం. ఇ-01-బ్రిడ్జిలు-2018. పని పేరు: విజయవాడ డివిజన్: 20 నెలల కొరకు డిఇఎన్/బిఆర్/బిజడ్ఎ, ఎడిఇఎన్/బిఆర్/నార్త్/బిజడ్ఎ మరియు ఎడిఇఎన్/బిఆర్/సౌత్/బిజడ్ఎ యొక్క తనిఖీ కొరకు టాటా సుమో/క్వాలిస్/బొలెరో లేదా తత్సమాన రకం వంటి నాలుగు చక్రాలు (నాన్ ఎసి) ఎంయువి రోడ్డు వాహనం అద్దెకిచ్చుట. పూర్తిచేయు కాలం : 20 (ఇరవై) నెలలు, టెండరు విలువ: ₹ 7,20,000/-, ఇఎండి: ₹ 14,400/-. టెండరు డాక్యుమెంట్ ధర: ₹ 2,000/-, ముగింపు తేదీ: 22-02-2018.

క్ర.సం.4 టెండరు నెం. ఇ-01-నార్త్-2018. పని పేరు: విజయవాడ- విశాఖపట్నం సెక్షన్- అనకాపల్లి- ఎడిఇఎన్/తుని సబ్ డివిజన్ యొక్క ఎస్ఎస్ఇ/పి.వే/అనకాపల్లి సెక్షన్‌లో బ్రిడ్జిల కొరకు బల్లాస్ట్ రిటైనింగ్ వాల్స్ మరియు బల్లాస్ట్ రిటైనర్ల యొక్క ఏర్పాటు. పూర్తిచేయు కాలం : 06 (ఆరు)నెలలు, టెండరు విలువ: ₹ 28,64,984/-, ఇఎండి: ₹ 57,300/-. టెండరు డాక్యుమెంట్ ధర: ₹ 3,000/-, ముగింపు తేదీ: 22-02-2018.

ఏదేని టెండరు కొరకు ఏవేని మార్పులు /సవరణ గమనించుటకు టెండరు ముగింపు తేదీకి ముందు వరకు వెబ్‌సైట్ www.ireps.gov.in దర్శించవలసినదిగా బావి టెండరుదారులను కోరడమైనది.

డివిజనల్ రైల్వే మేనేజర్ (పనులు), విజయవాడ

ఇ- టెండరు ప్రకటన

PUB/0062/18

భారత రాష్ట్రపతి తరపున దిగువ సంతకందారు దిగువ పనుల కొరకు తేది:22-02-2018న 15.30గం.ల వరకు ఇ-టెండర్లు ఆహ్వానిస్తున్నారు.

క్ర.సం.1 : పని పేరు: టెండరు ప్రకటన నెం. & తేదీ: బి.ఎస్ మరియు టి-ఎం-ఇ3-ఓటి-2018-19, తేది: 12-01-2018. 1) డిఎస్‌టిఇ/బిజడ్ఎ సెక్షన్‌లో ఆర్ఇ నుండి క్వాడ్ కేబుల్‌నకు ఎగ్జిట్ నుండి ఎంట్రీ చివరి వరకు చేంజ్‌ఓవర్‌నకు 6 క్వాడ్ కేబుల్ ఏర్పాటు. 2) విజయవాడ డివిజన్‌లో సిగ్నల్ మరియు టెలికాం కేబుల్స్ కొరకు ఆర్‌సిసి కేబుల్ రూట్ మార్కర్స్ సరఫరా మరియు బిగించుట. సుమారు విలువ: ₹ 70,62,715/-, బయానా సొమ్ము ధరావతు : ₹ 1,41,260/- ఆన్ లైన్ చెల్లింపు విధానాల ద్వారా మాత్రమే, ఒక్కొక్క టెండరు పుస్తకం ధర: ₹ 5,000/- ఆన్ లైన్ చెల్లింపు విధానాల ద్వారా మాత్రమే, పూర్తిచేయు కాలం: ఎల్ఓఎ జారీ తేదీ నుండి 180 రోజులు.

క్ర.సం.2 :పని పేరు: టెండరు ప్రకటన నెం. & తేదీ: బి.ఎస్ మరియు టి-ఎం-ఇ4-ఓటి-2018-19, తేది: 12-01-2018. రాజమండ్రి: ఆర్‌జెవై మరియు జివిఎన్ స్టేషన్‌ల వద్ద యార్డ్ రీ-మోడలింగ్‌నకు సంబంధించి సిగ్నలింగ్ పనులు మరియు హాట్ స్టాండ్ బై ఆర్కిటెక్చర్‌తో పాడైపోయిన ఎలక్ట్రానిక్ ఇంటర్‌లాకింగ్ ఏర్పాటు. సుమారు విలువ: ₹ 7,52,47,146/-, బయానా సొమ్ము ధరావతు : ₹ 5,26,240/- ఆన్‌లైన్ చెల్లింపు విధానాల ద్వారా మాత్రమే, ఒక్కొక్క టెండరు పుస్తకం ధర: ₹ 10,000/- ఆన్‌లైన్ చెల్లింపు విధానాల ద్వారా మాత్రమే, పూర్తిచేయు కాలం: ఎల్ఓఎ జారీ తేదీ నుండి 365 రోజులు.

ముగింపు తేదీ మరియు సమయం: సమయం: 15.30గం.లు. తేది: 22-02-2018.

ఏవేని టెండరు కొరకు ఏవేని మార్పులు /సవరణ గమనించుటకు టెండరు ముగింపు తేదీకి ముందు వరకు వెబ్‌సైట్ www.ireps.gov.in దర్శించవలసినదిగా బావి టెండరుదారులను కోరడమైనది.

డివిజనల్ రైల్వే మేనేజర్ (ఎస్&టి), విజయవాడ

టెండరు ప్రకటన నెం.ఇ.29/సి/టిఆర్‌డి / 23/ 2017-18 తేది: 22.12.2017కు సవరణ-1 తేది:16-01-2018

PUB/0064/18

టెండరు ప్రకటన నెం. ఇ.29/సి/టిఆర్‌డి/23/2017-18: దక్షిణ మధ్య రైల్వే యొక్క సికింద్రాబాద్ డివిజన్‌పై బల్హార్ష మరియు కాజీపేట స్టేషన్ల మధ్య వివిధ ట్రాక్షన్ సబ్-స్టేషన్లు (టిఎస్ఎస్)/ సెక్షనింగ్ అండ్ పారలెలింగ్ పోస్టు (ఎస్‌పి) యొక్క ఫీడింగ్ పోస్టుల దగ్గర అసోసియేటెడ్ మాడిఫికేషన్‌సహా ప్రస్తుత ఓహెచ్ఇలో పిటిఎఫ్ఇ టైప్ న్యూట్రల్ సెక్షన్ అసెంబ్లీ యొక్క రూపకల్పన, సరఫరా, స్థాపించుట మరియు పనిచేయుంచుట.

పై డాక్యుమెంట్‌లో చేసిన మార్పులు దిగువ విధంగా ఉన్నవి.

అంచనా వ్యయం : ప్రచురించబడినవిధంగా : ₹ 2,76,84,374.00 దిగువ విధంగా చదువుకోవలెను: ₹ 3,65,04,378.00

ఇఎండి : ప్రచురించబడిన విధంగా : ₹ 2,88,430.00 దిగువ విధంగా చదువుకోవలెను: ₹ 3,32,530.00

అన్ని ఇతర షరతులు మరియు నిబంధనలలో ఎటువంటి మార్పు లేదు.

గమనిక:

1) అప్‌డేటెడ్ టెండర్ డాక్యుమెంట్‌ను సవరణ డాక్యుమెంట్ తేది: 16.01.2018 నుండి డౌన్‌లోడ్ చేసుకొనవచ్చును

2) టెండర్‌దారులు అప్‌డేటెడ్ / మాడిఫై టెండర్ డాక్యుమెంట్ నుండి మాత్రమే అంకెలు మరియు పదాలలో పర్సంటేజ్ రేట్లను కోడ్ చేయవలెను. లేని యెడల వారి ప్రతిపాదన పూర్తిగా తిరస్కరించబడును.

డిప్యూటీ చీఫ్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ నిర్మాణం/ఓహెచ్ఇ/ సికింద్రాబాద్

ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు ప్రకటన నెం.డబ్ల్యు.07./2018 తేది: 12.01.2018

PUB/0060/18

భారత రాష్ట్రపతి తరపున మరియు కొరకు దిగువ సంతకందారుచే ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా దక్షిణ మధ్య రైల్వే (ఓపెన్ లైన్)నకు దిగువ తెలిపిన ట్రాక్ మెటీరియల్ యొక్క తయారీ మరియు సరఫరా కొరకు దిగువ తెలిపిన టెండరును ఆహ్వానించుచున్నారు.

క్ర.సం.1 ఇ-టెండరు నెం. మరియు సంక్షిప్త వివరము & పరిమాణం: ఎస్‌సిఆర్‌ఓఎల్‌జిఆర్‌ఎస్‌పి521718 ఆర్‌డిఎస్ఓ డ్రాయింగ్ నెం.టి-3703 (ఆల్ట్.8)నకు 52 కె.జి. కొరకు హోర్బ్‌తో 6 మి.మీ. మందం గ్రూవ్డ్ రబ్బర్ సోల్ ప్లేట్ల యొక్క సేకరణ (పరిమాణం: 5,84,226 నెం.లు) అంచనా విలువ: ₹ 2,09,32,817.58/- బయానా సొమ్ము ధరావత్తు: ₹ 4,18,700/-. పూర్తి చేయు కాలం: 6 నెలలు, గడువు తేది & సమయం : 14.02.2018న 15.00 గం.ల వద్ద.

క్ర.సం.2 ఇ-టెండరు నెం. మరియు సంక్షిప్త వివరము & పరిమాణం: ఎస్‌సిఆర్‌ఓఎల్‌జెఎఫ్‌పి 60కెజి 1718 ఆర్‌డిఎస్ఓ డ్రాయింగ్ నెం.టి-5849 (ఆల్ట్-1)నకు 60 కె.జి. జాగల్డ్ ఫిష్ ప్లేట్ల యొక్క సేకరణ (పరిమాణం:7,250 సెట్లు) అంచనా విలువ: ₹ 4,54,57,065.00 బయానా సొమ్ము ధరావతు: ₹ 5,00,000/-. పూర్తి చేయు కాలం: 6 నెలలు, గడువు తేది & సమయం : 14.02.2018న 15.00 గం.ల వద్ద.

క్ర.సం.3 ఇ-టెండరు నెం. మరియు సంక్షిప్త వివరము & పరిమాణం: ఎస్‌సిఆర్‌ఓఎల్ ఎస్‌పిఎఫ్‌పి 60కెజి.17-18 ఆర్‌డిఎస్ఓ డ్రాయింగ్ నెం.టి-5843 (ఆల్ట్-1)నకు గ్లూడ్ జాయింట్ కొరకు 60 కె.జి. స్పెషల్ ఫిష్ ప్లేట్ల యొక్క సేకరణ (పరిమాణం: 6,022 నెం.లు) అంచనా విలువ: ₹ 2,11,30,836.68 బయానా సొమ్ము దరావత్తు: ₹ 4,23,000/-. పూర్తి చేయు కాలం: 6 నెలలు, గడువు తేది & సమయం : 14.02.2018న 15.00 గం.ల వద్ద.

క్ర.సం.4 ఇ-టెండరు నెం. మరియు సంక్షిప్త వివరము & పరిమాణం: ఎస్‌సిఆర్‌ఓఎల్ ఎస్‌పిఎఫ్‌పి 52కెజి. 2017-18 ఆర్‌డిఎస్ఓ డ్రాయింగ్ నెం.టి-5361 (ఆల్ట్.2)నకు గ్లూయిడ్ జాయింట్ కొరకు 52 కె.జి. స్పెషల్ ఫిష్ ప్లేట్ల యొక్క సేకరణ (పరిమాణం: 6,022 నెం.లు) అంచనా విలువ: ₹ 63,76,496.50/- బయానా సొమ్ము ధరావతు: ₹ 1,28,000/-. పూర్తి చేయు కాలం: 4 నెలలు, గడువు తేది & సమయం : 14.02.2018న 15.00 గం.ల వద్ద.

క్ర.సం.5 ఇ-టెండరు నెం. మరియు సంక్షిప్త వివరము & పరిమాణం: ఎస్‌సిఆర్‌ఓఎల్ బిఒఎల్‌టిఎస్2017-18 వివిధ సైజుల యొక్క బోల్టుల యొక్క వివిధ టైపుల యొక్క సేకరణ రైల్ స్క్రూలు. పరిమాణం: 12,604 నెం.లు, ఆర్‌డిఎస్ఓ డ్రాయింగ్ నెం.11504నకు ఎంఎస్ బోల్టులు (25x90 మి.మీ.) పరిమాణం: 1.808 మె.టలు, ఆర్‌డిఎస్ఓ డ్రాయింగ్ నెం.టి-11637నకు 18x90 మి.మీ. సైజ్ యొక్క స్ట్రెచ్చర్ బార్ బోల్టులు పరిమాణం: 0.80 మె.టలు, వివిధ సైజుల యొక్క మెరుగు పరచబడిన ఎస్.ఇ.జె. బోల్టులు పరిమాణం: 13.26 మె.టలు. అంచనా విలువ: ₹ 11,53,538.81, బయానా సొమ్ము ధరావతు: ₹ 23,100/-. పూర్తి చేయు కాలం: 4 నెలలు, గడువు తేది & సమయం : 14.02.2018న 15.00 గం. వద్ద.

గమనిక: నెట్ బ్యాంకింగ్, డెబిట్ కార్డ్, క్రెడిట్ కార్డ్ మొదలైనటువంటి పోర్టల్‌పై ఐఆర్ఇపిఎస్ పై అందుబాటులో గల ఆన్ లైన్ చెల్లింపు విధానాల ద్వారా మాత్రమే బయానా సొమ్ము నిమిత్తం ఇ-టెండరుకు బదులుగా చెల్లింపులు భారతీయ సంస్థలచే అనుమతించబడతాయి. డిమాండ్ డ్రాఫ్ట్, బ్యాంకర్స్ చెక్, గ్యారంటీ బాండ్లు మొదలైనటువంటి వాటి ద్వారా భారతీయ సంస్థలచే మాన్యువల్ చెల్లింపులు అనుమతించబడవు.

పై టెండరు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా పంపబడినది. పై టెండర్‌లో పాల్గొనుటకు ఆసక్తి గల టెండరుదారులు వెబ్ సైట్. www.ireps.gov.in దర్శించవలసినదిగా మరియు వారి ఆఫర్లను సమర్పించవలసినదిగా అభ్యర్థించడమైనది. స్వయంగా లేదా పేపర్ పై సమర్పించిన ఆఫర్లు అంగీకరించబడవని గమనించవలెను. పోస్టు ద్వారా పంపిన ఆఫర్లు కూడా అనుమతించబడవు. టెండరు ముగింపు సమయం టెండరు యొక్క గడువు తేదీన 15.00 గం.లుగా ఉంటుంది.

A0090 చీఫ్ ఇంజనీర్/ టిపి/ సికింద్రాబాద్

తదుపరి టెండరు షరతులు/వివరాల కొరకు మరియు టెండరు డాక్యుమెంట్ల డౌన్‌లోడింగ్ కొరకు దయచేసి వెబ్‌సైట్ www.ireps.gov.in లేదా http://www.scr.indianrailways.gov.in వద్ద దర్శించండి.

Dwaraka

Andhraprabha business 2018
బిజినెస్
BUSINESS

చమురు, సహజవాయువును
జీఎస్టీలోకి తెండి

• ప్రభుత్వానికి సీఐఐ విన్నపం

CII



న్యూఢిల్లీ : చమురు సహజవాయువును వస్తు సేవల పన్ను (జీఎస్టి) పరిధిలోకి వీలైనంత త్వరగా తేవాలని భారత పారిశ్రామిక సమాఖ్య (సీఐఐ) ప్రభుత్వాన్ని కోరింది. గతేడాది జులై 1, 2017 నుంచి కేంద్రప్రభుత్వం జీఎస్టిని అమల్లోకి తెచ్చింది. దీంతో కేంద్ర, రాష్ట్రపరిధిలోకి వచ్చే పరోక్ష పన్నులు అన్నీ మటుమాయం అయ్యి ఏకరూపు పన్ను వ్యవస్థ అమల్లోకి వచ్చింది. అయితే ముడిచమురు, సహజవాయువు, డిజిల్, పెట్రోల్, విమానాలకు వినియోగంచే ఇంధనం ఎటీఎఫ్‌లను మాత్రం జీఎస్టి పరిధి నుంచి మినహాయించారు.

పెట్రోలియం ఉత్పత్తులపై పన్ను ఎగవేయకుండా పైన తెలిపిన ఐదు ఉత్పత్తులపై సీ ఫాం వ్యవస్థను కొనసాగించాలని సీఐఐ ప్రభుత్వాన్ని కోరింది. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్రప్రభుత్వాల మధ్య ఉన్న అవగాహన ప్రకారం గతంలో ఉన్న వ్యాట్, సీఎస్‌టి నిబంధనలే ప్రస్తుతం ఈ ఐదు ఉత్పత్తులపై కొనసాగుతోంది. అయితే ఈ ఉత్పత్తులను జీఎస్టి పరిధి నుంచి తప్పించారు కాబట్టి జీఎస్టిపై వసూళ్లపై తీవ్ర ప్రభావం చూపుతాయని పేర్కొంది. ప్రస్తుతం చమురు సహజవాయువు ఉత్పత్తులు ఓఐడీఏ (ఆయిల్ డెవలప్‌మెంట్ యాక్ట్) సెస్, సెంట్రల్ సేల్స్ టాక్స్ యాక్ట్ స్టేట్ వ్యాల్యూ యాడెడ్ టాక్స్ పరిధిలోకి వస్తాయని సీఐఐ విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది.

గతంలోని సీఎస్‌టి చట్టం ప్రకారం కొనుగోలు దారుడు అంతరాష్ట్ర కొనుగోలు ప్రకారం నాన్ జీఎస్టి గూడ్స్ (జీఎస్టి) పరిధిలోని రాని వస్తువులు ... ఫామ్ -సీ ప్రకారం కన్సెషనల్ సెంట్రల్ సేల్స్ టాక్స్ రెండు శాతం చెల్లించి కొనుగోలు చేసుకునేవారు. దీన్ని అవకాశంగా తీసుకొని ఎరువుల తయారీ కంపెనీలు, విద్యుత్ ఉత్పత్తి కంపెనీలు, ఆటోమొబైల్ తయారీ కంపెనీలతో పాటు ఇతర పరిశ్రమలు సమజవాయయుతో పాటు ఇతర పెట్రోలియం ఉత్పత్తులు ఫామ్ సీ బదులుగా సీఎస్‌టి రెండు శాతం చెల్లించి తమ కావాల్సిన పెట్రోలియం ఉత్పత్తులను తెప్పించుకుంటున్నాయి.

అయితే జీఎస్టి అమల్లోకి వచ్చిన తర్వాత పెట్రోలియం ఉత్పత్తులు వాటిలో సహజవాయువును కూడా కలుపుకొంటే చెల్లించిన వ్యాట్‌పై క్రెడిట్ ఇవ్వడం లేదు. ఇంటర్‌స్టేట్ (అంతరాష్ట్ర)గా జరిగే పెట్రోలియం ఉత్పత్తులపై సీఎస్‌టి చట్టంలో మార్పులు చేయడమే దీనికి కారణం. దీని వల్ల జీఎస్టి అమల్లోకి వచ్చిన తర్వాత పెట్రోలియం ఉత్పత్తులపై పన్ను పెరిగింది. అయితే కేంద్ర ప్రభుత్వం ఉద్దేశం మాత్రం పన్ను పెంచాలనేది కాదని సీఐఐ పేర్కొంది.


కేంద్రప్రభుత్వం పన్ను సవరణ చట్టం 2017 ప్రకారం సీఎస్‌టి చట్టంలో 'గూడ్స్' సరుకు లేదా వస్తువు నిర్వచనాన్ని సవరించింది. వాటిలో ముడి చమురు, డిజిల్, పెట్రోల్, ఎటీఎఫ్)ల, సహజవాయువు, ఆల్కాహాల్ (మానవులు సేవించేందుకు) వినియోగించే వస్తువులపై నిర్వచనాన్ని మార్చింది.

దీన్ని కొన్ని రాష్ట్రాల వాణిజ్య పన్నుల శాఖలు తమకు అనుకూలంగా మార్చుకున్నాయి. సీ - ఫామ్‌కు వ్యతిరేకంగా ఇచ్చే రెండు శాతం కన్సెషన్‌ను వినియోగించుకుంటున్నాయి. పైన తెలిపిన వస్తువులు లేదా సరకును తిరిగి విక్రయించుకోవడానికి, లేదా తయారు చేసుకోవడానికి (అదే వస్తువు) ను... ఇతర వస్తువులకు వినియోగించరాదు. లేదా టెలికమ్యూనికేషన్, మైనింగ్ లేదా విద్యుత్ ఉత్పత్తికి వినియోగించరాదని సవరణలో ఉంది. దీని అర్థం ఏమిటంటే ఎరువులు కంపెనీలు సీ-ఫాం వినియోగించుకోవడానికి వీల్లేదు. ఎందుకంటే సహజవాయువు కేవలం యూరియా ఉత్పత్తి చేసే కంపెనీలకు మాత్రమే ఇవ్వాలి... మళ్లీ సహజ వాయువు ఉత్పత్తికి కాదు. అలాగే ఆటో మొబైల్ ఉత్పత్తి కంపెనీలు కూడా అంతరాష్ట్రంగా పెట్రోల్, డిజిల్ లేదా సహజవాయువు కొనుగోలుకు సీ ఫాం వినియోగించడానికి అర్హులు కారు.

కొత్త వాహనాలకు వారే సొంతంగా పెట్రోల్ లేదా డిజిల్ లేదా గ్యాస్ సమకూర్చుకోవాల్సి ఉంటుంది. దీంతో పాటు పర్చేజింగ్ డీలర్ అంతరాష్ట్రస్థాయిలో సరకు సప్లయ్ వ్యాపారంలో లేకపోతే.. (సీఎస్‌టి చట్టం సవరణ) ప్రకారం .. అలాంటి వారు రిజిస్ట్రేషన్ చేయించుకోవాల్సిన అవసరం లేదు.. వారికి ఫామ్ -సీ ఇవ్వాల్సిన అవసరం లేదని .. లేదంటే అదనపు పన్న భారం పడుతుందని సీఐఐ పేర్కొంది. జీఎస్టి అమ ల్లోకి వచ్చిన తర్వాత అంత రాష్ట్ర కొను గోళ్లకు ఫామ్ సీ లభించడం లేదని... దీంతో అదనపు పన్ను భారం వినియోగదారుడిపై పడుతోందని సీఐఐ తెలిపింది. వీటిని దృష్టిలో ఉంచుకొని పెట్రోలియం ఉత్పత్తులు, సహజవాయువు, విద్యుత్, ఆల్కాహాల్, రియల్‌ఎస్టేట్‌ను జీఎస్టి పరిధిలోకి తేవాలని సీఐఐ ప్రభుత్వానికి సూచిస్తోంది. పెట్రోలియం ఉత్పత్తులను జీఎస్టి పరిధిలోకి తెచ్చే వరకు సీ ఫామ్‌లను జారీ చేయాలని సీఐఐ కోరింది. వ్యాట్ విషయానికి వస్తే నాన్- క్రెడిటబుల్ టాక్స్ కాబట్టి వ్యాట్ రేటును నాలుగు శాతం లేదా అంత కంటే తక్కువ రేటుకు కుదించాలని ప్రభుత్వాన్ని సీఐఐ కోరింది.

రేపటి నుంచి జీఎస్టీ మండలి సమావేశం

70-80 వస్తువులపై పన్ను రేట్లలో కోత?



గురువారం నుంచి ప్రారంభం కానున్న జీఎస్టి మండలి సమావేశంలో పలు కీలకమైన మార్పులుచేర్పులు చోటుచేసుకోబోతున్నాయి. వాటిలో జీఎస్‌టి ఫైల్‌రిటర్న్స్ మరింత సులభతరం చేయడం, జీఎస్టి చట్టం, నిబంధనల్లో పలు సవరణలు చేయడంతో పాటు సుమారు 70 నుంచి 80 వసువులు లేదా సేవల పన్ను రేటుల్లో కోత విధించే అవకాశాలున్నాయి.

చిన్న మధ్య తరహా వ్యాపారులు సింగిల్ స్టేట్‌జీ రిటర్న్ ఫైలింగ్‌కు అనుమతించే అవకాశాలున్నాయి. మొత్తం మూడు కీలక రిటర్న్ ఫాంలు జీఎస్‌టిఆర్1(ఔట్‌వార్డ్ సప్లయి) జీఎస్‌టిఆర్2(ఇన్‌వార్డ్ సప్లయి), జీఎస్‌టిఆర్3(ది ఫైనల్ నెటెడ్ ఐట రిటర్న్)అన్నీ కలిసి సింగిల్ ఫాంగీ తీసుకొచ్చే అవకాశాలున్నాయని సీనియర్ ప్రభుత్వ అధికారి తెలియజేశారు. సింగిల్ ఫాం రిటర్న్స్ ఫైల్ చేస్తే ఏడాదికి 12 రిటర్న్స్ ఫైల్ చేయాల్సి ఉంటుంది. గతంలో వీటికి 37 రిటర్న్స్ ఫైల్ చేయాల్సివచ్చేది. గతేడాది జులై 1 నుంచి జీఎస్టి అమల్లోకి వచ్చిన తర్వాత పెద్దెత్తున కొత్తపరోక్ష వ్యవస్థపై (జీఎస్టి)పై పెద్దెత్తున విమర్శలు వచ్చాయి. రిటర్న్స్ ఫైలింగ్‌తో పాటు జీఎస్‌టి నెట్‌వర్క్ సరిగా పనిచేయకపోవడంతో వ్యాపారులు ఇబ్బందులు పడ్డారు. అటు తర్వాత ప్రభుత్వం కూడా మెత్తబడి వీలైనంత వరకు జీఎస్టి ఫైలింగ్‌ను సరళతరం చేస్తూపోయింది.

గురువారం నుంచి ఆర్థికమంత్రి అరుణ్‌జైట్లీ నేతృత్వంలో ప్రారంభం కాబోయే జీఎస్టి సమావేశంలో సుమారు 70-80 వస్తువులు లేదా సేవలు చౌక కాబోతున్నాయని విశ్వసనీయవర్గాల సమాచారం. ఉదాహరణకు ఎలక్ట్రిక్ వాహనాలు, వ్యవసాయ పనిముట్లు, హస్తకళలను తక్కువ పన్ను శ్లాబ్‌లోకి తెచ్చే అవకాశాలున్నాయని చెబుతున్నారు. చివరగా గత నవంబర్‌లో 200 వస్తువులపై పన్ను తగ్గించడంతో ప్రభుత్వానికి రూ.20వేల కోట్ల రెవెన్యూ తగ్గింది. ప్రభుత్వానికి రెవెన్యూ తగ్గితే ప్రభుత్వం వ్యయంపై కొంత సర్దుబాటు చేయాల్సి వస్తుందని డెలాయిట్ భాగస్వామి ప్రశాంత్ దేశ్‌పాండ్ అభిప్రాయపడ్డారు.

బోధ్‌ట్రీ కన్సెల్టింగ్‌కు రూ.50కోట్ల ఆర్డర్

హైదరాబాద్ : బోధ్‌ట్రీ కన్సెల్టింగ్ లిమిటెడ్ .. ఐటి కన్సెల్టింగ్ సాఫ్ట్‌వేర్ సర్వీసెస్ ప్రొవైడర్‌కు రూ.50 కోట్ల ఆర్డర్ లభించిందని మంగళవారం నాడు ఒక ప్రకటనలో పేర్కొంది. ఆర్డర్ల విషయానికి వస్తే ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ ఫారెస్ట్రీ రీసెర్చ్ అండ్ ఎడ్యూకేషన్ (ఐసీఎఫ్ఆర్ఈ) నుంచి రూ.8.39 కోట్ల ఆర్డర్‌దక్కించుకున్నట్లు కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది. మగధ్ యూనివర్శిటీ నుంచి రూ.43 కోట్ల ఆర్డరు లభించినట్లు, ప్రాజెక్టు విషయానికి వస్తే డిజిటల్ యూనివర్శిటీ ప్లాట్‌ఫాం కిందికి తీసుకువస్తామని... బీహార్‌లోనే అతి పురాతన విశ్వవిద్యాలయంలోసుమారు 5 లక్షల మంది విద్యార్థులు చదువుతుంటారని... సుమారు 100 కోర్సులుంటాయని ప్రకటనలో తెలిపింది.

Bodhtree

విద్యార్థులకు పరీక్షల నుంచి సర్టిఫికేట్లు, అడ్మిషన్ల వరకు అంతా డిజిటల్‌లోనే ఉంటుందని వివరించింది. గత 18 నెలల నుంచి కంపెనీ అతి పెద్ద మూడు ప్రాజెక్టులు రూ.200 కోట్ల వరకు దక్కించుకున్నట్లు బోధ్‌ట్రీ మేనేజింగ్ డైరెక్టర్ ఎల్ఎన్ రామకృష్ణ ప్రకటనలో తెలిపారు.

బ్రిటిష్ ఎయిర్‌వేస్ ఆఫర్లు

లండన్‌కు రూ.38,950


హైదరాబాద్ : కొత్త సంవత్సరాన్ని పురస్కరించుకుని బ్రిటిష్ ఎయిర్‌వేస్ భారత్‌లోని కస్టమర్లను దృష్టిలో ఉంచుకొని కొన్ని ఆఫర్లు ప్రకటించింది. భారత్ నుంచి లండన్, అమెరికా, కెనెడాలకు సెలవుల్లో గడపాలనుకునే వారికి ముందుస్తుగా ఫ్లెక్సిబుల్ రేట్లతో టిక్కెట్లను అందుబాటులోకి తెచ్చింది. రిటర్న్ టిక్కెట్లతో కలుపుకొని (ఎకనమీ)క్లాస్‌లో లండన్‌కు ప్రారంభం ధర రూ.38,950గా నిర్ణయించింది. బ్రిటిన్‌కు ప్రయాణించాలనుకునే వారికి ఇదే మంచి తరుణమని బ్రిటిష్ ఎయిర్‌వేస్ ఒక ప్రకటనలో పేర్కొంది. అమెరికా, కెనెడాలకు ప్రయాణించాలనుకునే వారికి అన్నీ పన్నులతో కలుపుకొని న్యూయార్క్‌కుకు ప్రారంభం ధర రూ.72,040, ఈ ఆఫర్ జనవరి 16 నుంచి జనవరి 31 అర్థరాత్రి వరకు ఉంటుంది. ప్రయాణతేదీలను దేశంలోని ఐదు నగరాల నుంచి జనవరి 16 నుంచి డిసెంబర్ 31, 2018 మధ్యలో ఉండేలా చూసుకోవచ్చునని తెలిపింది.

మన్నాఫుడ్స్‌లో మోర్గాన్ స్టాన్లీ పెట్టుబడి

హైదరాబాద్, ఆంధ్రప్రభ : మోర్గాన్ స్టాన్లీ ప్రైవేట్ ఈక్విటీ ఆసియా నిర్వహణలోని ఫండ్ సహజసిద్ధ ఆహార ఉత్పత్తుల బ్రాండ్ నేచురల్ హెల్త్ ఫుడ్ ప్రాడక్ట్స్ 'మన్నా ఫుడ్స్' తయారీదారు సదరన్ హెల్త్ ఫుడ్స్‌లో రూ.152 కోట్ల మేర పెట్టుబడి పెట్టింది. మన్నాఫుడ్స్ వేడిపాలతో వెంటనే సిద్ధం చేసుకోగల, సాంప్రదాయంగా ఇంట్లోనే చేసుకునే 'సత్‌మవ్వ'ను అభివృద్ధి చేస్తూ, తృణ, చిరు, పప్పుధాన్యాల మిశ్రమంగా మన్నా హెల్త్‌మిక్స్‌ను తన ప్రముఖ ఉత్పత్తిగా అందిస్తోంది. తన ప్రధానమైన ఉత్పత్తితోపాటు ఇంకా రెడీ టు కుక్ - మిల్లెట్ బేస్డ్ ఇన్‌ఫాంట్ ఫుడ్, మిల్లెట్ గ్రెయిన్స్, సోయా నగ్గెట్స్, డ్రైడ్ ఫ్రూట్స్, ప్యూరీస్, పేస్ట్ తదితర హెల్త్ ఫుడ్ ప్రాడక్టులను కూడా ఈ సంస్థ అందిస్తోంది. దక్షిణ భారతదేశంలో అనేక కుటుంబాల నమ్మకాన్ని చూరగొన్న బ్రాండ్లలో మన్నా ఒకటిగా నిలిచిందని కంపెనీ ప్రమోటర్ నాజర్ చెప్పారు. నిల్వ పదార్థాలు వినియోగించకుండా సహజమైన, సాంప్రదాయమైన ఆహార శ్రేణిని తమ సంస్థ అందిస్తుందని ఆయన చెప్పారు. మోర్గాన్ స్టాన్లీతో భాగస్వామ్యమయ్యాక ఎఫ్‌సీజీ విభాగంలో మన్నా కంపెనీ స్థానం మరింత బలోపేతమవుతుందని ఫల్‌క్రమ్ పార్ట్‌నర్ ఏతాన్ ఖాత్రి అన్నారు.

ఎగుమతుల్లో 12.3% వృద్ధి

• దిగుమతుల్లో 21శాతం • వాణిజ్యలోటు మూడేళ్ల గరిష్ఠానికి



న్యూఢిల్లీ : సంవత్సరం ప్రాతిపదికన చూస్తే ఎగుమతులు డిసెంబర్‌లో 12.63 శాతం పెరిగి 27.03 బిలియన్ డాలర్లకు ఎగబాకగా.. క్రితం ఏడాది నవంబర్లో 26.19 బిలియన్ డాలర్లు. అంతకు ముందు నెల 23 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. అయితే ఏప్రిల్ నుంచి డిసెంబర్ నెల వరకు చూస్తే ఎగుమతులు మొత్తం 223.5 బిలయన్‌డాలర్లకు చేరాయి. క్రితం ఏడాది ఇదేకాలంలో ఎగుమతులు 199.5 బిలియన్ డాలర్లని వాణిజ్య పరిశ్రమల మంత్రిత్వశాఖ విడుదల చేసిన గణాంకాలను బట్టి తెలుస్తోంది. ఆగస్టు 2016 నుంచి డిసెంబర్ 2017 వరకు ఎగుమతులు గణనీయంగా పెరిగాయని తెలిపింది. కాగా అక్టోబర్ 2017లో ఎగుమతులు 1.1 శాతం తగ్గాయని వాణిజ్యమంత్రిత్వశాఖ ఒక ప్రకటనలో వివరించింది. వివరాల్లోకి వెళితే ఇంజినీరింగ్ ఉత్పత్తులు 25.3 శాతం పెరిగి 7.3 బిలియన్ డాలర్లకు, పెట్రోలియం ఉత్పత్తలులు 25.15 శాతం పెరిగి 3.6 బిలియన్ డాలర్లకు.. జేమ్స్, జువెలరీ 2.4 శాతం పెరిగి 3.2 బిలియన్ డాలర్లకు ఎగబాకాయి. రసాయనాలు 31.36 శాతం పెరిగి 1.9బిలియన్ డాలర్లు, ఔషధాలు ఫార్మా ఉత్పత్తులు 6.95 శాతం పెరిగి 1.7 బిలియన్ డాలర్లకు చేరాయి. గత నెలలో మొత్తం 30 ఉత్పత్తుల్లో 21 ఉత్పత్తులు బాగా పెరిగాయి. రెడీమెడ్ దుస్తులు ఎగుమతులు 8 శాతం క్షీణించి 1.33 బిలియన్ డాలర్లకు.. దీంతో పాటు ఖనిజాల ఎగుమతులు తగ్గముఖం పట్టాయి. డాలర్ మారకంతో రూపాయి పుంజుకోవడంతో పోటీ ఇవ్వలేకపోయినట్లు ఫెడరేషన్ ఆఫ్ ఇండియాన్ ఎక్స్‌పోర్ట్ ఆర్గనైజేషన్ ప్రెసిడెంట్ జీకె గుప్తా ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరం మొదటి తొమ్మిది నెలల కాలానికి ఎగుమతులు 224 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయని.. మొత్తానికి ఈ 2018లో కూడా ఎగుమతులు మెరుగ్గానే ఉంటాయని తెలిపింది. 2017-18 ఆర్థిక సంవత్సరానికి ఎగుమతులు 300 బిలియన్ డాలర్ల మార్కును దాటుతాయని గుప్తా భరోసాను వ్యక్తం చేశారు.

దురదృష్టవశాత్తు దిగుమతులు మాత్రం జోరందుకున్నాయి. ముఖ్యంగా ముడిచమురు, బంగారం గత నెలలో 42 బిలియన్ డాలర్లకు చేరాయి.. డిసెంబర్ 2016లో పోల్చుకుంటే 21శాతం పెరిగాయి. దిగుమతులు భారీగా పెరిగిపోవడంతో వాణిజ్యలోటు 14.8 బిలియన్ డాలర్లకు చేరింది. సంవత్సరం ప్రాతిపదికన చూస్తే వాణిజ్యలోటు 41 శాతం పెరిగింది. ఇటీవల కాలంలో ముడి చమురు ధరలు భారీగా పెరగడంతో ద్రవ్యలోటు పెరిగిపోయింది. గతనెలలో భారీగా పెరిగిన దిగుమతుల విషయానికి వస్తే ఎలక్ట్రానిక్ వస్తువులు 19.2 శాతంతో 4.6 బిలియన్ డాలర్లు, ముత్యాలు 94 శాతం పెరిగి 3.4 బిలియన్ డాలర్లకు చేరాయి. బంగారం 71.5 శాతం పెరిగి 3.4 బిలియన్ డాలర్లకు చేరిందని వాణిజ్యమంత్రిత్వశాఖ విడుదల చేసిన గణాంకాలను బట్టి తెలుస్తోంది. జీఎస్టి అమల్లోకి వచ్చిన తర్వాత వరుసగా మూడు నెలల పాటు దిగుమతులు తగ్గుముఖం పట్టాయి. అటు తర్వాత పండుగ సీజన్ మొదలు కావడంతో వ్యాపారులు కొత్తగా సరుకును నిల్వ ఉంచుకోవడంతో బంగారానికి డిమాండ్ పెరిగిందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. మొత్తానికి చూస్తే ద్రవ్యలోటు విపరీతంగా పెరిగిపోవడం ఆందోళన కలిగించే అంశమని గుప్తా అన్నారు.

ఎన్‌పీసీఐ ఎండీగా దిలిప్ ఆస్బే

హైదరాబాద్, ఆంధ్రప్రభ : నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పిసిఐ) మేనేజింగ్ డైరెక్టర్‌గా దిలీప్ ఆస్బే నియమితులయ్యారు. ఈ నియామకం వెంటనే అమల్లోకి వస్తుందని ఆ కంపెనీ తెలిపింది. 2009లో ఏర్పాటైన ఎన్‌పిసిఐ దేశంలోని సెంట్రల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్టులకు రిటైల్ పేమెంట్ సిస్టమ్స్ అందిస్తోంది.

గోద్రెజ్ ఎడ్జ్ డ్యూ రిఫ్రిజిరేటర్

హైదరాబాద్ : గోద్రెజ్ అప్లియెన్సెస్ తాజాగా సరికొత్త రిఫ్రిజిరేటర్ గోద్రెజ్ ఎడ్జ్ డ్యూను ఆవిష్కరించింది. ఈ సింగిల్‌డోర్ రిఫ్రిజిరేటర్‌లో ప్రత్యేకంగా కూరగాయల కోసం డ్రాను ఏర్పాటు చేసింది. దేశంలో రిఫ్రిజిరేటర్లు వినియోగించే వారిలో 80శాతం మంది సింగిల్ డోర్ రిఫ్రిజిరేటర్లను వినియోగిస్తున్నారని, రోజు సరాసరి పది సార్లు డోర్ తెరుస్తారని, దీంతో కూరగయాల విభాగం లోనే 40 శాతం వరకు వారి వాడుతుంటారని కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది. రిఫ్రిజిరేటర్ డోర్‌ను తరచూ తెరిచినా ఎలాంటి ఇబ్బందులు లేకుండా సాంకేతికంగా పలు మార్పులు చేసినట్లు గోద్రెజ్ ఎడ్జి డ్యూ ప్రాడక్టు హెడ్ అనుప్ భార్గవ తెలిపారు.

జోరుకు బ్రేకు



ముంబై : వరుసగా మూడు రోజుల పాటు లాభాలతో దూసుకుపోయిన స్టాక్ మార్కెట్లు మంగళవారంనాడు నష్టాల తో ముగిశాయి. బీఎస్ఈ 72 పాయింట్లు ష్టపోయి 34,771.05 వద్ద, నిఫ్టీ 41.10 పాయింట్లు క్షీణించి 10,700.45 వద్ద ముగి సింది. ఈ ఏడాది ఐటి రంగం గాడినపడుతుందని మోర్గా న్ స్టాన్లీ నివేదికతో ఐటి రంగానికి చెందిన షేర్లు జోరందుకున్నాయి. డిసెంబర్ నెల వాణిజ్యలోటు 14.88 బిలియన్ డాలర్ల కు చేరడంతో సెంటిమెంట్ బలహీనపడింది. గత మూడు ట్రేడింగ్ సెషన్‌లలో సూచి 410.44 పాయింట్ల పెరిగింది ఆల్‌టైం రికార్డు 34,843.51 పాయింట్లకు ఎగబాకింది. ఇదిలా ఉండగా సోమవారం నాడు దేశీయ సంస్థాగత మదుపరులు రూ.173.28 కోట్ల షేర్లు విక్రయిస్తే, విదేశీ సంస్థాగత మదుపరులు రూ.32.92 కోట్ల షేర్లు కొనుగోలు చేశారు. బీఎస్ఈలో అత్యధికంగా నష్టపోయిన షేర్లలో కోల్ ఇండియా 4.57 శాతం, రిలయన్స్ ఇండస్ట్రీస్ 2.54శాతంగా నమోద య్యాయి. నష్టపోయిన షేర్లలో టాటామోటార్స్, టాటాస్టీల్, ఐటీసీ లిమిటెడ్, ఎస్‌బీఐ, పవర్‌గ్రిడ్, భారతి ఎయిర్‌టెల్, ఎంఅండ్ఎం ఏషియన్‌పెయిం ట్స్, హెచ్‌డీఎఫ్‌సీ లిమిటెడ్, హీరోమోటోకార్ప్, కొటక్ బ్యాంకు, ఇండస్ ఇండ్ బ్యాంకు, ఎస్‌బ్యాంకు, యాక్సిస్‌బ్యాంకు, మారుతి సుజుకి, బజాజ్‌ఆటోలు 2.30 శాతం వరకు నష్టోపోయిన వాటిలో ఉన్నాయి. దీనికి వ్యతిరేకంగా ఐటి షేర్లు విప్రో, ఇన్ఫోసిస్, టీసీఎస్‌లు 4.88 శాతం వరకు లాభపడ్డాయి.

ఆన్‌లైన్‌లో పతంజలి ఉత్పత్తులు

• ఈ ఏడాది వ్యాపార లక్ష్యం రూ.1,000 కోట్లు • అమెజాన్, ఫ్లిప్‌కార్ట్‌తో భాగస్వామ్యం



న్యూఢిల్లీ: బాబా రాందేవ్‌కు చెందిన పతంజలి ఆయుర్వేద... తమ ఎఫ్ఎంసీజీ ఉత్పత్తులను ఈ-కామర్స్ ద్వారా విక్రయాలు జరుపనున్నట్లు మంగళవారం నాడు ప్రకటించింది. ఈ - కామర్స్ దిగ్గజాలు ఫ్లిప్‌కార్ట్, అమెజా న్‌లతో భాగస్వామ్యం చేపడుతున్నట్లు తెలిపింది. ఈ ఏడాది ఈ కామర్స్ ద్వారా రూ.1,000 కోట్ల రెవెన్యూ సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది. మొత్తం ఎనిమిది ఆన్‌లైన్ కంపెనీలతో ఒప్పందాలు కుదర్చుకున్నట్లు పేర్కొంది. వాటిలో గ్రోఫర్స్, షాప్‌క్లూస్, బిగ్‌బాస్కెట్, 1ఎంజీ, పెటీయంమాల్స్, నెట్‌మెడ్స్‌లలో పతంజలికి చెందిన అన్నీ ప్రాడక్టులను అందుబాటు లో ఉంచుతుంది. వీటితో పాటు కొత్త ప్రాడక్టులను కూడా విస్తరించనున్నామని వాటిలో బాటిల్ వాటర్ 'దివ్యజల్' దస్తులు, ఫుట్‌వేర్‌లను 'పారిధన్'పేరుతో ఆన్‌లైన్‌లో విక్రయిస్తున్నట్లు తెలిపింది. సంప్రదాయ మార్కెట్‌కు భిన్నంగా ఇంట్లోనే కూర్చుని సౌకర్యవంతంగా తమ కావాల్సిన ఉత్పత్తులను తెప్పించుకోవచ్చునని రాందేవ్ బాబా అన్నారు.

ఆన్‌లైన్‌తోపాటు రిటైల్ నెట్‌వర్కును మరింత విస్తరించనున్నామని.. గ్రామీణ ప్రాంతాల వినియోగ దారులను దృష్టిలో ఉంచుకొని మరిన్ని కొత్త ప్రాడక్టులను పరిచయం చేయనున్నామని, ప్రత్యేకంగా 5,000 స్టోర్‌లున్నాయని.. వాటిని మరింత పెంచుతామన్నారు. దీంతో పాటు జనవరి 26 నుంచి కొత్త లాయల్టీ కార్డు స్వదేశీ సమృద్ధి ని ప్రారంభిస్తున్నామన్నారు. కొత్త లాయల్టీ ప్రోగ్రాం ద్వారా సుమారు 5 లక్షల మందిని స్వదేశీ సమృద్ధిలోకి తీసుకువస్తామన్నారు. ఈ కార్డు హోల్డర్లు చనిపోతే లేదా వికలాంగులైతే వారికి బీమా ఆఫర్ చేస్తామన్నారు. తమ ప్రాడక్టులు సుమారు 15 నుంచి 20 లక్షల కిరాణా స్టోర్‌లలో విక్రయిస్తు న్నామని, 75 శాతం మార్కెట్‌ను ఇంకా కవర్ చేయాల్సి ఉందన్నారు. ఈ ఏడాది తమ ఉత్పత్తులు 50 లక్షల కిరాణా దుకాణాలకు చేరే విధంగా ప్రణాళికలు రూపుదిద్దుతున్నామన్నారు. ముఖ్యంగా గ్రామీణ మార్కెట్లపై దృష్టి పెడుతున్నట్లు ఆయన పేర్కొన్నారు. వ్యాపారం విస్తరణతో పాటు మానవ వనరులను కూడా పెంచుకుంటామన్నారు. కొత్తగా 20వేల మందిని రిక్రూట్ చేసుకుంటామని, వారిలో సేల్స్‌మేనేజర్స్ నుంచి జోనల్ మేనేజర్స్, రీజినల్ మేనేజర్స్ వరకు ఉంటారని రాందేవ్ అన్నారు. దీంతో పాటు ఉత్పత్తిని కూడా పెంచుకుంటామన్నారు. ప్రస్తుతం ఏడాదికి రూ.50వేల కోట్ల విలువ చేసే ఉత్పత్తులను ఉత్పత్తి చేస్తున్నామన్నారు. హరిద్వారా, తేజ్‌పూర్, అస్సాంలతో పాటు నోయిడా, నాగపూర్; ఇండోర్ లలో కూడా ఉత్పత్తి పూర్తి స్థాయిలో జోరందు కున్నాయని రాందేవ్ బాబా వివరించారు. నాగపూర్ యూనిట్ ప్రారంభమైన వెంటనే ఎగుమతులు మొదలుపెడతామన్నారు. పతంజలి తమ ఉత్పత్తులను యూఏఈ, యూఎస్, కెనెబా, యూరోప్, దక్షిణి అమెరికా, ఆఫ్రికాతో పాటు ఇతర దేశాలకు ఎగుమతుల చేయాలనుకుంటోంది.

ఢిల్లీ ఆటో ఎక్స్‌పో 2018

• కొత్తగా 24వాహనాల ఆవిష్కరణ
• ఫిబ్రవరి 8-11వరకు ఆటో షో




న్యూఢిల్లీ : ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి జరిగే ఆటోఎక్స్‌పో వచ్చే నెల 9-14 వరకు జరుగుతుంది. గ్రేటర్ నోయిడాలో జరిగే ఈ 14 షోలో మొత్తం 24 ఆవిష్కరణలతో పాటు 100 వాహనాల ఆవిష్కరణ జరుగుతుందని నిర్వాహకులు ఇండియన్ ఆటోమొబైల్ మాన్యు ఫ్యాక్చరర్స్ అసోసియేషన్ (సియామ్) చీఫ్ సుగాతోసేన్ మంగళ వారం నాడు వెల్లడించారు. 2016 ఎడిషన్ తో పోల్చుకుంటే ఈ ఏడాది కొత్త ఆవిష్కరణలు ఎక్కువగా ఉంటాయన్నారు.

వాటిలో ప్యాసింజర్ కార్లతో పాటు వాణిజ్య వాహనాలు, ద్విచక్ర వాహనాలు కూడా ఉంటాయని ఆయన పేర్కొన్నారు. ఫిబ్రవరి 7-8 తేదీల్లో సుమారు 100 ప్రాడక్టుల కంటే ఎక్కువ వాహనాల ప్రివ్యూ ఉంటుందని సియామ్ ట్రేడ్ పెయిర్ చైర్మన్ అరుణ్ మల్హోత్రా చెప్పారు. కాగా ఈ షోను సియామ్‌తో పాటు ఆటోమొటివ్ కాంపోనెంట్ మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఏసీఎంఏ), కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఇండస్ట్రీ (సీఐఐ)లుకలిసి నిర్వహిస్తున్నాయి. ఈ ఆటోషోలో నిస్సాన్, ఆడి, ఫోక్స్‌వ్యాగెన్, స్కోడా, ఫోర్డ్, డుకాటిలు ఈ మెగాషోలో పాల్గొన డం లేదని ఆయన దృష్టికి తేగా.. సేన్ స్పందిస్తూ.. సియామ్ సభ్యుల్లో 50 శాతం మంది సాధారణంగా హాజర వుతుంటాయని ఆయన అన్నారు. ఈ షోకు పెద్దెత్తున రుసుము వసూలు చేస్తున్నారన్న వాదనను ఆయన కొట్టిపారేశారు. కొత్త వారు ఉదాహరణకు కొరి యాకు చెందిన కియా మోటార్స్, జపాన్‌కు చెంది కావాసాకిలు ఈ షోలు పాల్గొంటున్నాయి. ప్రస్తుతం ఆటో మార్కెట్లో పలు ఇబ్బందులు తలెత్తున్నాయని.. వాటిలో ప్రధానంగా చెప్పుకోవాలంటే బీఎస్ -4 ప్రమాణాలనుంచి బీఎస్ -6 ప్రమాణాలను మారుతున్నామనివచ్చే రెండేళ్లలో ఎలక్ట్రిక్ వాహనాలకు మారిపోతున్నామని ఆయన వివరించారు. కొన్ని కంపెనీలు కూడా కొత్త వాహనాలను ఇక్కడ ప్రదర్శనకు తేవడం లేదన్నారు. అలాగే 2012 నుంచి ఇక్కడ షోలకు వసూలు చేసే అద్దెల్లో ఎలాంటి మార్పుల్లేవన్నారు. ఒక విధంగా చెప్పాలంటే డిస్కంట్లను ఆఫర్ చేస్తున్నామన్నారు. సియామ్ సభ్యులకు చదరపు మీటరుకు రూ.8,900 నుంచి రూ.8,200కు స్థలాన్ని ఆఫర్ చేస్తున్నామన్నారు.

స్వర్ణచతుర్భుజికి మోక్షం

• నాలుగు మెట్రో కారిడార్లకు బడ్జెట్లో ఆమోదం • మెట్రోనగరాల్లో తగ్గనున్న ప్రయాణ సమయం • రైల్వే వర్గాల సమాచారం



న్యూఢిల్లీ : వచ్చే బడ్జెట్‌లో ప్రధానంగా నాలుగు రైలు కారిడార్‌లకు అనుమతులు లభించే అవకాశం కనిపిస్తోంది. ఈ అనుమతులు లభిస్తే ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వర్ణచతుర్భుజి ప్రాజెక్టులు పూర్తి అవుతాయి. ఈ స్వర్ణ చతుర్భుతి నాలుగు మెట్రో నగరాలను కలుపుతుంది. అవి ఢిల్లీ, ముంబై, చెన్నై, కోలకతాలు. ఇవి హైస్పీడ్ నెట్‌వర్క్ పరిధిలోకి వస్తాయని అధికారులు మంగళవారం నాడు తెలిపారు. స్వర్ణచతుర్భుజిలో రెండు కారిడార్లు.. ఢిల్లీ - ముంబై, ఢిల్లీ- హౌరాలున్నాయి. ఈ ప్రాజెక్టుపై గత కేంద్రబడ్జెట్‌లో వరుసగా రూ.11,189 కోట్లు, రూ.6,875 కోట్లు కేటాయించారు. మిగిలిన నాలుగు కారిడార్‌లు.. ఢిల్లీ - చెన్నై, చెన్నై - హౌరా, చెన్నై - ముంబై, హౌరా - ముంబై కారిడార్ లను కనెక్ట్ చేయాల్సి ఉంటుంది. ఈ కారిడార్‌లో రైళ్లు గంటకు 160 కిలోమీటర్ల నుంచి 200 కిలోమీటర్ల వేగంతో పరుగులు తీస్తాయి. ఈ కారిడార్‌లు పూర్తి చేయడానికి ప్రభుత్వం సుమారు రూ.40వేల కోట్లు కేటాయించాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు. హైస్పీడ్ స్వర్ణచతుర్భిని ఆగస్టు 15, 2022 నాటికి పూర్తి చేయాల్సి ఉంటుంది. అదే సమయానికి దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు పూర్తవుతుంది కూడా. ఈ మొత్తం నాలుగు కారిడార్‌లు అమల్లోకి వస్తే రైలు ప్రయాణం ఈ నాలుగు మెట్రోనగరాలకు ప్రస్తుతం ఉన్న ప్రయాణం సమయాన్ని 50 శాతం తగ్గించుకోవచ్చునని అధికారులు తెలియజేశారు. ఉదాహరణకు ప్రస్తుతం కోలకతా - ముంబై మధ్య రైలు ప్రయాణం 26 గంటల నుంచి 40 గంటల సమయం పడుతోంది. దురంతో ఎక్స్‌ప్రెస్ విషయానికి వస్తే కోలకతా నుంచి చత్రపతి శివాజీ టెర్మినస్‌కు 26 గంటల సమయం పడుతుంది. అదే లోక్‌మాన్య తిలక్ టెర్మినస్ (కుర్లా)కు 30 గంటల సమయం పడుతుంది. అదే సెమీ హైస్పీడ్ రైళ్లు అమల్లోకి వస్తే ప్రయాణం సమయం 10 -16 గంటల తగ్గుతుంది.

ఇదిగిదిగో సామాన్యుడి బడ్జెట్

ఇలా ఉంటే... సూపర్ హిట్

నోట్లరద్దు నుంచి ఉపశమనం ఉండాలి

ఆశల పల్లకిలో మధ్య తరగతి..

బడ్జెట్‌లో ఎన్నికల తాయిలాలు




న్యూఢిల్లీ: రానున్న బడ్జెట్ పన్నులను నేల మీదకు దించుతుందా? మరికొద్ది వారాల్లో పార్లమెంట్‌లో ఆర్థిక బిల్లు ప్రవేశపెడతారనగా భారతీయుల నోళ్ళలో నానుతున్న ప్రశ్న ఇది. పన్నుతో మమేకమైపోయిన దేశం మనదే. కానీ యావత్ భారత జనాభాలో కేవలం 3 శాతం అంటే 4.1 కోట్ల మంది భారతీయులు మాత్రమే ఆదాయ పన్ను పత్రాలు దాఖలు చేశారంటే ముక్కున వేలు ఉంచుకోవాల్సిందే మరి. అంతేకాక ప్రతి ఇద్దరిలో ఒకరు పన్ను భారం లేని ఆదాయాన్ని చూపుతూ పత్రాలు దాఖలు చేశారు. అయినప్పటికీ బడ్జెట్ అంటే కేవలం వ్యక్తిగత పన్ను వడ్డింపు అన్న తీరుగా పన్ను స్లాబులు, కోతలు, మినహాయింపులు లాంటి బడ్జెట్ ప్రతిపాదనలను భారతీయులు అత్యంత నిశితంగా గమనిస్తుంటారు.

గత బడ్జెట్‌కు ముందు నోట్ల రద్దు దేశ ప్రజలపై పిడుగుపాటులా పడింది. దాన్నుంచి బైటపడ్డానికి కేంద్ర ఆర్థిక మంత్రి మధ్యతరగతి వర్గానికి ఏదైనా కీలకమైన పన్ను ఊరటను ఇస్తారమోనని ప్రతి ఒక్కరూ ఆశగా ఎదురు చూశారు. వారి ఆశను నిరాశ చేయని రీతిలో పన్ను చెల్లింపుదారులపై పడే సగటు పన్నుభారాన్ని తగ్గించే విధంగా బడ్జెట్ వచ్చింది. కానీ అదే సమయంలో కొన్ని ప్రయోజనాలను కంటి ముందు లేకుండా చేసింది. స్వంత ఇంటిని అద్దెకు ఇచ్చినవారికి దిగ్భ్రాంతి కలిగిస్తున్నట్టుగా గృహరుణం వడ్డీకోతపై పరిమితి విధించబడింది.

ఈ ఏడాది బడ్జెట్‌పై అంచనాలు ఆకాశనందుకున్నాయి. ఎందుకంటే ఈ ఏడాది ఎనిమిది రాష్ట్రాలకు అసెంబ్లీ ఎన్నికలు జరగబోతున్నాయి. వచ్చే ఏడాది మరో మూడు రాష్ట్రాలు ఎన్నికలకు సై అంటున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఒక ప్రజాకర్షక బడ్జెట్‌ను తెస్తుందనే ఆందోళనలో ఆర్థికవేత్తలు ఉన్నారు. ఆర్థిక మంత్రి, ఆయన బృందం బడ్జెట్‌ను వండి వడ్డించడానికి సన్నాహాలు చేసుకుంటున్న తరుణంలో సామాన్యులకు మేలు చేకూర్చేలా మంత్రివర్యులకు కొన్ని సూచనలు.

విద్యా రుణంపై కాలపరిమితి పెంపు



సెక్షన్ 80ఇ కింద విద్యా రుణంపై ఒక అర్హుడైన రుణ గ్రహీత చెల్లించే వడ్డీని పన్ను తీసివేతగా క్లెయిమ్ చేసుకోవచ్చు. కానీ ఈ ప్రయోజనం గరిష్టంగా ఎనిమిది సంవత్సరాలు మాత్రమే ఉంటుంది. 2006లో ఈ తీసివేతను ప్రవేశపెట్టినప్పుడు నాలుగేళ్ళ ఇంజినీరింగ్ కోర్సుకు ఖర్చు దాదాపు రూ. 3 నుంచి రూ. 4 లక్షల మధ్య, మెడికల్ డిగ్రీకి ఖర్చు దాదాపు రూ. 5 నుంచి రూ. 6 లక్షల మధ్య ఉండేది. ఆ తర్వాతికాలంలో ఉన్నత విద్యకు అయ్యే ఖర్చు గణనీయంగా పెరిగింది. నేడు ఇంజినీరింగ్ కోర్సు పూర్తి చేయడానికి రూ. 8 నుంచి రూ. 9 లక్షలు, మెడికల్ డిగ్రీకి ఎంతలేదన్నా రూ.12 నుంచి రూ.14 లక్షలు అవుతున్నది. ప్రస్తుతం విద్యా రుణాలపై వడ్డీ రేట్లు 10.5శాతం నుంచి 13.5శాతం మధ్య ఉంటున్నాయి. వడ్డీ రేటు 11.5శాతం ఉందనుకుంటే ఎనిమిదేళ్ళకు రూ. 25 లక్షలపై ఇఎంఐ దాదాపు రూ. 40,000 ఉంటుంది. ఆ లెక్కన సగటు రుణగ్రహీత రుణం చెల్లింపు కాలాన్ని ఎనిమిదేళ్లకు మించి పొడిగించాలనుకుంటారు. ఆ క్రమంలో గృహ రుణం తరహాలో పన్ను తీసివేత కూడా రుణంపై పూర్తి కాల చెల్లింపునకు వర్తించాలి. ఇది ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే భారతీయ యువతకు ఊతమిస్తుంది.

వేతన జీవులకు ప్రామాణిక పన్ను తీసివేత



గత బడ్జెట్ల తరహాలో కార్పొరేట్ పన్నుల రేట్ల తగ్గింపు ప్రణాళికలు ఉన్నాయనే సంకేతాలను ఆర్థిక మంత్రి ఇచ్చారు. అదే సమయంలో ఆయన వ్యక్తిగత పన్ను రేట్ల తగ్గింపు లేదా స్లాబ్ పరిమితుల పెంపును సైతం పరిగణనలోకి తీసుకోవాలి. ఇతరులు ఖర్చులు మినహాయించుకొని పన్నులు చెల్లిస్తుంటే వేతనజీవులకు మాత్రం స్థూల స్థాయి వద్ద పన్ను చెల్లించాల్సిన పరిస్థితి. ఇది ఒక అసంబద్ధమైన విధానం. దీన్ని పరిష్కరించడానికి ప్రామాణిక పన్ను తీసివేతను తిరిగి తీసుకురావడమే ఏకైకమార్గం. ఒకనిర్దిష్టమైన ప్రామాణిక తీసివేత శాతాన్ని వేతనజీవులకు నిర్ధారించాలి. తద్వారా వేతనజీవులు, ఇతర పన్నుల చెల్లింపుదారులకు మధ్య సమన్యాయం పాటించాలి.

ఈక్విటీలపై దీర్ఘకాలిక మూలధన రాబడి పన్ను ప్రయోజనం యథాతథం

కొందరు వ్యక్తులు మరీ ముఖ్యంగా స్టాక్ బ్రోకర్లు సెక్యూరిటీలపై లావాదేవీల పన్ను(ఎస్‌టిటి) కుదింపు అదేక్రమంలో ఈక్విటీల నుంచి దీర్ఘకాలిక మూల ధన రాబడులకు పన్ను రహిత స్థితిని తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు. ఎస్‌టిటిలో కుదింపును స్వాగతించాల్సిందే కానీ దీర్ఘకాలిక మూల ధన రాబడులకు పన్ను రహిత స్థితితో దానిని ముడిపెట్టాల్సిన అవసరం లేదు.



డివిడెండ్ డిస్ట్రిబ్యూషన్ పన్ను రద్దు

ఇది కంపెనీలను డివిడెండ్లు చెల్లించకుండా చేస్తున్నది. దాంతో పెట్టుబడిదారులకు నమ్మకం సడలిపోతున్నది. ఇన్వెస్టర్ సెంటిమెంట్ మెరుగుదల దిశగా డివిడెండ్ డిస్ట్రిబ్యూషన్ పన్నును రద్దు చేయాలి.

స్వయం ఉపాధి పొందుతున్న వారిపై పన్ను తీసివేత పరిమితి పెంపు



సెక్షన్ 80సిసిడి(1) కింద స్వయం ఉపాధి పొందుతూ ఎన్‌పీఎస్ కలిగి ఉన్న పన్ను చెల్లింపుదారులకు పన్ను తీసివేతపై పరిమితి ఉంది. వేతనజీవులు, స్వయం ఉపాధి పొందుతున్న వారి మధ్య సమన్యాయం పాటించేలా 2017 బడ్జెట్ స్థూల ఆదాయంపై పరిమితిని 10శాతం నుంచి 20శాతం పెంచింది. అయితే స్వయం ఉపాధి పొందుతున్న పన్ను చెల్లింపుదారులకు సెక్షన్ 80సిసిఇ కింద నికర పన్ను తీసివేత పరిమితి రూ. 1.5 లక్షల కిందకు ఇది వస్తుంది. మరోవైపు ఒక ఉద్యోగి నికర పరిమితిలో సెక్షన్ 80సిసిడి(1) కింద తన ఆదాయానికి 10శాతం వరకు తీసివేతను క్లెయిమ్ చేసుకోవచ్చు. అలాగే ఎలాంటి నికర పరిమితి లేకుండా సెక్షన్ 80సిసిడి(2) కింద వేతనంపై 10శాతం వరకు యజమాని భాగస్వామ్యం రూపేణా మరింత తీసివేతను క్లెయిమ్ చేసుకోవచ్చు. ఈ వ్యత్యాసాన్ని భర్తీ చేయడానికి వేతన జీవులకు దక్కుతున్న ప్రయోజనాలకు దీటుగా స్వయం ఉపాధి పొందుతున్న పన్నుచెల్లింపుదారులకు నికర పరిమితిని పెంచాలి.

ఆర్ఈఐటీలకు ఎల్‌టీసీజీ హోల్డింగ్ పీరియడ్ తగ్గింపు



రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్ట్‌లు(ఆర్ఈఐటీలు)పెట్టుబడి దారులకు సరికొత్త ఆస్తి తరగతిని ఇవ్వడానికి తోడు ప్రస్తుతం ఉన్న పెట్టుబడిదారులు, డెవలపర్లకు విశ్వసనీయమైన నిష్క్రమణ మార్గాన్ని చూపించడం ద్వారా రియల్ ఎస్టేట్ లోతుపాతులను వృద్ధి చేస్తుంది. ఈ నేపథ్యంలో బడ్జెట్ ఆర్ఐటీలకు దీర్ఘకాలిక మూలధన రాబడుల హోల్డింగ్ పీరియడ్‌ను మూడు సంవత్సరాల నుంచి ఒక ఏడాదికి తగ్గించాల్సిన అవసరం ఉంది. ఇది ఈక్విటీ పెట్టుబడులకు దీటుగా పెట్టుబడులను తీసుకువచ్చే అవకాశాన్ని అందిస్తుంది. ఆర్ఐయిటీలకు పెట్టుబడులకు మరింత అనుకూలమైనవిగా మారుస్తుంది.

బీమా ఉత్పత్తులపై జీఎస్టీ తగ్గింపు



వస్తు సేవల పన్ను(జీఎస్టీ) సంక్లిష్టమైన పన్ను ఛత్రాన్ని సరళీకతం చేసింది. ఉత్పత్తులు, సేవలపై పన్ను రేట్లు తగ్గించింది. చివరి వినియోగదారునికి భారాన్ని తగ్గించింది. అయితే దీని వల్ల ఆర్థిక సేవలపై మొదట్లో 15శాతంగా ఉన్న పన్ను 18శాతంకి పెరిగింది. దీంతో బీమా ఉత్పత్తులు ఖరీదైన వ్యవహారంగా మారిపోయాయి. ఇతర దేశాలతో పోలిస్తే మన దేశంలో జీవిత బీమా వృద్ధి రేటు 3 నుంచి 4 శాతమే ఉంది. ఒక వ్యక్తి లేదా కుటుంబానికి ఆర్థిక భద్రతను అందించే మొదటి మెట్టు జీవిత బీమా. ఇంతటి కీలకమైన బీమాను అందరికీ అందుబాటులో తేవడానికి బీమా ఉత్పత్తులపై జీఎస్టీని తగ్గించాల్సిన అవసరం ఉంది.

బహుమతులు, విరాళాలుగా సెక్యూరిటీలు



లిస్టయిన స్టాకులు, మ్యూచువల్ ఫండ్లు లాంటి సెక్యూరిటీలను ఎలాంటి పన్నులు లేకుండా విరాళాలు, బహుమతులుగా మార్చుకునేందుకు అనుమతించేలా పన్ను చట్టాలను మార్చాల్సిన అవసరం ఉంది. వాస్తవిక బదలీ చేపట్టే తేదీకి సెక్యూరిటీల మార్కెట్ విలువకు తగ్గట్టుగా బహుమతి లేదా విరాళం విలువను లెక్కగట్టాలి. ఇది దాత లేదా బహుమతికి రెండు లాభాలను తెచ్చిపెడుతుంది. వాటిలో మొదటిది సెక్యూరిటీలపై మూలధన రాబడుల పన్ను నుంచి మినహాయింపు కాగా రెండవది వారి ఆదాయంపై వచ్చే మొత్తంపై పన్ను తీసివేత.

ప్రతి ఒక్కరికీ వ్యక్తిగత రిటైర్‌మెంట్ ఖాతా



సెక్షన్ 80సీ కింద ప్రస్తుత మినహాయింపులను పొందడంలో అనేక పథకాలు, సెక్షన్లపై అదేపనిగా దృష్టిపెట్టాల్సిన పని పెట్టుబడిదారులకు లేకుండా చేయడానికి ప్రభుత్వం విడిగా ఒక వ్యక్తిగత రిటైర్‌మెంట్ ఖాతాను(ఐఆర్ఎ) ప్రవేశపెట్టాలి. ఐఆర్ఎకు కేటాయించిన దానిలో కొంతమొత్తంపై పన్ను లేకుండా చేయాలి. 20 నుంచి 30 సంవత్సరాల పాటు సదరు మొత్తాన్ని విత్ డ్రా చేయకుండా లాక్ పీరియడ్ విధించాలి.

ఎల్‌టీసీజీకి హోల్డింగ్ పీరియడ్ తగ్గింపు



డెట్ ఫండ్లలో పెట్టుబడి పెట్టేలా రిటైల్ ఇన్వెస్టర్లను ప్రోత్సహించేలా, వేర్వేరు ఆస్తి తరగతులకు హోల్డింగ్ పీరియడ్‌ను ప్రామాణికం చేసేందుకు దీర్ఘకాలిక మూలధన రాబడులకు (ఎల్‌టీసీజీ) కనీస హోల్డింగ్ పీరియడ్‌ను 36 నెలల నుంచి 12 నెలలకు తగ్గించాలి.

షేర్లకు పన్ను మినహాయింపుపై స్పష్టత



షేర్ల కేటాయింపు లేదా బదలీపై ఎంప్లాయీ స్టాక్ ఆప్షన్ ప్లాన్లకు(ఇఎస్‌వోపి) పన్ను వర్తిస్తుంది. ఎస్‌టిటి చెల్లింపు జరపకుండా 2004, అక్టోబర్ ఒకటవ తేదీ తర్వాత కొనుగోలు చేసిన ఈక్విటీ షేర్ల విక్రయానికి నిర్దేశిత పన్ను మినహాయింపు వర్తించదని గత బడ్జెట్ ప్రతిపాదించింది. తదనంతర నోటిఫికేషన్లు ఇఎస్‌వోపి, తదితర ఎంప్లాయీ స్టాక్ పర్చేస్ పథకాలకు కొంత మినహాయింపు ఇచ్చాయి. కానీ తర్వాతి కాలంలో లిస్ట్ కావడానికి అవకాశం ఉన్న కంపెనీలకు ఈ మినహాయింపు వర్తిస్తుందా లేదా స్పష్టం కాలేదు. వచ్చే బడ్జెట్ దీన్ని స్పష్టం చేయాలి.

మెడికల్ అలవెన్సులకు పన్ను రహిత పరిమితి పెంపు



అనారోగ్యకరమైన ఆహారపుటలవాట్లు, జీవనశైలి కారణంగా భారతదేశంలో వ్యాధులు అంతకంతకూ పెరిగిపోతున్నాయి. పరిస్థితిని మరింత దిగజారుస్తున్నట్టుగా వైద్య ద్రవ్యోల్బణం నిలకడగా పెరిగిపోతున్నది. ప్రస్తుతం అది సాలుకు 18 నుంచి 20శాతం నమోదు చేసుకుంటున్నది. దాంతో సగటు కుటుంబానికి ఏడాదికి రూ.15,000గా ఉన్న మెడికల్ అలవెన్సు పరిమితిని వైద్య ఖర్చులు అధిగమిస్తున్నాయి. పన్ను రహిత పరిమితిని పెంచిన పక్షంలో కంపెనీలు సైతం అలవెన్సును పెంచడానికి ముందుకు వస్తాయి.

ఆటోమేటిగ్గా ట్యాక్స్ రిటర్న్ ఫైలింగ్



పన్ను చెల్లింపుదారులు రిటర్న్ దాఖలు చేయడానికి ఆన్‌లైన్ పోర్టల్స్‌ను వినియోగిస్తున్న సంగతి తెలిసిందే. కానీ ప్రతి సారి వారు నిర్దేశిత దరఖాస్తు పత్రాన్ని నింపాల్సి వస్తోంది. ప్రభుత్వం అలా కాకుండా పన్ను చెల్లింపుదారులు ఆధార్, పాన్‌కు అనుసంధానంగా జరిపిన ఆర్థిక లావాదేవీలు ప్రాతిపదికగా వారి ఫామ్ 26ఎఎస్‌లో సమాచారంతో ప్రీ పాపులేటెడ్ ట్యాక్స్ ఫామ్‌ను పన్ను చెల్లింపుదారులకు పంపే చొరవ తీసుకోవాలి.

పన్ను పొదుపు ఉత్పత్తులపై ఏకీకృత హోల్డింగ్ పీరియడ్




పన్ను పొదుపు ఉత్పత్తులకు సంబంధించి ఒక్కోదానికి ఒక లాక్ పీరియడ్ ఉంది. ఉదాహరణకు ఈఎల్ఎస్ఎస్‌కు మూడేళ్ళు ఉంటే అదే ఈక్విటీ పెట్టుబడులపై దీర్ఘకాలిక మూలధన రాబడుల పన్ను లబ్ధి పొందడానికి ఏడాది పడుతుంది. డెట్ ఇన్వెస్ట్‌మెంట్లకు మూడు సంవత్సరాలు పడుతుంది. బ్యాంక్ ఫిక్స్‌డ్ డిపాజిట్లకు ఐదు సంవత్సరాలు ఉంటే ఈపీఎఫ్, పీపీఎఫ్ పెట్టుబడులకు అది వేర్వేరుగా ఉంటుంది. పెట్టుబడులు నికర కాలం ప్రాతిపదికగా పన్ను పొదుపు ఉత్పత్తులకు హోల్డింగ్ పీరియడ్‌ను ఏకీకృతం చేయాలి.

ఎన్నారైలకూ మినహాయింపులు


దేశంలో ఉంటున్న బంధువులకు వైద్య ఖర్చులు భరించే ఎన్నారైలకు సెక్షన్ 80డిడి కింద భారతీయుల తరహాలో ఎలాంటి మినహాయింపు లభించడం లేదు. రానున్న బడ్జెట్ ఈ అసమానతను తొలగించాలి. ఎన్నారైలకు ఎన్ను మినహాయింపును వర్తింపజేయాలి.

రియల్ ఎస్టేట్ ధరలు తగ్గించాలి



అందరికీ ఇల్లు కోసం ప్రభుత్వం ఇప్పటికే అనేక చర్యలు తీసుకుంది. అయితే రియల్ ఎస్టేట్ ధరలు చుక్కలను అంటుతున్న కారణంగా సొంత ఇల్లు అందరికీ అందుబాటులోకి రావడంలేదు. బడ్జెట్‌లో విధానపరంగా కొన్ని కఠినమైన చర్యలు తీసుకోవడం ద్వారా ప్రాపర్టీ ధరలను హేతుబద్ధీకరించవచ్చు. అన్ని కోణాల్లో భవన నిర్మాణం పూర్తయిన తర్వాత కూడా కూడా ఇన్వెంటరీ నిలుపుదల చేసినందుకు, ఆక్యుపేషన్ సర్టిఫికేట్ పొందడానికి 10శాతం పన్నును బడ్జెట్‌లో ప్రవేశపెట్టాలి. దీనివల్ల ప్రాజెక్టులను పూర్తిచేయడంలో ఇన్వెంటరీని బిల్డర్లు తగ్గించుకుంటారు. సరఫరా పెరుగుదలతో ధరలు తగ్గుముఖం పడతాయి.

ఇంటి బీమా తప్పనిసరి.. ప్రీమియంపై పన్ను తీసివేత



ముంబై, చెన్నై లాంటి మహానగరాలను ముంచెత్తిన వరద బీభత్సం భారతీయుల స్మృతిపథం నుంచి ఇంకా చెరిగిపోలేదు. ఇలాంటి విపత్తుల నుంచి ఆర్థిక ఊరట కల్పించడంలో ఒక ఇంటి బీమా పాలసీ ఎటంతగానో ఉపకరిస్తుంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఇంటి బీమాను అనివార్యం చేయాలి. అదే సమయంలో ప్రీమియంపై పన్ను కోత విధించాలి. ఇది ఖాతాదారులకు ఆర్థిక నష్టం నుంచి భద్రతను కల్పించడమే కాక దేశంలో బీమా పథకాల వృద్ధిరేటుకు ఉపకరిస్తుంది.

రిస్క్ తక్కువుండే హైబ్రీడ్ ఫండ్లు



ఇటీవల దాకా అనేక మంది ఇన్వెస్టర్లు సెక్షన్ 80సీ కింద పన్ను ప్రయోజనాల కోసం ఎఫ్‌డీలలో పెట్టుబడులు పెట్టేవారు. కానీ వడ్డీ రేట్లు పడిపోతున్న కారణంగా తక్కువ రిస్క్, మంచి రిటర్న్‌లు, అదే రకమైన పన్ను ప్రయోజనాలు ఇచ్చే ప్రత్యామ్నాయాల కోసం ప్రస్తుతం వెదుకుతున్నారు. సంప్రదాయ లేదా తొలిసారి పెట్టుబడి పెట్టేవారికి హైబ్రీడ్ ఫండ్లు ఉత్తమ ప్రత్యామ్నాయంగా చెప్పుకోవచ్చు. మార్కెట్లలో ఉత్థానపతనాలను తట్టుకుంటూ ఈక్విటీల్లో పెట్టుబడి ద్వారా మంచి రిటర్న్‌లు ఇచ్చేలా హైబ్రీడ్ ఫండ్లకు రూపకల్పన చేశారు. కనుక ఈఎల్ఎస్ఎస్ తరహాలో మూడేళ్ళ లాక్ పీరియడ్‌తో హైబ్రీడ్ ఫండ్లకు సైతం పన్ను మినహాయింపు ప్రయోజనాన్ని వర్తింపజేయాలి.

బంగారంపై దిగుమతి సుంకం దిగిరావాలి



బంగారానికి 3శాతం ప్రత్యేక జీఎస్టీ స్లాబును వర్తింపజేశారు. అయితే స్వర్ణంపై అత్యధికంగా 10శాతం కస్టమ్స్ సుంకం కారణంగా మార్కెట్ కళ తప్పుతున్నది. విస్తృతమైన ఆర్థిక సంస్కరణలు విజయవంతం కావడానికి, బంగారం ఆర్థిక భాగస్వామ్యాన్ని పైకి తీసుకురావడానికి స్వర్ణ లోహాన్ని మరీ భారమైన సుంకాల్లేకుండా మార్కెట్లోకి తీసుకురావాలి. కస్టమ్స్ సుంకంపై తగిన కోతతో స్వర్ణంపై అన్నిరకాల పన్నును హేతుబద్ధీకరించాలి.

పింఛను ప్లాన్లు సడలించాలి



ఆర్బీఐ నివేదిక ప్రకారం 65 సంవత్సరాలు పైబడినవారిలో కేవలం కొద్దిమంది మాత్రమే ప్రైవేటు పింఛను ప్లాన్లలో పొదుపు చేసుకున్నారు. పన్ను పరిధిలోకి పింఛను ప్లాన్లు రావడం. పింఛను రాబడిని కదిలించకుండా ఉంచితే దానిలో 66శాతం పన్ను పరిధిలోకి వస్తుంది. కనుక నియమాలను సడలించడం ద్వారా పింఛను ప్లాన్లలో పెట్టుబడులు పెట్టేలా ప్రజలను ప్రోత్సహించాలి.


పక్కా టర్మ్ ప్లాన్లకు విడిగా పన్ను తీసివేత

ప్రస్తుతం సెక్షన్ 80సీ బుట్ట రకరకాల పథకాలతో కిటకిట లాడిపోతున్నది. దీనికి విరుగుడుగా జీవిత బీమా ప్లాన్లకు విడిగా ఒక పన్ను తీసివేత పరిమితిని బీమా పరిశ్రమ అదేపనిగా అడుగుతూ వస్తున్నది. ఇది వీలు కాని పక్షంలో పక్కా ప్రొటెక్షన్ ప్లాన్లకు విడిగా ఒక తీసివేత ఉండాలి. భారతదేశంలో పన్ను ప్రయోజనాలు ఆర్థిక నిర్ణయాలకు చోదకంగా వ్యవహరిస్తుంటాయి.

ప్రాపర్టీపై పన్ను తగ్గింపు

రియల్ ఎస్టేట్ రంగంలో విక్రయాలకు సంబంధించి జీఎస్టీ రేటు 12శాతంగా ఉంది. జీఎస్టీకి ముందు సేవా పన్ను దాదాపు 4.5శాతం, విలువ ఆధారిత పన్ను 1శాతం కలుపుకొని మొత్తంగా పన్ను 5.5శాతం ఉండేది. ఆ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వాలు స్టాంప్ డ్యూటీ రద్దు చేయాలి లేకుంటే జీఎస్టీ రేట్లతో దీటుగా దాన్ని సవరించాలి.

సీనియర్ సిటిజన్లకు పన్ను ఉపశమనం



పడిపోయిన వడ్డీ రేట్లు సీనియర్ సిటిజన్లను ఎంతగానో గాయపరిచాయి. వారికి ఊరటనిస్తున్నట్టుగా రూ. 10 లక్షల వరకు వార్షిక ఆదాయం ఉన్న సీనియర్ సిటిజన్లకు ఫిక్స్‌డ్ ఇన్‌కమ్ ఇన్‌స్ట్రుమెంట్లకు వడ్డీపై రూ. 75,000 తీసివేతను ఇవ్వాలి. దీనికి తోడు క్రమం తప్పకుండా జరిపే వైద్య ఖర్చుల కోసం రూ. 50,000 తీసివేతను సైతం అనుమతించాలి.

కేంద్రీకృత కేవైసీగా ఆధార్ అనుసంధానం



రకరకాల కేవీసీ(నో యువర్ కస్టమర్) ప్రక్రియలను పాటించడం ఒక్క పెట్టుబడిదారులకు మాత్రమే కాదు ఆర్థిక సేవలందించే కంపెనీలకు సైతం తీవ్రమైన తలపోటుగా మారింది. బ్యాంక్ ఖాతాలు ఇప్పటికే ఖాతాదారుని పాన్‌కు అనుసంధానమైంది. త్వరలో ఆధార్‌కూ అనుసంధానమవుతుంది. ఇది ఆటోమాటిగ్గా పెట్టుబడిదారు గుర్తింపును తనిఖీ చేస్తుంది. కనుక ఆధార్ అనుసంధానాన్ని కేంద్రీకృత కేవైసీ పరిగణించాలి. పెట్టుబడిదారు అదేపనిగా వేర్వేరు కేవైసీ ప్రక్రియలకు గురికాకుండా చూడాలి.

Dwaraka

ఆంధ్రప్రభ

బుధవారం 17 జనవరి 2018

పశువుల వ్యర్థాలతో సేంద్రీయ ఎరువులు

● 460 గ్రామాల్లో విజయవంతంగా అమలు ● నెలకు ఒక్కో ఆవు నుంచి సగటున రూ. 2500 ఆదాయం



అమరావతి, ఆంధ్రప్రభ: పశువుల పాలకు ఎంత గిరాకీ ఉందో మనకు తెలుసు. అలాంటిది పశువుల నుంచి వచ్చే వ్యర్థాలైన మూత్రం, పేడలకు కూడా మార్కెట్లో డిమాండ్ బాగా పెరుగుతోంది. ఇప్పటికే పలు రకాలైన ఔషధ, సౌందర్య ఉత్పత్తుల తయారీ కంపెనీలు ఆవు పేడ, మూత్రాన్ని ఆయా ఉత్పత్తుల తయారీలో వినియోగిస్తున్నారు. ఆవు పేడతో తయారు చేసిన పిడకలను ఇప్పటికే పలు పట్టణాల్లో ఆన్‌లైన్‌లో విక్రయిస్తున్నారు. పేడ నుంచి తయారు అయిన సేంద్రీయ ఎరువులకు కూడా మార్కెట్లో డిమాండ్ ఉంది. ఆవు మూత్రాన్ని కొంత శుద్ధి చేసి సీసాలో పెట్టి విక్రయిస్తున్నారు. మన దేశంలో ఆవుకు ఎంతో పవిత్రత ఉంది. అలాంటి ఆవు మూత్రాన్ని కొన్ని దోషాలను నివారించుకోవడానికి ఇళ్లలో చల్లుకుంటారు. ఇప్పుడు ఇదే విధంగా దానిని ఆదాయ మార్గం గా రైతులు మర్చుకునే విధంగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇప్పటికే రాష్ట్రంలోని కొన్ని గ్రామాల్లో పశువుల నుంచి వచ్చే సేంద్రీయ ఎరువులను తయారు చేసి ఆర్గానిక్ పంటలకు వినియోగిస్తున్నారు. పంటల ఎదుగుదలకు ఆవు పేడ ఎంతో తోడ్పడుతుంది. ప్రధానంగా గిర్ జాతికి చెందిన ఆవు నుంచి లభించే పేడ, మూత్రానికి మార్కెట్ లో ఎంతో డిమాండ్ ఉంది. రానున్న రోజుల్లో పశువుల ఉన్న డిమాండ్‌ని పాలిన చూస్తే వ్యర్థాల ద్వారా వచ్చే ఆదాయం ఎంతో అధికంగా ఉంటుందని పశుసంవర్ధక శాఖ అధికారులు చెబుతున్నారు. పశువుల పాల నుంచి కాకుండా అవిరిచిపడేసే వ్యర్థాల నుంచి సేంద్రీయ ఎరువులు తయారు చేయడం ద్వారా మంచి ఆదాయాన్ని ఆర్జించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇప్పటికే పలు విధాలుగా గ్రామంలోని రైతులకు ఆదాయ మార్గాలను చూపుతున్న ప్రభుత్వం రైతులు రాబడి సాధించే విధంగా ప్రభుత్వం దృష్టిసారించింది. ఇప్పటికే ఈ పథకంపై పలు అధ్యయనాలు కూడా చేపట్టింది. ఈ ప్రాజెక్టును విజయవంతంగా ముందుకు తీసుకువెళ్లే విధంగా ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. ఒక్కో పశువు వ్యర్థాల నుంచి నెలకు రూ.2,500 వరకు ఆదాయం వచ్చే విధంగా చర్యలు చేపడుతున్నారు. ప్రతి గ్రామం నుంచి సంవత్సరానికి రూ.25 లక్షల నుంచి 50 లక్షల వరకు ఆదాయం వచ్చేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. ఇప్పటికే ఈ కార్యక్రమం ద్వారా ప్రకాశం జిల్లాలోని కొంకణి గ్రామంలో మంచి ఫలితాలు రావడంతో ప్రభుత్వం దీనిపై దృష్టి పెట్టింది. పశువుల వ్యర్థాల నుంచి సంపదను సంపాదించిన కొంకణి గ్రామాన్ని ఆదర్శంగా తీసుకుని రాష్ట్రంలోని ఇతర గ్రామాలలోని రైతులు కూడా సంపదను సృష్టించుకోవాలని ముఖ్యమంత్రి సూచించారు. ఒక గ్రామంలో ఉత్పత్తి అయిన పశువుల మల, మూత్రాలను ఒక ప్రదేశంలో నిల్వ ఉంచి, తరువాత దానిని సేంద్రీయ ఎరువుగా మారుస్తారు. రాష్ట్రంలోని 460 గ్రామాలలో దీనిని అమలు చేసే విధంగా పశుసంవర్ధక శాఖ చర్యలు తీసుకుంటుంది. వాతావరణంలో వచ్చే మార్పులకనుకులంగా పశు జాతులకు అభివృద్ధి చేయడంతో పాటు సరైన వాతావరణం వాటికి కల్పించే విధంగా ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకువెళ్తున్నారు. ప్రతి గ్రామంలోని పశువులను ఇప్పటికే జియో ట్యాగ్ చేయడం ద్వారా వాటి ఆరోగ్య పరిస్థితులను, కదలికలను ఎప్పటికప్పుడు గమనిస్తున్నారు. ఇప్పటికే దీనిని ప్రస్తుతంలోని మూడు జిల్లాలో ముందుకు తీసుకు వెళ్లే విధంగా పశుసంవర్ధక శాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. రాష్ట్రంలోని అనంతపురం, చిత్తూరు, విజయనగరం జిల్లాలను ఎంపిక చేశారు. ఒక్కొక జిల్లా నుంచి రెండు గ్రామాల చొప్పున తీసుకోనున్నారు. కోస్తా ప్రాంతం నుంచి మూడు, ఉప్పు ప్రాంతం నుంచి మూడు గ్రామాలలో చొప్పున మొత్తం రాష్ట్ర వ్యాప్తంగా ఆరు గ్రామాలలో ఈ కార్యక్రమం పై అధ్యయనం చేయనున్నారు. ఆయా ప్రాంతాలలో అధ్యయనం చేసే మార్కెటింగ్ పరిస్థితులను పరిశీలించనున్నారు.

మైనారిటీ విద్యకు ప్రభుత్వ 'ఉపకారం'

● ఇంటర్ నుంచి పీహెచ్‌డీ వరకు ఉపకార వేతనాలు ● గత మూడేళ్లలో రూ. 601.91 కోట్ల పంపిణీ ● ఈ ఏడాది లక్ష్యం రూ. 285 కోట్లు



(ఫైల్ ఫోటో)

అమరావతి, ఆంధ్రప్రభ: నేటి వేగవంతమైన ప్రపంచంలో మెరుగైన జీవితం కోసం ఉద్యోగ, ఉపాధి అవకాశాలను పొందాలంటే నాణ్యమైన విద్యతో పాటు మంచి నైపుణ్యాలు తప్పనిసరి. ఈ విషయాన్ని గ్రహించిన చంద్రబాబు ప్రభుత్వం అవకాశాలను అంది పుచ్చుకోవడంలో వెనుకబాటుతనం అనుభవిస్తున్న రాష్ట్రంలోని మైనారిటీలకు నాణ్యమైన విద్యను అందుబాటులోకి తీసుకువచ్చే దిశగా చర్యలు చేపట్టింది. విద్యతోనే వెనుకబడ్డ ముడిపడి ఉన్న నేపథ్యంలో మైనారిటీ విద్యార్థులకు ఉన్నత విద్యలను సైతం ఆర్థిక భారం లేకుండా అభ్యసించేందుకు ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంటు రూపంలో ఆర్థిక సహాయాన్ని చంద్రబాబు సర్కార్ అందిస్తోంది. పునర్విభజన తరువాత ఏర్పడిన నవ్యాంధ్రప్రదేశ్‌లో మైనారిటీలు పరిగణించబడుతున్న ముస్లింలు 36.18 లక్షలు, క్రైస్తవులు 6.83 లక్షలు, సిక్కులు 0.10 లక్షలు, బుద్ధులు, 0.04 లక్షలు, జైనులు 0.27 లక్షలు, పార్శీలు 0.04 లక్షలు కలిపి మొత్తంగా 43.46 లక్షల మంది ఉన్నారు. వీరిని ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చేసేందుకు పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న టీడీపీ ప్రభుత్వం 2017-18 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.840.25 కోట్ల భారీ బడ్జెట్‌ను కేటాయించడం జరిగింది. ముఖ్యమంత్రి చంద్రబాబు మైనారిటీ సంక్షేమ శాఖను స్వయంగా పర్యవేక్షిస్తున్న నేపథ్యంలో మైనారిటీల విద్యకు అధిక ప్రాధాన్యతను ఇస్తూ గత మూడేళ్లలో స్కాలర్‌షిప్స్ రూపంలో రూ.601.91 కోట్లను పంపిణీ చేసింది.

ప్రతి నెల ఎంటీఎఫ్, మూడు నెలలకు ఒకసారి ఆర్‌టీఫ్ పంపిణీ..

ఇంటర్ నుంచి పీహెచ్‌డీ వరకు అర్హులైన మైనారిటీ విద్యార్థులకు ప్రతి నెల మెయింటెనెన్స్ ఫీజు, మూడు నెలలకు ఒకసారి రీయింబర్స్‌మెంట్ ఆఫ్ ట్యూషన్ ఫీజును చంద్రబాబు సర్కార్ అందిస్తోంది. తల్లిదండ్రుల వార్షిక ఆదాయం గ్రామీణ ప్రాంతాల్లో రూ.1.50 లక్షలు, పట్టణ ప్రాంతాల్లో రూ.2 లక్షలు గల విద్యార్థులు ప్రభుత్వం నుండి ఉపకార వేతనాలను పొందేందుకు అర్హులు. ప్రొఫెషనల్ కోర్సుల విషయంలో మాత్రం కన్వీనర్ కోటాలో ఏ కేటగిరీ సీట్లను పొందిన వారికి మాత్రమే స్కాలర్‌షిప్స్, ఫీజు రీయింబర్స్‌మెంటును అందించడం జరుగుతుంది. గతంలో ఈపాస్ విధానంలో ఉంటే ఉపకార వేతనాల మంజూరీ ప్రక్రియ ఈ ఏడాది నుంచి ప్రభుత్వం పోర్టల్‌కు అనుసంధానం చేయడం జరిగింది. గతంలో స్కాలర్‌షిప్స్ కోసం విద్యార్థులే స్వయంగా అర్హత ధృవపత్రాలతో నేరుగా ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకునే విధానం ఉండేది. కానీ జ్ఞానభూమి పోర్టల్‌తో అనుసంధానం చేసిన తరువాత మైనారిటీ విద్యార్థి అడ్మిషన్ సమయంలోనే స్కాలర్‌షిప్స్, ఫీజురీయంబర్స్‌మెంటుకు అర్హత పొందేలా ఆయా కళాశాల యాజమాన్యాలు ప్రభుత్వానికి దరఖాస్తు చేయాల్సి ఉంటుంది. మైనారిటీ విద్యార్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయం, చదువుతున్న తరగతిని బట్టి నాలుగు గ్రూపులుగా విభజించి స్కాలర్‌షిప్స్‌ను అందించడం జరుగుతోంది. వీరిలో హాస్టల్ విద్యార్థులకు అత్యధికంగా రూ.1,050 నుంచి అత్యల్పంగా రూ.325 వరకు అలాగే డే స్కాలర్స్‌లో అర్హతను బట్టి అత్యధికంగా రూ.429 నుంచి అత్యల్పంగా రూ.182 వరకు ప్రతినెల విద్యార్థుల వ్యక్తిగత ఖాతాల్లో నగదును నేరుగా జమ చేయడం జరుగుతోంది.

ఈ ఏడాది 1,27,575 మంది విద్యార్థులకు లబ్ది

2014-15 సంవత్సరంలో 1,06,436 మంది మైనారిటీ విద్యార్థులకు ఎంటీఎఫ్ రూ.29.82 కోట్లు, ఆర్‌టీఎఫ్ రూ.147.60 కోట్లు, 2015-16లో 1,03,436 మంది విద్యార్థులకు ఎంటీఎఫ్ రూ.29.33 కోట్లు, ఆర్‌టీఎఫ్ రూ.147.03 కోట్లు, 2016-17లో 1,05,366 విద్యార్థులకు రూ.44.69 కోట్లు, ఆర్‌టీఎఫ్ రూ.233.47 కోట్లు మొత్తంగా ఈ మూడేళ్లలో రూ.601.91 కోట్లను ఉపకార వేతనాలను చంద్రబాబు ప్రభుత్వం పంపిణీ చేసింది. అలాగే 2017-18కుగాను ప్రతి నెలా ఇప్పటి ఎంటీఎఫ్ రూ.60 కోట్లు, మూడు నెలలకు ఒకసారి ఆర్‌టీఎఫ్ రూ.225 కోట్లు కలిపి మొత్తంగా రూ.285 కోట్లను మైనారిటీ విద్యార్థులకు పంపిణీ చేసేందుకు చంద్రబాబు ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపులు చేసింది. ఈ ఏడాది ఉపకార వేతనాలు, ఫీజు రీయంబర్స్‌మెంటు కోసం జ్ఞానభూమి పోర్టల్ ద్వారా దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను పరిశీలిస్తే శ్రీకాకుళం జిల్లాలో 342 మంది, విజయనగరంలో 818, విశాఖపట్నంలో 3,371, తూర్పు గోదావరి లో 3,574, పశ్చిమ గోదావరిలో 4,724, కృష్ణా జిల్లాలో 12,281, గుంటూరులో 17,713, ప్రకాశంలో 8,903, నెల్లూరులో 9,289, చిత్తూరులో 13,581, కడపలో 16,829, కర్నూలులో 21,862, అనంతపురంలో 14,288 మంది కలిపి మొత్తంగా 1,27,575 మంది విద్యార్థులు ఉన్నారు. ఈ ఏడాది లక్ష్యంలో భాగంగా ఇప్పటి వరకు 82 వేల మంది విద్యార్థులకు రూ.15 కోట్ల ఎంటీఎఫ్ నిధులను, 42 వేల మంది మైనారిటీ విద్యార్థులకు రూ.92 కోట్ల ఆర్‌టీఎఫ్ నిధులను పంపిణీ చేసింది.

కృష్ణానదిలో నాటు పడవ బోల్తా

● తృట్టిలో తప్పిన ప్రమాదం ● 20 మంది ప్రయాణికులను రక్షించిన స్థానికులు

అమరావతి, ఆంధ్రప్రభ: కృష్ణా నదిలో సోమవారం నాటు పడవ నదిలో బోల్తా కొట్టింది. ఈ సంఘటలో ఎలాంటి ప్రాణ నష్టం జరుగలేదు. పడవలో ఎక్కించిన నలుగు బైక్ లు, ఇతర సామగ్రి నదిలో పడిపోయాయి. ఈ సంఘటనకు సంబంధించి సేకరించిన వివరాల ప్రకారం కృష్ణా జిల్లా ఎదురు మొండి దీవుల్లోని కృష్ణా నదిలో ఈ సంఘటన చోటుచేసుకుంది. సోమవారం సాయంత్రం ఎదురుమొండి దీవుల నుంచి 20 మంది ప్రయాణీకులతో నాటు పడవ నాగాయలకం వైపుకు బయలు దేరింది. పడవ బయలు దేరిన 10 నిమిషాల తరువాత ఒక్కసారిగా బోల్తా కొట్టింది. దీంతో పడవలో ప్రయాణిస్తున్న వారంతా నదిలో పడిపోయారు. విషయాన్ని గమనించిన స్థానికులు హూటా హూటీన నదిలో దిగి 20 మంది ప్రాణాలు కాపాడారు. దీంతో అందరు ఊపిరి పీల్చుకున్నారు. నాగాయలంకలో జరుగుతున్న పడవల పోటీల కు ఇక్కడ తిరిగే పడవలను తరలించడంతో గత మూడు రోజులుగా నాటు పడవలను రవాణాకోసం ఉపయోగిస్తున్నారు. పరిమితికి మించి ప్రయాణీకులు ఎక్కడంమూలంగానే ఈ ప్రమాదంచోటుచేసుకుందని స్థానికులు చెబుతున్నారు.

ఆరుగురు బాల నేరస్తుల పరార్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : నిర్వాహకులను బెదిరించి ఓ అబ్జర్వేషన్ హోమ్ నుంచి ఆరుగురు బాల నేరస్తులు పరారయ్యారు. ఈ ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాల్లోకి వెళితే.. ఎల్‌బీ నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కృషి నగర్‌లో రోజ్ అబ్జర్వేషన్ హోమ్ ఉంది. అందులో ఉన్న బాల నేరస్తులలో ఆరుగురు బాలలు నిర్వాహకులను బెదిరించి పరారయ్యారు. మూడు నెలల వ్యవధిలో ఇటువంటి సంఘటన జరగడం ఇది మూడోసారి కావడం గమనార్హం. నిర్వాహకులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి పరారీలో ఉన్న బాల నేరస్తుల కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేశారు.

హైకోర్టు ఆదేశాలు బేఖాతర్



● కోడిపందాల నిర్వహించినవారిపై చర్యలు తీసుకోవాలి ● వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి అంబటి డిమాండ్

అమరావతి, ఆంధ్రప్రభ : రాష్ట్రంలో టీడీపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కోడిపందాల పేరుతో జూదశాలలు తెరిచి, వాటిని కార్పొరేట్ స్థాయిలో నిర్వహిస్తూ, కోట్లాది రూపాయల అక్రమ సంపాదనకు తెరతీశారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి అంబటి రాంబాబు ధ్వజమెత్తారు. విజయవాడలోని వైసీపీ రాష్ట్ర కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. క్రికెట్ పిచ్‌లు ఏర్పాటు చేసినట్టు ట్వంటీ ట్వంటీ క్రికెట్ మాదిరిగా ఫ్లడ్ లైట్లు పెట్టి కోడి పందాలకు కార్పొరేట్ లుక్‌ను తీసుకువచ్చారని చెప్పారు. కోడిపందాల నిర్వహణకు హైకోర్టు అభ్యంతరం వ్యక్తంచేస్తూ ఆదేశాలు జారీ చేసిందని, కానీ టీడీపీ నేతలు వాటిని జూదశాలలుగా మార్చేసి ఏకంగా ఫ్లెక్సీలతో ఆహ్వానిస్తూ క్రికెట్ పిచ్‌లు మాదిరిగా బరులు తయారు చేశారని ఆరోపించారు. ఆ బరులు చుట్టూ జూదక్రీడలైన పేకాట, గుండాట, మద్యం షాపులు, బిర్యానీ పాయింట్లు స్టాల్స్ పెట్టించి, వాటిని వేలం ద్వారా కోట్లాది రూపాయలకు విక్రయించారని ఆరోపించారు. ఇవి కళ్లెదుట కనిపిస్తున్నా పోలీసులు చూసీచూడనట్లు వదిలేశారన్నారు. చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి చినరాజప్పలు కోడిపందాల పట్ల చూసీచూడనట్లు ఉండమని ఇచ్చిన ఆదేశాలు దీనికి కారణం అని ఆయన అనుమానం వ్యక్తం చేశారు. హోం మంత్రి నియోజకవర్గంలోనే పందెం కోళ్ల కాళ్లకు కత్తులు కట్టి మరీ పోటీలు నిర్వహిస్తున్నారని తెలిపారు. చట్ట వ్యతిరేక, న్యాయస్థానం ఆదేశాలకు విరుద్ధంగా జూదం, బెల్ట్ షాపులు, అసభ్య నృత్యాలు నడుస్తుంటే పోలీసులు చోద్యం చూస్తున్నారని ఇది అత్యంత దారుణమైన విషయం అని అన్నారు. చట్టం టీడీపీ నేతలకు ఒక రకంగా, సామాన్యులకు మరో రకంగా అమలు అవుతోందన్నారు. ఇది సిగ్గుచేటైన విషయమన్నారు.

గుంటూరు జిల్లాలో కల్తీ మద్యం తయారీ కేంద్రం

● భారీగా కల్తీ మద్యం, ముడిసరుకు స్వాధీనం ● అసలకు ధీటుగా నకిలీ బ్రాండ్ల తయారీ



అమరావతి, ఆంధ్రప్రభ: గుంటూరు జిల్లా రేపల్లె మండలం, గాదేవారిపాలెంలో నకిలీ మద్యం తయారీ కేంద్రంపై ఎక్సైజ్ పోలీసులు దాడిచేసి భారీగా కల్తీ మద్యం సీసాలతోపాటు తయారు చేసే ముడి సరుకు, యంత్ర పరికరాలు స్వాధీనం చేసుకున్నారు. ప్రముఖ కంపెనీలకు చెందిన ఓల్డ్ టావెర్న్, ఆఫీసర్స్ ఛాయిస్ బ్రాండ్ల పేర్లతో నకిలీ మద్యాన్ని తయారుచేసి బయటి మార్కెట్లో విక్రయిస్తున్నారు. పెనుమూడి గ్రామ సర్పంచ్ భర్త గుమ్మడి సాంబశివరావు ఈ నకిలీ మద్యం తయారీకి ప్రధాన సూత్రధారుడిగా ఎక్సైజ్ పోలీసులు గుర్తించారు. నకిలీ మద్యం తయారీ కేంద్రం గుట్టు రట్టు కావడం జిల్లాలో కలకలం సృష్టించింది. ఈ ఘటనలో ప్రధాన సూత్రధారి అయిన సాంబశివరావు తుమ్మల పంచాయతీలోని గాదెవారిపాలెంలో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని గత మూడు నెలలుగా ఈ తంతు నడుపుతున్నట్లు సమాచారం. అక్కడ తయారు చేసిన కల్తీ మద్యాన్ని తన షాపు ద్వారా విక్రయిస్తున్నట్లు బయటపడింది. కల్తీ మద్యం కేంద్రంలో భారీ ఎత్తున ఖాళీ సీసాలు, వాటి మూతలు, మద్యం తయారీకి ఉపయోగించే స్పిరిట్, సీల్ వేసే యంత్రాలను ఎక్సైజ్ పోలీసులు కనుగొన్నారు. 250 లీటర్లు గల ఐదు స్పిరిట్ పీపాలు, వాటర్ క్యాన్స్, ఖాళీ సీసాలను మద్యంతోనింపే పరికరాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే సుమారు 3 లక్షల విలువగల 268 కేసుల కల్తీ ఓసీ, ఓటీ సీసాలతోపాటు మద్యానికి రంగు వచ్చే క్యారామిల్ లిక్విడ్, 21 గోతాల ఖాళీ సీసాలను కూడా వారు స్వాధీనం చేసుకోవడం జరిగింది. కొల్లూరుకు చెందిన రమావత్ సాంబశివరావునాయక్ ఖాళీ మద్యం సీసాలను సేకరించి కల్తీ తయారీ కేంద్రానికి సరఫరా చేస్తున్నట్లు ఎక్సైజ్ పోలీసుల దర్యాప్తుల వెల్లడైంది. గత మూడు నెలలుగా గాదె వారిపాలెంలో తయారైన ఈ కల్తీ మద్యాన్ని నిర్వాహకుడు సాంబశివరావు తన సొంత షాపుతోపాటు మండలంలోని బెల్టుషాపులకు కూడా సరఫరా చేస్తూ లక్షల్లో అక్రమార్జనకు పాల్పడ్డట్లు తెలుస్తుంది. కల్తీ మద్యం తయారీ కేంద్రంలో పట్టుబడిన ఘటనను పరిశీలిస్తే దీని వెనుక మరికొందరి హస్తం ఉన్నట్లుగా కూడా అనుమానాలు రేకెత్తుతున్నాయి. అసలును పోలిన విధంగా నకిలీ మద్యం తయారు చేయాలంటే పాళ్లు కలపడానికి కెమిస్ట్ అవసరముంటుంది. ఐతే ఈ కేంద్రంలో కల్తీ మద్యం తయారీ వెనుక కెమిస్ట్‌తోపాటు తయారీలో సాంకేతిక పరిజ్ఞానం కలిగిన నిపుణులు కూడా ఉన్నట్లు అర్థమవుతోంది. మినీప్లాంటు తరహాలో కల్తీ మద్యం కేంద్రం వెనుక రాజకీయ నాయకుల హస్తాలే ఉండవచ్చని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాగా ఈ ఘటనలో ప్రమేయమున్న ఇద్దరు వ్యక్తులను ఎక్సైజ్ పోలీసులు అదుపులోకి తీసుకోగా, మరి కొందరికోసం గాలిస్తున్నారు. గతంలో రాయలసీమలోని ఆళ్లగడ్డలో కూడా ఇదేతరహాలో కల్తీమద్యాన్ని తయారు చేస్తున్న కేంద్రంపై ఎక్సైజ్ శాఖ దాడులు నిర్వహించి భారీ ఎత్తున మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్న విషయం విదితమే. గుంటూరు జిల్లాలో నకిలీ మద్యం తయారీ కేంద్రం పట్టుబడిన ఘటనపై అన్ని కోణాల్లో దర్యాప్తు చేస్తున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వెంకటేశ్వరరావు వెల్లడించారు.

చిర్రావూరులో ఫేస్‌బుక్ వివాదం

● యువతిని వేధించిన ఆకతాయి ● నగ్న ఫోటోలతోలతో పోస్ట్ ● రాజీయత్నాలు షురూ

అమరావతి, ఆంధ్రప్రభ : వివాహితఫోటోను మార్ఫింగ్ చేసి నగ్నంగా ఉన్న ఫోటోలను ఆమెకు పంపించి వేధింపులకు గురి చేసిన ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం చిర్రావూరులో కొద్దిరోజుల క్రితం జరిగిన ఈ సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. జరిగిన దారుణానికి సంబంధించి యువతి పోలీసులకు ఫిర్యాదు చేసినా..పోలీసులు కేసు నమోదు చేయకుండా తాత్సారం చేయడంతో రాజకీయ నాయకులు రంగప్రవేశం చేశారు. ఇందుకు సంబంధించిన వివరాల్లోకి వెళితే..చిర్రావూరు గ్రామానికి చెందిన యువతి కొంతకాలం క్రితం భర్త నుంచి విడిపోయి కుటుంబంతో ఉంటోంది. కొద్దిరోజుల క్రితం ఆమె తన సెల్‌ఫోన్‌ను పక్కింటి వారికి విక్రయించారు. అయితే ఫోన్‌లో ఉన్న ఫేస్‌బుక్ అక్కౌంట్‌ను తొలగించకుండా ఇచ్చేయడంతో అందులో ఉన్న యువతి ఫోటోలను మార్ఫింగ్ చేసి నగ్న చిత్రాలను తయారు చేశాడు. ఆ తర్వాత ఆ ఫోటోలను యువతికి చేరేలా చేయడంతో ఆమె తాడేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే పోలీసులు కేసు నమోదు చేయలేదు. ఈలోగా కొందరు రాజకీయ నాయకులు రంగప్రవేశం చేశారు. ఇందులో కొందరు యువతి పక్షాన, మరికొందరు యువకుని పక్షాన చేరడంతో రాజీ యత్నాలు ప్రారంభమయ్యాయని తెలిసింది. అయితే ఈ సంఘటన మాత్రం మండలం లోనే గాక గుంటూరు జిల్లా వ్యాప్తంగా సంచలనం కావడంతో పోలీసు ఉన్నతాధికారులు ఆరా తీస్తున్నారని తెలిసింది.

నాలుగేళ్లలో బాబు సాధించిందేమిటి?

● పీఏసీ చైర్మన్ బుగ్గన రాజేంద్రనాథ్

హైదరాబాద్, ఆంధ్రప్రభ : పోలవరం కోసం తెలంగాణలోని నాలుగూళ్లను ఏపీలో కలపకపోతే సీఎంగా ప్రమాణస్వీకారమే చేయనని ప్రధానమంత్రిని డిమాండ్ చేసినట్లు ప్రచారం చేసుకున్న చంద్రబాబు నాయుడు మరి నాలుగేళ్లలో ఏపీకి కేంద్రం నుంచి సాధించిందేమిటో చెప్పాలన్ని పబ్లిక్ అక్కౌంట్స్ కమిటీ చైర్మన్ బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి అన్నారు. మంగళవారం వైఎస్‌ఆర్‌కాంగ్రెస్‌పార్టీ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రజలను నాలుగేళ్లుగా మభ్యపెడుతూ నాలుగు టెంపరరీ బిల్డింగులు కట్టడం తప్ప సీఎం చంద్రబాబు నాయుడు సాధించిందేమీ లేదన్నారు. అవి కూడా నాలుగు చినుకులు పడితే కారుతున్నాయన్నారు. రాష్ట్ర విభజన చట్టంలోని ఒక్క హామీని కూడా సాధించలేకపోయారన్నారు. విశాఖ రైల్వేజోన్ , వైజాగ్ -చెన్నై కారిడార్, ప్రత్యేకహోదా, దుగ్గిరాజపట్నం పోర్టు, అమరావతి నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు వంటివి ఏవీ సాధించలేకపోయారన్నారు. ముఖ్యమంత్రి ఢిల్లీకి వెళ్లి నాలుగేళ్ల తరువాత కూడా వాటితోనే ప్రధానికి వినతిపత్రం ఇవ్వటం హాస్యాస్పదంగా ఉందన్నారు. కాగ్ రిపోర్టు ప్రకారం రూ.24వేలకోట్లు లోటు బడ్జెట్ ఉండేదని , చంద్రబాబు మాత్రం రూ16వేలకోట్లు లోటు ఉందని కేంద్రానికి లేఖలు రాస్తున్నారన్నారు. ఇన్నిసార్లు ఢిల్లీకి వెళ్లి చంద్రబాబు సాధించిందేమిటో ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు.

అనంతలో మట్కా గుట్టురట్టు...

● రూ. 30 లక్షల నగదు స్వాధీనం

అనంతపురం కార్పొరేషన్, ప్రభ న్యూస్ : మట్కా పేరిట పేదల జీవితాలను నాశనం చేస్తున్న మట్కా పై అనంతపురం జిల్లా ఎస్పీ జీవీఎస్ అశోక్‌కుమార్ ఉక్కుపాదం మోపారు. ఆయన ఆదేశాల మేరకు డీఎస్పీ వెంకటరావ్ సారథ్యంలో సిఐ కృష్ణమోహన్ స్సైలు హమీద్ ఖాన్, మధుసూదన్ రెడ్డి, శ్రీనివాసులు, శ్రీరామ్, సిబ్బంది హెడ్ కానిస్టేబుల్ మడకశిర రమేష్, కానిస్టేబుళ్లు జయరామ్, ఖాజామైనుద్దీన్ ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి, నలుగురు మట్కా నిర్వాహకులు, 11 మంది బీటర్లను అరెస్టు చేశారు. వారి వద్ద నుంచి రూ. 30,00,250 నగదు 15 సెల్ ఫోన్లు, ఒక ల్యాబ్‌ట్యాబ్, ప్రింటర్, మట్కా చీటీలు, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. మట్కాకు సంబంధించి ఇంత పెద్ద మొత్తంలో ఒకేసారి రూ. 30 లక్షల నగదును స్వాధీనం చేసుకోవడం ఇదే తొలిసారి. కరవు జిల్లా అయిన అనంతలో మట్కా ద్వారా పేదల ప్రజలతో ఆడుకునే మట్కా నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ అశోక్‌కుమార్ అన్నారు. అనంతరం ప్రత్యేక బృందానికి ఆయన అభినందనలు తెలిపి, రివార్డులు అందించారు.

ఆర్.కృష్ణయ్య రాజీనామా చేయాలి

అమరావతి, ఆంధ్రప్రభ: అత్యంత వెనుకబడిన సంచార జాతులకు నమ్మక ద్రోహం చేసినందుకు జాతీయ బీసీ సంఘ అధ్యక్షులు ఆర్ .కృష్ణయ్య తన పదవికి, శాసన సభ్యత్వానికి రాజీనామా చేయలాని బలహీన వర్గాల జేఏసీ నాయకులు వేల్పూరి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బీసీ సంఘం జాతీయ అధ్యక్షుడన్న ముసుగులో రాష్ట్రంలోని టీటీడీ బోర్డు చైర్మన్ , రాజ్యసభ, ఎమ్మెల్సీ. కార్పొరేషన్, మార్కెట్ కమిటీ చైర్మన్ వంటి పదవులు సంచార జాతులకు దక్కకుండా కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో ఒక్క శాతం కూడా లేని కురుమ సామాజిక వర్గానికి చెందిన కృష్ణయ్య తన రాజకీయ ప్రయోజనాల కోసం కులాల మధ్య చిచ్చు పెట్టడం తగదని హితవు పలికారు. తెలంగాణాలో 27 బీసీ కులాలను ఎలాంటి కారణం లేకుండా కెసిఆర్ తొలగిస్తే మౌనంగా ఉండటం వెనుక అర్థం ఎమిటని ఆయన ప్రశ్నించారు. ఒక్క శాతం ఉన్న కురుమ వర్గానికి చెందిన కృష్ణయ్య 135 సంచార కులాల ద్రోహిగా ఆయన అభివర్ణించారు. టీటీడీ చైర్మన్ పదవిని సంచార జాతులకు కేటాయించాలని ముఖ్యమంత్రి చంద్రబాబును ఆయన మంగళవారం ఒక ప్రకటనలో కోరారు.

రైలు పైకెక్కి యువకుల హల్‌చల్

● విద్యుత్ షాక్‌తో ఒకరికి తీవ్ర గాయాలు

అమరావతి, ఆంధ్రప్రభ : పశ్చిమ గోదావరి జిల్లాలో మంగళవారం నలుగురు యువకులు రైలెక్కి హల్‌చల్ సృష్టించారు. కొవ్వూరు రైల్వేస్టేషన్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. వారు ఎక్కడివారో తెలియదు కానీ ఆ నలుగురు యువకులు ఆగి వున్న గూడ్స్ రైలు ఎక్కి నానా హంగామా చేశారు. దీంతో అధికారులు, స్థానికులు నానా హైరానాకు గురయ్యారు. విద్యుత్ వైరు తగలడంతో ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. హుటాహుటిన అతడిని స్థానిక ఆస్పత్రికి తరలించి, చికిత్స చేయిస్తు న్నారు. కాగా క్షతగాత్రుడి పరిస్థితి ప్రమాదకరంగానే ఉందంటున్నారు. కాగా నలుగురు యువకులు ఎందుకు రైలు ఎక్కాల్సి వచ్చింది? మద్యం మత్తులో ఇలా చేశారా ? లేక ఆత్మహత్య చేసుకోవడానికి యత్నించారా ? అనే కోణంలో రైల్వే పోలీసులు విచారిస్తున్నారు. కాగా ఈ ఘటనకు సంబంధించి మరింత సమాచారం తెలియాల్సి ఉంది.

హైటెక్ సెక్స్ రాకెట్ గుట్టు రట్టు

హైదరాబాద్, ఆంధ్రప్రభ : తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్‌లో హైటెక్ సెక్స్ రాకెట్ ముఠా గుట్టు రట్టయింది. ప్రశాసన్ నగర్‌లో వ్యభిచారం నిర్వహిస్తున్న కీలక సూత్రధారి ఫయాజ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. జూబ్లీహిల్స్‌లోని ఓ డ్యూప్లెక్స్ ఇంటిలో వ్యభిచార కార్యకలాపాలు కొనసాగిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు దాడుల నిర్వహించారు. ఈ దాడులలో కోల్‌కతా, గోవా, ముంబై ప్రాంతాల నుంచి యువతులను వారం, పది రోజుల పాటు హైదరాబాద్‌కు తీసుకువచ్చి వ్యభిచారం నిర్వహిస్తున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. పదేళ్ల నుంచి ఫయాజ్ వ్యబిచార కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. హైదరాబాద్‌లో మాత్రం రెండేళ్లుగా నిర్వహిస్తున్నాడని పోలీసులు గుర్తించారు. అతడి నుంచి పశ్చిమబెంగాల్ రాజధాని కోల్‌కతాకు చెందిన ఇద్దరు యువతులు, మహబూబ్‌నగర్‌కు చెందిన ఓ యువతిని రక్షించినట్లు పోలీసులు తెలిపారు. హైటెక్ వ్యభిచారం నిర్వహిస్తున్న కీలక సూత్రధారి ఫయాజ్‌తో పాటు అతడికి సహకరించిన జోసఫ్, సురేష్‌లనే మరో ఇద్దరు యువకులను పోలీసులు అరెస్టు చేశారు. నిందితుల నుంచి రూ.12 వేల నగదు, మూడు మొబైల్ ఫోన్‌లు, 20 కండోమ్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఫయాజ్ ఆరుగురు దళారులను ఏర్పాటు చేసుకుని ఈ చీకటి వ్యాపారం కొనసాగిస్తున్నట్లు ఏసీపీ తెలిపారు. నిందితులను కస్టడీకి తీసుకుని మరింత లోతుగా విచారణ చేస్తామన్నారు. కాగా, ప్రశాసన్‌నగర్‌లోని ఆ ఇంటి యజమాని ముంబయిలో ఉంటాడని పోలీసులు తెలిపారు.

మంచు దుప్పటిలో రాష్ట్రం

● రోడ్లు కనిపించక మృత్యువాత పడుతున్న జనం ● ఇప్పటికే 50 మందికిపైగా దుర్మరణం ● ఒక్క రోజే 10 మంది మృతితో ఆందోళన ● విదేశాల్లో ఆధునిక సాంకేతికతో ప్రమాదాలకు చెక్ ● ఇన్‌ఫ్రారెడ్ లైట్లు ఏర్పాటుకు వినతి



అమరావతి, ఆంధ్రప్రభ: రాష్ట్రాన్ని మంచు దుప్పటి కమ్మేయడంతో రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాల పరంపర కొనసాగుతోంది. గత కొద్ది రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా దట్టంగా పొగమంచు కమ్ముకోవడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందికరంగా మారింది. అర్ధరాత్రి నుంచే పొగమంచు అలుముకుంటుండడంతో వాహన రాకపోకలకు తీవ్ర ఆటంకంగా మారింది. దీంతో రోడ్డు సక్రమంగా కనిపించపోవడంతో ఎదురెదురుగా వస్తున్న వాహనాలు ఢీకొంటున్నాయి. దీంతో జనం పెద్ద ఎత్తున మృత్యువాత పడుతున్నారు. గత వారం రోజుల్లో ఇప్పటివరకు రాష్ట్ర వ్యాప్తంగా 50 మందికి పైగానే పొగ మంచు వల్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో మృత్యువాతపడడం ఆందోళన కలిగిస్తోంది.ఇవి కేవలం అధికార లెక్కలు మాత్రమే. అనధికార లెక్కలు ప్రకారం ఈ సంఖ్య రెట్టింపు ఉంటుందంటున్నారు. తాజాగా ఒక్క రోజే రాష్ట్రంలోని వేర్వేరు చోట జరిగిన రోడ్డు ప్రమాదాల్లో 10 మందికి పైగానే చనిపోవడం గమనార్హం. కృష్ణా, గుంటూరు, నెల్లూరు, చిత్తూరు, విజయనగరం, విశాఖ, పశ్చిమగోదావరి తదితర జిల్లాల్లో పొగమంచు వల్ల రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. నెల్లూరు జిల్లాలో తాజాగా పొగమంచు వల్ల జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆరుగురు మృత్యువాతపడ్డారు. మరో అయిదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. మైపాడుగేట్ జాతీయ రహదారిపై జరిగిన ప్రమాదంలో రెండు ట్రావెల్ బస్సులు ఢీకొనడంతో ఇద్దరు అక్కడికక్కడే చనిపోయారు. భోగి సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా రహదారులు రక్తసిక్తమయ్యాయి. చిత్తూరులో ముగ్గురు, నెల్లూరులో అయిదుగురు, గుంటూరులో ఇద్దరు పొగమంచుకు బలయ్యారు. చిత్తూరు జిల్లాలో కాలినడకన తిరుమలకు బయలు దేరిన బృందాన్ని వేగంగా వచ్చిన ద్విచక్ర వాహనం ఢీకొనడంతో ముగ్గురు వ్యక్తులు దుర్మరణం చెందారు. ఫిరంగిపురంలో ఆటో - ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో నలుగురు పదో తరగతి విద్యార్థులతో సహా ఆటో డ్రైవర్ చనిపోయారు. గుంటూరు జిల్లా నరసరావుపేట, దుర్గి, దుగ్గిరాల, రేపల్లె, కృష్ణా జిల్లా నూజివీడు, తదితర ప్రాంతాలలో విపరీతంగా పొగ మంచు కురుస్తోంది. విజయ నగరం జిల్లాను కూడా పొగమంచు విపరీతంగా కమ్మేయడంతో మరింత ఇబ్బందికర పరిస్థితులు తలెత్తాయి. వాహన రాకపోకలకు తీవ్ర ఆటంకం కలుగుతోంది. దీంతో జాతీయ రహదారిపై భారీగా వాహనాలు నిలికిపోతున్నాయి. ట్రాఫిక్ సమస్య కూడా ఉత్పన్నమవుతోంది. రానున్న రోజుల్లో పొగమంచు తీవ్రత మరింతగా పెరిగే అవకాశం ఉండడంతో ఆందోళన కలిగిస్తోంది. ప్రధానంగా తెల్లవారు జాము 3 గంటల ప్రాంతంలో విపరీతంగా దట్టంగా పొగ మంచు కురుస్తుండ డంతో ప్రమాదాల సంఖ్య పెరుగు తోంది. విదేశాల్లో మాదిరిగా మన దేశంలో పొగమంచును ఎదుర్కొనే అవకాశం లేకపోవ డంతో వాహనదారులను పెద్ద సంఖ్యలో పొగమంచు రూపం లో మృత్యువు కబళిస్తోంది. పొగమంచు లో లైట్లు వేసుకుని వెళుతున్నా వాహనాలు దగ్గరకు వచ్చేంతవరకు కనిపించక పోవడంతో ప్రమాదాలు అధిక సంఖ్యలో జరుగుతున్నాయం టున్నారు. అయితే చైనా, నార్వే, సింగపూర్, జపాన్, రష్యా, దక్షిణకొరియా, స్వీడన్, డెన్మార్క్, స్విట్జర్లాండ్ వంటి దేశాల్లో ఆధునిక సాంకేతితను వినియోగించడం ద్వారా ముందు వెళ్లే వాహనాలను పసిగట్టి, రోడ్డు ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నారు. దీంతో ఆయా దేశాల్లో శీతాకాలంలో పొగ మంచు వల్ల ప్రమాదాలు లేకుండా పోయాయంటు న్నారు. జపాన్ వంటి దేశాల్లో విద్యార్థులకోసం కూడా ప్రత్యేకించి, చర్యలు తీసుకోవడం వల్ల విద్యార్థులు సురక్షితంగా గమ్యాలకు చేరుకుంటున్నారు. ఆయా దేశాల్లో శాటిలైట్ ఆధారంగా దిశానిర్దేశం చేయడం ద్వారా వాహనాల రాకపోకలు సాగిస్తూ ప్రమాదాలకు చెక్ పెడుతున్నారు. మంచు తీవ్రత అధికంగా ఉండే దేశాల్లో వాహనాలకు ఇన్‌ఫ్రారెడ్ లైట్లు అమర్చి, ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకుంటున్నారు. ఈ ఇన్‌ఫ్రా రెడ్ లైట్లు కిలో మీటరు దూరంలోని వాహనాలను సైతం పసిగట్టి, డ్రైవర్‌ను అప్రమత్తం చేస్తాయంటున్నారు. ఇదే పద్ధతి లో మన రాష్ట్ర ప్రభుత్వం కూడా ఆ దిశగా చర్యలు తీసుకుంటే పొగమంచు నేపథ్యంలో జరిగే రోడ్డు ప్రమాదాలకు శాశ్వతంగా చెక్ పెట్టడానికి అవకాశం ఉంటుందంటున్నారు.

హ్యూమన్ ట్రాఫికింగ్‌లో తొలి స్థానంలో నవ్యాంధ్ర

హైదరాబాద్, ఆంధ్రప్రభ : హ్యూమన్ ట్రాఫికింగ్‌లో దేశంలోనే తొలి స్థానంలో నవ్యాంధ్ర నిలుస్తోంది. అక్రమంగా అమ్మాయిల తరలింపు, వ్యభిచార గృహాల నిర్వహణపై దేశంలో చట్టాలు కఠినంగా ఉన్నప్పటికీ, వాటిని పట్టించుకునేవారు అంతంతమాత్రమే. ఈ విషయంలో మిగతా రాష్ట్రాలకన్నా నవ్యాంధ్ర ముందుందని, ఏపీ నుంచి అమ్మాయిల రవాణా, వ్యభిచార గృహాల నిర్వహణ అత్యధికమని తాజా నివేదికలో అధికారలు వెల్లడించారు. ఇక ఈ తరహా ఘటనలపై ఉక్కుపాదం మోపేందుకు ఏపీ సర్కారు కఠిన చర్యలు ప్రారంభించినప్పటికీ పట్టుబడిన వారు చిన్న చిన్న శిక్షలు, బెయిల్ తీసుకుని బయటకు వస్తూ తిరిగి అదే పనిలో నిమగ్నమవుతున్నారు. దీంతో వేశ్యావాటికలకు బాలికలను విక్రయించే మహిళలు, ముఠాలపై తీసుకుంటున్న చర్యలు నామమాత్రమే అవుతున్నాయి. యాంటీ ట్రాఫికింగ్ చట్టాలపై అధ్యయనం కోసం న్యాయనిపుణులతో ఏపీ సర్కార్ ఓ కమిటీని ఏర్పాటు చేయగా, ఈ కమిటీ రెండు నెలల్లోఓ రిపోర్టును ఇవ్వాల్సి ఉంది. ఇమ్మోరల్ ట్రాఫికింగ్ ప్రివెన్షన్ యాక్ట్ గురించి మాట్లాడిన కమిటీ సభ్యురాలు సునీతాకృష్ణన్, వ్యభిచారం నిర్వహించేవారు, వ్యభిచార గృహాలు నిర్వహించే వ్యక్తులకు ఈ చట్టం కఠిన శిక్షలు విధిస్తుందని అన్నారు. బాలికలను కొనేవారు ఉన్నంత కాలం అమ్మేవారు పుట్టుకొస్తూనే ఉంటారని చెప్పారు. అయితే, హ్యూమన్ ట్రాఫికింగ్‌ను అరికట్టేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు సరైన ఫలితాలు ఇవ్వడం లేదని అభిప్రాయపడ్డారు.

ఆర్టీసీ ఆదాయం రూ.6 కోట్లు!

• రూ.10 కోట్లు వస్తుందంటున్న అధికారగణం • మరోవైపు కోట్లు దండుకున్న ప్రైవేట్ ట్రావెల్స్ • రైల్వేకూ గణనీయంగా పండుగ ఆదాయం



అమరావతి, ఆంధ్రప్రభ: ఏపీఎస్ఆర్టీసీ పండుగ లక్ష్యాన్ని సాధించిందంటున్నారు. అసలే వేల కోట్ల నష్టాల్లో ఉన్న ఆర్టీసీకి ప్రతి ఏడాది వచ్చే సంక్రాంతి వంటి పండుగలు కొండంత అండగా నిలుస్తున్నాయడంలో అతిశయోక్తి లేదు. ముఖ్య పండుగలకు ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులను వివిధ ప్రాంతాలకు నడపడం ద్వారా పెద్ద ఎత్తున ఆదాయాన్ని సమకూర్చుకుంటోంది. అదే క్రమంలో ఈసారి సంక్రాంతి పండుగకు కూడా ఏపీఎస్ఆర్టీసీ భారీగా ప్రత్యేక బస్సులను నడుపుతోంది. ఈనెల 9 నుంచి 18వరకు ప్రత్యేక బస్సులను నడుపుతున్న సంగతి తెలిసిందే. ఈసారి నిర్దేశిత లక్ష్యమైన రూ. 10 కోట్ల ఆదాయాన్ని ఇప్పటికే అతి సులువుగా సాధిస్తుందంటున్నారు. కాగా ఈనెల 9 నుంచి ఇప్పటివరకు రాష్ట్ర వ్యాప్తంగా నడిపిన ప్రత్యేక సర్వీసులు ద్వారా ఆర్టీసీకి రూ.6 కోట్లకుపైగానే ఆదాయం సమకూరినట్లు అధికారులు అంచనా. ఇంకా రెండు, మూడు రోజులైతే కానీ ఈ విషయంలో పూర్తి క్లారిటీ రాదంటున్నారు. వాస్తవానికి ఈసారి సుమారు రూ. 10 కోట్ల వరకు ఆదాయం సమకూర్చుకోవాలని ఆర్టీసీ ఉన్నతాధికారులు భావించారు. ఆమేరకు తప్పనిసరిగా అదే స్థాయిలో ఆదాయం వచ్చి తీరుతుందంటున్నారు. విజయవాడ ,హైదరాబాద్ కేంద్రంగా చేసుకుని ఆర్టీసీ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలతో పాటు ఇతర రాష్ట్రాల్లోని ప్రాంతాలకు కూడా ప్రత్యేక బస్సులను నడుపుతోంది. ఈసారి ఏపీఎస్ ఆర్టీసీ పండుగ సందర్భంగా 2,135 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. అలాగే టీఎస్ఆర్టీసీ కూడా 3,262 బస్సులను ఏర్పాటు చేసింది. రెండు రాష్ట్రాలు కలిపి 5,397 ప్రత్యేక సర్వీసులను ఏర్పాటు చేశాయిబు .హైదరాబాద్, విజయవాడ కేంద్రంగా వీటిని నడుపుతున్నారు. ఏపీఎస్ ఆర్టీసీ అధికారులు ముందుగానే హైదరాబాద్ చేరుకుని, అక్కడ నుంచి వివిధ ప్రాంతాలకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నారు. హైదరాబాద్ నుంచి విజయవాడ, విశాఖపట్నం, నెల్లూరు, తిరుపతి, మచిలీపట్నం, గుంటూరు, రాజోలు, బెంగుళూరు, బళ్లారి, చెన్నై, షిర్డీ, పుణ, ముంబై, కొల్హాపూర్ తదితర ప్రాంతాలకు ఏపీఎస్ ఆర్టీసీ ప్రత్యేక బస్సులను నడుపుతోంది. అదే విధంగా ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాలకు విజయవాడ నుంచి కూడా ప్రత్యేక బస్సులు నడుపుతోంది. సుమారు 1,352 బస్సులను విజయవాడ నుంచి దూర ప్రాంతాలకు ఎప్ప టికప్పుడు నడుపుతోంది. అయితే ప్రైవేట్ ట్రావెల్స్ కూడా పోటీ పడి ఆయా ప్రాంతాలకు బస్సులను తిప్పుతున్నాయి. దాదాపు 1000కి పైగానే బస్సులు నడుపుతున్నారు. ఏపీఎస్ ఆర్టీసీ టిక్కెట్‌పై అదనంగా 50 శాతం వసూలు చేస్తోంది. దీన్ని సాకుగా తీసుకున్న ప్రైవేట్ ట్రావెల్స్ కూడా అందినకాడికి దోచుకుంటున్నాయని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టిక్కెట్ ధరపై 50 శాతం అదనంగా వసూలు చేస్తుండడంతో ఆర్టీసీకి పెద్ద ఎత్తున ఆదాయం వచ్చిందంటున్నారు. హైదరాబాద్ నుంచి ఆంధ్రాలోని వివిధ ప్రాంతాలకు పండుగకు వచ్చినవారు ఇప్పటికే తిరుగు ముఖం కూడా పట్టారు. తిరుగు ప్రయాణానికి కూడా ఆర్టీసీ ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసింది. తిరు గు ప్రయాణానికి సంబంధించి హైదరాబాద్, బెంగుళూరు, చెన్నై, తిరుపతి, విశాఖపట్నం, విజయవాడ తదితర ప్రాంతాలకు ప్రత్యేక బస్సులు తిప్పుతున్నారు. మంగళ, బుధ, గురు, శుక్రవారాల్లో ఈ ప్రత్యేక బస్సు లను నడుపుతుండడంతో ఆర్టీసీకి మరింత ఆదాయం సమకూరనున్నది. వాస్తవానికి 9 నుంచి 15వ తేదీ మధ్యలోనే ఆర్టీసీకి భారీగా ఆదాయం వచ్చిందంటు న్నారు. ఈ తేదీల మధ్యనే ఆర్టీసీకి రూ. 5కోట్లకు పైగానే ఆదాయం లభించినట్లు అంచనా వేస్తున్నారు. ఈసారి ఏపీఎస్ఆర్టీసీ, టిఎస్ఆర్టీసీ సంస్థలు పోటీ పడి పండు గ సర్వీసులను ఏర్పాటు చేశాయి. ఆదాయం విషయం లో కూడా పోటీ పడ్డాయి. దీంతో ఏపీఎస్ ఆర్టీసీ అధికారులు ఈ పరిస్థితిని గుర్తించి, ముందుగానే హైదరాబాద్ వెళ్లి,అక్కడే మకాం వేసి, హైదరాబాద్ నుంచి ఆంధ్రాలోని వివిధ సుదూర ప్రాంతాలకు ప్రత్యేక బస్సులను నడపారు. దీని వల్ల లక్ష్యం మేరకు ఆదాయం సాధించగలిగారు.అయితే ప్రైవేట్ ట్రావెల్స్ వల్ల ఈసారి ఆర్టీసీకి భారీగా నష్టం వచ్చిందంటున్నారు.ప్రైవేట్ ట్రావెల్స్ యజమానులు ఆర్టీసీకి ధీటుగా బస్సులు వేసి,రెట్టింపు చార్జీలు వసూలు చేశారు. ప్రైవేట్ ట్రావెల్స్‌కూడా దాదాపు రూ. 6 కోట్లుకుపైగానే ఆదాయాన్ని సమకూర్చుకోవడం గమనార్హం. రెండు రాష్ట్రాల్లో కలిపి ప్రైవేట్ ట్రావెల్స్ నిర్వాహకులు రూ. 10 కోట్లుకు పైగానే ఆదాయాన్ని సమకూర్చుకున్నాయంటే ఆర్టీసీ ఆదాయానికి ఏమేరకు గండిపడిందో వేరే చెప్పనక్కర్లేదు.దీనికి తోడు ఇతర రాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్ చేయించుకుని,ఇక్కడ స్టేజీ క్యారేజీలుగా తిప్పుతున్న బస్సుల వల్ల కూడా ఆర్టీసీ ఆదాయానికి భారీగా గండిపడిందంటున్నారు. ఆర్టీసీలో రిజర్వేషన్లు దొరకని ప్రయాణీకులంతా ప్రైవేట్ ట్రావెల్స్‌ను ఆశ్రయించారు. ప్రైవేట్ ట్రావెల్స్ నిర్వాహకులు ఇదే అదునుగా భావించి విపరీతంగా దండుకున్నారు. హెదరాబాద్ నుంచి విజయవాడకు సాధారణ రోజుల్లో టిక్కెట్ ధర రూ. 500 ఉంటే సంక్రాంతికి రూ. 1500 దాకా వసూలు చేశారు. అదే విధంగా విశాఖపట్నానికి సాధారణ చార్జీ రూ. 940 ఉంటే ఇప్పుడు రూ. 2,590 లు, కాకినాడకు రూ. 1800, గుంటూరుకు రూ. 1500, విజయనగరం రూ. 2,600 దాకా ప్రైవేట్ నిర్వాహకులు వసూలు చేశారని వాపోయారు. ప్రైవేట్ ట్రావెల్స్ పెద్ద ఎత్తున ప్రయాణికుల జేబుకు చిల్లు పెడుతున్నా, పట్టించుకునే వారే కరువయ్యారని ప్రయాణికులు వాపోతున్నారు. తిరుగుప్రయాణం లో కూడా ప్రైవేట్ ట్రావెల్స్ ప్రయాణీకుల నుంచి అధిక చార్జీలు దండుకుంటున్నాయని ప్రయాణికులు ఆవేదన చెందుతున్నారు. ప్రైవేట్ ట్రావెల్స్‌ను కట్టడి చేసి ఉన్నట్లయితే ఏపీఎస్ ఆర్టీసీకి ఈసారి అదనపు ఆదాయం వచ్చేదంటున్నారు. ప్రైవేట్ ట్రావెల్స్ ఆర్టీసీతో పోటీ పడి, సొమ్ము చేసుకోవడంతో ఆర్టీసీ భారీగా నష్టపోకతప్పలేదు. ఇక ఈసారి దక్షిణ మధ్య రైల్వే కూడా 20కి పైగానే ప్రత్యేక రైళ్లను నడిపింది. హైదరాబాద్ - విజయవాడ- తిరుపతి -విశాఖపట్నం -బెంగుళూర్ తదితర మార్గాల్లో ప్రత్యేక రైళ్లను నడిపింది. ఈ సందర్భంగా రైల్వేకు కూడా భారీగానే ఆదాయం లభించినట్లు రైల్వే వర్గాల సమాచారం. అయితే ఈసారి రైళ్లో ఏసీ బోగీలు ఎక్కువగా వేసి, సాధారణ ప్రయాణికులను విస్మరించడంతో విమర్శలకు గురైంది. దీని వల్ల సాధారణ ప్రయాణికులు తీవ్ర ఇక్కట్లకు గురికావాల్సి వచ్చింది. కాగా తిరుగు ప్రయాణంలో కూడా ఏపీఎస్ ఆర్టీసీ విజయవాడ, హైదరాబాద్ కేంద్రంగా ప్రత్యేక బస్సులను నడుపుతుందని ఏపీఎస్ ఆర్టీసీ ఇన్‌చార్జి ఎం.డి. ఎం.మాలకొండయ్య పేర్కొన్నారు. ఆర్టీసీ ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్సుల్లోనే ప్రయాణించాలని ఆయన కోరారు. ఇదిలా ఉంటే జాతీయ రహదారుల్లోని టోల్‌ప్లాజాలకు వాహనాల బెడత అధికంకావడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుంది. వీటి వద్ద భారీ ఎత్తున వాహనాలు నిలిచిపోవడంతో ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందికరం గా మారింది. గత రెండు ,మూడు రోజులుగా ఏ టోల్‌ప్లాజా చూసినా వాహనాలతో నిండిపోయి కనిపిస్తున్నాయి. అడుగు తీసి,అడుగు ముందుకేసే పరిస్థితి లేదు. ప్రధానంగా విజయవాడ - హైదరాబాద్ జాతీయ రహదారిలోని టోల్ ప్లాజాల వద్ద భారీగా వాహనాలు బారులు తీరాయి. హైదరాబాద్‌లో ఉంటోన్న ఆంధ్రా ప్రాంతం వాసులు పెద్ద ఎత్తున తమ సొంతూళ్లకు వచ్చి, తిరిగి హైదరాబాద్ వెళ్తుండడంతో హైవే రహదారిపై రద్దీ నెలకొన్నది. యాదాద్రి భువనగిరి జిల్లా పంతంగి టోల్‌ప్లాజాల దగ్గర కూడా ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమవుతున్నది. కృష్ణా జిల్లా కీసర దగ్గర నుంచి ఇప్పటికే లక్షల్లో వాహనాలు వెళ్లాయి. మంగళ వారం నుంచి తిరుగు ప్రయాణంలో హైదరాబాద్ వెళుతుండడంతో టోల్‌గేట్ల వద్ద ఇంకా రద్దీ కొనసాగుతూనే ఉందంటున్నారు.

ఆర్టీసీ స్థలాల పై 'వేటు'

• బీవోటీ విధానంపై విమర్శలు • చేజారుతున్న విలువైన ఆస్తులు • గవర్నర్‌పేట-2 డిపో స్థలంపై వివాదం • 'కార్పొరేట్' ఆధీనంలో గన్నవరం స్థలం • వ్యతిరేకిస్తున్న కార్మికులు



అమరావతి, ఆంధ్రప్రభ: రాష్ట్ర విభజన నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థకు చెందిన కోట్ల విలువైన ఆస్తులు ఒక్కొక్కటి ప్రైవేట్‌పరం అవుతున్నాయని కార్మిక సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. రాష్ట్రంలో సుమారు రెండు నుంచి మూడు వేల ఎకరాల ఆస్తులు ఆర్టీసీ కింద ఉన్నాయంటున్నారు. రాష్ట్ర విభజన నేపథ్యంలో ఏపీఎస్ఆర్టీసీ ఆస్తులకు భారీగా డిమాండ్ పెరిగింది. ఆ స్థలాలు ప్రధాన నగరాల నడిబొడ్డున ఉండడమే ఇందుకు ప్రధాన కారణం. ప్రైవేట్ మంత్రం జపిస్తున్న ఏపీఎస్ ఆర్టీసీ ఇప్పటికే రూ.3,900 కోట్ల నష్టాల ఊబిలో కూరుకుపోయి, గట్టెక్కే దారిలేక సతమతమవుతోంది. విజయవాడ నగరం నడిబొడ్డున కోట్లు విలువ చేసే 5 ఎకరాల ఆర్టీసీ స్థలాన్ని కూడా గుంజుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయి. కార్మిక సంఘాల వత్తిడి వల్ల ప్రభుత్వం కొంత వెనక్కితగ్గిందంటున్నారు. లేకుంటే ఆ 5 ఎకరాల స్థలం ఏ కార్పొరేట్ సంస్థకో దారాదత్తం చేసే వాళ్లని అంటున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఏపీఎస్ఆర్టీసీకి దాదాపు రూ.55వేల కోట్ల ఆస్తులున్నాయి. రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్‌లో ఏపీఎస్ఆర్టీసీకి సుమారు రూ.25వేల కోట్ల దాకా ఆస్తులున్నట్లు సమాచారం. ఈ విలువైన ఆస్తులను సంస్థ యాజమాన్యం కమర్షియల్‌గా అభివృద్ధి చేసి, కిరాయిలకు ఇస్తే నష్టాలు కనుచూపు మేరలో ఉండవంటున్నారు. కానీ యాజమాన్యం ఆ దిశగా చర్యలు తీసుకోకుండా ఉన్న ఆస్తులను ఏకంగా బీఓటీ పద్ధతిలో లీజుకిచ్చుకుంటూ పోవడం వల్ల సంస్థ మరింత నష్టాల ఊబిలోకి కూరుకుపోతుందంటున్నారు. బీవోటీ పద్ధతి అంటే ఆర్టీసీ స్థలాన్ని 33 ఏళ్లకు లీజుకు తీసుకుని, అందులో కట్టడాలు కట్టుకుని వినియోగించుకుని, లీజు అగ్రిమెంట్ పూర్తయిన తర్వాత ఆ కట్టడాలను ఆర్టీసీకి వదిలేయడం.అయితే ఇప్పటికే ఈ పద్ధతిలో వేల కోట్ల విలువైన ఆస్తులను ప్రైవేట్ వ్యక్తులు, సంస్థలకు దారాదత్తం చేయడం పట్ల విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికే రాష్ట్రంలో విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి, ఏలూరు, రాజమండ్రి, నెల్లూరు, ఒంగోలు తదితర ప్రాంతాల్లోని ఆర్టీసీ స్థలాలు ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్లిపోయాయి. అయితే ఈ స్థలాల్లో ఆర్టీసీనే కమర్షియల్ నిర్మాణాలు చేపట్టి, లీజుకు ఇస్తే పెద్ద ఎత్తున ఆదాయం వచ్చి, నష్టాలు ఊసే ఉండదని కార్మిక సంఘాలు అంటున్నా, ఆర్టీసీ యాజమాన్యానికి పట్టడం లేదనే విమర్శలున్నాయి. బీవోటీ పద్ధతిలో ఆర్టీసీ స్థలాలను లీజుకు తీసుకున్న వ్యక్తులు లాభపడుతుండగా, మరో వైపు సంస్థ రోజురోజుకు నష్టాల ఊబిలోకి కూరుకుపోతుండడం ఆందోళన కలిగిస్తోంది. రాష్ట్రంలో 128 డిపోలున్నాయి. దాదాపు 55వేల మంది కార్మికులు పని చేస్తున్నారు. 250 దాకా బస్ స్టేషన్లు ఉన్నాయి. ఒక్కో బస్ డిపోకు దాదాపు 10 ఎకరాల దాకా స్థలం ఉంది. కొన్నింటికి 15 ఎకరాలు దాకా ఉంది. మారిన కాలమాన పరిస్థితుల్లో ఇవి ప్రస్తుతం నగరాల నడిబొడ్డున ఉండడం వల్ల వీటికి భారీగా డిమాండ్ పెరగడంతో అందర్నీ కళ్లు వీటిపై పడ్డాయి. ఇంకేముందీ ఖరీదైన ఆర్టీసీ ఆస్తులు ఒక్కొటొక్కటిగా ప్రైవేట్‌పరం అవుతున్నాయి. అయితే ఆర్టీసీ గుర్తింపు సంఘమైన నేషనల్ మజ్దూర్ యూనియన్ మాత్రం ఈ విధానాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. విలువైన ఆస్తులను ప్రైవేట్ సంస్థలు, వ్యక్తులకు దారాదత్తం చేయడం వల్ల ఆర్టసీకి వచ్చేది కేవలం స్వల్ప ఆదాయం మాత్రమేనని, వాస్తవానికి లాభభపడేది ఆయా వ్యక్తులు మాత్రమేనని అంటోంది. కనుక ఈ విధానంలో మార్పు రావాల్సి అవసరం ఉందంటోంది. ఆర్టీసీనే వీటి నిర్వహణ బాధ్యతను తీసుకోవాల్సిన అవసరాన్ని యాజమాన్యం దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకునే దిక్కులేకుండాపోతుందంటున్నారు.ఎవరెన్ని విధాలుగా చెప్పినా వినిపించుకోని యాజమాన్యం ఒక వైపు ఉన్న విలువైన ఆస్తులను 33 ఏళ్లకు లీజుకు ఇవ్వడమే కాకుండా ఉన్న బస్‌స్టేషన్లు,డిపోలను కూడా బ్యాంక్‌ల వద్ద తాకట్టు పెట్టి మరీ రుణాలు తీసుకుంటూపోతుండడం వల్ల ఆర్టీసీపై కోలుకోలేని భారం పడుతుందంటున్నారు. శాశ్వత నిర్మాణాలు చేసిన వ్యక్తులు,సంస్థలు అంత తేలికగా వాటిని లీజు తర్వాత ఆర్టీసీకి ఇస్తారనే నమ్మకం లేదని, పైగా మళ్లీ లీజు అగ్రిమెంట్లు పొడిగించుకుంటూపోయే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయంటున్నారు. ఇలా ఉంటే ప్రభుత్వం ఆర్టీసీ పరిరక్షణకు సంస్కరణలు అంటూనే మరో వైపు సంస్థకు చెందిన కోట్ల రూపాయల విలువైన స్థలాలను బడా కార్పొరేట్ సంస్థలకు దారాదత్తం చేయడం పట్ల సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా కార్మిక వర్గం నుంచి ఆందోళన,వ్యతిరేకత వ్యక్తమవుతున్నా పట్టించుకోకుండా ముందుకుపోతున్నదని అంటున్నారు. కోట్లాది రూపాయల విలువైన స్థలాలను కాపాడి, సంస్థకు చేదోడు వాదోడుగా ఉండాల్సింది పోయి సంస్థను ఇబ్బందిపెట్టే విధంగా వ్యవహరించడం పట్ల వ్యతిరేకత వ్యక్తమవుతున్నది. ఆర్టీసీ స్థలాల్లో వాణిజ్య సముదాయాలు నిర్మించి,సంస్థను ఆర్థికంగా ఆదుకోవాలని నిర్ణయించిన ప్రభుత్వం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తోందంటున్నారు. విజయవాడ గవర్నర్‌పేట -2 బస్సు డిపో విషయంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మరిన్ని విమర్శలకు దారితీసింది. ఎంతో పురాతనమైన ఈ డిపోకు విజయవాడ నగరం నడిబొడ్డున 4.23 ఎకరాల స్థలం ఉంది. ప్రజలందరికీ అందుబాటులో ఉన్న ఈ డిపోను 1965 ప్రాంతంలో పాత బస్టాండ్ ఆవరణలో ఏర్పాటు చేశారు. ప్రైవేట్ సిటీ బస్సుల జాతీయకరణ సందర్భంలో దీని ఏర్పాటు జరిగింది. అప్పటి నుంచి ఈ డిపో ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతోంది. రెండు డిపోలకు సంబంధించిన పాలనపరమైన కార్యాలయాలు కూడా ఇక్కడే ఉన్నాయి. ఇక్కడ 200 బస్సులు పైబడి ఆపరేట్ చేయడమే కాకుండా దాదాపు ప్రతి రోజు 70వేల కిలోమీటర్లకు పైబడి సర్వీస్ చేయడం జరుగుతోంది. నూతనంగా ఏర్పాటు చేసిన సచివాలయానికి కూడా ఇక్కడ నుంచి 84 ట్రిప్పులను తిప్పుతున్నారు. దాదాపు 1400 మంది కార్మికులు ఉన్నారు. ఇందులో 200 మహిళా కార్మికులు కూడా సేవలందిస్తున్నారు. కాలుష్యరహిత నగరంగా విజయవాడను అభివృద్ధి చేయడంలో భాగంగా ప్రప్రథమంగా ఆర్టీసీలో కంప్రెస్డ్ నేచురల్ గ్యాస్ బస్సులను ఇక్కడ నుంచే ప్రవేశపెట్టడడం, లక్షలాది రూపాయలు ఖర్చు పెట్టి బస్సులకు గ్యాస్‌ఫిల్ చేయడానికి కూడా ఇక్కడే ఆర్టీసీ సొంతంగా బంక్‌ను కూడా ఏర్పాటు చేసుకున్నారు. ఇంతటి ఘన చరిత్ర కలిగి,ప్రజలకు ఎంతో సౌకర్యవంతంగా ఉన్న గవర్నర్‌పేట డిపో -2 స్థలాన్ని కాల్వగట్ల సుందరీకరణ పేరుతో ఖాళీ చేయాలని ప్రభుత్వం ఇటీవల ఆర్టీసీకి ఆదేశాలు జారీ చేయడం వివాదాస్పదంగా మారింది. దీంతో ఉద్యోగుల్లో కూడా అభద్రతాభావం ఏర్పడిందంటున్నా రు. కార్మికులు, ఆర్టీసీ గుర్తింపు యూనియన్ నేషనల్ మజ్దూర్ యూనియన్ (ఎన్ఎంయు) ఈ చర్యను తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. ఎట్టి పరిస్థితుల్లోను ఈ డిపో స్థలాన్ని ఖాళీ చేసేందుకు కార్మికులు, యూనియన్ నేతలు సిద్ధంగా లేకపోవడంతో ప్రభుత్వానికి ఏమి చేయాలో అర్థంకాని అయోమయ పరిస్థితి ఏర్పడి, ప్రస్తుతం మిన్నకుండిపోయింది. పైగా ఎన్నో కోట్ల విలువ చేసే గవర్నర్‌పేట -2 డిపో స్థలానికి ప్రత్యామ్నాయంగా ఎక్కడో ఊరి చివరిలో స్థలాన్ని చూపిస్తుండడాన్ని కార్మిక సంఘాలు వ్యతిరేకిస్తున్నాయి. ప్రజలందరికీ సౌకర్యవంతంగా ఉన్న స్థలాన్ని వదిలి ఊరి బయటకు పంపటమేమిటని ప్రశ్నిస్తున్నారు. కాగా ఈ స్థలానికి గతంలో ఆర్టీసీనే ప్రభుత్వానికి సొమ్ము చెల్లించి, స్వాధీనం చేసుకుంది. ఎంతో విలువ పెరిగిన నేపథ్యం లో ఇప్పుడెలా దానిని ఖాళీ చేస్తామని కార్మిక సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. ఇదిలా ఉంటే కొద్ది నెలల క్రితం గన్నవరంలోని ఆర్టీసీ శిక్షణ కళాశాలకు చెందిన 27 ఎకరాల స్థలాన్ని కూడా ప్రభుత్వం స్వాధీనం చేసుకుని, ఓ బడా కార్పొరేట్ సంస్థకు అప్పగించిందంటున్నారు. ఇది జరిగి నెలలు గడిచినా ఇంతవరకు ప్రత్యామ్నాయం చూపలేదంటున్నారు. కొన్ని కోట్ల విలువైన ఆ స్థలాన్ని కార్పొరేట్ సంస్థకు అప్పగించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో తాజాగా విజయవాడ నగరం నడిబొడ్డున ఉన్న విలువైన స్థలాన్ని కూడా ఖాళీ చేయాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావడంతో కార్మిక వర్గం భగ్గుమంటోంది. ఈ రెండింటి విలువ దాదాపు రూ.250 కోట్లకుపై మాటేనని అంటున్నారు. ప్రభుత్వ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని ఆర్టీసీ గుర్తింపు సంఘమైన నేషనల్ మజ్దూర్‌యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు చల్లా చంద్రయ్య కోరారు. ఇదే అంశంపై ఈనెల 18, 19 తేదీల్లో కూడా ధర్నాలు చేస్తున్నట్లు చెప్పారు. బీవోటీ విధానానికి స్వస్తి చెప్పాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు.

తిరుమలలో వైభవంగా పార్వేటి ఉత్సవం



తిరుమల, ప్రభ న్యూస్: తిరుమలలో శ్రీ వేంకటేశ్వరస్వామివారికి పార్వేట ఉత్సవం మకరసంక్రమణంనకు మరుసటి రోజున అనగా కనుమ పండగ రోజైన మంగళవారం అత్యత వైభవంగా జరిగింది. స్వామివారికి ప్రాతఃకాలారాధన పూర్తి అయిన తర్వాత శ్రీ మలయప్పస్వామివారు వెండి తిరుచ్చిలో, శ్రీకృష్ణస్వామివారు మరో తిరుచ్చిలో పార్వేట మండపంనకు చేరుకున్నారు. అనంతరం మలయప్పస్వామివారు, శ్రీకృష్ణస్వామివారు పార్వేటిలో ఉత్సవాహంగా పాల్గొన్నారు. శ్రీ మలయప్పస్వామివారి తరపున అర్చకులు మూడుసార్లు బాణం, ఈటెలు వేసి మాదిరి వేటను ప్రదర్శించి, భక్తులకు కనువిందు చేశారు. ఇంతటితో ఎంతో వేడుకగా జరిగే పార్వేట ఉత్సవం ఘనంగా ముగిసింది. ఈ పార్వేట ఉత్సవంలోటీటీడీఈవో అనిల్‌కుమార్‌సింఘాల్, తిరుమల జేఈవో శ్రీనివాసరాజు, ఇతర ఉన్నతాధికాలు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

అంజన్న సేవలో తెలంగాణా న్యాయమూర్తి, విజిలెన్స్ ఎస్‌పి

గుంతకల్లుఅర్బన్, ప్రభన్యూస్ : అనంతపురంజిల్లా కసాపురం శ్రీనెట్టికంటి ఆంజనేయస్వామి వారిని మంగళవారం తెలంగాణా రాష్ట్రం నల్గొండ జిల్లా ఏడిజె బిందేశ్వరి, అనంతపురం జిల్లా విజిలెన్స్ ఎస్‌పి. అనిల్‌కుమార్ దర్శించుకున్నారు. విఐపిల రాక సందర్భంగా ఆలయ అధికారులు సంప్రదాయ బద్ధంగా వారికి స్వాగతం పలికారు. అనంతరం శ్రీస్వామివారి సన్నిధి లో వారి పేరిట ప్రత్యేక పూజలు అర్చనలు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు గరు డాచార్యులు, సూపరిండెంట్ వెంకటేష్, వేమన్నలు వారికి తీర్థ ప్రసాదాలు అందజేశారు.



లోక్‌సభ బడ్జెట్ సమావేశాల తొలిరోజే

నియోజకవర్గాల పునర్విభజన బిల్లు

• సీఎంలకు ఇప్పటికే కేంద్రం సమాచారం

హైదరాబాద్, ఆంధ్రప్రభ : అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజన బిల్లును లోక్‌సభ బడ్జెట్ సమావేశాల ప్రారంభం రోజు ఫిబ్రవరి 29న ప్రవేశపెట్టేందుకు ప్రణాళికలు సిద్ధమవుతున్నట్టు తెలుస్తోంది. తెలుగు రాష్ట్రాలతో పాటు మరికొన్ని రాష్ట్రాల్లో శాసనభ నియోజకవర్గాలను పెంచాలని ఆయా ప్రభుత్వాలు కేంద్రంపై ఒత్తిడి తెస్తున్న సంగతి తెలిసిందే. రాష్ట్రానికి సంబంధించిన వివిధ అంశాలపై చర్చించేందుకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు ఇటీవల ఢిల్లీలో ప్రధాని నరేంద్రమోడీని కలిసిన సందర్భంలో నియోజకవర్గాల పెంపునకు సంబంధించిన అంశాన్ని తీవ్రంగా పరిశీలిస్తున్నట్లు చెప్పిన సంగతి తెలిసిందే. మరోవైపు కేంద్ర హోంశాఖ నియోజకవర్గాలను పెంచేందుకు ఉద్దేశించిన ముసాయిదా బిల్లును సిద్ధంచేసి ఇప్పటికే తుది ఆమోదం కోసం ప్రధానమంత్రి కార్యాలయానికి పంపించిందన్న ప్రచారం జరుగుతోంది. తెలంగాణలో ప్రస్తుతం ఉన్న 119 నియోజకవర్గాలు 153గా, ఏపీలో 175 నుంచి 225 నియోజకవర్గాలను చేయాలని ముఖ్యమంత్రులు కేసీఆర్, చంద్రబాబులు ఇదివరకే కేంద్రాన్ని మరీ ముఖ్యంగా ప్రధాని నరేంద్రమోడీకి విజ్ఞప్తి చేసిన సంగతి విదితమే. లోక్‌సభ సమావేశాలకు ముందు భారతీయ జనతాపార్టీ పార్లమెంటరీ బోర్డు సమావేశం, ఆ తర్వాత కేంద్ర మంత్రివర్గాన్ని సమావేశపరిచి ఇందులో ఈ బిల్లుపై తుదినిర్ణయం తీసుకునే అవకాశాలు మెండుగా ఉన్నాయని భాజపా అగ్రనేత ఒకరు చెప్పారు.

పెట్రో మంట ఎందుకో?

• పెరుగుతున్న ధరలు • సామన్యులపై పెను భారం • రవాణా రంగం కుదేలు • స్థానిక పన్నులే అధికం • జీఎస్టీలోకి తెస్తేనే మోక్షం

అమరావతి, ఆంధ్రప్రభ : పెట్రోలు, డీజిల్ ధరలు మండిపోతున్నాయి. ధరల పెరుగుదల ప్రభావం అన్ని రంగాలపై ఉంటుందన్న ఆందోళన వ్యక్తమవుతోంది. ఇప్పటికే నిత్యావసరాల ధరలు సామాన్యులకు అందుబాటులో లేకుండా పోయాయి. పెట్రోలు, డీజిల్ ధరలు ఇదే విధంగా పెరిగిన పక్షంలో ప్రజా, సరుకు రవాణా పెనుభారం అవుతుందని వాణిజ్య, వ్యాపార వర్గాలు భయాందోళన వ్యక్తం చేస్తున్నాయి. ప్రధానంగా నిత్యావసరాల ధరలు పెరిగే ప్రమాదం లేకపోలేదంటున్నారు. విజయవాడలో మంళవారం లీటర్ పెట్రోలు ధర రూ.76.92లు, డీజిల్ లీటర్ ధర రూ.68.79లు, పెట్రోలు ధరల కంటే డీజిల్ ధరలు పెరగడం ఆందోళనకరమైన పరిణామమని రవాణా రంగం నిపుణులు భావిస్తున్నారు. సరుకు, ప్రజా రవాణా పూర్తిగా డీజిల్‌పై ఆధారపడి ఉంది, పెరిగిన ఇంధన ధరలు సరుకు రవాణా రంగాన్ని కుదిపేసే పరిస్థితి నెలకొంటుందని లారీ యజమానులు సంఘం ఆందోళన వ్యక్తం చేసింది. ఇప్పటికే లారీల నిర్వహణ కష్టంగా మారిందని, డీజిల్, నిర్వహణ వ్యయం పెరిగిన పక్షంలో లారీలను నడిపించడం ఎట్టి పరిస్థితిలో లాభదాయకం కాబోదని పేర్కొన్నారు. ప్రజారవాణా రంగం కూడా ఆందోళనలో ఉంది. ఇప్పటికే నష్టాలతో నడుస్తున్న ప్రజా రవాణా రంగం ఇక భారాలను భరించలేమని స్పష్టం చేస్తుంది. ఆర్టీసీ అధికారులు తీవ్రమైన ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పెరిగిన భారాన్ని అంచనా వేస్తున్నారు. పెరిగిన భారాన్ని అంచనా వేస్తున్నారు. పెరిగిన భారాలను ప్రయాణికులు భరించడం అనివార్యం అంటున్నారు. నిత్యావసరాల వ్యాపారులు కూడా ఆందోళనలో ఉన్నారు. పెరిగిన రవాణా ఛార్జీలు వినియోగదారులు భరించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ధరలు పెరగడం అనివార్యం అంటున్నారు. పెట్రోలియం ఉత్పత్తుల ధరలు 2002 నుంచి ఇప్పటి వరకు 109 సార్లు పెరిగాయి. పెట్రోలు, డీజిల్‌తో పాటుగా లూబ్రికేషన్ల ధరలు కూడా అదుపు తప్పిపోతున్నాయి. అంతర్జాతీయ విపణిలో ఆయిల్ ధరలతో పాటుగా లూబ్రికేషన్ల ధరలు కూడా అదుపుతప్పిపోతున్నాయి. అంతర్జాతీయ విపణిలో ఆయిల్ ధరలతో పాటుగా పెట్రోల్, డీజిల్‌పై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విధించే అదనపు పన్నులు వినియోగదారులకు పెనుభారంగా మారాయి. జీఎస్‌టి అమలులోకి వచ్చిన తర్వాత వినియోగదారుల ఆందోళనను పరిగణలోకి తీసుకున్న కేంద్ర ప్రభుత్వం కొంత వరకు ఎక్సైజ్ పన్నును లీటరుకు రూ.2ల చొప్పున తగ్గించింది. రాష్ట్రాలు విధించే పన్నులను తగ్గించుకోవాలని కోరింది. పెట్రోలు, డీజిల్ పై పన్నులు తగ్గించుకోవడం సాధ్యంకాదని అత్యధిక రాష్ట్రాలు వెల్లడించాయి. రాబడిని తగ్గించుకుంటే సంక్షేమ పథకాలు కుంటుపడిపోతాయని ఆందోళన వ్యక్తం చేశాయి. పెట్రోలు, డీజిల్ అమ్మకాల ద్వారా వచ్చే రాబడి మొత్తాన్ని కేంద్రం భరించిన పక్షంలో పన్నులను ఉపసంహరించుకోవడానికి అభ్యంతరం ఉండబోదని పేర్కొన్నాయి. కేంద్రం ఈ ప్రతిపాదనను అంగీకరించే పరిస్థితిలో లేదు. లీటరుకు రూ.2ల ఎక్సైజ్ డ్యూటీని తగ్గించడంతో రూ.25 వేలు కోట్ల పన్ను రాబడి పడిపోయిందని కేంద్ర ప్రభుత్వం తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వాలు స్థానిక పన్నులతో పాటుగా వ్యాట్‌ను పెట్రోల్ డీజిల్‌పై అమలు చేస్తున్నాయి. తెలంగాణ ప్రభుత్వం పెట్రోల్‌పై అమలు చేస్తున్నాయి. తెలంగాణ ప్రభుత్వం పెట్రోల్‌పై 35.2 శాతం, డీజిల్‌పై 27 శాతం శాతం వ్యాట్‌ను వసూలు చేస్తుం ది. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలు స్థానిక పన్నులను తగ్గించు కనే పక్షంలో తెలంగాణ కూడా దాదాపు 5 శాతం అదనపు పన్నులను తగ్గించుకొనే అవకాశం తెలంగాణలో మద్యం, పెట్రోలియం ఉత్పత్తుల విక్రయాలపై పన్నుల భారాలను తగ్గించడం సాధ్యంకాదని ఉన్నతాధికార వర్గాలు పేర్కొన్నాయి. పెట్రోలియం కంపెనీలు రోజు వారీ ధరలను అమలు జరుపుతున్నాయి. ప్రతి రోజు ఉదయం ఆరు గంటల సమయంలో ఆ రోజు పెట్రోలు, డీజిల్ ధరలను పరిగణలోకి తీసుకొని ధరలను స్థిరీకరిస్తున్నందున కొన్ని సందర్భాల్లో ధరలు తగ్గడం, పెరగడం సహజమైంది. తగ్గడం కంటే కూడా పెరగడం ఎక్కువగా ఉందని పెట్రోలియం డీలర్ల సంఘాలు పేర్కొన్నాయి. పెట్రోలు, డీజిల్ విక్రయాలను జీఎస్‌టి పరిధిలోనికి తేవాలని అన్ని వర్గాలు కోరుకుంటున్నాయి.

బాలింతలకు వరం

అన్న అమృతహస్త పథకం

• నిత్యం అంగన్‌వాడీల ద్వారా పౌష్టికాహారం • అన్నం, ఆకుకూర పప్పు, పాలు, గుడ్డు సరఫరా • ఏడాదికి రూ.431.40 కోట్లు ఖర్చు చేస్తున్న చంద్రబాబు ప్రభుత్వం

అమరావతి, ఆంధ్రప్రభ: రాష్ట్రంలోని స్త్రీ, శిశు సంక్షేమానికి పెద్దపీట వేస్తున్న చంద్రబాబు ప్రభుత్వం వారి ఆరోగ్య సంరక్షణకు ప్రథమ ప్రాధాన్యాన్ని ఇస్తూ అద్భుతమైన పథకాలను అమలు చేస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా పౌష్టికాహార లోపం, రక్తహీనతలు మహిళల పాలిట శాపాలుగా మారుతూ ప్రసవ సమయంలోనే అధికంగా మాతా, శిశు మరణాలకు దారితీస్తున్నాయని నివేదికలు చెబుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆరోగ్యాంధ్ర ప్రదేశ్ లక్ష్యంగా ముందుకు సాగుతున్న చంద్రబాబు ప్రభుత్వం మహిళ గర్భం దాల్చిన సమయం నుంచే ఆమెకు పౌష్టికాహారం అందిస్తూ క్రమం తప్పని ఆరోగ్య పరీక్షలతో ఆరోగ్యవంతమైన పిల్లలు పుట్టేందుకు కృషి చేస్తోంది. దీని కోసం అన్న అమృతహస్త పథకాన్ని ప్రారంభించి ప్రతి రోజు పూర్తిస్థాయి పోషకాలు కలిగిన భోజనాన్ని గర్భిణీలకు, బాలింతలకు అందజేస్తోంది. ఈ పథకం కోసం ఏడాదికి రూ.431.40 కోట్లును చంద్రబాబు సర్కార్ ఖర్చు చేయడం జరుగుతోంది. అన్న అమృత హస్త పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయడంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నటువంటి 257 ఐసీడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని 55,607 అంగన్‌వాడీ కేంద్రాలు కీలకపాత్రను పోషిస్తున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాల్లో నియమించిన అంగన్‌వాడీ వర్కర్లు తమ కేంద్రం పరిధిలోని గర్భిణీలను, బాలింతలను గుర్తించి వారిని అంగన్ వాడీ కేంద్రాలకు తీసుకువచ్చి పౌష్టికాహారం, వ్యాధి నిరోధక టీకాలు, ఆరోగ్య పరీక్షలు, పిల్లల పెరుగుదలపై తల్లులకు సలహాలు, రిఫెరల్ సేవలు, పోషణ, విద్యను అందించడం జరుగుతోంది.



పోషక విలువలతో కూడిన భోజనం..

అన్న అమృతహస్త పథకం ద్వారా ప్రతి రోజు మధ్యాహ్న సమయంలో గర్భిణీ, బాలింతలకు సరఫరా చేసే భోజనం పూర్తిస్థాయి పోషక విలువలతో నిండి ఉంటుంది. నిత్యం అందించే అన్నం, ఆకుకూర, కాయగూర పప్పు, 200 మి.లీ. పాలు, గుడ్డు, ఐరన్ మాత్రలు ద్వారా 1,053 కిలో క్యాలరాలు, 33 గ్రాముల ప్రొటీన్, 500 గ్రాముల కాల్షియం గర్భిణీలకు, బాలింతలకు అందుతుంది. ఇలా రాష్ట్రవ్యాప్తంగా అంగన్ వాడీల ద్వారా భోజనం అందుకుంటున్న గర్భిణీల వివరాలను పరిశీలిస్తే శ్రీకాకుళంలో 18,083, విజయనగరంలో 16,041, విశాఖపట్నంలో 26,858, తూర్పు గోదావరిలో 34,922, పశ్చిమ గోదావరిలో 21,855, కృష్ణా జిల్లాలో 22,786, గుంటూరులో 28,122, ప్రకాశంలో 23,700, నెల్లూరులో 18,157, చిత్తూరులో 24,546, కడపలో 22,080, కర్నూలులో 40,909, అనంతపురంలో 32,700 మంది గర్భిణీలు ఈ పథకం ద్వారా లబ్ధిపొందుతున్నారు. అలాగే బాలింత వివరాలను పరిశీలిస్తే శ్రీకాకుళంలో 19,565, విజయనగరంలో 15,487, విశాఖపట్నంలో 25,673, తూర్పు గోదావరిలో 32,307, పశ్చిమ గోదావరిలో 22,935, కృష్ణా జిల్లాలో 22,155, గుంటూరులో 27,751, ప్రకాశంలో 24,328, నెల్లూరులో 19,229, చిత్తూరులో 26,892, కడపలో 22,828, కర్నూలులో 40,307, అనంతపురంలో 35,001 మంది బాలింతలు ఈ పథకం ద్వారా లబ్ధిపొందుతున్నారు.

తల్లి, బిడ్డల ఆరోగ్య సంరక్షణే లక్ష్యం: మంత్రి పరిటాల సునీత

ఆరోగ్యాంధ్రప్రదేశ్ లక్ష్యంగా పాలన సాగిస్తున్న టీడీపీ ప్రభుత్వం మహిళ గర్భం దాల్చినప్పటి నుంచి ఆరోగ్యవంతమైన శిశువును ప్రసవించే వరకు నిత్యం పౌష్టికాహారం అందజేస్తూ తల్లి, బిడ్డలు ఆరోగ్యంగా ఉండేందుకు కృషి చేస్తోందని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి పరిటాల సునీత తెలియజేశారు. రాష్ట్రంలోని మహిళలకు పెద్దన్నలా వ్యవహరిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు మహిళా ఆరోగ్య సంరక్షణకు పెద్దపీట వేస్తూ ప్రారంభించిన అన్న అమృత హస్త పథకం గర్భిణీ, బాలింతల పాలిట వరంలా మారిందన్నారు. ఈ పథకం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా 7.40 లక్షల మంది లబ్ది పొందుతున్నారని, వీరికి అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పోషక విలువలతో కూడిన ఆహారం కోసం ప్రతి నెల రూ.35.95 కోట్లను ప్రభుత్వం ఖర్చు చేస్తోందని తెలిపారు.

Dwaraka
ఆంధ్రప్రభ

క్రీడాప్రభ

సాహా స్థానంలో కార్తీక్

సెంచూరియన్: దక్షిణాఫ్రికా టూర్లో ఉన్న ఇండియా జట్టులోకి దినేశ్ కార్తీక్ రానున్నాడు. వికెట్ కీపర్ వృద్ధిమాన్ సాహా ప్రాక్టీస్ మ్యాచ్‌లో గాయపడటంతో కార్తీక్‌కు ఈ అవకాశం దక్కింది. ఈ నెల 24న ప్రారంభం కానున్న చివరి టెస్ట్ మ్యాచ్‌కు కార్తీక్‌ను ఎంపిక చేసినట్లు ఆలిండియా సీనియర్ సెలక్షన్ కమిటీ మంగళవారం ప్రకటించింది. సాహా ప్రస్తుతం దక్షిణాఫ్రికాతో జరుగుతున్న రెండో టెస్ట్‌లో ఆడటం లేదు. 'జనవరి 11న ప్రాక్టీస్ సెషన్లో సాహా కాలి కండరాలు పట్టేయగా ఆయన మధ్యలోనే ఆటనుంచి విరమించాడు. ఆయన ఇంకా పూర్తి తిరిగి మామూలు స్థితికి రాలేదు. మూడో టెస్టుకు సాహా స్థానంలో దినేశ్ కార్తీక్‌ను జట్టులోకి తీసుకున్నాం' అని బీసీసీఐ తాత్కాలిక కార్యదర్శిగా పనిచేస్తున్న అమితాబ్ చౌదరీ ప్రకటించారు.

32 ఏళ్ల కార్తీక్ ఇప్పటివరకు 23 టెస్టులాడాడు. చివరగా 2010లో బంగ్లాదేశ్‌తో ఆడాడు. తన టెస్ట్ కెరియర్ లో ఇప్పటివరకు 51 క్యాచ్‌లు పట్టి ఐదు స్టంపింగ్‌లు ఖాతాలో జమచేసుకున్నాడు.



పపువా న్యూగినియాపై భారత్ గెలుపు

- పృథ్వీ షా 57 నాటౌట్, పీఎన్‌జీ 64 ఆలౌట్
- మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అనుకుల్ రాయ్

అండర్-19 వరల్డ్‌కప్

మౌంట్ మౌన్‌గ్యాన్యూ: న్యూజిలాండ్‌లో జరుగుతున్న ఐసిసి వరల్డ్ కప్ యు-19లో మంగళవారం స్థానిక బే ఓవల్ మైదానంలో జరిగిన మ్యాచ్‌లో భారత్ 10 వికెట్ల తేడాతో పపువా న్యూగినియాపై అలవోకగా గెలిచింది. ఈ గెలుపుతో భారత్ క్వార్టల్ ఫైనల్‌కు ప్రవేశించడానికి మార్గం సుగమం అయింది. గ్రూప్ బి లో అగ్ర స్థానంలో నిలిచిన జూనియర్ భారత జట్టు 4 పాయింట్లతో 3.890 నెట్ రన్‌రేట్‌తో క్వార్టర్ ఫైనల్స్‌కు కొన్ని అంగుళాల దూరంలో ఉంది. కెప్టెన్ పృథ్వీ షా అద్భుతమైన బ్యాంటింగ్‌తో 57 పరుగులు చేసి అజేయంగా నిలవగా, బౌలింగ్‌లో స్పిన్నర్ అనుకుల్ రాయ్ పపువా న్యూగినియా జట్టుపై విరుచుకుపడి ఐదు వికెట్లు తీసి భారత గెలుపులో కీలకంగా మారి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును సొంతం చేసుకున్నాడు. రాయ్ తన బౌలింగ్ స్పెల్‌లో 6.5 ఓవర్లు బౌలింగ్ చేసి 14 పరుగులిచ్చాడు. టాస్ గెలిచిన భారత కెప్టెన్ పృథ్వీ షా బౌలింగ్‌ను ఎంచుకున్నాడు. శివం మావి, కమలేష్ నాగర్‌కోటీలు భారత బౌలింగ్‌ను ప్రారంభించారు. శివ తన మూడో ఓవర్లో మహురును ఎల్బీడబ్ల్యుగా ఔట్ చేశాడు. అనంతరం మరో ఓపెనెర్ సిమన్ అటాయ్, లేని రన్‌కోసం ప్రయత్నించి రనౌట్ అయ్యాడు. ఆ తర్వాత వచ్చిన పపువా బ్యాట్స్‌మన్లెవరూ కూడా నిలదొక్కుకోలేకపోయారు. భారత స్పిన్నర్ తన అద్భుత స్పిన్‌తో పపువా బ్యాట్స్‌మన్లను నడ్డివిరిచాడు. మొత్తానికి పపువా ఇన్నింగ్స్ 21.5 ఓవర్లలో 64 పరుగులు చేసి ఆలౌట్ అయింది. పపువా ఇన్నింగ్స్‌లో రెండంకెలు స్కోరు చేసింది ఓపెనర్లు మాత్రమే ఓవియా సామ్ (15), సిమన్ అటాయ్ (13). అనంతరం బ్యాంటింగ్ దిగిన భారత జూనియర్ ఆటగాళ్లు వికెట్ నష్టపోకుండా లక్ష్యాన్ని కేవలం 8 ఓవర్లోనే ఛేదించారు. పృథ్వీ షా అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడి 39 బంతుల్లో 57 పరుగులు చేసి నాటౌట్‌గా నిలిచాడు. ఇందులో 12 బౌండరీలున్నాయి. ఈ టోర్నీలో షాకిది రెండో అర్ధ సెంచరీ. భారత బౌలర్లలో శివం మావి రెండు వికెట్లు తన ఖాతాలో వేసుకోగా, కమలేష్ నాగర్‌కోటీ, అర్షదీప్ సింగ్ చెరో వికెట్ తీశారు. ఈ నెల 19 భారత్ జింబాబ్వే జట్టుతో తలపడునుంది.


పృథ్వీ షా
అనుకుల్ రాయ్ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్

స్కోరుబోర్డు

పపువా న్యూగునియా (యు-19)- 64/21.5 ఓవర్లలో ఆలౌట్

బౌలింగ్: శివం మావి 5-0-16-2, కమలేష్ నాగర్ కోటీ 6-3-17-1, అనుకుల్ సుధాకర్ రాయ్ 6.5-2-14-5, అర్షదీప్ సింగ్ 3-0-10-1, శివ సింగ్ 1-0-1-0

భారత్ బ్యాటింగ్: పృథ్వీ షా నాటౌట్ 57, మనోజ్ కర్లా 9 నాటౌట్

బౌలింగ్: సెమోకమియా 3-0-27-0, జేమ్స్ టావు 4-0-28-0, లెకె మోరియా 1-0-11-0

మరో మ్యాచ్‌లో ఐర్లండ్‌పై పాక్ గెలుపు

వాంగ్రెయ్ సిటీలోని కోభం ఓవల్ మైదానంలో జరిగిన అండర్-19 ప్రపంచకప్ మరో మ్యాచ్‌లో పాకిస్తాన్ (యు-19) జట్టు ఐర్లండ్(యు-19)పై 9వికెట్ల తేడాతో గెలిచింది. టోర్నీలో ఇప్పటివరకు రెండు మ్యాచ్‌లాడిన పాక్ ఒక మ్యాచ్‌లో గెలిచి మరో మ్యాచ్‌లో ఓడిపోయింది. నేటి మ్యాచ్‌లో ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా షహీన్ ఆఫ్రిదీ నిలిచాడు. టాస్ గెలిచి బౌలింగ్ ఎంచుకున్న పాక్ ఐర్లండ్ జట్టును 28.5 ఓవర్లకే కట్టడి చేసింది. ఐర్లండ్ మొత్తం 97 పరుగులు చేసి ఆలౌటయింది. పాక్ బౌలర్లలో ఆఫ్రిదీ గొప్పగా రాణించి 8.5 ఓవర్లలో 15 పరుగిలిచ్చి ఐర్లండ్ జట్టు ఆరు వికెట్లు తీశాడు. పాక్ 98 పరుగుల లక్ష్యాన్ని ఒక వికెట్ కోల్పోయి సాధించింది.

ఐలీగ్‌లో నెరొకా ఎఫ్‌సి విజయం

వాస్కో: స్థానిక తిలక్ స్టేడియంలో జరిగిన ఐ లీగ్ ఫుట్‌బాల్ టోర్నీలో నెరొకా ఎఫ్‌సి, ఇండియన్ ఆరోస్‌ను 2-0 గోళ్ల తేడాతో ఓడించింది. మంగళవారం జరిగిన ఈ మ్యాచ్‌లో రెండు జట్లు హోరాహోరీగా పోరాడాయి. తొలి హాఫ్‌లో నెరొకా అనేక మార్లు బంతిపై ఆదీనంలో ఉంచుకోవడానికి ప్రయత్నించింది. అందులో సఫలీకృతమయినప్ప టికి నెరొకా జట్టు గోల్లను చేయడంలో విఫలమైంది. 18వ నిమిషంలో ఆరోస్ డిఫెండర్ అన్వర్ అలీ సెల్ఫ్ గోల్ చేయడంతో నెరొకాకు 1-0 ఆధిక్యం వచ్చింది. రెండవ హాఫ్‌లో నెరొకా జట్టు మరో గోల్ చేయడంతో 2-0 తేడాతో నెరొకా గెలుపొం దింది. ఈ విజయంతో నెరొకా పాయింట్ల పట్టికలో మూడవ స్థానంలో నిలిచింది. మొత్తం 9 మ్యాచ్‌ల్లో 18 పాయింట్లు సాధించింది. పట్టికలో రెండవ స్థానంలో ఈస్ట్ బెంగాల్ 19 పాయింట్లను కలిగివుంది. మినర్వా జట్టు 9 మ్యాచ్‌లాడి 22 పాయింట్లతో టాప్‌లో ఉంది. కాగా ఆరోస్ జట్టు 11 మ్యాచ్‌లాడి 10 పాయింట్లతో ఏడవ స్థానంలో ఉంది.

ప్రొ లీగ్ రెజ్లింగ్‌లో ఒలింపిక్స్ విజేతపై పూజ విజయం

న్యూఢిల్లీ: ప్రొ రెజ్లింగ్ లీగ్‌లో భాగంగా మంగళవారం జరిగిన పోటీలో పంజాబ్ రాయల్స్ జట్టులోని లాత్వియా దేశానికి చెందిన అనస్తాసిజా గ్రిగోర్‌జివా, భారత్ రెజ్లర్ పూజా దాండాలు తమ అద్భుత ప్రతిభతో హర్యానా హ్యామ్మర్స్ రెజ్లర్లపై 4-3 తేడాతో విజయం సాధించారు. తొలుత 62 కేజీల విభాగంలో జరిగిన పోటీలో అనస్తాసిజా తన ప్రత్యర్థి హర్యానా హ్యామ్మర్స్ రెజ్లర్ సరితపై 6-0 తేడాతో విజయం సాధించింది. అనంతరం 57 కేజీల విభాగంలో జరిగిన మరో పోటీలో పంజాబ్ రాయల్స్(పూజ) హర్యానా హ్యామ్మర్స్(ఒలింపిక్ ఛాంపియన్ అమెరికాకు చెందిన హెలెన్ మారొాయులిస్)పై 7-6 తేడాతో విజయం సాధించింది. పూజ తన కెరియర్‌లోనే అత్యున్నత విజ యంగా ఇది మిగిలిపోయింది. చివరి మ్యాచ్‌లో హర్యానా హ్యామ్మర్స్(రొవిల్‌జిత్ సింగ్) పంజాబ్(నసీర్‌పై) 9-0 తేడాతో గెలిచాడు. మిగతా పోటీల్లో రెండు జట్ల రెజ్లర్లు పోటాపోటీగా సాగారు చివరగా పంజాబ్ రాయల్స్ తన విజయాలతో 4-3 తేడాతో హ్యామ్మర్స్‌పై విజయం సాధించింది.


హెలెన్ పూజ

పోరాడుతున్న భారత్

- గెలుపు లక్ష్యం 287
- నాలుగో రోజు ఆట ముగిసే వరకు భారత్ 35/3
- ఆదుకుంటాడనుకున్న కోహ్లీ చేతులెత్తేశాడు

సెంచూరియన్: దక్షిణాఫ్రికాతో జరుగుతున్న రెండో టెస్ట్ మ్యాచ్‌లో సఫారీలు గెలుపే లక్ష్యంగా దూసుకుపోతున్నారు. నాలుగో ఆటలో సఫారీ జట్టు తన రెండో ఇన్నింగ్స్‌లో 250 పరుగులకు ఆలౌట్ అయి మొత్తం 287 పరుగుల ఆధిక్యంను భారత్ ముందు లక్ష్యంగా ఉంచింది. అనంతరం రెండో ఇన్నింగ్స్ బ్యాటింగ్ ప్రారంభించిన భారత్ బ్యాట్స్‌మన్‌లు సఫారీల బౌలింగ్‌ను ధైర్యంగా ఎదుర్కొంటూ లక్ష్య ఛేదన ప్రారంభించారు. అయితే 8వ ఓవర్లో భారత్‌కు ఎదురుదెబ్బ తగిలింది. రబాడా బౌలింగ్‌లో విజయ్(9) క్లీన్‌బౌల్డ్ అయ్యాడు. అప్పటికి భారత స్కోరు 11 పరుగులు మాత్రమే. అనంతరం బ్యాటింగ్‌కు వచ్చిన పూజారా, రాహుల్‌కు జతకలిశాడు. అయితే 12 ఓవర్లో ఎన్‌గిడి బౌలింగ్‌లో రాహుల్ 4 పరుగులు చేసి మహరాజ్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. అనంతరం బ్యాటింగ్‌కు వచ్చిన కెప్టెన్ కోహ్లీ తొలి ఇన్నింగ్స్‌లో ఆటను ఆడతాడాని అందరూ వూహించారు. కాని కోహ్లీ 20 బంతులను ఎదుర్కొని కేవలం 5 పరుగులు చేసి ఎన్‌గిడికి ఎల్బీడబ్ల్యుగా వికెట్ల ముందు దొరికిపోయాడు. వికెట్ కీపర్ పృథ్వీ పటేల్ పూజారాతో కలిసి నాలుగో రోజు ఆట ముగిసే సమయానికి 23 ఓవర్లు ఆడి జట్టు స్కోరును 35 పరుగులకు చేర్చారు. బౌలర్లకు సహకరిస్తున్న ఈ పిచ్‌పై భారత్ గెలుపు అంత అశావాషి కాదని తేలిపోయింది. ఆట చివరి రోజు ఏదైనా చమత్కారం జరిగితే తప్ప భారత్ గెలవడమో మ్యాచ్ డ్రా కావడం జరిగే అవకాశముందని క్రీడా విశ్లేషకుల అంచనా.

దక్షిణాఫ్రికా తన తొలి ఇన్నింగ్స్‌లో 335 పరుగుల చేసి ఆలౌట్ కాగా, భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 307 పరుగులకు ఆలౌటయింది. భారత ఇన్నింగ్స్‌లో కెప్టెన్ 153 పరుగులు చేసి దక్షిణాఫ్రికాలో అత్యధిక పరుగులు సాధించిన నాలుగో ఆసియన్‌గా రికార్డును తనపేర నమోదు చేసుకున్నాడు. గతంలో సచిన్ టెండూల్కర్ 1997, 2001లో వరుసగా 169, 155 పరుగులు చేశాడు. చటేశ్వర్ పూజారా 2003లో 153 పరుగుల చేశాడు. కాగా కోహ్లీ తన ఇన్నింగ్స్‌లో 217 బంతులనెదుర్కొని 153 పరుగులు చేశాడు. మొత్తం 15 ఫోర్లు కొట్టాడు. భారత ఇన్నింగ్స్‌లో ఒక్క సిక్సర్ క ూడా నమోదు కాలేదు. తొలి ఇన్నింగ్స్ 28 పరుగుల ఆధిక్యంతో సఫారీ జట్టు రెండో ఇన్నింగ్స్‌ను ప్రారంభించింది. భారత పేసర్ల త్రయం, బుమ్రా, ఇషాంత్, షమీలు రాణించారు. కాగా స్పిన్నర్ ఈ ఆశ్విన్ లాంగ్ స్పెల్ బౌలింగ్ వేసినప్పటికి ఒక్క వికెట్‌ను మాత్రమే దక్కించుకున్నాడు. ఓపెనెర్ మర్‌క్రంను బుమ్రా 1 పరుగుకే ఎల్బీడబ్ల్యుగా పెవిలియన్‌కు పంపగా, అనంతరం ఆయన స్థానంలో వచ్చిన ఆమ్లా వికెట్‌ను కూడా బుమ్రానే దక్కించుకున్నాడు. అప్పటికే సఫారీల స్కోరు మూడు పరుగులు మాత్రమే. ఈ దశలో బ్యాటింగ్ వచ్చిన సఫారీ బ్యాట్స్‌మన్ డి విల్లియర్స్ నాటౌట్‌గా ఉన్న మరో ఓపెనెర్ డీన్ ఎల్గర్‌కు జతకలిసి దాటిగా బ్యాటింగ్ చేశారు. భారత పేసర్లు వారిని ఏమాత్రం నిలువరించలేకపోయారు. 42వ ఓవర్లో మహ్మద్ షమీ వేసిన బంతిని ఆడబోయిన డి విల్లియర్స్ తన వ్యక్తిగత స్కోరు 80 పరుగుల వద్ద వికెట్ కీపర్ పృథ్వీపటేల్‌కు క్యాచ్ ఇచ్చి ఔటవ్వడంతో భారత్ ఊపిరి పీల్చుకుంది. 46 వ ఓవర్లో ఎల్గర్(61) షమీ బౌలింగ్‌లో రాహుల్ క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. అప్పటికే క్రీజులో ఉన్న డు ప్లెసిస్‌తో, డికాక్ జత కలిశాడు. అయితే డికాక్ 12 పరుగులు చేసి షమీ బౌలింగ్‌లో వికెట్ కీపర్ పటేల్‌కు క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. ఆ తర్వాత వచ్చిన బ్యాట్స్‌మన్లు అంతగా పరుగులు చేయలేదు. కొరకరాని కొయ్యగా తయారైన డు ప్లెస్సిస్(48) 89వ ఓవర్లో బుమ్రా బౌలింగ్‌లో అతనికే క్యాచ్ ఇచ్చి పెవిలియన్‌కు వెనుతిరిగాడు. చివరి వికెట్‌గా లుంగిసని లిజిడి 1 పరుగుచేసి ఆశ్విన్ బౌలింగ్‌లో విజయ్‌కు క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. మొత్తం 10 వికెట్లకు సఫారీలు 258 పరుగులు చేసింది. సఫారీ జట్టు తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో కలిపి చూస్తే భారత్ గెలవాలంటే 287లు సాధించాల్సి ఉంటుంది.





స్కోరుబోర్డు

దక్షిణాఫ్రికా తన తొలి ఇన్నింగ్స్ 335

భారత్ తొలి ఇన్నింగ్స్ 307

భారత్ తొలి ఇన్నింగ్స్:దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్: మర్‌క్రమ్ ఎల్బీడబ్ల్యు (బి) బుమ్రా1, ఎల్గర్ (సి) రాహుల్ (బి) షమీ 61, ఆమ్లా ఎల్బీడబ్ల్యు (బి) బుమ్రా1, డివిలియర్స్ (సి) పృథ్వీ పటేల్ (బి) షమీ 80, డు ప్లెసిస్ (సి అండ్ బి) బుమ్రా 48, డి కాక్ (సి) పృథ్వీ పటేల్ (బి) షమీ12, ఫిలాండర్ (సి) విజయ్ (బి) ఇశాంత్ 26, కేశవ్ మహరాజ్ (సి) పృథ్వీ పటేల్ (బి) ఇశాంత్ 6, రబాడా (సి) కోహ్లీ (బి) షమీ 4, మోర్కెల్ నాటౌట్ 10, ఎన్‌గిడి (సి) విజయ్ (బి) అశ్విన్ 1, ఎక్స్‌ట్రాలు 8, మొత్తం 258 ఆలౌట్(91.3 ఓవర్లు), వికెట్ల పతనం: 1-1, 3-2, 144-3, 151-4, 163-5, 209-6, 215-7, 245-8, 245-9, 258-10, బౌలింగ్: బుమ్రా 20-3-70-3, షమి 16-3-49-4, ఇషాంత్ 17-3-40-2, పాండ్య 9-1-14-0, అశ్విన్ 29.3-6-70-1.

భారత్ రెండో ఇన్నింగ్స్: విజయ్ (బి) రబాడా 9, రాహుల్ (సి) మహరాజ్ (బి) ఎన్‌గిడి 4, పుజారా బ్యాటింగ్ 11, కోహ్లి ఎల్బీడబ్ల్యు (బి)ఎన్‌గిడి 5, పృథ్వీ ప టేల్ బ్యాటింగ్ 5., **బౌలింగ్:** కేశవ్ మహరాజ్ 1 -0-1-0, మోర్కెల్ 5-3-4 -0, ఫిలాండర్ 6-3-6-0, రబాడా 5-2-9-1, ఎన్‌గిడి 6-2-14-2



ఆస్ట్రేలియన్ ఓపెన్ రెండో రౌండ్లోకి

షరపోవా, కెర్బర్

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియా ఓపెన్‌లో మాజీ ఛాంపియన్లు మారియా షరపోవా, అంజలిక్ కెర్బర్ రెండో రౌండ్లోకి ప్రవేశించారు. మండే ఎండలతో ఒకింత కంగారుకు గురైన షరపోవా, కెర్బర్‌లో కోర్టులోకి రావడానికి కొంచెం సమయం తీసుకున్నారు. నిషిద్ధ ఉత్ప్రేరేకం మెల్డోనియంను తీసుకుని గత ఏప్రిల్‌లో 15ఏళ్లపాటు నిషేధానికి గురైన షరపోవా తిరిగి మునపటి ఆటను అందిపుచ్చుకోవడానికి ప్రయత్నం చేస్తోంది. 2008లో మెల్‌బోర్న్ పార్క్ ఛాంపియన్‌గా నిలిచిన షరపోవా ప్రస్తుతం 48వ ర్యాంక్‌లో ఉంది. మంగళవారం జరిగిన మ్యాచ్‌లో షరపోవా, జర్మనీకి చెందిన టట్జానా మరియాపై 6-1,6-4 తేడాతో గెలిచింది. తర్వాత జరిగే మ్యాచ్‌లో షరపోవా లాత్వియా దేశానికి చెందిన 14 సీడెడ్ అనస్టాసిజా సెవస్టోవా లేదా అమెరికన్ క్రీడాకారిణి వార్వారా లెప్చెంకోతో షరపోవా తలపడనుంది. 2016లో ట్రోఫీని గెల్చుకున్న జర్మనీ క్రీడాకారిణి కెర్బర్ 6-0, 6-4 వరుస సెట్లలో అన్నా లెనా ఫ్రెడ్‌సామ్‌ను ఓడించింది. కాగా ఆరవ సీడ్ కరోలినా ప్లిస్‌కోవా, ఎనిమిదో సీడ్ కరోలినా గార్సియాలు కూడా తమ ప్రత్యర్థులను ఓడించి టోర్నీలో ముందుకు సాగుతున్నారు. పురుషుల సింగిల్స్‌లో ఆరు సార్లు ఛాంపియన్‌గా నిలిచిన సెర్బియా ఆటగాడు నొవక్ డిజకోవిక్ తొలి రౌండ్లో అన్‌సీడెడ్ అమెరికన్ ఆటగాడు డొనాల్డ్ యంగ్‌పై 6-1, 6-2, 6-4 తేడాతో గెలిచాడు. మరో మ్యాచ్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ స్విట్జర్లాండ్ ఆటగాడు రోజర్ ఫెదరర్ బ్రిటన్ ఆటగాడు అల్‌జాజ్ బెడెనీని 6-3, 6-4,6-3 వరుస సెట్లలో ఓడించి రెండో రౌండ్లోకి ప్రవేశించాడు. తర్వాత రౌండ్లో ఫెదరర్ జర్మనీకి చెందిన జాన్ లియోనార్డ్‌తో తలపడనున్నాడు.



మమ్మల్ని పట్టించుకోరా?

ఆఫ్ఘనిస్తాన్ టెస్ట్ మ్యాచ్‌పై బిసిసిఐలో విభేదాలు

కోల్‌కతా: భారత్‌లో ఆఫ్ఘనిస్తాన్ ఆడే చారిత్రక టెస్ట్ మ్యాచ్‌పై సందిగ్ధత తొలగిపోలేదు. ఒకవైపు బిసిసిఐ కార్యదర్శి అమితాబ్ చౌదరీ, సీఈవో రాహుల్ జోహ్రీ మంగళవారం ఒక ప్రకటన చేస్తూ.. బెంగళూరులో జూన్ 14-18 వరకు రెండు జట్ల మధ్య టెస్టు మ్యాచ్ జరుగుతుందని ప్రకటించారు. ఇది ఆఫ్ఘనిస్తాన్‌కు తొలి టెస్ట్ మ్యాచ్. అయితే దీనిపై బిసిసిఐ ఉన్నతాధికారులు నోరు మెదపడంలేదు. ముఖ్యంగా బిసిసిఐ తాత్కాలిక అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్న సికె. ఖన్నా, కోశాధికారి అనిరుద్ చౌదరీ సీనియర్ సభ్యుడు రాజీవ్ శుక్లాలు ఈ చారిత్రక టెస్ట్ మ్యాచ్‌పై తమను సంప్రదించలేదని అంటున్నారని పీటీఐ వార్తల సమాచారం. ఏదేశంతోనైనా అంతర్జాతీయ మ్యాచ్‌లాడేందుకు టూర్ షెడ్యూల్, వేదిక, తేదీలను ఒక ఉపకమిటీ తీసుకుంటుందని వారు అంటున్నారు. ఈ కమిటీలో అధ్యక్షుడు, కార్యదర్శి, కోశాధికారి ఎక్స్ అఫీషియో సభ్యులుగా ఉంటారు. శుక్లా, ఒకసీనియర్ కాంగ్రెస్ నేత కూడా ఇందులో సభ్యులుగా ఉంటారు. ' నిర్ణయం తీసుకోవడంలో కార్యదర్శి లేదా కోశాధికారిని పక్కన పెట్టకూడదు. ప్రొటోకాల్ ప్రకారం ఉప కమిటీ సమావేశం కావాలి. ఆఫ్ఘనిస్తాన్‌తో ఆడే మ్యాచ్‌కు సంబంధించి నిర్ణయం జనరల్ బాడీ ఫోరం(ఎస్‌జీఎం)లో జరగాల్సి ఉంటుంది. ప్రస్తుతం సభ్యులను పక్కకు పెట్టి తేదీ, వేదికను ప్రకటించారు' అని బిసిసిఐ సీనియర్ ఆఫీస్ బేరర్ మంగళవారం మీడియాతో అన్నారు. ఈ వివాదంపై వ్యాఖ్యానించడానికి శుక్లా కాని, బిసిసిఐ సీఈవో రాహుల్ కాని అందుబాటులో లేరు. అయితే కార్యదర్శి చౌదరీకి క్లోజ్ ఉండే ఓ అధికారి మాట్లాడుతూ.. ఆఫ్ఘనిస్తాన్ పర్యటనకు ఫిక్సర్స్ కమిటీ నుంచి అనుమతి తీసుకోనవసరం లేదని తెలిపారు.

ఆఫ్ఘనిస్తాన్‌తో తొలి టెస్టు వేదికగా బెంగళూరు
బిసిసిఐ కార్యదర్శి అమితాబ్ చౌదరీ

భారత్‌తో చారిత్రాత్మక టెస్ట్ మ్యాచ్ ఆడనున్న ఆఫ్ఘనిస్తాన్‌తో వేదికగా బెంగళూరును ప్రకటించారు. ఈమేరకు బిసిసిఐ తాత్కాలిక కార్యదర్శి అమితాబ్ చౌదరీ మంగళవారం ప్రకటన చేస్తూ.. జూన్ 14 నుంచి 18 వరకు ఈ మ్యాచ్ జరుగుతుందని తెలిపారు. అయితే ఈ మ్యాచ్‌ను డే నైట్ మ్యాచ్‌గా నిర్వహించే విషయంపై త్వరలో ప్రకటన చేస్తామని మీడియాకు తెలిపారు. 12 టెస్టు హోదా పొందిన దేశాల్లో 8 మాత్రమే డే అండ్ నైట్ మ్యాచ్‌లను ఆడుతున్నాయి. తొలి టెస్టు డే అండ్ నైట్ మ్యాచ్ న్యూజిలాండ్, ఆస్ట్రేలియా మధ్య 2015లో జరిగింది. 2016లో భారత్‌లో న్యూజిలాండ్‌తో టెస్ట్ మ్యాచ్ డే అండ్ నైట్‌లో నిర్వహించడానికి బిసిసిఐ మాజీ అధ్యక్షుడు అనురాగ్ ఠాకూర్ ప్రకటించారు. అయితే అమలుకు నోచుకోలేదు. ఇప్పటికి ప్రపంచంలో 9 డే అండ్ నైట్ టెస్టు మ్యాచ్‌లు జరుగాయి. వీటిలో రెండు గత నెలలో ఇంగ్లండ్, ఆస్ట్రేలియా మధ్య, మరొకటి దక్షిణాఫ్రికా, జింబాబ్వే మధ్య జరిగాయి. ఈ మ్యాచ్‌లకు పింక్ బంతులను ఉపయోగించారు.

Printed & Published by MOOTHA GOUTAM on behalf of Andhra Prabha Publications Ltd., and Printed at Andhra Prabha Publications Ltd., Part no 75, Opp: Time Hospital, Ashok Nagar, Vijayawada - 520010.
Editor: Mootha Goutam, Responsible for News selection under PRB ACT. RNI Regd No. 3464/59.

lifepage2012@gmail.com

ఆంధ్రప్రభ

లైఫ్

I

బుధవారం 17 జనవరి 2018



వృత్తి..ప్రవృత్తి...రెండింటికి మధ్య సన్నని గీత మాత్రమే ఉంటుంది. దానిని చెరిపేస్తే..వృత్తి ధర్మానికి మానవీయత తోడవుతుంది. అది వృత్తి ధర్మాన్ని వంద శాతం సక్సెస్‌ఫుల్‌గా నిర్వర్తించేందుకు దోహదం చేస్తుంది. ప్రజల మన్ననలు పొందుతుంది. జీతం తీసుకుంటున్నా.... డ్యూటీ చేస్తున్నా...అనే కోణంలో ప్రవర్తిస్తే... మంచి అధికారిగా రాణించవచ్చేమో కాని, మంచి మనిషిగా మాత్రం గుర్తింపు పొందలేము. ప్రభుత్వం జీతం ఇస్తుంది. ప్రభుత్వం చెప్పిన పనిచేస్తున్నా...అనడం సరైన పద్ధతి కాదు..ఎందుకంటే ఆ జీతం ప్రజలు చెల్లించిన పన్నుల రూపంలో ప్రభుత్వానికి వచ్చిన ఆదాయం. ఒక్కమాటలో చెప్పాలంటే..ప్రభుత్వ ఉద్యోగులకు జీతాలు ఇచ్చేది పరోక్షంగా ప్రజలే. అందుకే ఉద్యోగులు డ్యూటీ చేయాల్సింది ప్రజల కోణంలో....ప్రభుత్వ కోణంలో కాదు! లా అండ్ ఆర్డర్ కాపాడడం పోలీసు అధికారుల డ్యూటీ. అంతవరకే పరిమితం అయితే స్ట్రిక్ట్ పోలీస్ ఆఫీసర్ అవుతారే తప్ప... మంచి పోలీస్ అధికారి అనిపించుకోలేరు. అలా అనిపించుకోవాలంటే...ప్రజల మన్ననలు పొందాలి. అలా పొందాలంటే ప్రజలతో మమేకం కావాలి. డ్యూటీకి మానవీయ విలువలు జోడించాలి. అలా జోడించి మూడు దశాబ్దాలుగా పోలీస్ ఆఫీసర్‌గా రాణిస్తున్నారు ఐపీఎస్ ఆఫీసర్, తెలంగాణ పోలీసు గృహనిర్మాణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ బుసిరెడ్డి మల్లారెడ్డి! వివరాలు ఆయన మాటల్లోనే..!

నేను-నా ప్రజలు

రుధిర వీణపై శాంతిరాగం

ఫ్యాక్షన్ సీమలో మార్పు కోసం మల్లారెడ్డి యత్నం

సాటి మనిషిగా స్పందించి...!

2007..కొల్హాపూర్ సింగోటం జాతర కోసం నందికొట్కూర్ నుంచి పడవలో జనం బయలు దేరారు. కొంత దూరం పోగానే అధికలోడ్ కారణంగా పడవ తిరగబడింది. 72 మంది మృత్యువాత పడ్డారు. సంఘటన జరిగింది శ్రీశైలం బ్యాక్ వాటర్‌లో..! బంధువుల ఆర్తానాధాలు.. ఆహాకారాలతో ఆ ప్రాంతమంతా విషాదం అలుముకుంది. ఆ సమయంలో కర్నూలు ఎస్పీగా బాధ్యతలు నిర్వహిస్తున్నా. సంఘటనా స్థలానికి చేరుకుని సహాయ చర్యలు పర్యవేక్షించా. గల్లంతైన వారి మృతదేహాల కోసం గాలింపు చర్యలు సాగుతున్నాయి. మొదటి రోజు పగలంతా గాలించినా పెద్దగా ఫలితం దక్కలేదు. ....జిల్లా అధికారిగా పనులు పురమాయించి హాయిగా హెడ్ క్వార్టర్ చేరుకుని మానిటర్ చేయవచ్చు. కాని అంతమందిని అక్కడ వదిలేసి రావడానికి మనస్సు అంగీకరించలేదు... అంతేకాదు పై అధికారిగా నేను అక్కడ ఉంటే సిబ్బంది పనిలో అశ్రద్ధచూపరు. సహాయక చర్యలు స్పీడ్‌గా కొనసాగుతాయి. అధికారిగా డ్యూటీ చేస్తూనే.. మనిషిగా బాధితులను ఓదార్చుతూ..ధ్యైర్యం చెప్పడం నా బాధ్యత అనిపించింది... అంతే.. ఒకటి,..రెండు....మూడు రోజులు..పడవ ప్రమాదంలో చనిపోయిన వారి మృతదేహాలన్ని దొరికి వారి వారి బంధువులకు అప్పగించేవరకు....రాత్రి పగలు అక్కడే ఉండిపోయా...అప్పుడు డ్యూటీ చేశాను... అనేదానికంటే సాటి మనుషులకు ఓదార్పు ఇచ్చానన్న తృప్తితో అక్కడి నుంచి హెడ్‌క్వార్టర్స్ కు చేరుకున్నా. ఆ సంఘటన రాష్ట్ర ప్రభుత్వాన్ని కదిలించింది. అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి.... అభినందిస్తూ లేఖ కూడా రాశారు.

ప్రజల్లో మార్పుకోసం....!

నేను పోలీస్ అధికారిగా కర్నూలు, కడప జిల్లాలో పనిచేశా. అక్కడి ఫ్యాక్షన్ నన్ను కదిలించింది. ఎవరి పగకో అమాయకులైన ప్రజలు బలవుతున్నారనే బాధ నన్ను వేధించేది. అందుకే ఆళ్లగడ్డ డిఎస్పీగా మొదట ఫ్యాక్షన్ గడ్డపై అడుగు పెట్టినప్పుడే..ప్రజలల్లో మార్పుకోసం ప్రయత్నాలు ప్రారంభించా. ఫ్యాక్షన్ గొడవలప్పుడు ఇరు పార్టీల వారు దగ్గరకు వస్తే పోలీసులుగా కేసులు నమోదు.. అరెస్టులు యధావిధిగా సాగేవి. ఆ తర్వాత బాధితులను ఆఫీస్‌లో కూర్చొబెట్టుకుని వారికి జరుగుతున్న అన్యాయం గురించి నా పరిధిలో కౌన్సిలింగ్ ఇచ్చేవాడిని. ఫ్యాక్షన్ నాయకులు వారి కుటుంబాలు చల్లగానే ఉన్నాయి. కాని వారి పగలకు అనుచరుల కుటుంబాలు ఎలా వీధిన పడుతున్నాయో వివరించేవాడిని. మొదట్లో వారు నన్ను ఆదోలా చూసేవారు. కాని వారిలో మార్పు తేవాలనే నా ప్రయత్నాలు వారిలో ఆలోచన రేకెత్తించాయి. కొందరు మారారు. ఆవిషయం కర్నూలు ఎస్పీగా బాధ్యతలు నిర్వర్తించిన సమయంలో తెలిసింది. ఎస్పీగా జిల్లాలో పర్యటించేటప్పుడు..గతంలో నేను కౌన్సిలింగ్ ఇచ్చిన వారు వచ్చి.. ఆవిషయం నాతోచెప్పేవారు.అది నాకు చాలా సంతృప్తిని ఇచ్చింది. ఫ్యాక్షన్ జిల్లాల్లోనే కాదు మహబూబ్‌నగర్, నెల్లూరు జిల్లాల్లో ఎస్పీగా పనిచేసినప్పుడు కూడా అదే ధోరణి కొనసాగించా. నెల్లూరు ఎస్పీగా వెళ్లినప్పుడు 2009 సాధారణ ఎన్నికలు జరిగాయి. ప్రజల్లోకి వెళ్లి పోలింగ్ పట్ల అవగాహన కల్పించడం ద్వారా..జిల్లా మొత్తంలో ఒక్క చోట కూడా రీపోలింగ్ లేకుండా ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా చూడగలిగాను.పోలీసు అధికారిగా నాకు పేరు వచ్చింది. ప్రజల మొప్పు లభించింది. కాని అది ప్రజల సహకారంతోనే జరిగింది. పోలీసులుగా కాకుండా.....మేము ప్రజల్లో ఒక్కరిగా మసలుకోబట్టే అది సాధ్యమైంది. అధికారులు..డ్యూటీని డ్యూటీగా కాకుండా..సమాజంలో పౌరునిగా ఫీలై చేస్తే ఫలితం ఉంటుంది.

కడప జిల్లాలో పల్లెనిద్ర!

ఇక కడప జిల్లాలో పనిచేసిప్పుడు పల్లె నిద్రలు చేశా. ఫ్యాక్షన్ పీడిత గ్రామాలు అధికంగా ఉన్న ప్రొద్దుటూరు, జమ్మలమడుగు పరిధిలోని పల్లెలకు సిబ్బందితో వెళ్లి రాత్రి బసచేసేవాడిని. అదో అనుభూతి. అక్కడి ప్రజలతో కలిసి మాట్లాడుతుంటే వారి బాధలు కదిలించేవి. మేం ఎక్కడికి వెళితే అక్కడి ప్రజలతో కలిసి భోజనం చేసి, వారితో మమేకం అయ్యేవాళ్లం. ఫ్యాక్షన్ వల్ల కలిగే నష్టాలను, వారి పిల్లలకు భవిష్యత్తులో కలిగే ఇబ్బందులు తెలియజెప్పడం ద్వారా వారిలో మార్పుకోసం ప్రయత్నించాము. అందరూ మారుతారని కాదు. కొందరు



మారినా సంతోషమే కదా. అంతేకాదు పోలీసులంటే కేసులు... అరెస్టులకే పరిమితం కాదు. మన తోటి మనుషులే అనే భావన ప్రజల్లో కల్పించడం ద్వారా.. వారు ఏ టైంలో అయినా ఆఫీస్‌కు వచ్చి నాతో మాట్లాడే విధంగా వారితో మమేకమయ్యేవాడిని. మరోవైపు ఏ హోదాలో ఉన్నా..ప్రభుత్వాలు చేపట్టే స్వచ్ఛభారత్, గ్రామ జ్యోతి లాంటి కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకు వెళ్లేందుకు



ప్రయత్నించాను. పోలీసు శాఖ ద్వారా ప్రభుత్వ కార్యక్రమాల పట్ల ప్రజల్లో అవగాహ పెంచేందుకు ఎప్పుడూ ముందుండేవాడిని. పోలీసులంటే శాంతి భద్రతల పరిక్షణకే పరిమితం కాదు. సమాజంలో మేమూ ఒక భాగం.అందుకే ప్రజల సమస్యల పరిష్కరించడంలో నా పరిధికి మించి పనిచేసేవాడని. అది కూడా నిబంధనలకు లోబడి మాత్రమే! చెప్పుకోవడం ఇష్టంలేదు. కాని నా సొంత వూరు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు వచ్చి వారి సమస్యలు చెబితే పరిష్కరించేందుకు ప్రయత్నిస్తుంటా. పేదల పిల్లలు చదువుకునేందుకు ప్రోత్సహిస్తుంటా. అవసరమైతే ఆర్థిక సాయం చేస్తుంటా.

తెలుగు భాషాభిమానం!

నాకు భాషాభిమానం ఎక్కువ. తెలుగు భాషంటే ఎనలేని మక్కువ. నేను నల్లగొండ జిల్లోని పల్లెలో పుట్టిపెరిగా. తెలుగు మాధ్యమంలోనే చదువుకున్నా. ఇంగ్లీషు మాధ్యమంలో చదివితేనే ఉద్యోగాలు వస్తాయన్నది నిజంకాదు. మాతృభాషపై పట్టు సాధిస్తే... ఇతర భాషలు నేర్చుకోవడం ఈజీ. నేను సిండికేట్ బ్యాంకులో ఉద్యోగంలో చేరిన దగ్గర నుంచి ఇప్పటి వరలకు ముప్పై సంవత్సరాలుగా తెలుగులోనే సంతకం చేస్తున్నా. అంతేకాదు నేను ఎక్కడ మాట్లాడినా తెలుగులోనే మాట్లాడుతా. ఏదైనా మీటింగ్‌లో పెద్దలు ఆంగ్లంలో మాట్లాడితే మిగతావారు ఆంగ్లంలో మాట్లాడుతారు. తెలుగులో మాట్లాడితే తెలుగులో మాట్లాడుతారన్నది నా నమ్మకం. నేను తెలుగు మాట్లాడి, మిగతావారని తెలుగులో మాట్లాడేందుకే ప్రోత్సహిస్తా. ఇది నా పరిధిలో నేను మాతృభాషకు సేవ చేస్తున్నట్లుగానే భావిస్తాను. కెనెరా బ్యాంక్ ఉద్యోగిగా ఉన్నప్పుడు ఆంగ్లంలో సంతకం చేయమన్నారు. నేను మాత్రం అప్పుడూ తెలుగులోనే సంతకం చేసానే తప్ప నా పద్ధతి మార్చుకోలేదు. ఎందుకంటే మాతృభాషకు సేవచేయడం అంటే అమ్మకు సేవచేసినట్లే!

ఉద్యోగ ప్రస్థానం..!

నల్లగొండ జిల్లా అనుముల మండలం రామడుగులో జన్మించిన బుసిరెడ్డి మల్లారెడ్డి ..ఎమ్మెస్సీ(అగ్రికల్చర్) పూర్తి చేసిన తర్వాత ..సిండికేట్ బ్యాంకులో వ్యవసాయ అధికారిగా 3సంవత్సరాలు పనిచేశారు. 1987లో గ్రూప్-1 పరీక్షరాసి, తొలి ప్రయత్నంలోనే విజయం సాధించారు. డీఎస్పీగా ఎంపికయ్యారు. శిక్షణలో భాగంగా కడపలో ఆరు మాసాలు ప్రాక్టికల్ ట్రైనింగ్ తీసుకుని, 1989సెప్టెంబర్‌లో కర్నూలు జిల్లా ఆళ్లగడ్డ డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించారు. తర్వాత డీఎస్పీగా మీర్‌చౌక్, మహబూబ్ నగర్, కడప, కర్నూల్, గద్వాల, నర్సంపేట సబ్ డివిజన్లలో పనిచేశారు. 1995లో ఆడిషనల్ ఎస్పీగా పదోన్నతి పొంది...వరంగల్ జిల్లా ఓఎస్‌డీగా బాధ్యతలు నిర్వహించారు. చిత్తూరు జిల్లా తిరుపతి అడిషనల్ ఎస్పీగా బాధ్యతలు నిర్వహించారు. విశాఖ పట్టణం, మహబూబ్ నగర్ జిల్లాల్లో ఎఎస్పీగా పనిచేశారు.2002లో మల్లారెడ్డి..ఎస్పీగా పదోన్నతి పొంది... ఏసీబీ విభాగంలో జాయింట్ డైరెక్టర్‌గా పనిచేశారు. కర్నూలు, నెల్లూరు,కడప జిల్లాల్లో ఎస్పీగా బాధ్యతలు నిర్వర్తించారు.అనంతరం హైదరాబాద్ ట్రాఫిక్ డీఎస్పీగా, సెక్యూరిటీ విభాగంలో పనిచేశారు. .2012లో డీఐజీగా పదోన్నతి పొందిన తర్వాత హైదరాబాద్ స్పెషల్ బ్రాంచ్ జాయింట్ కమిషనర్‌గా పనిచేశారు. 2014నుంచి 2016 వరంగల్ రేంజ్ డీఐజీగా పనిచేశారు.అదే సమచయంలో కరీంనగర్ రెంజ్‌కి అదనపు బాధ్యతలు సమర్ధవంతంగా నిర్వర్తించారు. 2016 జూన్ నుంచి రాష్ట్ర పోలీసు గృహనిర్మాణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్‌గా కొనసాగుతున్నారు.. ఐరవై ఏడు సంవత్సరాల సర్వీసులో 25సంవత్సరాలు లా అండ్ ఆర్డర్ వింగ్‌లోనే పనిచేశారు మల్లారెడ్డి. ఏకదాటిగా దాదాపు ఏడు సంవత్సరాలు ఎస్పీగా కొనసాగిన ఘనత కూడా పోలీసుశాఖలో మల్లారెడ్డికే దక్కుతుంది. ప్రభుత్వాలు ఆయన సేవలకు తగిన గుర్తింపు నిచ్చాయి. 1998లో ఆంధ్రప్రదేస్ పోలీస్ సేవాపథకం, 2004లో యూఎన్ పీస్‌మెడల్..2004లో ఇండియన్ పోలీస్ పథకం లభించాయి.

- చొల్లేటి వేంకటేశ్వరా చారి











సీసా

ఏదైనా సరే..ఖాళీ అయిందంటే ఇక దానికి విలువుండదు. పాతసామాన్లు కొనేవాళ్ల దగ్గరికి చేరాల్సిందే. కానీ ఖాళీ సీసాలతో ఇలా చూడచక్కని కళాకృతులను తయారుచేసుకునే అవకాశం ఉంది. పిండికొద్దీ రొట్టెలా ఆలోచనకొద్దీ అందం... అనేంతగా వీటి ఆకృతులకు

ఖాళీ సీసా కనువిందుగా...

తీర్చిదిద్దవచ్చు. మనకు అందుబాటులో ఉన్న అలంకరణ సామగ్రిని ఉపయోగించే... వీటికి ఇంతటి అందాన్ని తీసుకురావచ్చు. ప్యాకింగ్‌కి ఉపయోగించే సాధారణ తాళ్లు, పేపరు పూలు, రంగురాళ్లు, పూసలు, చెమ్కీలు, పెయింట్లు... ఇలాంటి వన్నీ... మన రూపకల్పనని బట్టి అవసరమైన వాటిని తెచ్చుకోవాల్సి ఉంటుంది. కాస్త ఓర్పు ఉంటే చాలు...ఎన్నెన్నో కొంగొత్త కళారూపాలను ఇంట్లో అలంకారాలుగా మెరిపించవచ్చు.

మధుమేహాన్ని తగ్గించే ఆసనాలు!


ఇంతకుముందు కాలమ్‌లో మధుమేహంకి పరిష్కారంగా నేరేడు చెట్టు బెరడుని ఎలా తీసుకోవాలో తెలుసుకున్నాం....కదా. ఈ వారం మధుమేహాన్ని తగ్గించే యోగాసనాలను గురించి తెలుసుకుందాం-

ఆసనాలు వేస్తున్నపుడు ఎవరైనా ఒక విషయాన్ని గుర్తుంచుకోవాలి. శ్వాస వేగం కానీ, గుండె కొట్టుకునే వేగం కానీ పెరగకుండా చూసుకోవాలి. అయితే ఇప్పుడు చెప్పబోయే ఆసనాలు పదేపదే చేయాల్సినవి కనుక కాస్త శ్వాస వేగం పెరిగేందుకు అవకాశం ఉంది. అందుకే సనాతన క్రియ నియమాలతో పాటు వీటిని పాటిస్తే..శ్వాస వేగం నియంత్రణలో ఉంటుంది. అయితే వీటన్నింటినీ క్రమబద్ధంగా చేయాలంటే మీకు దగ్గరలో ఉన్న ధ్యాన్ ఫౌండేషన్ కేంద్రం నుండి నేర్చుకోవాల్సి ఉంటుంది.



వీరభద్రాసనం

నిటారుగా నిలబడాలి. శ్వాస తీసుకుంటూ నెమ్మదిగా మందుకు వంగాలి. ఇలా వంగుతున్నపుడు...వెన్నెముక వంగకుండా జాగ్రతపడాలి. రెండుచేతులను నేలకు తాకించాలి. ఈ స్థితిలో ఎడమకాలిని పైకి లేపాలి. అలా లేపటం వలన ఎడమకాలు నేలకు సమాంతరంగా ఉంటుంది. శరీరాన్ని కుడికాలిమీదే బ్యాలన్స్ చేసుకోవాలి. శ్వాసని నిదానంగా వదులుతూ కాలుని కిందకి దించాలి. చేతులను నేలకు సమాంతరంగా ముందుకు చాపి కూడా చేయవచ్చు. ఇలా ఏడుసార్లు చేయాలి.



గురు కాలమ్

నటరాజాసనం

ముందుగా నిటారుగా నిలబడాలి. శ్వాసని తీసుకుం టూ..ఎడమ మోకాలిని మడుస్తూ...కాలు శరీరం వెనుకవైపుకి వచ్చేలా చేసి...సపోర్టుకోసం కాలి మడమని ఎడమచేత్తో పట్టుకోవాలి. ఎడమ కాలిని వెనక్కు మడుస్తున్నపుడే కుడిచేతిని పైకి లేపుతూ...తలను కూడా పైకెత్తి పైకి చూడాలి. శ్వాసని వదులుతూ కాలుని చేతిని కిందకు దించాలి. ఇలా ఏడుసార్లు చేయాలి.

ఉద్యాన్, జలంధర్ బంధ్

మొదట నిటారుగా నిలబడాలి. శ్వాసని లోపలికి తీసుకుంటూ...పొట్టని సాధ్యమైనంతవరకు పెంచాలి. తరువాత నోటి ద్వారా గాలిని బయటకు వదులుతూ...పొట్టని, ఊపిరి తిత్తులను సాధ్యమైనంత వరకు ఖాళీ చేయాలి. ఇలా చేస్తున్నపుడు పక్కటెముకలకు కిందుగా ఉన్న భాగం లోపలికి వెళుతుంది. అయితే ఈ పరిస్థితిలో ఎలాంటి అసౌకర్యం లేకుండా చూసుకోవాలి. ఇప్పుడు తలను కిందకు దించి...నేలను చూస్తూ..గడ్డం ఛాతీని అంటుకునేలా చేయాలి. పొట్టని లోపలికి తీసుకుంటూ శ్వాస వదలాలి. తరువాత తలను పైకెత్తి యథాస్థితికి రావాలి.



గమనిక: మధుమేహం ఉన్నవారు కపాల భాతి ప్రాణాయామాన్ని చేయరాదు. ఇది హైపరాక్టివిటీని కలిగించవచ్చు కనుక మధుమేహులకు ఇది పూర్తిగా నిషిద్ధం.

మణిపూరక చక్రాన్ని శక్తిమంతం చేసే మంత్రం

మణిపూరక చక్రంలో అసమతౌల్యమే మధుమేహానికి కారణమని ఇంతకుముందు చెప్పుకున్నాం కదా. దానిని శక్తిమంతం చేసే మంత్రముంది. ఈ చక్రానికి సంబంధించిన బీజ మంత్రం రామ్. సుఖాసనంలో లేదా వజ్రాసనంలో కూర్చుని, రెండు అర చేతులను ఒకదానిపై ఒకటి ఉంచి నాభి ప్రాంతంలో ఉంచాలి. ఇప్పుడు రామ్ అనే మంత్రాన్ని ఉచ్చరించాలి. ఈ మంత్రాన్ని ఉచ్ఛరించే విధానం కోసం ధ్యాన్‌ఫౌండేషన్ డాట్ కామ్‌లో చూడవచ్చు. ఈ మంత్రం మణిపూరక చక్రం పనితీరుని మెరుగుపరుస్తుంది.



- యోగి అశ్విని

పురుష సూక్తం భగవంతుణ్ని కీర్తిస్తుంది. భగవంతునికి వేలాది తలలు, కన్నులు, పాదాలు ఉంటాయని, భూమిలోని 10 అంగుళాల స్థానాన్ని ఆక్రమించాడని చెబుతోంది. విశ్వవ్యాపిగా ఉన్న భగవంతుడు మనలోనూ ఉన్నాడని తెలుసుకోవాలి. భూత భవిష్యత్ కాలాలు భగవంతుని రూపమే. ఆయన అన్నింటినీ అతిక్రమించినవాడు.



భగవంతుని రూప వర్ణన పురుష సూక్తం

పురుషుడు అంటే భగవంతుడు. భగవంతుణ్ని కీర్తించేదే పురుష సూక్తం. ఇందులో మంత్ర శక్తి ప్రధానమైనది. వేద మంత్రాలతో కూడినది ఈ పురుష సూక్తం. వేదాలు సంహిత, బ్రాహ్మణాలు, ఉపనిషత్తులు అని మూడు భాగాలు. సంహితలు దేవతా ప్రార్థనలు, బ్రాహ్మణాలు యాగాలను గురించి చెప్పేవి. ఉపనిషత్తులు సనాతన ధర్మం గురించి చెప్పేవి. వేద కాల ఋషులు ప్రపంచం నడకను ఒక యజ్ఞం అన్నారు. కనిపించకుండా పోతున్నవి తిరిగి కొత్తవిగా రావడం, మరణించినది తిరిగి పుట్టడం ఇదే ఒక మహా యజ్ఞం. మనం ఆహారం, నీరు, ప్రాణవాయువు మొదలైనవి తీసుకుని జీవిస్తున్నాం. కార్బన్ డయాక్సైడ్ వ్యర్థాలను తిరగి ఇచ్చేస్తున్నాం. ప్రపంచంలో జనం పాటించే ఇది ఒక యజ్ఞ విధి. ఈ సూత్రాన్ని పాటించి జీవితాన్ని ఆనందప్రదం చేసుకోవాలి. భగవద్గీతలో చెప్పినట్లు యజ్ఞం చేసి దేవతలను మెప్పించి వర్షం వంటి వరాలను పొంది సంతోషించాలి.

పురుష సూక్తం భగవంతుణ్ని కీర్తిస్తుంది. భగవంతునికి వేలాది తలలు, కన్నులు, పాదాలు ఉంటాయని, భూమిలోని 10 అంగుళాల స్థానాన్ని ఆక్రమించాడని చెబుతోంది. విశ్వవ్యాపిగా ఉన్న భగవంతుడు మనలోనూ ఉన్నాడని తెలుసుకోవాలి. భూత భవిష్యత్ కాలాలు భగవంతుని రూపమే. ఆయన అన్నింటినీ అతిక్రమించినవాడు.

పూర్వ సృష్టిలో భగవంతుడు అనేక ప్రాణులను సృష్టించాడు. ఉత్తర సృష్టిలో ఆ ప్రాణులు జీవించడానికి అవసరమైన ఆహార పదార్థాలుగా మారినట్లు చెప్పబడింది. ఆ ఆదిపురుషుని నుంచి బ్రహ్మాండం, దాని నుంచి బ్రహ్మ పుట్టి, భూమిని సృష్టించాడు. తర్వాత ప్రాణులకు శరీరాలను సృష్టించాడు. దేవతలు చేసే యజ్ఞానికి వసంత ఋతువు నెయ్యిగాను, గ్రీష్మ ఋతువు వంట చెరుకుగాను, శరత్కాలం



నైవేద్యంగాను అయ్యాయి. పంచ భూతాలు, ఇరవైఒక్క తత్త్వాలు సమిధలయ్యాయి. (కాళ్ళు, చేతులు, నోరు, మర్మాంగం, గుదం ఐదు కర్మేంద్రియాలు. ప్రాణ, అపాన, వ్యాన, ఉదాన, సమానాలు పంచ ప్రాణాలు. మనస్సు, బుద్ధి, చిత్తం, అహంకారం నాలుగు అంతఃకరణాలు. ధర్మం అధర్మం వంటివి మొత్తం 21 తత్త్వాలు. బ్రహ్మను పశువుగా కట్టారు. యజ్ఞం ప్రారంభమైన కొద్ది సేపటిలోనే యజ్ఞ పురుషుడైన బ్రహ్మపై నీళ్ళు చల్లి, దేవతలు, సాధ్యులు, ఋషులు అందరూ యాగాన్ని చేశారు. పక్షులు, పులివంటి మృగాలు, సాధు జంతువులు పుట్టించాడు బ్రహ్మ. తర్వాత సామవేద మంత్రాలు పుట్టాయి. అందులో నుంచే గుర్రాలు, మృగాలు, పశువులు, గొర్రెలు, గేదెలు పుట్టాయి. బ్రహ్మ ముఖం బ్రాహ్మణునిగా, చేతులు క్షత్రియులుగా, తొడలు వైశ్యునిగా అయ్యాయి. పాదాల నుంచి శూద్రులు పుట్టారు. అయితే అందరూ పుట్టినది ఒక బ్రహ్మ నుంచే. ఆయన మనస్సు నుంచి చంద్రుడు, కంటి నుంచి సూర్యుడు, ముఖం నుంచి ఇంద్రాగ్నులు ఉద్భవించారు. ప్రాణం నుంచి వాయువు, నాభి నుంచి అంతరిక్షం, శిరస్సు నుంచి స్వర్గం, పాదాల నుంచి భూమి, చెవి నుంచి దిశలు, అదే విధంగా లోకాలు ఉద్భవించాయి.

పూర్ణత్వాన్ని పొందిన ఋషులు తమ జీవితాల్లో పాటించిన సనాతన సత్యాలను మనం సాధన చేస్తే ఆ సత్యాలను మనం కూడా ప్రాప్తించుకోవచ్చు. అదే మనకు గుణ పాఠం. ఈ యజ్ఞం ద్వారా దేవతలు భగవంతుణ్ని ఆరాధించి ఉన్నత లోకాలను చేరారు. అందుకే యజ్ఞాన్ని చేసే వారెవరైనా ఆ లోకాన్నే చేరుతారు. యజ్ఞం చేయడం ద్వారా వారు మహాత్ములవుతారు.

దేవతలకు గురువుగా ఉంటూ వారికి తేజస్సునిస్తున్న వాడెవరో అతడే దేవతల కంటె ముందు ఉద్భవించాడు. ఆ ప్రకాశవంతుడైన భగవంతునికి నమస్కరిద్దాం. సిరులకు మూలమైన లక్ష్మీదేవి, లజ్జా స్వరూపిణి అయిన హ్రీ దేవి ఆయన అర్ధాంగినులు. రాత్రింబవళ్లు ఆయన పార్శ్వాలు. సృష్టిని సూచించే నక్షత్రాలు ఆయన దివ్యరూపం.


అశ్వనీ దేవతలు ఆయనకు వికసించిన వదనం. అటువంటి భగవంతుణ్ని మనం ప్రార్థించాలి. కోరుకున్న దానిని ప్రసాదించమని, ప్రపంచానికి సుఖాన్నిచ్చి కరుణించమని, ఇహ పరాల్లో సమస్త సుఖాలను ప్రసాదించమని కోరుకుందాం.

లక్ష్మణరేఖ గోపాలకృష్ణ
9493053206

చింతన

శ్రీ రమణాశ్రమ లేఖలు, స్మృతులు

అప్పడపు పాట



(పల్లవి)
అప్పడమొత్తిచూడు
అదితినినప్పుడే నీ
యాశపుడు .....(అ)
(అనుపల్లవి)
ఇప్పుడుమియందున
యేమరి తిరుగక
సద్బోధా నందుడౌ
సద్గురు నాథుడు
చెప్పక చెప్పెడు తత్త్వము గుసమము
గొప్పది లేనట్టి యొకమాట చొప్పున (అ)
(చరణములు)
1.తానుగాని పంచకోశ క్షేత్రమునందు
తానుగాపెరుగభిమానమినుములను
నేనెవ్వడనెడు విచార తిరుగలిలో
నేనుగానని పగలగొట్టిపిండియు చేసి (అ)
2.సత్సంగమనియెడు నల్లేరు రసముతో
శమదమములను జీలకర్ర మిరియముతో
ఉపరతి యనునట్టి యుప్పును కలిపిన
ద్వాసన యనియెడియింగువను చేర్చి (అ)
3.రాతి చిత్తము నేను నేనని భ్రమయక
లోదృష్టిరోకటితోను మానక దంచి
శాతంమౌ కొడుపుతో సమమగు పీటపై
సంతతమలయక సంతనంబు తోడ (అ)
4.మౌన ముద్ర యనెడిముగియని పాత్రమున
జ్ఞానాగ్నిచేకాగుసద్బ్రహ్మ ఘృతమున
నేనదియగుననినిత్యమును పేల్చి
తనుదానె భుజియింప తన్మయమగునట్టి (అ)
తెలుగు అనువాదము : ప్రణవానందులు
- సూరినాగమ్మ

శ్రీ రమణాశ్రమము, తిరువణ్ణామలై వారి సౌజన్యంతో

Facebook page https://www.facebook.com/ Sri Ramana Telugu
website http://www.sriramanamaharshi.org/ tel/

దినఫలాలు

మేష రాశి: కోర్టు సంబంధిత వ్యవహారాల్లో సానుకూలత ఉంటుంది. పనులలో శ్రమ అధికం. ఆరోగ్యంలో మంచి మార్పులు ఉంటాయి. శుభ వార్తలు వింటారు. ఆదాయంలో మెరుగైన వాతావరణం ఉంటుంది.

వృషభరాశి: ఆర్థికంగా అసహన పరిస్థితులుంటాయి. ప్రయాణాల విషయంలో జాగ్రత్తలు అవసరం. ఆరోగ్య సమస్యలకు పరిష్కారాలు లభిస్తాయి. కుటుంబ వ్యవహారాల్లో చిరు సమస్యలు ఉంటాయి. ఆదాయ మార్గాలు అన్వేషించగలుగుతారు.

మిథున రాశి: వాహన నిర్ణయాలు లాభిస్తాయి. గృహ కార్యాలు, కార్యక్రమాలు కలసి వస్తాయి. మానసిక ధైర్యం పెరుగుతుంది. ఆర్థిక అసహన పరిస్థితులు కొనసాగుతాయి. ఆరోగ్యం విషయంలో జాగ్రత్తలు పాటించాలి. గతంలోని ఒప్పులు తప్పులుగా మారుతాయి. అధిక ప్రయత్నాలతో ఆదాయపరంగా అనుకూల పరిస్థితులు ఉంటాయి.

కర్కాటక రాశి: దూర ప్రయాణాలు కలసి వస్తాయి. అభివృద్ధి కుటుంబరీత్యా ఆనందాన్ని కలిగిస్తుంది. పిల్లల విషయంలో శ్రద్ధ తప్పనిసరి. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. ఆలోచనా లోపాల ద్వారా సమస్యలు తలెత్తుతాయి. అవమానాలు ఎదురయ్యే అవకాశాలు ఉన్నాయి కనుక జాగ్రత్తలు పాటించాలి. ఆదాయ మార్గాలు అనుకూలం.

సింహ రాశి: ఆర్థిక ప్రయత్నాలు ఊరట కలిగిస్తాయి. వినోదాల్లో పాల్గొంటారు. ఆరోగ్యం పర్వాలేదు. ఆర్థిక విషయాల్లో సులువుగా అవకాశాలు లభిస్తాయి. ఆదాయంలో ఆశాజనకమైన వాతావరణం ఉంటుంది.

కన్యారాశి: ఉద్యోగ ప్రయత్నాలు అనుకూలం. గృహరీత్యా ఆహ్లాదకర వాతావరణం ఉంటుంది. సంబంధబాంధవ్యాల విషయంలో మనస్పర్థల అవకాశం ఉంది కనుక జాగ్రత్తలు పాటించాలి. ఆరోగ్య ప్రతికూలత తగ్గుతుంది. స్థిరాస్తి విషయాల్లో చికాకులు కొనసాగుతాయి. ఆదాయ మార్గాలు సులభతరం.

తులారాశి: విదేశీ లావాదేవీలు లాభిస్తాయి. కళారంగంలో ప్రతిభ గుర్తించబడుతుంది. ముఖ్యమైన పనులలో జాప్యాలు కొనసాగుతాయి. ఆదాయరీత్యా ప్రోత్సాహక పరిస్థితులతో ఆనందం.


వృశ్చిక రాశి: వ్యాపార ఒప్పందాలు అనుకూలం. ఉద్యోగ వ్యవహారాల్లో ఆశించిన ఫలితాలు ఉంటాయి. ఆరోగ్య ఖర్చులు పెరుగుతాయి. చేపట్టిన కార్యాలలో వేగం తగ్గుతుంది. ఆదాయంలో అనుకూల ప్రతికూలతలు ఉంటాయి.

ధనూ రాశి: ఆదాయంలో అనుకూల పరిస్థితులు ప్రారంభం. వేగంగా నిర్ణయాలు తీసుకోలేకపోతారు. ఆరోగ్యంలో ఖర్చులు తగ్గుతాయి. గతంలోని పొరపాట్లు సరిదిద్దుకోగలుగుతారు. ఆదాయంలో మెరుగైన అవకాశాలు దగ్గరవుతాయి.

మకర రాశి: ఆరోగ్య పరీక్షలు మేలు కలిగిస్తాయి. విదేశీ లావాదేవీల్లో ఊరట. ఆరోగ్య రక్షణ తప్పనిసరి. ఆరోగ్య ఖర్చులు పెరుగుతాయి. మంచికి పోయి చెడు కొనితెచ్చుకుంటారు. ఆర్థిక వ్యవహారాల్లో విజయం గట్టి ప్రయత్నాలతో మాత్రమే సాధ్యం.

కుంభ రాశి: నూతన స్నేహాల ద్వారా లబ్ధి చేకూరుతుంది. గృహ కార్యాలు, కార్యక్రమాలు ఉపకరిస్తాయి. శుభ వార్తలు వింటారు. ఆరోగ్య క్రమశిక్షణ ఏర్పడుతుంది. ఆరోగ్యంలో ప్రతికూలతలు తగ్గుతాయి. వ్యాపార అనుకూలత ఉంటుంది. ఆదాయంలో ప్రోత్సాహకపరిస్థితు లుంటాయి.

మీన రాశి: విద్యా ప్రయత్నాలు అనుకూలం. నూతన స్నేహాలు అనుకూలిస్తాయి. ఆరోగ్యంలో ఆకస్మిక ప్రతికూలత ఉంటుంది. ఆరోగ్య ఖర్చులు పెరుగుతాయి. కోర్టు వ్యవహారాల్లో ప్రతికూల ప్రభావం ఉండవచ్చు. ఆదాయంలో అనుకూల మార్పులు గోచరిస్తాయి.



శ్రీ నూకల సూర్యనారాయణ
nookalasuryanarayana@gmail.com

ఘృత సముద్రానికి అవతల క్రౌంచ ద్వీపము రెండింతలుగా విశాలమైన క్షీరసాగరము చేత ఆవరింపబడి, క్రౌంచమను పర్వతరాజము వలన ఆ పేరు కలిగి ఉంది. ఈ పర్వతం పాలసముద్రముతో తడపబడుతూ వరుణ దేవునితో రక్షింపబడుతూ ఉంటుంది. ప్రియవ్రత పుత్రుడు ఈ ద్వీపమునకు అధిపతి అయిన ఘృతపృష్టుడు ద్వీపాన్ని ఏడు భాగములుగా విభజించి తన కుమారులకు అందించి తాను పరమాత్మ గుణాలను స్మరిస్తూ పరమాత్మ పాదాలను చేరాడు. ఈ ద్వీపాధిపతుల పేర్లు ఆమ, మధుర, మేఘపృష్ట, సుధామ, భ్రాజిష్ట, లోహితార్ణ, వనస్పతి. వీరు ఏడు

క్రౌంచ ద్వీపం-అధినేత

ధర్మం-మర్మం



వర్షములను పరిపాలించసాగెను. ఈ వర్షములలో శుక్ల, వర్ధమాన, భోజన, ఉపబరిహిణ, నంద, నందన, సర్వతోభద్ర అను ఏడు కులపర్వతములు, అభయా, అమృతౌఘా, ఆర్యకా, తీర్థవతీ, రూపవతీ, పవిత్రవతీ, శుక్లా అను ఏడు నదులు ఉన్నవి. ఈ వర్షములలో ఉన్నవారు పవిత్రమైన, పరిశుద్ధమైన, మధురమైన ఈ జలములను ఉపయోగించుచూ పురుష, ఋషభ, ద్రవిణ, దేవక అను నాలుగు వర్ణములతో వరుణ దేవుడిని నిండు దోసిలితో మంత్రము జపిస్తూ ఆరాధింతురు.

ఆపః పురుష వీర్యాఃస్థ
పునంతీః బూర్భువస్సువః
తానః పునీతామీవఘ్నీ
స్స్పృశతామాత్మానా భువః॥

ఈ మంత్రము జపిస్తే ప్రాణశక్తి, ఇచ్ఛాశక్తి, క్రియా శక్తి, జ్ఞానశక్తి, ధారణ శక్తి, బల ప్రతాపము, స్థైర్యము, ధైర్యము, ఓజస్సు, బలపరాక్రమాలు పెరుగుతాయి.



- డా॥ కందాడై రామానుజాచార్య

స్నానంతో విశేష ఫలం మాఘం



మాఘమాసం వచ్చింది. చంద్రుడు మఖ నక్షత్రంతో కూడుకుని ఉన్న మాసం మాఘం. ప్రతి మాసానికీ దేని విశిష్టత దానికుంది. ఆయా మాసాల్లో కొనకని కొన్కొని ప్ర్యతేక విధి విణదనానలును కూడా వాప్తకం ఏర్పరచింది. ఈ విధి విధనానానానలు మన పూర్వ ఋషులు, తమ దివ్య జ్ఞానంలో పరిశీలించి, వోధించి ఏర్పరిచారు . వీటిలో ఆరోయ రహస్యాలు కూడా దాగి ఉంటాయి. మాఘ మాసంలో స్నానానికి ప్రాధాన్యత ఎక్కువ. దేశ వ్యాప్తంగా మాఘ స్నానాలు అచరించేఆచారం ఉంది. సూర్యోదయానికి ముందే లేచి భగవన్నామ స్మరణ చేస్తూ స్నానం చేయాలి. ఇది పాపాలు తొలగించడమే కాదు పుణ్యప్రదం కూడా. ఇక స్నానం గురించి చెప్పాలంటే సూర్యోదయానికి అరగంట ముందు చేసే స్నానాలు శ్రేష్ఠం. ఈ మాసానికి అధిష్ఠాన దైవం సూర్యుడు. ఈ స్నానానికే కాదు ఏ స్నానానికైనా ప్రవహించే జలం శ్రేష్ఠం. గంగా, త్రివేణీ సంగమ ప్రాంతాలలో స్నానం ఉత్కృష్టమని వేరే చెప్పనక్కర్లేదు. నదులు అందుబాటులోలేని వారు కాలువలు, చెరువులు, బావులు వంటివాటిని ఆశ్రయించాలి. ఇక ఇళ్లలో అయితే గంగా జలం కలిపిన నీరు లేదా పవిత్రమైన నదుల పేర్లు చెప్పి ఆ నదీ జలాల పవిత్రత మనం చేసే నీళ్లలోకి రావాలని ప్రార్థించే 'గంగే చైమునేచైవ గోదావరి, సరస్వతీ, నర్మదే, సింధు, కావేరి జలేస్మిన్ సన్నిధిం కురు' అనే మంత్రం చదవి స్నానం చేయాలి.

ఈ మాసంలో రథ సప్తమి నాడు సూర్యారాధన చేస్తారు. సూర్యుడు ఆరోగ్య ప్రదాత, ఆరోగ్యం భాస్కరాదిచ్ఛేత్ అనే వాక్యం తెలిసిందే. అందువల్ల ఈ మాసం ఆరోగ్యదాయకమైనది. ఇక్కడి నుంచి సూర్యని ప్రతాపం పెరుగుతూ వస్తుంది. కనుక కొన్ని రకాల వ్యాధులు తగ్గు ముఖం పడతాయని భావించవచ్చు. మాఘ శుద్ధ ఏకాదశి భీష్మ నిర్యాణానికి సంబంధించినది. ఆ రోజు విష్ణు సహస్ర నామ పారాయణ వంటివి చేయాలని పెద్దలు చెబుతారు.

ఇది కాక పరమ శివుడు అగ్ని స్తంభ రూపంలో వెలసిన మహాశివరాత్రి పర్వం ఈ నెలలోనే వస్తుంది. లింగరూపుడైన ఆయన ఆద్యంతాలు తెలుసుకోవడానికి బ్రహ్మ, విష్ణువులు ప్రయత్నించడం మిగతా కథ అందరికీ తెలిసిందే. ఆ రోజు ఉపవాస, జాగరణలు ఎంతో పుణ్యప్రదం. ఆపాతాళనభస్థలాంత భువన బ్రహ్మాండ మావిస్ఫురత్.... అంటూ ఆ మహాదేవుని ఆ రోజు అర్చిస్తారు. అశుతోషునికి అభిషేకాలు చేస్తారు. ఇంక మాఘ పాల్గుణాలు శిశిర రుతువులో వస్తాయి. చెట్లు ఆకులను రాల్చే కాలం. అంటే మళ్లీ చిగుళ్లు వేయడానికి ఇది నాందిగా భావించాలి. చిగుళ్లు వేయడాన్ని జీవితానికి అన్వయించుకుంటే కొన్ని కారణాల వల్ల కష్టాలు వచ్చినా మళ్లీ మంచికాలం అందరికీ వస్తుందని తెలుసుకోవాలి. అన్నీ కోల్పోయినా మళ్లీ ధైర్యం కూడదీసుకుని ముందుకు సాగాలనేది దీనిలోని అంతరార్థం. ఇన్ని ప్రత్యేకతలు, పర్వాలు ఉన్న మాఘ మాసాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

-సేకరణ:జిపి

పరమాత్మను తెలియనివ్వని త్రిగుణ భ్రాంతి



అధ్యాయం 7, శ్లోకం 13

త్రిభిర్గుణమయైర్భావైః
ఏభిః సర్వమిదం జగత్।
మోహితం నాభిజానాతి
మామేభ్యః పరమవ్యయమ్॥

తాత్పర్యం

సమస్త విశ్వము సత్త్వరజస్తమోగుణములనెడి త్రిగుణములచే భ్రాంతికి గురియై గుణములకు పరుడును, అవ్యయుడును అగు నన్ను ఎరుగజాలకున్నది.

భాష్యం

ఈ ప్రపంచములో ప్రతి ఒక్కరూ త్రిగుణములచేత ప్రభావితులైన వారే. వారి బంధనాన్ని, స్వభావాన్ని బట్టి వేరు వేరు గుణాలకు ఆకర్షితులవుతారు. దానిని బట్టి వారి శరీరము, కర్మలు, సాంగత్యము ఉంటాయి. ఇలా మానవ సమాజాన్ని బ్రాహ్మణ, క్షత్రియ, వైశ్య, శూద్రులను నాలుగు రకాలుగా విభజించవచ్చును. నేను అమెరికన్, ఇండియన్, రష్యన్, బ్రాహ్మణ, హిందు,ముస్లిం ఈ విధముగా మనము భావించవచ్చునేమో గానీ, వచ్చే జన్మలో ఎక్కడ ఉంటామో చెప్పలేము. కాబట్టి ఇవన్నీ ఈ శరీరానికే పరిమితం. కాబట్టి తాత్కాలికమైనవి. ఇలా భౌతిక భావాలలో కూరుకుపోతే దాని వెనుక సూత్రధారియైన శ్రీకృష్ణుని అర్థం చేసుకొనలేము. ఈ ప్రపంచములోని మానవులు, జంతువులే కాదు దేవతలు సైతమూ భగవంతుణ్ని గుర్తించలేరు. అనగా సత్వగుణమున వున్నవారే గుర్తించలేకపోతే ఇక రజస్తమో గుణములలో నున్న వారి గురించి చెప్పనేల! కాబట్టి చైతన్యవంతులై త్రిగుణాలను అధిగమిస్తే ముక్తులము కాగలుగుతాము.

అంతర్జాతీయ కృష్ణ చైతన్యసంఘ సంస్థాపకాచార్యులు కృష్ణ కృపామూర్తి శ్రీశ్రీల ఎసి భక్తి వేదాంతస్వామి ప్రభుపాదులు రచించిన 'భగవద్గీత' యథాతథము ఆధారంగా సమర్పిస్తున్నాము.

Google play | iOS iTunes





అంచల్ ఠాకూర్!...భారత క్రీడారంగంపైకి అనూహ్యంగా దూసుకు వచ్చిన మంచు కిరణం!!..ఠాకూర్ చారిత్రక విజయంతో దేశం పరవశించి పోతోంది!.. ఇది ఎవరో అన్న మాటకాదు..సాక్షాత్తు దేశప్రధాని నరేంద్రమోదీ చేసినట్వీట్. అంతేకాదు అది ఆమె అందుకున్న ప్రథమ ప్రసంశం కూడా! .... ఆతర్వాత సోషల్ మీడియాలో కురుస్తున్న ప్రశంసల వర్షంలో మంచు (చి) ముత్యంలా మెరిసి.. మురిసి పోతోంది అంచల్! ఇంతకీ ఎవరీ అంచల్ ఠాకూర్? ఆమె నేపథ్యం ఏమిటి?...

మంచు కిరణం అంచల్!

దేశంలో అన్ని క్రీడలను క్రికెట్ డామినేట్ చేస్తోంది. క్రికెట్‌కున్న ఆదరణ ప్రోత్సాహం దేశంలో మరే ఇతర క్రీడకు లేదంటే అతిశయోక్తికాదు. ఇతర క్రీడలకు కాస్తో కూస్తో ఆదరణ ఉన్నా.. స్కీయింగ్‌కు మాత్రం మన దేశంలో సరైన గుర్తింపు ఉన్న దాఖలాలు కనిపించవు. అంతేకాదు స్కీయింగ్‌ను విశ్రాంతి సమయంలో ఆడుకునే ఆటగానే బావిస్తుంటారు. అలాంటి తురణంలో ..అంతర్జాతీయ స్కీయింగ్ ఈవెంట్‌లో దేశానికి కాంస్యపతకం సాధించి పెట్టింది క్రీడాకారిణి అంచల్! భారత దేశ కీర్తి పతాకను అంతర్జాతీయ వేదికపై రెపరెపలాడేలా చేసింది. అంతగా ఆదరణ లేని, ప్రోత్సాహం లభించని స్కీయింగ్‌లో ..ఎన్నో వ్యయప్రయాసలకోర్చి రాణించిన అంచల్ ఠాకూర్ స్వస్థలం బురువా. ఇది హిమాచల్ ప్రదేశ్‌లో మనాలిలోని మారుమూల గ్రామం. తన కెరియర్‌లో పాల్గొన్న తొలి స్కీయింగ్ పోటీల్లో పతకం సాధించి.. బురువా గ్రామాన్ని అంతర్జాతీయ దృష్టిని ఆకర్షించేలా చేసింది 21సంవత్సరాల అంచల్ ఠాకూర్. ఆమె తండ్రి రోషన్ ఠాకూర్..వింటర్ గేమ్స్ ఫెడరేషన్ ఆప్ ఇండియాకు జనరల్ సెక్రెటరీగా విధులు నిర్వర్తిస్తున్నారు. అంచల్ తన తండ్రి రోషన్ ఠాకూర్, అంతర్జాతీయ స్కీ సమాఖ్య ప్రోత్సాహం,ఆర్థిక సాయం వల్లే ఈ స్థాయికి ఎదిగింది. రోషన్ ఠాకూర్ స్కీయింగ్‌లో నేషనల్ ఛాంపియన్. అంచల్ సరదాకోసం స్కీయింగ్ ఆట ఆడుతుందని భావించారు మొదట్లో...కాని అంచల్ 11సంత్సరాల వయస్సునుంచి స్కీయింగ్‌ను సీరియస్‌గా ప్రాక్టీస్ చేశారు. అది గమనించిన రోషన్ ఆమెను సరైన రీతిలో ప్రోత్సహించారు. ఇక ఆమె సోదరుడు హిమాంశు ఠాకూర్ కూడా స్కీయర్. అతను 2014 వింటర్ ఒలంపిక్స్‌లో పాల్గొన్నాడు. అంచల్ మాజీ ఒలంపియన్ హీరాలాల్ శిక్షణలో స్కీయింగ్‌లో రాటుదేలింది. హిమాచల్ ప్రదేశ్‌లోని మంచుకొండల్లో అరకొర సౌకర్యాలతోనే సాధన చేసి తనేమిటో నిరూపించుకుంది. టర్కీ వేదికగా అంతర్జాతీయ స్కీ సమాఖ్య(ఎఫ్ఐఎస్) ఆధ్వర్యంలో జగిగిన 2018 ఆల్ఫైన్ ఎజ్డర్ 3200కప్‌లో మహిళల విభాగంలో మూడో స్థానంలో నిలిచి కాంస్యపతకం సాధించింది అంచల్ ఠాకూర్! అంతర్జాతీయ స్కీయింగ్ పోటీల్లో పాల్గొనడమే భారత స్కీయర్లు గొప్పగాభావిస్తారు. అటువంటిది ఓమహిళా స్కీయర్‌గా పోటీల్లో పాల్గొనడమే కాకుండా పతకం సాధించడం దేశ చరిత్రలో ఇదే ప్రథమం.

స్కీయింగ్‌కు ప్రోత్సాహం కరువు

బారతం దేశంలో వింటర్ గేమ్స్‌కు ప్రోత్సాహం, ఆదరణ కరువనే చెప్పాలి. కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ కుడా స్కీయింగ్‌ను ఓ క్రీడగా గుర్తించి దాఖలాలు కనిపించవు. స్కీయింగ్‌ను ప్రాక్టీస్ చేయాలంటే



స్కీయర్లకు స్కిస్, బూట్స్ అండ్ బైండింగ్స్, పోల్స్,హెల్మెట్స్ ,సూట్స్, గాగుల్స్ తదితర పరికరాలు కావాలి. వీటికి ఎంతలేదన్నా 5 నుంచి 10 లక్షల రూపాయలు ఖర్చు అవుతుంది.అందుకే ప్రొఫెషనల్ స్కీయర్లు కూడా అర్థిక వ్యయం భరించలేక ఈ క్రీడలో రాణించలేకపోతున్నారు. వందకుపైగా అథ్లెట్లను తయారు చేయడమే లక్ష్యంగా ఒలంపియనల్లకోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన టార్గెట్ ఒలంపిక్ పోడియమ్ స్కీమ్ (టీఓపీఎస్) నుంచి కూడా వింటర్ స్పోర్ట్స్ అథెట్లకు సరైన శిక్షణ ఆర్థిక సాయం అందడం లేదు. కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ స్కీయర్లకు కావాల్సిన సౌకర్యాలను కల్పించడంలో శ్రద్ధ చూపడం లేదనే చెప్పాలి. అంచల్ విజయం తర్వాత ఆమె తండ్రి నేషనల్ మీడియాతో మాట్లాడుతూ ఇదే విషయమై ఆవేదన వ్యక్తం చేశారు. అంచల్ సాధించిన అంతర్జాతీయ పతకంతో ఆమెకు కేంద్రం నుంచి ఆర్థిక సాయం అందుతుందని భావిస్తున్నానని అన్నారు. అంతేకాదు కూతుర అంచల్,కొడుకు హిమాంశులు 2018 ఒలంపిక్ క్రీడల్లో పాల్గొనాలనే ఆకాంక్షను వ్యక్తం చేయడం ఇక్కడ గమనార్హం.ఆయన ఆవేనద వెనుక ఆర్థిక భారం ఉందన్నది ఇక్కడ సుస్పష్టం.



స్కీయింగ్‌కు వేల వసంతాల చరిత్ర

ఆధునిక స్కీయింగ్ స్కాండినేవియాలో ప్రారంభమైనప్పటికి దీనికి దాదాపు ఐదువేల సంవత్సరాలకు పైగా చరిత్ర ఉంది. పురాతన చైనా చిత్రాలను బట్టి..100 శతాబ్దాల క్రితమే ఈ ఆట ఉన్నట్లు తెలుస్తుంది. స్కై అనే పదం నార్వే నుంచి వచ్చింది. ఇది పురాతన నార్స్ పదం స్కైర్ నుంచి పుట్టింది. స్కైర్ అంటే చెక్కను ముక్కలు చేయడం అని అర్థం. 18వ శతాబ్దంలో నార్వేలో మిలటరీ స్కీ రేసులు నిర్వహించేవారు. 19శతాబ్దం వరకు ఈ క్రీడ ఉత్తరఫిన్‌లాండ్, స్వీడన్‌లో మనుగడలో ఉంది. 19 శతాబ్ధం మధ్యలో ట్రాన్స్ పోర్ట్ కోసం స్కీయింగ్‌ను ఉపయోగించుకునేవారు. ఆర్వాత స్కీయింగా ఒక క్రీడగా మారింది. 19 వశతాబ్దం చివర్లో...20 శతాబ్దం ప్రారంభంలో ఈ స్కీయింగ్ ఆల్ఫైన్ మరియు నోర్డిక్ విభాగాలుగా అభివృద్ధి చెందింది. ఇంతట పురాతన చరిత్ర కలిగిన స్కీయింగ్ క్రీడకు ..అంచల్ ఠాకూర్ విజయంతోనైనా మన దేశంలో తగిన ప్రోత్సాహం లభిస్తుందని ఆశిద్దాం!

ఆమె గెలిచింది!

చట్టాన్ని ధిక్కరించింది! మార్పును సాధించింది!

జీవితం వడ్డించిన విస్తరి కాదు.. మనమే వండి, వార్చి, వడ్డించుకోవాలి..ఎన్ని కష్టాలు ఎదురైనా!....ఎన్ని నష్టాలు భరించైనా!....అప్పుడే అనుకున్నది సాధించగలుగుతాం... ఆశయ సాధనలో ముందడుగు వేయగలుగుతాం!... అక్షరాలా అదే చేసింది జారియా పట్నీ! అంబరాన్నంటే ఆత్మవిశ్వాసంతో...చట్టాన్ని ధిక్కరించింది. సవాల్ విసిరింది. విజయాన్ని ముద్దాడింది. ఇంతకు ఎవరా జారియా పట్నీ? ఆమె సాధించిన విజయం ఏంటి?

ఆడాళ్లంటే అబలలని.. వంటింటి కుందేళ్లనే రోజులు పోయాయి. ఆకాశంలో సగం...!.ఆవేశంలోనూ తీసిపోం...!! అంటూ మగాళ్లతో సమానంగా అన్ని రంగాల్లో మహిళలు రాణిస్తున్నారు. కాని ఇప్పటికీ కొందరు మృగాళ్లు....ఆడది అబల....తన చెప్పుచేతల్లో ఉండాల్సిందే అనే మానసిక రులగ్మతతో సమాజంలో తిరాగాడుతున్నారు. అదే అబల తిరగబడితే...ఏం జరుగుతుంది? సబల అని నిరూపితం అవుతుంది. ముంబాయికి చెందిన జారియా పట్నీ అదే చేసింది. తన భర్త రాక్షసత్వంపై తిరగబడింది. భర్తకు అధిక విలువ ఇచ్చే వీసా నిబంధనలను ధిక్కరించింది. చారిత్రక విజయం సాధించింది. ఆడది అబల కాదు సబల... మగాడి తోడులేకుండా సంతానాన్ని పెంచి పోషించగలదు... సమాజంలో గౌరవప్రధంగా జీవించనూ గలదు...అని నిరూపించింది. వివరాల్లోకి వెళితే.. ముంబాయిలోని ఒకే భవనంలో జారియా పట్నీ, మాజీ భర్త ..వారి వారి కుటుంబాలతో నివాసం ఉండేవారు. కాని ఆమె ఎప్పుడూ అతన్ని చూసి పాపాన పోలేదు. కాని అతను మాత్రం ఆమెను చూశాడు. ఇష్టపడ్డాడు. తనతో కలిసి మాట్లాడాలని అందుకు ఒక తేదీ చెప్పమని అడిగాడు.విధి బలీయమైంది... ఎందుకంటే అప్పుడు ఆమె వయస్సు 19సంవత్సరాలు కాగా....అతను ఆమెకన్నా 7సంవత్సరాలు పెద్ద. ఆతని కోర్కెమేరకు ఇద్దరూ కలిశారు. మాట్లాడుకున్నారు. చివరకు ఇద్దరూ పెళ్లి చేసుకోవాలనే నిర్ణయానికి వచ్చారు.పెళ్లి చేసుకున్నారు... అప్పుడు తెలియదు ఆమె జీవితంలో అదే పెద్ద తప్పుగా పరిణమిస్తుందని...బతుకును అల్లకల్లోలం చేస్తుందని.



పెళ్లిచేసుకున్న తర్వాత ముంబాయి నుంచి దుబాయ్ వెళ్లి స్థిరపడ్డారు. తన ఇష్టప్రకారం.. చేసుకున్న పెళ్లి. ఆదిలో ఆనందంగానే ఉన్నా.. త్వరలోనే తాను తప్పుచేశానన్న చేదు నిజం జారియా పట్నీకి తెలిసి వచ్చింది. కొంతకాలం సంసారం సాఫీగానే సాగింది. ఆతర్వాత తన భర్తలోని మృగాడు బయటకు వచ్చాడు. భార్యను పూర్తిగా చెప్పుచేతల్లో పెట్టుకునేందుకు ప్రయత్నించాడు. కాలు కదిపినా,మెడ తిప్పినా తన ఆదుపాజ్ఞల్లోనే జరగాలన్నంతగా వేధించడం ప్రారంభించాడు. ఆమె కంటూ ఎలాంటి కోరికలు ఉండకుడదు.తిన్నా, తాగినా, దుస్తులు ధరించినా తన ఇష్టప్రకారమే జరగాలని ఆంక్షలు విధించాడు. చీటికి మాటికి బెదిరించేవాడు. తిట్టేవాడు. కొట్టేవాడు. చిత్రిహింసలు పెట్టేవాడు. అతని నిజ స్వరూపం, వికృత చేష్టలు మరింతగా పెరిగాయి..దాంతో తాను జీవితంలో చేయకూడని తప్పుచేశానని గ్రహించింది.

తాను చేసిన తప్పును తానే సరిదిద్దుకోవాలనే నిర్ణయానికి వచ్చింది. ఈ తరుణంలోనే జారియా గర్భందాల్చింది.

శాడిస్టు భర్త దెబ్బల కారణంగా ఆరోగ్యం పాడైంది. ఆస్పత్రిలో చేర్పించాల్సింది పోయి తిట్లపురాణం అందుకున్నాడు మాజి భర్త. ఎట్టకేలకు ఆస్పత్రిలో చేరింది జారియా పట్నీ. ఆమెను పరీక్షించిన నర్సు .. ఒక్క రోజు ఆస్పత్రిలో చేర్చడం ఆలస్యమైనా ప్రాణాన్ని మాల్యంగా చెల్లించాల్సి వచ్చేదని.. గుండెలు పగిలే నిజం చెప్పింది. నర్సు మాటలతో ..అతనితో జీవించడం సురక్షితం కాదన్న నిర్ణయానికి వచ్చింది జారియా... ఆస్పత్రి నుంచి డిశ్చార్జ్ అయిన తర్వాత దుబాయ్ నుంచి ముంబాయిలోని పుట్టింటికి వచ్చింది. తన భర్త గురించి, తాను దుబాయ్‌లో అనుభవించిన నరకం గురించి చెప్పింది. ఇక భర్త దగ్గరకు వెళ్లనని, అతనితో విడిపోవాలన్న తన నిర్ణయాన్ని చెప్పింది. అంతేకాదు న్యాయబద్ధంగా శాడిస్టు భర్త నుంచి 2012లో విడాకులు తీసుకుంది. కొడుకుతో సహా ముంబాయిలోనే ఉండిపోయింది. కూతురు నిర్ణయాన్ని గౌరవించిన తల్లిదండ్రులు ఆమెకు బాసటగా నిలిచారు. కన్నవారి నీడలో జారియా పట్నీ బతుకు పోరు మొదలు పెట్టింది. మొదట తండ్రికి వ్యాపారంలో చేదోడు వాదోడుగా ఉంటూనే.. తనలోని ఫ్యాషన్ ఫోటోగ్రఫీ కళకు పదును పెట్టింది. అనతి కాలంలోనే పేరున్న బ్రాండ్‌లకు షూటింగ్ చేసే స్థాయికి ఎదిగింది.



చారిత్రక విజయం!

జీవితం అంటేనే ఒడిదుడుకులు..అనూహ్యామైన మలుపులు.జీవితంలో కష్టనష్టాలను అధిగమించి, కొడుకతో హ్యాపీగా ఉన్న తరుణంలో జారియా పట్నీకి అనుకోని అవాంతరం ఎదురైంది. విదేశీ పర్యటనకు వెళ్లేందుకు..కొడుకు వీసాకోసం దరఖాస్తు చేసుకుంటే ..అక్కడి నిబంధనలు మరో పోరాటానికి నాందిపలికాయి. చట్టాలు ఉండేది ప్రజల జీవన శైలిని మెరుగు పరచడానికి,..కాని ప్రజలను ఇక్కట్ల పాలు చేయడానికి కాదు. కాని వీసా నిబంధనలు జారియా పట్నీకి ఇబ్బందిగా మారాయి. కొడుక్కు వీసా కావాలంటే తండ్రి సంతకం తప్పని సరని చెప్పారు అధికారులు. కాని భర్త నీడకూడా తాకకుండా తాను బతుకుతూ, కొడుకును బతికించుకుంటున్న జారియా పట్నీకి అది ఏమాత్రం నచ్చలేదు. కార్యాలయం చుట్టు చెప్పులు అరిగేలా తిరిగింది. చేయాల్సిన ప్రయత్నాలన్నీ చేసింది. అయినా తండ్రి సంతకం లేదన్న కారణంగా కొడుకు వీసా దరఖాస్తు తిరస్కరణకు గురికావడం ఆమెను తీవ్రంగా బాధించింది. తండ్రి లేకుండా పిల్లలను తల్లి పెంచుతున్నప్పుడు..కొడుకు సంరక్షణను పూర్తిగా తల్లే చూసుకుంటు న్నప్పుడు తండ్రి సంతకం అనే నిబంధన ఏంటన్న ప్రశ్న జారియా బుర్రను తొలిచేసింది. అంతే మరో పోరాటానికి సిద్ధపడింది. ఈ నిబంధనను మార్చాలంటూ విదేశీ వ్యవహారాల మంత్రి సుషా స్వరాజ్‌కు ట్వీట్ చేసింది. సర్వోన్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేసింది. జారియాపట్నీ చేసిన ట్వీట్ 96000మందిని ఆకర్షించింది. ఆమెకు సపోర్టుగా నిలిచేలా చేసింది. ఇక న్యాయస్థానం కూడా జారియాకు మద్ధతుగా తీర్పునిచ్చింది. న్యాయబద్ధంగా తల్లి పిల్లలకు సంరక్షకురాలిగా ఉంటున్నప్పుడు వీసా జారీకి తండ్రి సంతకం అవసరం లేదంటూ నింబంధనలు మార్చాలని ఆదేశాలు జారీ చేసింది. అప్పటికే విదేశాంగ శాఖ మంత్రికి ట్వీట్ చేసి ఉండడం, సోషల్ మీడియాలో ఆవార్త హల్ చల్ చేయడం.,. కోర్టు తీర్పు.. వెరసి.....కేంద్రం వీసా,పాస్‌పోర్టు జారీలో నిబంధనలను మార్చింది. జారియా పట్నీ పోరాటం ఫలితంగా..ఇప్పుడు పిల్లలు ఆన్‌లైన్‌లో పాస్‌పోర్ట్,వీసా కోసం దరఖాస్తు చేసుకుంటే తల్లి లేదా తండ్రి లేదా ఇద్దరి సంతకం ఉంటే సరిపోతుందేనే నిబంధన అమలులోకి వచ్చింది. జీవితంలో ఎన్నో ఆటుపోట్లను అధిగమిస్తూ ..చివరకు కొడుకు వీసాకోసం చేసిన అలుపెరుగని పోరాటంలోనూ జారియా పట్నీ గెలిచింది! తనలాంటి ఒంటరి మహిళలను గెలిపించింది!!

- చొల్లేటి వేంకటేశ్వరా చారి

హైకోర్టు జడ్జిగా పనిచేయుకుండానే నేరుగా సుప్రీం కోర్టు న్యాయమూర్తిగా ఎంపికైన ప్రథమ మహిళగా సీనియర్ న్యాయవాది ఇందు మల్హోత్రా రికార్డు సృష్టించనున్నారు. ఉత్తరాఖాండ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి కేఎం జోసెఫ్‌తో పాటు ఇందు మల్హోత్రా పేరును ..సుప్రీం కొలిజియం సుప్రీంకోర్టు న్యాయ మూర్తులుగా కేంద్రానికి సిఫారసు చేసింది. కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇస్తే ఏడో మహిళా న్యామూర్తిగా సుప్రీం కోర్టులో అడుగు పెట్టను న్నారు. దేశ సర్వోన్నత న్యాస్థానంలో ఇప్పటి వరకు ఆర్గురు మహిళలు న్యాయమూర్తులుగా నియమితులైనారు. జస్టిస్ ఎం.ఫాతిమా బీవి 1989లో సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా ఎంపికైన ప్రథమ మహిళ. ప్రస్తుతం జస్టిస్ ఆర్.భానుమతి న్యాయమూర్తిగా కొనసాగుతున్నారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా చర్చకు తెరలేపిన ..ఇందు మల్హోత్రా ఎవరు?

పుట్టింది బెంగుళూరులో..!

ఇందు మల్హోత్రా 1956లో బెంగుళూరులో జన్మించారు. ప్రముఖ న్యాయవాది ఓం ప్రకాశ్ మల్హోత్రా, సత్యమల్హోత్రాల ముద్దుల సంతానం ఇందు. ఆమె తండ్రి సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది. పారిశ్రామిక వివాదాలపై వ్యాఖ్యానం రాసిన ప్రముఖ రచయిత. ఆయన పారిశ్రామిక వివాదాలపై వ్యాఖానాలను ఆరు సంచికలుగా ప్రచురించారు.ఇవి న్యాయకోవిధుల ప్రశంసలు అందుకున్నారు. ఇందు కూడా తండ్రికి తగ్గ తనయ అనిపించుకున్నారు. ఆయన బాటలోనే సుప్రీంకోర్టు న్యాయవాదిగా కొనసాగుతూ ప్రత్యేక గుర్తింపును పొందారు. న్యూఢిల్లీలోని కార్మెల్ కాన్వెంట్ స్కూల్‌లో ప్రాథమిక విద్యాభ్యాసం చేసిన ఇందు మల్హోత్రా, శ్రీరాం మహిళా కాలేజ్ (యూనివర్సిటీ ఆప్ న్యూఢిల్లీ)లో పొలిటికల్ సైన్స్‌లో బీఏ పట్టాపొందారు. అదే కాలేజ్ నుంచి పొలిటికల్ సైన్స్‌లో మాస్టర్ డిగ్రీని పూర్తిచేసిన అనంతరం... న్యూఢిల్లీలోని మిరిందా హౌస్ కాలేజ్, వివేకానంద కాలేజ్‌లలో కొంతకాలం పొలిటికల్ సైన్స్ లెక్చరర్‌గా పనిచేశారు.1979 -1982లో ఢిల్లీ యూనివర్సిటీ నుంచి బ్యాచిలర్ ఆఫ్ లా పట్టా పుచ్చుకున్నారు.

సుప్రీంకోర్టు న్యాయవాదిగా...!

పువ్వు పుట్టగానే పరిమళిస్తుం దటారు. ఇందు మల్హోత్రా విషయంలో అదే జరిగింది. తండ్రి ఓ ప్రకాశ్ మల్హోత్రా వారసత్వాన్ని పుణికి పుచ్చుకున్న ఇందు.. సుప్రీంకోర్టు మెట్లు ఎక్కడంతోనే రికార్డు సృష్టించారు. 1983లో ఢిల్లీ బార్ కౌన్సిల్‌లో పేరు నమోదు చేసుకున్నారు. 1988లో సుప్రీంకోర్టులో అడ్వకేట్ ఆన్ రికార్డుగా అర్హత సాధించారు. అర్హత పరీక్షలో ప్రథమ శ్రేణిని పొంది, ముఖేష్ గోస్వామి మెమోరియల్ బహుమతిని పొందారు.అది ఆమె ప్రతిభకు నిదర్శనం.

ఇందు మల్హోత్రా.... 2007లో సుప్రీంకోర్టు సీ నియర్ న్యాయవాదిగా గుర్తింపు పొందారు. సుప్రీం కోర్టుచే సీనియర్ న్యాయవాదిగా గుర్తింపు పొందిన రెండో మహిళగా ఇందు చరిత్ర సృష్టించారు. అంతకు ముందు మూడ దశాబ్దాల క్రితం జస్టిస్ లీలాసేథ్ ఇటువంటి గుర్తింపు పొందిన ప్రథమ మహిళ. సుప్రీంకోర్టు న్యాయవాదిగా 25సంవత్సరాలకు పైబడి అనుభవంఉన్న ఇందు మల్హోత్రా..లా ఆఫ్ ఆర్బిట్రేషన్‌లో నిపుణురాలు.. భారత దేశంలో ఆర్బిట్రేషన్ మెకానిజం యెక్క సంస్థాగతీకరణను సమీక్షించేందుకు లా అండ్ జస్టిస్ మంత్రిత్వ శాఖలో కేంద్రం నియమించిన హై లెవల్ కమిటీలో సభ్యురాలిగా పనిచేశారు. చట్టబద్ధమైన సంస్థలు ఢిల్లీ డెవలప్ మెంట్ అథారిటీ,

ఇందుకు అరుదైన గౌరవం!



నేరుగా సుప్రీం కోర్టు జడ్జిగా ఎంపిక!
రికార్డు సృష్టించిన ఇందు మల్హోత్రా
దేశ చరిత్రలోనే ఇది తొలిసారి

కౌన్సిల్ ఫర్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్, సెక్యూరిటీస్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా, ఇండియన్ కౌన్సిల్ ఫర్ అగ్రికల్చర్ రీసెర్చ్ కు ప్రాతినిధ్యం వహించారు. ఆమెకు సేవ్ లైఫ్ పౌండేషన్‌తో సంబంధాలు ఉన్నాయి. విద్యాసంబంధిత విషయాలో ముఖ్యంగా కళాశాలల్లో ప్రవేశాలు, నియామకాల విషయంలో కోర్టులో తన వాదనా పటిమను కనబరిచారు. హర్యానా రాష్ట్ర ప్రభుత్వ స్టాండింగ్ కౌన్సిల్‌గా సేవలు అందించారు . అనేక సందర్భాల్లో సుప్రీంకోర్టు ఏర్పాటు చేసిన వివిద బెంచ్‌లలో అకమిస్ కురీగా నియమించబడింది. ఇటీవలలే వారసత్వ నగరంగా జైపూర్ పునరుద్ధరణ కోసం ఏర్పాటైన బెంచ్‌లో అమికస్‌గా నియమించబడింది. "సుప్రీకోర్టు ఏర్పాటు చేసిన పలు బెంచ్‌లలో ఆమె సభ్యురాలుగా పనిచేశారు. సుప్రీకోర్టులో పలు కీలక కేసుల్లో తన వాదనా పటిమను ప్రదర్శించి..న్యాయకోవిధుల మన్ననలు పొందింది ఇందుమల్హోత్రా! సుప్రీ కోర్టు సీనియర్ న్యాయావాదిగా, మధ్యవర్తిత్వ నిపుణురాలిగా పేరు గడించిన ఇందుమల్హోత్రా.. ఇప్పుడు సుప్రీం కొలీజియం చేత హైకోర్టు జడ్జిగా ఎంపిక చేయబడి నారు.

మరోవైపు..ఇందు మల్హోత్రా....లా అండ్ ప్రాక్టీస్ అఫ్ ఆర్బిట్రేషన్ అండ్ క్యాన్సిలేషన్ పై వ్యాఖ్యానాలను మూడు సంచికలుగా ప్రచురించారు. దీనికి సంబంధించిన మూడో ఎడిషన్‌ను ఏప్రిల్ 7, 2014న అప్పటి భారత ప్రధాన న్యాయమూర్తి ఆవిష్కరించారు. వివిధ పత్రికలు, మెగజైన్లలో ఆమె వ్యాసాలు ప్రచురించబడ్డాయి. ఆమె రాసిన పాస్ట్ ట్రాక్ ఆర్బిట్రేషన్ ..ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ ఆర్బిట్రేషన్ అండ్ క్వార్టర్లీలో (ఏప్రిల్-జూన్, 2006)లో పబ్లిష్ అయింది.నేషనల్ అకాడమీ ఆఫ్ లీగల్ స్టడీస్ అండ్ రీసెర్చ్ హైదరాబాద్ మరియు అమిటీ యూనివర్సిటీ,న్యూఢిల్లీచే మధ్యవర్తిత్వంపై ఉపన్యసించేందుకు అతిథి లెక్చరర్‌గా ఆహ్వానం అందుకున్నారు.

24న రంగస్థలం టీజర్

రామ్‌చరణ్, దర్శకుడు సుకుమార్‌ల కలయికలో రూపొందుతున్న రంగస్థలం-1985 చిత్రంపై అంచనాలు మిన్నంటుతున్నాయి. ఈ నేపథ్యంలో సంక్రాంతి సందర్భంగా ఈ చిత్రంలో చిట్టిబాబు పాత్రను పోషిస్తున్న రామ్‌చరణ్ కొత్త పోస్టర్‌ను విడుదలచేశారు. అదే సమయంలో ఈ చిత్రం టీజర్‌ను విడుదల చేస్తారని ప్రేక్షకాభిమానులు ఆశించారు. అయితే ఈ పోస్టర్‌లో ఈ నెల 24న టీజర్‌ను విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించడంతో అభిమానులు ఊరట చెందారు. మరోవైపు రామ్‌చరణ్ సతీమణి ఉపాసన క ూడా రంగస్థలం కోసం వెయిటింగ్ అంటూ ట్వీట్ చేశారు. రామ్‌చరణ్ సరసన సమంత నాయికగా నటిస్తున్న ఈ చిత్రం పల్లెటూరి ప్రేమకథ నేపథ్యంలో పీరియాడికల్‌గా సాగనుంది. ఇప్పటివరకు రాజమండ్రి, పోలవరం, హైదరాబాద్‌లలో ఈ చిత్రం షూటింగ్ జరిగింది. చివరి షెడ్యూల్‌లో మిగిలివున్న కొన్ని కీలక సన్నివేశాలను, రెండు పాటలను రాజమండ్రి పరిసరాల్లో చిత్రీకరిస్తారని సమాచారం. మైత్రీ మూవీమేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్, మోహన్ చెరుకూరి నిర్మిస్తున్న ఈ చిత్రం మార్చి 30న ప్రపంచవ్యాప్తంగా విడుదలకానుంది. ఈ చిత్రంలోని ఇతర ముఖ్యపాత్రల్లో ఆది పినిశెట్టి, జగపతిబాబు, ప్రకాష్‌రాజ్, రావురమేష్, అనసూయ నటిస్తుండగా, దేవిశ్రీప్రసాద్ సంగీతాన్ని, రత్నవేలు ఛాయాగ్రహణాన్ని అందిస్తున్నారు.



రామ్‌చరణ్

కృష్ణార్జునుల సందడి

నాని ద్విపాత్రాభినయంలో తెరకెక్కుతున్న చిత్రం కృష్ణార్జునయుద్ధం. భోగి పండుగ సందర్భంగా ఈ చిత్రంలో కృష్ణ పాత్రకు సంబంధించిన నాని లుక్‌ను విడుదలచేయగా, ఆ మరుసటి రోజే సంక్రాంతిని పురస్కరించుకుని అర్జున్ పాత్రకు సంబంధించిన నాని మరో లుక్‌ను విడుదలచేశారు. ఇక మూడురోజుల ఈ వరుస పండుగల్లో భాగంగా మంగళవారం కనుమ పండుగ సందర్భంగా ఈ చిత్రంలోని దారి చూడు దమ్ము చూడు మామ... అంటూ సాగే ఓ మాస్ పాటను సోషల్ మీడియాలో విడుదలచేశారు. నాని సరసన ఈ చిత్రంలో అనుపమ పరమేశ్వరన్, రుక్సార్ నాయికలుగా నటిస్తుండగా, హిప్ ఆఫ్ తమిళ సంగీతాన్ని సమకూరుస్తున్నారు. మేర్లపాక గాంధీ దర్శకత్వంలో షైన్ స్క్రీన్స్ పతాకంపై సాహు గరపా టి, హరీష్ పెద్ది ఈ సినిమాను నిర్మి స్తున్నారు.



నాని



మహేష్‌బాబు

26న ముహూర్తం!

సూపర్‌స్టార్ మహేష్‌బాబు కొత్తచిత్రం భరత్ అనే నేను. కొరటాల శివ దర్శకత్వంలో డివివి.దానయ్య నిర్మిస్తున్నారు. రాజకీయాలు నేపథ్యంలో తెరకెక్కుతున్న చిత్రమిది. శ్రీమంతుడు వంటి సూపర్‌హిట్ సినిమా తర్వాత రిపీట్ అవుతున్న కాంబినేషన్ కావడంతో భరత్ అనే నేనుపై అంచనాలు భారీగా ఉన్నాయి. ఈ చిత్రం ఫస్ట్‌లుక్ సంక్రాంతికి రిలీజ్ చేస్తారని అభిమానులు ఆశించారు. సినిమాకు సంబంధించిన తొలి విశేషం జనవరి 26న రిలీజ్ అవుతుందని చిత్ర నిర్మాత వెల్లడించారు. ఈ వార్తను ఆయన సంక్రాంతి రోజునే తెలియజేస్తూ అభిమానులు తీపికానుక అందించారు. జనవరి 26న టైటిల్ లోగో లేదా ఫస్ట్‌లుక్ రిలీజ్ చేస్తారా? లేకంగా ఏకంగా టీజర్ బయటకు వస్తుందానేది వేచిచూడాలి. కైరా అద్వానీ నాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి దేవిశ్రీప్రసాద్ స్వరరచన చేస్తున్నారు. ఈ చిత్రం విడుదలతేదీని గతంలోనే ఏప్రిల్ 27 అని ప్రకటించిన సంగతి తెలిసిందే.



సూర్య కథానాయకుడిగా విఘ్నేష్ శివన్ దర్శకత్వంలో రూపొందిన గ్యాంగ్ చిత్రం సక్సెస్‌మీట్ హైదరాబాద్‌లో జరిగింది. 12 ఏళ్లుగా తనను ఆదరిస్తున్న తెలుగు ప్రేక్షకులకు ఈ సందర్భంగా హీరో సూర్య కృతజ్ఞతలు తెలిపారు. గ్యాంగ్ చిత్రం విజయవంతంగా ప్రదర్శింపబడటం ఎనలేని ఆనందాన్ని కలిగిస్తోందని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో దర్శకుడు విఘ్నేష్ శివన్, నిర్మాతలు కె.ఇ.జ్ఞానవేల్ రాజా, వంశీ తదితరులు పాల్గొన్నారు.

ఆశ తీరేలా లేదు

నాయికలకు స్వర్ణయుగం నిడివి చాలా తక్కువ. మాయాజాలం లాంటి ఆ సందర్భం చూస్తుండగానే పలకరించి వెళ్లిపోతుంటుంది. రెండేళ్ల కిందట రకుల్‌తో ఇలాంటి అద్భుత సమయమే స్నేహం చేసింది. వరుసగా అగ్ర కథానాయకులతో నటించే అవకాశాలు దక్కాయి. వీటిలో ఆమె కలల కథానాయకులూ ఉన్నారు. ఈ నేపథ్యంలో విరామం లేకుండా నాలుగేళ్లు గడిచాయి. ఆ సమయంలో రకుల్ కొద్దిగా అలిసిపోయింది. మనసులో మాటను తీరిక లేని షూటింగ్‌లతో విసిగిపోయాను...కొన్నాళ్లు విశ్రాంతి తీసుకోవాలని అనుకుంటున్నాను అంటూ చెప్పేసింది. గట్టిగా కోరుకుంటే అవి జరుగుతాయనేది ఓ సిద్ధాంతం. రకుల్ విషయంలో ఇది నిజమయ్యే ఉంటుంది. ఆమె విరామం కావాలని చెప్పిన వెంటనే...స్పైడర్ లాంటి ఊహించని అపజయం తగిలింది. అనూహ్యంగా తెలుగులో అవకాశాలూ తగ్గిపోయాయి. అయితే తమిళం, బాలీవుడ్‌లో మాత్రం ఆమె గాలి వీస్తూనే ఉంది. తాజాగా తెలుగులో నాని నాగార్జున నటిస్తున్న మల్టీస్టారర్ సినిమాకు రకుల్‌ను సంప్రదించినట్లు సమాచారం. నాని సరసన ఈ సుందరి తొలిసారి ఆడిపాడబోతోంది. ఇదంతా చూస్తే సినిమాలు తగ్గించి కొన్నాళ్లు సేదతీరాలని అనుకుంటున్న పంజాబీ భామ రకుల్ ఆశ తీరేలా లేదు..



రకుల్ ప్రీత్‌సింగ్

నదియా కాదంటే



రమ్యకృష్ణ

సూపర్‌డీలక్స్ ఈ చిత్రం గురించి దక్షిణాది సినీరంగంలో ఆసక్తికరమైన చర్చ జరుగుతోంది. ఇందులో నదియ ఓ ప్రధాన పాత్రని చేస్తోందని ప్రకటించారు. కానీ ఇప్పుడు నదియా చేయడం లేదని, ఆ పాత్రలో రమ్యకృష్ణ నటించనుందని ప్రచారం జరుగుతోంది. నదియా వర్సెస్ రమ్యకృష్ణ కావడంతో అందరిదృష్టి ఈ సినిమాపై నిలిచింది. త్యాగరాజన్ దర్శకత్వం వహిస్తున్న సూపర్ డీలక్స్ చిత్రంలో విజయ్ సేతుపతి, సమంతతో పాటు నదియా నటిస్తున్నారు. ఇప్పటికే చిత్రీకరణ మొదలైంది. అయిన తన పాత్రలో ప్రతినాయక ఛాయలు ఎక్కువగా ఉన్నాయని భావించిన నదియా విలనిజం చేయడం తనవల్ల కాదని తేల్చిచెప్పిందట. తను ఈ సినిమా నుండి తప్పుకుంటానని చెప్పేసింది. నదియాపై చిత్రీకరణ ఇంకా మొదలుకాలేదు. ఈలోపు నదియా నటించడం లేదని తెలిసిన రమ్యకృష్ణ తను నటిస్తానంటూ యూనిట్‌కు కబురు చేసిందని ప్రచారం జరుగుతోంది. హీరోయిన్ నుండి క్యారెక్టర్ నటిగా మారిన రమ్యకృష్ణ పొగరుబోతు పాత్రలే కాకుండా నెగిటివ్ టచ్ ఉన్న పాత్రలు చేసింది. అలాంటి నటి తమ సినిమాలో నటించేందుకు ముందుకురావడం యూనిట్‌ను ఆనందానికి గురి చేసిందట. ఈ చిత్రంలో సమంత వైవిధ్యం ఉన్న పాత్రని చేస్తోందని తెలిసింది.



అర్జున్‌కపూర్

బాలీవుడ్ అర్జున్‌రెడ్డి

విభిన్నమైన, వైవిధ్యభరితమైన సినిమాలు ఏ భాషలో వచ్చినా విజయం సాధిస్తున్న సంగతి తెలిసిందే. అలా ఒక భాషలో ప్రేక్షకాదరణను చూరగొన్న చిత్రాలను వేరొక భాష లోకి అనువదించడమో లేక రీమేక్ చేయడం ఎప్పట్నుంచో జరుగుతున్న ప్రక్రియే. ఈ కోవలో గతేడాది తెలుగులో సంచలన విజయం సాధించిన అర్జున్‌రెడ్డి చిత్రాన్ని ఇతర భాషల్లో రీమేక్ చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇప్పటికే తమిళంలో విక్రమ్ వారసుడు ధృవ్‌ను హీరోగా పరిచయం చేస్తూ బాల దర్శకత్వంలో ఈ చిత్రం తెరకెక్కు తోంది. ఈ క్రమంలోనే బాలీవుడ్‌లో కూడా ఈ చిత్రాన్ని నిర్మిస్తారనే అంశంపై దాదాపుగా స్పష్టత వచ్చేసిందని పరిశ్రమలో అంటున్నారు. లోగడ బాలీవుడ్‌లో 2 స్టేట్స్, హాఫ్ గర్ల్‌ఫ్రెండ్ వంటి కొన్ని చిత్రాల్లో నటించిన అర్జున్‌కపూర్ ప్రస్తుతం సందీప్ ఔర్ పింకీ పేరుతో తెరకెక్కుతున్న బాలీవుడ్ చిత్రంలో నటిస్తున్నారు. అర్జున్‌కపూర్ హీరోగా, సహ నిర్మాతగా అర్జున్‌రెడ్డి చిత్రం బాలీవుడ్‌లో రూపొందనుందని, తెలుగు చిత్రానికి దర్శకత్వం వహించిన సందీప్‌రెడ్డి వంగా హిందీ వెర్షన్‌కు కూడా దర్శకత్వం వహిస్తారని అంటున్నారు.

రామ్ గారి భార్య



మంచు లక్ష్మి

మంచు లక్ష్మి నటిస్తున్న తాజా చిత్రానికి వైఫ్ ఆఫ్ రామ్ అని టైటిల్ నిర్ణయించారు. ప్రస్తుతం పోస్ట్‌ప్రొడక్షన్ పనులు జరుపుకుంటున్న ఈ చిత్రంలో మంచు లక్ష్మి పాత్ర చాలా భిన్నంగా సాగుతుంది. అబద్ధాలను నిజమని నమ్మే పాత్రలో ఆమె నటిస్తోంది. చాలా సహజంగా, అద్భుతంగా ఈ పాత్ర ఉంటుంది. మానవ సంబంధాలు, భావోద్వేగాల చుట్టూ తిరిగే కథ ఇది. రాజమౌళి వద్ద ఈగ, బాహుబలి చిత్రాలకు పనిచేసిన విజయ్ యలకంటి ఈ సినిమాకు దర్శకుడు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, మంచు ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకాలపై తెరెక్కుతున్న చిత్రమిది. ఇతర పాత్రల్లో సామ్రాట్ రెడ్డి, ఆదర్శ్ బాలకృష్ణ, ప్రియదర్శి, శ్రీకాంత్ అయ్యార్ నటిస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం రఘు దీక్షిత్, ఛాయాగ్రహణం సామల భాస్కర్, మాటలు సందీప్ గుంటా, కో ప్రొడ్యూసర్ వివేక్ కూచిబోట్ల.

Vaccum Therapy లింగవర్ధక యంత్రం
లింగం చిన్నదని నిరాశ ఎందుకు?
అమెరికా ఏజెన్సీ FDA వారి అభిప్రాయం ప్రకారం Vaccum Therapy లింగవర్ధక యంత్రం మరియు ఔషధాల ద్వారా పురుషుడు తన చిన్న లింగాన్ని 75 రోజులలో 7 నుండి 8 అంగుళాల పొడవు, లావు, గట్టిగా, శక్తివంతంగా మరియు దృఢంగా చేసుకొనవచ్చును. మరియు తన ఇష్టానుసారం శృంగార సమయాన్ని పొడిగించుకోవచ్చును. శీఘ్రస్కలనం, నపుంసకత్వం, లింగము వదులుగా ఉండుట, చిన్నగా ఉండుట, సన్నగా ఉండుటను తొలగించుకోవడంకోసం 30 రోజుల ఔషధం.
ఇంటి దగ్గరకే ఔషధం తెప్పించుకోండి
08943212076